

'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 148

సోమవారం 18-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అలీసా అదరహో

85 బంతుల్లో 137 నాటౌట్. చివరి వన్డేలో భారత్ 'ఎ'పై ఆసీస్ 'ఎ' గెలుపు -14లో



సిప్ సరే.. ఇక సిఫ్ చేస్తారా!

కొత్తగా స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్. కనీస పెట్టుబడి రూ.10 లక్షలు -15లో



ధ్వంసం చేసి డ్రామాలా?

అధికారంలో ఉండగా రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేసిన వారే నేడు డ్రామాలు ఆడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



స్వదేశానికి శుభాంశు

ఐఎస్ఎస్‌లో కాలుమోపి చరిత్ర సృష్టించిన భారత వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా భారత్ చేరుకున్నారు.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్ యుద్ధానికి తెర!

ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు అమెరికా, ఐరోపా సమాఖ్య చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

వివరాలు 6లో ▸



కథువాలో క్లౌడ్ బరస్ట్

జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఆదివారం రెండుచోట్ల క్లౌడ్ బరస్ట్‌తో నలుగురు పిల్లలు సహా ఏడుగురు మృతిచెందారు.

వివరాలు 6లో ▸

ఎత్తిపోతలు ఎప్పుడు?



గోదావరి జలాశయాలు నిండేదెప్పుడు?

- ఎగువ నదిలో ఎట్టకేలకు వరద ఉధృతి..
- ఒడిసి పట్టుకోవడంలో మీనమేషాలు!
- వృథాగా సముద్రంలో కలిసిపోతున్న జలాలు
- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు వరకే నీటి పంపింగ్
- అక్కడి నుంచి రంగనాయక, మల్లన్న, కొండపోచమ్మలకు ప్రారంభం కాని ఎత్తిపోతలు
- మలకపేట, అప్పర్ మానేరుకూ మొదలవ్వని పంపింగ్ ప్రక్రియ
- గోదావరి పరీవాహకంలో మొత్తం 57 జలాశయాలు
- మొత్తం 419.81 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 191.69 టీఎంసీలే నిల్వ

సాక్షి, హైదరాబాద్

వర్షాకాలం ప్రారంభమై రెండున్నర నెలల తర్వాత ఎట్టకేలకు ఎగువ గోదావరి వరదెత్తింది. నదీ పరీవాహకంలో కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు ప్రాజెక్టు నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పరీవాహకంలోని జలాశయాలన్నీ అడుగంటిపోయి ఉండగా, ఎప్పటికప్పుడు పంపుల ద్వారా ఎత్తిపోసి నిల్వ చేసుకోకపోవడంతో వరద జలాలన్నీ వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయి. జలాల ఎత్తిపోతలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం.. ఎల్లంపల్లి జలాశయం నుంచి మేడారం, అక్కడి నుంచి మిడ్‌మానేరు జలాశయానికి పంపింగ్‌ను మాత్రమే ప్రారంభించడం గమనార్హం.

మిడ్ మానేరుకు తరలింపులో తీవ్ర ఆలస్యం

మిడ్‌మానేరు నుంచి ఎగువన ఉన్న అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల్లోకి నీళ్లను ఎత్తిపోసే ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. వాస్తవానికి శ్రీరామ్‌సాగర్‌కు గత మూడు రోజులుగా భారీ వరద వస్తున్నా ఫ్లడ్ ఫ్లో కెనాల్ (ఎఫ్ఎఫ్‌సీ) ద్వారా గ్రావిటీతో మిడ్‌మానేరు జలాశయానికి నీళ్లను తరలించడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. ఆదివారం సాయంత్రం ఎల్ఎఫ్‌సీ ద్వారా 10,000 క్యూసెక్కులను విడుదల చేయగా, ఇంకా ఆ నీళ్లు మిడ్‌మానేరుకు చేరుకోలేదు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది పంప్‌హౌస్ ద్వారా 12,600 క్యూసెక్కులను మేడారం రిజర్వాయర్‌లోకి, అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా అంతే నీళ్లను మిడ్‌మానేరు జలాశయంలోకి ఎత్తిపోస్తున్నారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో చెరో ఏడు చొప్పున మొత్తం 14 పంపులుండగా, చెరో 4 పంపులతో నీళ్లను పంపింగ్ చేస్తున్నారు. దీంతో మిడ్‌మానేరు

మిగతా 2వ పేజీలో ▶

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం



- 24 గంటల తర్వాత వాయుగుండంగా మారే అవకాశం
- 19న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో తీరం దాటే అవకాశం
- రానున్న రెండు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలర్ట్
- రాష్ట్రంలో సాధారణం కంటే 15 శాతం అధికంగా వర్షాలు

2లో

అఫిడవిట్ ఇవ్వండి లేదా క్షమాపణ చెప్పండి

ఓట్ల చోరీ ఆరోపణలు గుప్పిస్తున్న రాహుల్ గాంధీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అల్టిమేటం



- కొందరు తమ భుజాల మీదుగా ఓటర్లకు తుపాకీ గురిపెడుతున్నారని వ్యాఖ్య
- బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అత్యంత పారదర్శకంగా కొనసాగుతోందని స్పష్టీకరణ
- రెండేసి చోట్ల ఓటు హక్కు ఉందన్నది నిరాధార ఆరోపణేనన్న సీఈసీ
- అందరి ఓటు హక్కు కాపాడేందుకు పనిచేస్తున్నట్లు వెల్లడి

వివరాలు 6లో ▶

ఓట్ల చోరీ బట్టబయలై ఈసీ బెంబేలు

బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ

అందుకే అఫిడవిట్ డిమాండ్లు.. బీజేపీని అడగలేదేం?



- బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట ఓట్ల చోరీ జరుగుతోంది
- అనుకూల ఓటర్లను చేర్చి వ్యతిరేకుల పేర్లు తొలగించడం ద్వారా ఎన్నికల్లో నెగ్గే కుట్ర
- పేదల ఓటు హక్కును కాపాడుతాం..
- ఈసీ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న డేటాతోనే ఓట్ల చోరీని బయటపెట్టా..

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

ఫ్యూచర్ సిటీ టు అమరావతి



ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతికి 8 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా హైదరాబాద్–విజయవాడ మధ్య 70 కి.మీ. మేర దూరం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 3లో▶


ఇక కొత్త సర్వే మాన్యువల్!



రాష్ట్రంలో భూముల హద్దుల నిర్ధారణకు కొత్త సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో భాగంగా సర్వే వ్యవస్థకు నూతన హంగులు తెస్తున్నామన్నారు.

- వివరాలు 3లో▶

సిరిసిల్ల నుంచే పోటీ చేస్తా



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ సిరిసిల్ల నుంచే పోటీ చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తాను హైదరాబాద్ శివార్లలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దన్నారు.

- వివరాలు 3లో▶

హ్యూమనాయిడ్ రోబోలు.. ఆటగాళ్లు.. అమ్మలు



హ్యూమనాయిడ్ రోబోలు.. అచ్చం మనలానే ఉండే, ఆలోచించగలిగే రోబోలు. ఇవి మన జీవితంలో భాగమయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. ఇందుకు గర్భం దాలుస్తున్న రోబోలు, రోబోల షాపింగ్ మాల్‌లే నిదర్శనం.

- వివరాలు 16లో▶

కాంగ్రెస్ ముందు మూడు ఆప్షన్లు!



స్థానిక సంస్థల ఎన్నికలపై 23న పీఏసీ భేటీ | పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయంపై చర్చించనున్న నేతలు

1. కోర్టును మరింత సమయం కోరడం, అవసరమైతే రివ్యూ పిటిషన్ వేయడం
2. అసెంబ్లీ సమావేశం పెట్టి అన్ని పార్టీల వైఖరి తెలుసుకోవడం
3. పార్టీ పరంగా 42% ఇస్తామని చెప్పి ముందుకు వెళ్లడం

- ఈ 3 అంశాలపై సభ్యుల అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయం.. అనంతరం పార్టీ పరంగా ప్రకటన
- ఆ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్న టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరహాలోనే అధికార కాంగ్రెస్ కూడా 3 ఆప్షన్లను పరిశీలించనుంది. ఈ మూడు ఆప్షన్లలో ఎటువైపు మొగ్గుచూపాలనే అంశాన్ని తేల్చేందుకు ఈనెల 23న టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ భేటీలో 3 అంశాలపై చర్చించి మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు పార్టీ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాలని యోచిస్తోంది. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయించినట్టు సమాచారం.

ఎలా ముందుకెళ్దాం?

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీలో ఏకాభిప్రాయం లేదు. పీసీసీ చీఫ్‌తో పాటు పార్టీలోని బీసీ ముఖ్య నేతలు ఓ వాదన వినిపిస్తుండగా, కొందరు మంత్రులు, మరికొందరు నేతలు మరో వాదన వినిపిస్తున్నారు. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ చాలా స్పష్టంగా తన వైఖరిని తెలియజేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ, కేంద్రం నుంచి వచ్చే నిధుల కంటే బీసీలకు 42 %రిజర్వేషన్ల కల్పనే

మిగతా 3వ పేజీలో ▶

ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్

బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం



- ఏకగ్రీవానికి సహకరించండి.. విపక్షాలకు నడ్డా విజ్ఞప్తి
- 'ఇండియా' కూటమి అభ్యర్థి నేడు ఖరారు!
- సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక
- ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనున్న 781 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ
- ఎన్డీయేకు మెజారిటీ ఉన్నందున గెలుపు లాంఛనమే

6లో

జూనియర్ ఎన్టీఆర్ బుడ్డా ఫకీర్..

వాని సినిమాలు ఆడనిస్తానా..?

లోకేశ్‌ను తిట్టిన వాడి సినిమాలు ఎలా ఆడనిస్తాననుకున్నారు?

అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆడియో వైరల్

- నా పర్మిషన్ లేకుండా వేయిస్తారా? ఈ సినిమా ఆడదని అభిమాన సంఘం నేతపై మండిపాటు
- ఎమ్మెల్యే వాయిస్ రికార్డు బయట పెట్టిన అభిమాన సంఘం నేత
- లోకేశ్, చంద్రబాబు ప్రోద్బలంతోనే ఎన్టీఆర్ సినిమాను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎన్టీఆర్, నందమూరి అభిమానుల్లో ఆగ్రహం
- ఎమ్మెల్యే ఇంటి వద్ద ఎన్టీఆర్ అభిమానుల ఆందోళన.. ఫ్లెక్సీల చించివేత.. నేడు హైదరాబాద్‌లో అభిమాన సంఘం నేతల భేటీ

12లో

ఆందోళనకరంగా ఆత్మహత్యలు

బలవన్మరణాల్లో దేశంలో 4వ స్థానంలో తెలంగాణ



- 2018–22 మధ్య ఏటా సగటున 8,746 ఆత్మహత్యలు
- దేశంలో మొదటి స్థానంలో సిక్కిం.. తర్వాత ఛత్తీస్‌గఢ్, కేరళ
- నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాలు వెల్లడించిన కేంద్రం
- దేశంలో ఏటా లక్షకు పైగానే మానసిక సమస్యల సంబంధిత ఆత్మహత్యలు
- బలవన్మరణాల నివారణకు దేశవ్యాప్తంగా టెలి మానస్ హెల్ప్‌లైన్ సెంటర్లు
- హైదరాబాద్ ఎర్రగడ్డ మానసిక వైద్య ఆసుపత్రిలో 'టెలి మానస్' సేవలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆందోళనకర స్థాయిలో ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. అత్యధికంగా ఆత్మహత్యలు నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉండటం గమనార్హం. దేశంలో 2018 నుంచి 2022 వరకు నమోదైన ఆత్మహత్యల వివరాలను నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్‌బీ) వెల్లడించింది. దీని ప్రకారం.. రాష్ట్రంలో 2018లో 7,845 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2019లో 7,675, 2020లో 8,058, 2021లో ఏకంగా 10,171 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2022లో ఆ సంఖ్య 9,980గా నమోదైంది. ఐదేళ్లలో 43,729 మంది ఆత్మహత్యలు చేసుకోగా ఏటా సగటున 8,746 మంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్సీఆర్‌బీ తెలిపింది. వీరిలో ఆర్థిక, కుటుంబ సమస్యలతో పాటు వివిధ కారణాలతో క్షణికావేశంలో ప్రాణాలు తీసుకున్న విద్యార్థులు, యువత, నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారు. ఇటీవల

మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఎన్ని ప్రోత్సాహకాలు ప్రకటించినా మన జనం పిల్లల్ని కనడంలేదని మంచి పని చేస్తున్నార్సార్!!


ఖమ్మం-కొత్తగూడెం రోడ్డులో చెట్లకు నాటిన బోర్డులు

చెట్లకు లేపనం!

సైన్ బోర్డుల కోసం చెట్లకు మేకులతో గాయాలు

- వైర్లు, మేకులతో వేరు వ్యవస్థ బలహీనమై కూలుతున్న చెట్లు
- భద్రాద్రి జిల్లాలో ఉద్యతంగా సాగుతున్న మేకుల తొలగింపు ప్రక్రియ
- ఇలాంటి కార్యక్రమం రాష్ట్రమంతటా చేపట్టాలంటున్న ప్రకృతి ప్రేమికులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హరితహారం, వనమహోత్సవం పేరిట భారీగా మొక్కలు నాటుతున్నారు. అయితే ఇలా నాటే చెట్లలో అనేకం మహా వృక్షాలుగా మారకముందే నేలకూలుతున్నాయి. 10–15 ఏళ్ల వయసున్న చెట్లకు పబ్లిసిటీ కోసం ఇష్టారీతిన మేకులు కొట్టడం, వైర్లు చుట్టడంతో ఈ దుస్థితి దాపురిస్తోంది. అయితే చెట్లకు జరుగుతున్న నష్టాలను నివారించే కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొదలైంది.

ఫ్రీ పబ్లిసిటీ కావడంతో..

దారి వెంట వచ్చిపోయే వారికి పచ్చదనం పంచుతూ చల్లని నీడనిచ్చే చెట్ల మనుగడ కొందరి ప్రచార ఆర్భాటాలతో ప్రమాదంలో పడుతోంది. వందల ఏళ్లు బలంగా బతకాల్సిన చెట్లు బలహీనమై అర్ధంతరంగా నేలకూలుతున్నాయి. విద్యుత్ స్తంభాలను ప్రైవేటు వ్యక్తులు వినియోగిస్తే అందుకు తగ్గ చార్జీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సి ఉంటుంది. ఇళ్ల ముందు ఏర్పాటు చేస్తే దాని యజమానులు తొలగిస్తారు. కానీ చెట్ల విషయంలో ఎలాంటి నిబంధనలు లేవు, ఇదేంటని అడిగే వారూ లేరు. రూపాయి ఖర్చు లేకుండా బోలెడంత ప్రచారం చేసుకునే వెసులుబాటు కలుగుతోంది. దీంతో అడ్డూఅదుపు లేకుండా చెట్లకు మేకులు దించి, బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేసుకునే కార్యక్రమం రాష్ట్రమంతటా సాగుతోంది. మరోవైపు ఈ చెట్లను ఆసరాగా చేసుకుని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వైర్లు గట్టిగా పట్టుకుని ఉండేందుకు వీలుగా ఇష్టారీతిగా చెట్లకు మేకులు కొట్టడం, ముడేయడం వంటివి చేస్తున్నారు.

నష్టాలు ఇలా..

వేర్ల నుంచి చెట్టు పైభాగాలకు వెళ్లే పోషకాల సరఫరాలో బెరడు భాగం ఎంతో కీలకం. చెట్టు ప్రధాన కాండానికి పదుల సంఖ్యలో మేకులు దించడం వల్ల చెట్టు చుట్టూ ఉండే బెరడులోని దారు భాగం దెబ్బతింటుంది. దీని వల్ల భూమి నుంచి చెట్టుకు కావాల్సిన నీరు అందదు. చెట్టు చుట్టూ బిగుతుగా వైర్లు కట్టడంతో పోషకాలు అందించే ప్రసరణ వ్యవస్థ పనితీరులో ప్రభావం చూపుతుందని వృక్ష శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా చెట్లు బలహీనంగా మారుతాయని అంటున్నారు. ఇటీవల చిన్నపాటి వానలు, గాలులకే రోడ్ల పక్కన చెట్లు కూలిపోవడం వెనుక ప్రధాన కారణాల్లో మేకుల మర్మం ఉందంటున్నారు.


బోర్డులు తొలగిస్తున్న సిబ్బంది

మేకుల తొలగింపు

రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి మోహన్ చంద్ర పర్గాయి ప్రస్తుతం సింగరేణి సంస్థకు సలహాదారుగా పని చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వస్తుండగా రోడ్లకు ఇరువైపులా చెట్లకు ఇబ్బడిముబ్బడిగా మేకులతో కొట్టిన సైన్‌బోర్డులు కనిపించాయి. చెట్ల మనుగడకే ప్రమాదకారులుగా మారుతున్న ఈ బోర్డులు, మేకుల విషయాన్ని ఆయన జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈనెల 6 నుంచి జిల్లావ్యాప్తంగా చెట్లకు కొట్టిన మేకులు, కేబుల్ వైర్లు తొలగించాలంటూ ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గత 10 రోజులుగా జిల్లాలో చెట్లకు మేకులు తొలగించే కార్యక్రమం సాగుతోంది. దీన్ని ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో కూడా అమల్లోకి తేవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



చెట్లకు నష్టం

యాభై ఏళ్ల వయసు ఉన్న పెద్ద వృక్షాలకు మేకుల వల్ల అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ ఐదు నుంచి పదిహేనేళ్ల వయసున్న చెట్లపై మేకుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మేకుల కారణంగా మహా వృక్షాలుగా రూపాంతరం చెందాల్సిన చెట్లు మధ్యలోనే బలహీనపడి చనిపోతాయి. భారీగా మొక్కలు నాటడం, వాటిని బతికించడంతోపాటు చెట్లను మహా వృక్షాలుగా మార్చే బాధ్యత కూడా మనం తీసుకోవాలి.

– మోహన్ చంద్ర పర్గాయి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, సింగరేణి సలహాదారు



ప్రసరణ వ్యవస్థపై ప్రభావం

ఎదుగుదలకు అవసరమైన కార్బన్‌డయాక్సైడ్, సూర్యరశ్మి తదితర పోషకాలను చెట్లు వాతావరణం నుంచి తీసుకుంటాయి. కానీ నీరు ప్రధానంగా భూమి నుంచే తీసుకుంటాయి. మేకులు, వైర్ల వలన చెట్ల ప్రసరణ వ్యవస్థ దెబ్బతింటుంది.

– రమేష్, బోటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్, పాల్వంచ

క్లుప్తంగా...

నేడు సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

సాక్షి, హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదురుగా సోమవారం ఉదయం 10.30 గంటలకు విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి పూజ చేయనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో జరగనున్న ఈ కార్యక్రమంలో.. టీపీసీసీ అధ్యక్షుడు, బి.మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు రవీంద్రభారతిలో జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల్లో సీఎం పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు తన నివాసంలో ఎంప్లాయీస్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలు, టి-ఫైబర్‌పై సీఎం సమీక్షిస్తారు.

పాపన్నగౌడ్ జయంతికి తరలిరండి

సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి కార్యక్రమానికి గౌడ కులస్తులు, గీత కార్మికులు, బీసీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని.. పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రేవతి గౌడ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరై.. పాపన్న గౌడ్‌కు నివాళులర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ రోడ్ల పునర్‌నిర్మాణానికి రూ.143 కోట్లు

- మంత్రి సీతక్కకు అంచనా వివరాలు నివేదించిన అధికారులు
- వర్షాల పరిస్థితిపై మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న 86.55 కి.మీ. మేర గ్రామీణ రహదారులను శాశ్వత ప్రాతిపదికన పునర్‌నిర్మించేందుకు రూ.143 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు మంత్రి సీతక్కకు నివేదిక సమర్పించింది. వాటికి మరమ్మతు చేసి తాత్కాలికంగా పునరుద్ధరించేందుకు రూ.6.5 కోట్లు ఖర్చవుతాయని వెల్లడించింది. ఆదివారం మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్సు ద్వారా వర్షాలపై పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామీణ రోడ్లకు జరిగిన నష్టంపై వివరాలను మంత్రి దృష్టికి తెచ్చారు. భారీ వర్షాలతో కొన్ని గ్రామాలకు రోడ్లు తెగి రాకపోకలు నిలిచిపోతే, తిరిగి పునరుద్ధరించామని ఈఎన్‌సీ అశోక్ పేర్కొన్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని, వరద తగ్గుముఖం పట్టగానే ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టం వివరాలను అంచనా వేసి వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

పొంగుతున్న కృష్ణా, గోదావరి


భారీ వర్షాలతో నిండుగా ప్రవహిస్తున్న నదులు

- మేడిగడ్డ బరాజ్ వద్ద 5.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నాగార్జునసాగర్ 22 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

సాక్షి నెట్‌వర్క్: ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు తెలంగాణ, ఏపీలోనూ భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదుల ఉధృతి ఆదివారం మరింత పెరిగింది. కాళేశ్వరం వద్ద పుష్కర ఘాట్లను తాకుతూ 9.980 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారం (సరస్వతి) బరాజ్ వద్ద ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులకు చేరింది. బరాజ్‌లోని మొత్తం 66 గేట్లు ఎత్తి వరద మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. మేడిగడ్డ బరాజ్‌కి 5.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బరాజ్‌కి 1,84,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అదేస్థాయిలో ఔట్ ఫ్లో కొనసాగుతోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 12.98 మీటర్లకు గోదావరి నీటి మట్టం చేరుకుంది. సోమవారం నాటికి మరింత పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు పడవల ద్వారా మల్యాల, కొండాయి, ఐలాపురం, గోవిందరాజు కాలనీ ప్రజలను తరలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, తహసీల్దార్ జగదీశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ తెలిపారు.

సాగర్‌కు నిలకడగా వరద

కృష్ణానదిలో కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. శ్రీశైలం ఆనకట్ట వద్ద ఆదివారం మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి దిగువన నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాలలో క్రస్ట్ గేట్ల ద్వారా 77,946, విద్యుదుత్పత్తి చేస్తూ 38,818, సుంకేసుల నుంచి 49,632 మొత్తం 1,66,396 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో మూడు గేట్ల ద్వారా 79,269 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ మరో 65,807 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 881.4 అడుగుల వద్ద 195.6605 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,99,781 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590.00 అడుగులు కాగా.. ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది.


సాగర్ వద్ద 22 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


మంథని వద్ద గోదావరి ప్రవాహం

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

24 గంటల తర్వాత వాయుగుండంగా మారే అవకాశం

- 19న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో తీరం దాటే అవకాశం
- రానున్న రెండు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలర్ట్
- ఐదు జిల్లాలో అధిక వర్షాలు



సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం ఉదయం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో అల్పపీడనం ఏర్పడింది. సోమవారం ఉదయానికల్లా ఇది వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల సమీపంలో ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం నాటికి తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల చక్రవాత ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి 9.6 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఉత్తర ప్రాంత జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది. ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. సోమవారం ఈ మూడు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశంఉందని, ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాల కదలికలు చురుగ్గా ఉండడంతోపాటు రాష్ట్రమంతటా ఆకాశం మేఘావృతమవ్వడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 30.8 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

15 శాతం అధిక వర్షపాతం

నైరుతి సీజన్ వర్షాలు సంతృప్తికరంగా ఉన్నాయి. ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 47.81 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 54.98 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 15 శాతం అధికంగా వర్షాలు నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 5 జిల్లాల్లో అత్యధికంగా, 9 జిల్లాల్లో అధికంగా వర్షాలు కురిశాయి. 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆదివారం ఒక్కరోజు రాష్ట్రంలో సగటున 1.51 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎత్తిపోతలు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

జలాశయం నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలకు గాను 11.13 టీఎంసీలకు చేరింది.

మిడ్ మానేరు నుంచి ఎప్పుడు?

మిడ్‌మానేరు నుంచి నీళ్లను ఏకకాలంలో సమాంతరంగా అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌తో పాటు మరో లింక్ ద్వారా మలకపేట, అప్పర్ మానేరుకు ఎత్తిపోసేందుకు వీలుండగా, ఇంకా ఆ ప్రక్రియను ప్రారంభించలేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఈ ఆన్‌లైన్ రిజర్వాయర్లలో ప్రస్తుతం నిల్వలు అడుగంటిపోయి ఉన్నా పంపింగ్ ప్రారంభించకపోవడం గమనార్హం.

ప్రాజెక్టులకు వరద ఇలా..

సింగూరు ప్రాజెక్టుకు శనివారం సాయంత్రం 6 గంటలకు 31,412 క్యూసెక్కుల వరద రాగా, ఆదివారానికి 28,357 క్యూసెక్కులకు తగ్గిపోయింది. జలాశయం నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.37 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 43,244 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 49,000 క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రస్తుతం నిల్వలు 12.88 టీఎంసీలకు చేరాయి. ఇక గోదావరి ప్రధాన పాయపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకు 1.51 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 66.23 టీఎంసీలకు పెరిగాయి. మరో రెండురోజుల్లో శ్రీరామ్‌సాగర్ గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

అప్పుడే కడెం, ఎల్లంపల్లి గేట్లు కిందకి..

కడెం ప్రాజెక్టుకు వస్తున్న వరద ప్రవాహం శనివారంతో పోల్చితే ఆదివారానికి 1.33 లక్షల క్యూసెక్కుల నుంచి 4,632 క్యూసెక్కులకు తగ్గిపోవడంతో గేట్లను కిందికి దించేశారు. జలాశయం గరిష్ట నిల్వ సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.17 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 299 క్యూసెక్కులను కాల్వకు విడుదల చేస్తున్నారు. శ్రీరామ్‌సాగర్, కడెంకి దిగువన గోదావరి ప్రధాన పాయపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చే వరద సైతం 2.15 లక్షల క్యూసెక్కుల నుంచి 28,460 క్యూసెక్కులకు పడిపోవడంతో గేట్లను మూసివేశారు. జలాశయం నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 18.31 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 12,600 క్యూసెక్కులను మేడారం రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 9,390 క్యూసెక్కులను మిడ్‌మానేరు రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. మిడ్‌మానేరు నుంచి నీళ్లను ఎత్తిపోస్తే అనంతగిరి రిజర్వాయర్ కింద 40వేల ఎకరాలు, రంగానాయకసాగర్ కింద 1.10 లక్షల ఎకరాలు, మల్లన్నసాగర్ కింద 2.96 లక్షల ఎకరాలు, కొండపోచమ్మసాగర్ కింద 2.85 లక్షల ఎకరాలు, అప్పర్ మానేరు కింద 16,085 ఎకరాలకు ప్రస్తుత ఖరీఫ్‌లో సాగునీరు అందే అవకాశం ఉంది.

కృష్ణా జలాశయాలు కళకళ

కృష్ణా పరీవాహకంలో రాష్ట్రంలో మొత్తం 649.53 టీఎంసీల సామర్థ్యంతో 30 రిజర్వాయర్లుండగా, 584.65 టీఎంసీల నిల్వలతో అన్నీ జలకళను సంతరించుకున్నాయి. కానీ గోదావరి పరీవాహకంలో మొత్తం 419.81 టీఎంసీల సామర్థ్యంతో 57 జలాశయాలుండగా, కేవలం 191.69 టీఎంసీల నిల్వలతో వెలవెలబోతుండటం గమనార్హం. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో 33.18 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని రాష్ట్రం తాత్కాలికంగా కోల్పోయింది. సింగూరు జలాశయానికి ఏ క్షణంలోనైనా గండిపడవచ్చనే హెచ్చరికలున్న నేపథ్యంలో 21 టీఎంసీలకు మించి నీళ్లను నిల్వ చేయడం లేదు. కాగా నీటి నిల్వలకు అవకాశం ఉన్న జలాశయాలూ ఖాళీగా ఉండడం గమనార్హం.

తెలంగాణ అవసరాలు తీరాకే మిగులు జలాలపై మాట్లాడాలి: భట్టి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహారాణిపేట (విశాఖ): తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల గురించి ఎవరైనా మాట్లాడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం వచ్చిన ఆయన ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. 'నదీ జలాలను వినియోగించుకుని బీడు భూములను సాగులోకి తేవాలన్న ప్రధాన లక్ష్యంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. గోదావరిపై తెలంగాణలో నిర్మిస్తున్న ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్, దేవాదుల వంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. తెలంగాణ అవసరాలు తీరకుండా దిగువన ప్రాజెక్టులు నిర్మిస్తే భవిష్యత్‌లో నీటి కేటాయింపుల సమస్యలు పెరుగుతాయి. మాకు రాజకీయ ప్రయోజనాల కంటే మా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం' అని భట్టివిక్రమార్క స్పష్టం చేశారు.

ఓటుహక్కును కాలరాస్తున్న బీజేపీ: ఓటు వేసే హక్కు ప్రతి భారతీయ పౌరుడికి ఉంటుందని, అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ హక్కును కాలరాస్తోందని భట్టివిక్రమార్క ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓట్ల గల్లంతును దేశమంతా చూసిందని చెప్పారు. బతికున్న వారిని కూడా చనిపోయినట్లు చూపించారని తెలిపారు. ఓట్ల గల్లంతుపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటంలో అన్ని పార్టీలతోపాటు దేశ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి దామోదర సూచన


సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

పుల్‌కల్(అందోల్): భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన సింగూరు ప్రాజెక్టు మట్టికట్టకు పడిన గండిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలసి పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కట్టపై నిర్మించిన అతిథిగృహంలో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరదలపై అధికారులనుంచి వివరాలు సేకరించారు. చెరువులకు గండ్లు పడకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదిక ప్రకారం భద్రతపై నిబంధనలు పాటించాలని చెప్పారు. కమిటీ సూచనల మేరకు సింగూరు ప్రాజెక్టులో 20.5 మీటర్ల నీరు నిల్వ ఉంచి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించి గేట్లను ఎత్తాలని సూచించారు. అంతకుముందు ఇసోజీపేట వద్ద సింగూరు పంట కాలువకు పడిన గండిని ఆయన పరిశీలించారు. గండి వరకు వాహనాలు వెళ్లకపోవడంతో కలెక్టర్‌తో కలసి మూడు కిలోమీటర్లు ట్రాక్టర్‌పై ప్రయాణించి గండి వద్దకు వెళ్లారు. గండిని పరిశీలించాక త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంత్రి వెంట ఎస్ఈ పోచమల్లు, ఆర్డీఓ పాండు, డీఈ నాగరాజు, తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

నీరంతా సముద్రం పాలవుతోంది

- ఒడిసిపట్టడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం
- రేవంత్, ఉత్తమ్‌లకు నీటి విలువ తెలియదు
- మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు



సాక్షి, సిద్దిపేట: 'నీటిని ఒడిసి పట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోంది..రేవంత్‌కు, ఉత్తమ్‌లకు నీటి విలువ తెలియదు..అందుకే ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతుంటే గేట్లు ఎత్తి 62 వేల క్యూసెక్కుల నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతున్నారు' అని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాళేశ్వరం ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని నందిమేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ఆన్ చేసి నీటిని రోజుకు 2 టీఎంసీల చొప్పున అన్నపూర్ణ సాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్లు నింపాలని డిమాండ్ చేశారు.

లక్షలాది మంది రైతులతో కదులుతాం: 'కేసీఆర్, హరీశ్‌రావుల మీద కోపం ఉంటే శిక్ష వేయండి. వరద నీటిని ఒడిసి పట్టి ఖాళీగా ఉన్న రిజర్వాయర్లను నీటితో నింపి యాసంగి పంటలకు అందించాలని' హితవు పలికారు. కాళేశ్వరం కూలిందనే అబద్ధాన్ని నిజం చేసేందుకు మోటార్లు ఆన్ చేయడం లేదన్నారు. కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయకపోతే లక్షలాది మంది రైతులతో కదిలి వెళ్లి మేమే మోటార్లు ఆన్ చేస్తామని హెచ్చరించారు.

కాళేశ్వరంపై మరో కుట్ర: కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం మరో కుట్ర చేస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. మోటార్లను తరచూ ఆన్, ఆఫ్ చేస్తుండటంతో పనికి రాకుండా చేయాలని చూస్తున్నారన్నారు. ఆన్, ఆఫ్ ఊరికే చేయొద్దని మోటార్లను సరఫరా చేసిన బీహెచ్ఈఎల్ హెచ్చరించిందని గుర్తు చేశారు. మోటార్లను నాశనం చేసి, బీఆర్ఎస్‌పై వేయాలని కుట్ర చేస్తున్నారని, కావాలనే మేడిగడ్డకు మరమ్మతులు చేయడం లేదన్నారు.

క్లుప్తంగా...

రాధాకృష్ణన్ ఎంపికపై రాంచందర్‌రావు హర్షం



సాక్షి, హైదరాబాద్: ఎన్డీఏ తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాధాకృష్ణన్ నిరంతరం ప్రజాసేవకు అంకితమయ్యారని, ఆయన గెలుపు ఖాయమన్నారు.

వరంగల్‌లో సమన్వయం కోసం సీనియర్లతో కమిటీ

- టీపీసీసీకి క్రమశిక్షణ కమిటీ సిఫారసు.. గజ్వేల్ ఘటనపై శ్యాంమోహన్ నేతృత్వంలో కమిటీ
- 26న రాజగోపాల్‌రెడ్డి అంశంపై చర్చ: మల్లురవి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య సమన్వయం కోసం పార్టీ సీనియర్ నాయకులతో కమిటీని ఏర్పాటు చేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సూచించింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సిఫారసు చేయాలని కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం గాంధీ భవన్‌లో కమిటీ చైర్మన్ మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి గజ్వేల్ నుంచి వచ్చిన పలువురు కార్యకర్తలు, నేతలు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఆయనపై ఎట్టి పరిస్థితుల్లోనూ చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. వీరి వాదనలను రికార్డు చేసిన క్రమశిక్షణ కమిటీ, ఈ అంశంపై నివేదిక కోసం కమిటీ సభ్యుడు అనంతుల శ్యాంమోహన్‌ను కన్వీనర్‌గా నియమించింది. సమావేశం అనంతరం కమిటీ చైర్మన్ మల్లురవి విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లో ఏం జరిగిందన్న దానిపై నివేదిక కోసం కమిటీని నియమించామని, మంత్రి వివేక్ సమక్షంలోనే ఘటన జరిగినందున ఆయన నుంచి కూడా వివరాలను సేకరిస్తామన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను కూడా పరిశీలించాలని తెలిపారు, ఈ అంశంపై ఈనెల 26వ తేదీన జరిగే సమావేశంలో చర్చిస్తామని వెల్లడించారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ సంసిద్ధం: కాసం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉన్నట్లు.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పార్టీ యంత్రాంగానికి సంకేతాలు పంపారు. స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత కోసం ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని 31 జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వర్క్‌షాప్‌లు పూర్తయ్యాయని వివరించారు. 566 మండలాలలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వర్క్‌షాప్‌లు కూడా పూర్తయినట్లు చెప్పారు. ఈ నెల 21 నుంచి 25 వరకు స్థానిక సమస్యలను ప్రజలకు తెలియజేస్తూ, కాంగ్రెస్, బీఆర్ఎస్ స్థానిక సంస్థలను ఎలా నిర్వీర్యం చేశాయో వివరిస్తూ, 566 మండలాలలో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ర్యాలీలు పూర్తయ్యాక, ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకు అన్ని జిల్లా కేంద్రాలలో ర్యాలీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21, 22 తేదీలలో '24 గంటల టూర్'కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు.. రంగారెడ్డి జిల్లాలోని ఒక మండలంలో 24 గంటలు బస చేస్తారని తెలిపారు.

బీఆర్ఎస్‌కు అసిస్టెంట్‌గా ప్రవీణ్‌కుమార్

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎద్దేవా



శంషాబాద్ రూరల్ (హైదరాబాద్): సమాజం కోసం అంకితమై, అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎండగడతానని మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఇప్పుడు ఆ పార్టీకి అసిస్టెంట్‌గా. ఫిర్యాదుల రైటర్ అవతారం ఎత్తారని మాజీ ఎమ్మెల్యే, గువ్వల బాలరాజు ఎద్దేవా చేశారు. మండలంలోని పెద్దషాపూర్‌లో జరుగుతున్న ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల బీజేపీ మండల అధ్యక్షుల శిక్షణ శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నంతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రవీణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. ఎస్పీగా ఉన్న సమయంలో ప్రవీణ్‌కుమార్ ఎంతోమంది దళిత బిడ్డలను ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకుందని ఆరోపించారు. అవినీతిలో కూరుకుపోయి, ప్రజల ఛీత్కారాలకు గురవుతున్న బీఆర్ఎస్ పార్టీలో కొనసాగేందుకు మనసు ఒప్పక బీజేపీలో చేరినట్లు వెల్లడించారు.

ఫోన్ల రికవరీస్



వేలు కాదు.. లక్షలు పోసి ఫోన్ కొంటున్నాం. ఎడాపెడా వాడేస్తున్నాం. అంతేనా? అన్ని సెక్యూరిటీ ఫీచర్స్ ఎనేబుల్ చేస్తాం. డేటాని బ్యాకప్ పెట్టేస్తున్నాం. కానీ, అనుకోకుండా ఫోన్ పోతే? ఏముందీ.. రికవర్ చేసేయొచ్చులే అనుకుంటే మీది ఓవర్ కాన్ఫిడెన్సే. ఎందుకంటే.. పోయిన ఫోన్ల రికవరీ రేట్ మీరు అనుకునేంత స్థాయిలో లేదు. దేశ రాజధాని ఢిల్లీనే అందుకు సాక్ష్యం. అక్కడ పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ రేటు ఎంతో తెలుసా? 1.87%. అంటే.. వంద ఫోన్లు పోతే.. ఒకటో రెండో రికవర్ చేస్తున్నారట. దేశ రాజధానిలో పరిస్థితి సరే, మరి మన దగ్గర ఎలా ఉంది?

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఫోన్ పోగానే ముందుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంప్లైంట్ ఇస్తాం. ట్రాక్ చేస్తారులే అని భరోసాతో ఎదురు చూస్తాం. కానీ, పోయిన ఫోన్లు దొరికే అవకాశం చాలా తక్కువ అని గణాంకాలు చెబుతున్నాయి. జాతీయ స్థాయిలో సగటున 100 ఫోన్లు పోతే 25 ఫోన్లనే తిరిగి తీసుకురాగలుగుతున్నారట. టెలికమ్యూనికేషన్ల శాఖకు చెందిన సంచార్ సాథీ పోర్టల్ చెబుతున్న వాస్తవాలివి. ఢిల్లీలో మొత్తంగా 8.22 లక్షలకు పైగా ఫోన్లను బ్లాక్ చేశారు. కానీ, వాటిలో తిరిగి దొరికినవి కేవలం 9,871 మాత్రమే. ఈ తక్కువ రికవరీ జాబితాలో పంజాబ్, బిహార్ ఉన్నాయి. జాతీయ స్థాయిలో 36.35 లక్షలకుపైగా ఫోన్లను బ్లాక్ చేస్తే.. ట్రేస్ చేసినవి 22.14 లక్షలు. రికవరీ చేసినవి 5.45 లక్షలు. రికవరీ రేటు 24.5 శాతం. అంటే 100లో 25 ఫోన్లు మాత్రమే రికవరీ అవుతున్నాయన్నమాట. ఈ గణాంకాల విషయంలో యూజర్లు కాస్త ఘాటుగానే స్పందిస్తున్నారు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా ఎందుకీ అలసత్వం అంటూ సోషల్ మీడియా వేదికలపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు స్టేషన్లు అంటే ఫిర్యాదులు, విచారణలు, కేసులు. కానీ, కొన్ని స్టేషన్లకు ఇటీవల విచిత్రమైన పార్సిళ్లు వస్తున్నాయి. అవేంటో తెలుసా..దొంగిలించిన మొబైల్ ఫోన్లు. వాటిని కొనుక్కున్న కొత్త యజమానులు వాటిని తిరిగి పోగొట్టుకున్న వారికి పంపేందుకు పోలీస్ స్టేషన్లకు కొరియర్ చేస్తున్నారట. అంతలా స్వచ్ఛందంగా ఎందుకు పంపుతున్నారనేగా మీ సందేహం? ఎందుకంటే.. ఈ చిత్రమైన ట్రెండ్ వెనుక ఒక కొత్త టెక్నాలజీ ఉంది. దానిపేరే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్). ఫోన్ల దొంగతనాల్ని కట్టడి చేసేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం సీఈఐఆర్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఫోన్ పోగొట్టుకున్నవారు ఐఎంఈఐ నంబర్ సాయంతో.. ఈ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ని బ్లాక్ చేయొచ్చు. దీంతో ఆ ఫోన్ దేశంలో ఎక్కడున్నా.. ఏ నెట్‌వర్క్‌పైనా పనిచేయకుండా పోతుంది. అంటే అది దొంగల చేతిలో ఉన్నా పనికిరాదన్నమాట. అందుకే అలాంటి ఫోన్లు పోలీస్ స్టేషన్లకు పార్సిళ్లుగా వెళ్తున్నాయి.


100 ఫోన్లు పోతే 25 మాత్రమే దొరుకుతున్నాయి

ఢిల్లీలో అత్యల్పంగా రికవరీ రేటు కేవలం 1.87%

తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటుకంటే నయమే

స్వచ్ఛందంగా డిస్‌కనెక్ట్

కావాల్సిన ప్రూఫ్‌లతో విచ్చలవిడిగా సిమ్ కార్డులు తీసుకుని వాడేసిన రోజులు దాటుకుని.. నా పేరు మీద ఏదైనా నంబర్లు ఇంకా యాక్టివ్‌గా ఉన్నాయా? అని మనమే వెతుక్కునే రోజులకి వచ్చాం. అందుకు కారణం లేకపోలేదు. ఫేక్ ప్రూఫ్‌లు, దొంగిలించిన సిమ్‌లతో సైబర్ క్రైమ్‌లకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం. ఈ నేపథ్యంలో చాలా మంది యూజర్లు స్వచ్ఛందంగానే వారి పేరు, అడ్రస్ ప్రూఫ్‌తో ఉన్న ఫోన్ నంబర్లను వెతికి 'సంచార్ సాథీ' పోర్టల్ ద్వారా బ్లాక్ / డిస్‌కనెక్ట్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి మొబైల్ కనెక్షన్ల సంఖ్య 1.07 కోట్లు.



మన పరిస్థితేంటి?

తెలంగాణలో 3.76 లక్షల ఫోన్లు బ్లాక్ చేస్తే.. ట్రేస్ చేసినవి 2.13 లక్షలు. వాటిలో 91,306 ఫోన్లు రికవరీ అయ్యాయి. అంటే, రికవరీ రేటు 42.8%. ఆంధ్రప్రదేశ్‌లో 1.26 ఫోన్లు బ్లాక్ చేస్తే.. 79వేలకుపైగా ట్రేస్ చేయగలిగారు. తిరిగి తీసుకొచ్చినవి 31,478. రికవరీ రేటు 39.66% శాతం. మరోవైపు సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్న ప్రకారం.. రికవరీ ఫోన్లను పోలీసులు రాబట్టే క్రమంలో కొందరు అమాయకులు బయటపడుతున్నారు. ఎవరా అమాయకులు అంటే.. దొంగిలించిన ఫోన్‌ని కొన్నవాళ్లు. చాలా తక్కువ ధరకే దొరుకుతుందని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్లలో అనధికారికంగా ఇలాంటి ఫోన్లు కొంటున్నారు.

రాష్ట్రం	రికవరీ రేటు (శాతం)	రాష్ట్రం	రికవరీ రేటు (శాతం)
పంజాబ్	11.02	ఆంధ్రప్రదేశ్	39.66
బిహార్	12.48	రాజస్తాన్	41.86
తమిళనాడు	35.44	తెలంగాణ	42.77
కర్ణాటక	39.25	జాతీయ సగటు	24.5

సిరిసిల్ల నుంచే పోటీ చేస్తా

మీరు వద్దనుకునే వరకు ఇక్కడి నుంచి వెళ్లను

- కొన్ని పార్టీల తప్పుడు ప్రచారం నమ్మొద్దు
- స్థానిక ఎన్నికల్లో ఇల్లిల్లూ తిరిగి మిమ్మల్ని గెలిపించుకుంటా
- వస్త్ర వ్యాపారులకు రాజకీయాలెందుకు?
- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ నేత కేటీఆర్
- కుటుంబ సభ్యుల కోసమే సీఎం ఫ్యూచర్ సిటీ ప్రచారమని విమర్శ
- బీఆర్ఎస్ కార్యకర్త కుంటయ్య కూతురు వివాహం జరిపించిన కేటీఆర్



నవితతో కరచాలనం చేస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/గంభీరావుపేట/సిరిసిల్ల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సిరిసిల్ల నుంచే పోటీ చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు తెలిపారు. తాను హైదరాబాద్ శివార్లలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నట్లు దుష్ప్రచారం జరుగుతోందని, దానిని ఎవరూ నమ్మవద్దని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కేటీఆర్ సమావేశమై మాట్లాడారు. 'మీ ఆశీర్వాదంతోనే రాజకీయంగా ఎదిగాను. మీరు వద్దనుకునే వరకు ఇక్కడే పోటీ చేస్తాను. వచ్చే ఎన్నికల్లో నేను సిరిసిల్లలో పోటీ చేయనని, హైదరాబాద్ శివారుల్లో పోటీ చేస్తానని కొన్ని పార్టీల నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రచారాన్ని నమ్మవద్దు'అని కోరారు.

మిమ్మల్ని దగ్గరుండి గెలిపించుకుంటా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను దగ్గరుండి గెలిపించుకుంటానని కేటీఆర్ తెలిపారు. 'నా గెలుపు కోసం మీరంతా కష్టపడ్డారు. మీ గెలుపు కోసం మున్సిపల్ ఎన్నికల్లో నేను కష్టపడుతాను. ఇంటింటికీ వెళ్తాను. అభ్యర్థులకు బీఆర్ఎస్ టిక్కెట్లు నేనే ఇస్తాను. మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత నాదే. సిరిసిల్ల వస్త్రవ్యాపారులు కొందరు రాజకీయాలు చేస్తున్నారు. వారు వ్యాపారం చేసుకోవాలే తప్ప, వాళ్లకు రాజకీయాలు ఎందుకు?'అని ప్రశ్నించారు. యూరియా కొరతతో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, 'సెస్'చైర్మన్ చిక్కాల రామారావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– ఎస్ఐఆర్)తో పాటు ఎన్నికల సంఘానికే సమగ్ర ప్రక్షాళన అవసరమని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంపై ఆయన 'ఎక్స్' లో స్పందించారు. 'ఎన్నికల సంఘం నిర్వహించిన మీడియా సమావేశంలో సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువగా మిగిలాయి. దీనిపై ఎన్నికల ప్రధాన కమిషనర్ ఇచ్చిన వివరణలో, సమస్యల పరిష్కారాల కన్నా సాకులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడాల్సిన ఎన్నికల సంఘం, ఎన్డీయే ప్రభుత్వానికి అనుబంధ విభాగంలా పనిచేస్తోంది. ఓటర్ల జాబితాలో లోపాలను అంగీకరించినప్పుడు, తమ విధులను నిర్లక్ష్యం చేసినట్లు కూడా ఒప్పుకోవాల్సిన అవసరం లేదా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఫ్యూచర్ సిటీకి ఫ్యూచరే లేదు

సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే ప్రచారం చేస్తున్న ఊహాజనిత ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని కేటీఆర్ అన్నారు. కేవలం తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న సీఎం ఆకాంక్ష నెరవేరదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేని నాయకుడు. ఆయన నిర్ణయాల వల్ల ప్రజాధనం వృధా అవుతోంది. ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మోసపోయారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్ సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారు. నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందనే దానికి ఫ్యూచర్ సిటీ ప్రచారం ఒక ఉదాహరణ'అని మండిపడ్డారు. ఫార్మాసిటీ భూములపై ప్రభుత్వం వెంటనే ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఆ ఆహ్వానం నాకెంతో ప్రత్యేకం

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ధ్యానబోయిన నవిత వివాహానికి కూడా కేటీఆర్ ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. 'అన్నా.. నాకు నాన్న, అన్న లేరు. మీరు అన్నయ్యగా పెళ్లికి వచ్చి మా దంపతులను ఆశీర్వదించాలి' నవిత వాట్సాప్‌లో పంపిన ఆహ్వానం తన మనస్సును కదిలించిందని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఈ రోజు ఒక ప్రత్యేకమైన ఆహ్వానం అందింది. నాకు ఇదొక ప్రత్యేకమైన అనుభూతి. ప్రతి అమ్మాయి తన వివాహానికి నాన్న ఆశీర్వాదం, అన్నయ్య అండ కావాలని కోరుకుంటుంది. కానీ నా చెల్లి తన నాన్న, అన్నయ్యను కోల్పోయిన తర్వాత ఆ లోటును తీర్చాలని నన్ను పిలిచింది. ఆమె ఆహ్వానం నాకు కేవలం ఆహ్వానం కాదు.. అది నా మీద ఉంచిన నమ్మకం. ఒక అన్నయ్యపై ఉంచిన ఆశ. ఆ ఆడబిడ్డ ఆహ్వానం నా మనసును కదిలించింది. ఆమె కోరికను గౌరవించడం నా బాధ్యతగా, కర్తవ్యంగా భావించాను'అని పేర్కొన్నారు.



కుంటయ్య కూతురు పెళ్లి చేసిన కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కరికవేణి కుంటయ్య ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా.. ఆయన కూతురు లక్షిత (భార్గవి) పెళ్లి బాధ్యతలను కేటీఆర్ నిర్వహించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో పెళ్లి వేడుకలకు ఆదివారం హాజరయ్యారు. పెళ్లి ఖర్చులను పార్టీ పరంగా కేటీఆర్ భరించారు. కుంటయ్య చిన్న కూతురుకు కొంత డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా అందించారు.

ఫ్యూచర్ సిటీ టు అమరావతి..

- 8 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సర్కారు నిర్ణయం
- బందరు ఓడరేవుతో నాలుగో నగరి అనుసంధానం
- దీంతో జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య రవాణా సులువు
- కేంద్రం అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- వచ్చే వెయ్యేళ్ల అవసరాలు తీర్చేలా భవిష్యత్తు నగరి అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నాలుగో నగరి.. ఫ్యూచర్ సిటీతో రాష్ట్రాభివృద్ధి మరో దశకు చేరనుందని పరిశీలకులు అంటున్నారు. భవిష్యత్తు నగరాన్ని వచ్చే వెయ్యేళ్ల అవసరాలను తీర్చేలా, ఒక నమూనాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్న సర్కారు.. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి మధ్య ఎనిమిది లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. ఈ రహదారి నిర్మాణం తర్వాత హైదరాబాద్–విజయవాడ మధ్య దూరం 70 కిలో మీటర్ల మేర తగ్గుతుందని చెపుతున్నారు.

మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మక రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రీజనల్ రింగ్ రైల్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ ప్రాజెక్టులను ఓడరేవుతో అనుసంధానిస్తే జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య రవాణాతో పాటు బహుళ జాతి సంస్థలు, పెట్టుబడిదారులను ఆకర్షించడం సులువవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీని ఏపీలోని మచిలీపట్నంలో బందరు పోర్టుకు అనుసంధానించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం తన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. దీనికి త్వరలోనే అనుమతి మంజూరు అవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ వెంట రెండు డ్రై పోర్టులు..

ఆర్ఆర్ఆర్, రీజనల్ రింగ్ రైల్ ప్రాజెక్టులకు కూడా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. రీజనల్ రింగ్ రైల్‌ను బందరు పోర్టు లేదా ఇతర ఓడరేవుతో అనుసంధానించే ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు ట్రిపుల్‌ఆర్ వెంట రెండు డ్రై పోర్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెదక్, చౌటుప్పల్ లేదా ఖమ్మం వద్ద వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తెలంగాణ రైజింగ్..

రాష్ట్రాన్ని కోర్ అర్బన్ (ఓఆర్ఆర్ లోపల), సెమీ అర్బన్ (ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య), గ్రామీణ (ఆర్ఆర్ఆర్, తెలంగాణలోని మిగిలిన ప్రాంతాల మధ్య) ప్రాంతం.. అని మూడు భాగాలుగా విభజించిన సర్కారు.. వీటిని సేవా, పారిశ్రామిక, వ్యవసాయ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచిస్తోంది. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు తెలంగాణ రైజింగ్–2047 విజన్ పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించనుంది. దీనిని వచ్చే డిసెంబర్ 9న విడుదల చేయనుందని తెలుస్తోంది. ఆ రోజు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం కావడం గమనార్హం.

కాంగ్రెస్ ముందు మూడు ఆప్షన్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీకి ప్రధానమని, అవసరమనుకుంటే ఈ విషయంలో మరికొంత సమయం తీసుకుందామని ఆయన అంటున్నారు. ఆదివారం సీఎంతో జరిగిన సమావేశంలోనూ ఇదే అభిప్రాయాన్ని వెల్లడించినట్టు తెలుస్తోంది. మరోవైపు కొందరు మంత్రులు, నాయకులు మాత్రం ఇప్పటికే స్థానిక ఎన్నికలు ఆలస్యమయ్యాయని, మరింత జాప్యం చేయడం మంచిది కాదని, పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించి ముందుకు వెళ్లడం మంచిదని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక కమిటీ అయిన పీఏసీని సమావేశపరచి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వచ్చారు.

ఈ మూడు ఆప్షన్లు పీఏసీ ముందుకు..

పీఏసీ సమావేశంలో మూడు అంశాలపై చర్చ జరగనుండగా.. రిజర్వేషన్ల విషయం ఎటూ తేలనందున కోర్టును మరింత సమయం కోరుదామని, వీలుకాదంటే రివ్యూ పిటిషన్ దాఖలు చేసి మరోమారు ఢిల్లీకి వెళదామనే ప్రతిపాదన ఇందులో మొదటిది. మరోమారు అసెంబ్లీని సమావేశపరిచి అన్ని పార్టీల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టి ప్రజల ముందు పెట్టాలనేది రెండో ప్రతిపాదన. ఈ రెండూ కాదంటే నేరుగా పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలకు వెళ్లడం మూడోది. వీటిపై అందరి అభిప్రాయాలనూ క్రోడీకరించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

సీఎంతో ముఖ్యుల భేటీ

ఆదివారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌తో మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేత వి.హనుమంతరావులు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లు, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు గాంధీభవన్‌లో పీఏసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కాగా 22న నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో జరిగే అమరవీరుల స్తూపావిష్కరణకు హాజరు కావాలని రేవంత్‌ను వీహెచ్ కోరారు. అయితే ఈ కార్యక్రమానికి వెళ్లాల్సిందిగా పీసీసీ చీఫ్‌కు సూచించిన ముఖ్యమంత్రి.. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వస్తారని వీహెచ్‌కు చెప్పినట్టు సమాచారం.

ఇక కొత్త సర్వే మాన్యువల్!

- భూముల హద్దుల నిర్ధారణకు తాజా నిబంధనలు
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు
- నేటి నుంచి లైసెన్సుడు సర్వేయర్లకు రెండో విడత శిక్షణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని భూముల హద్దును నిర్ధారించేందుకుగాను కొత్త సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత పదేళ్ల కాలంలో సర్వే విభాగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని, ప్రజాపాలనలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే వ్యవస్థకు నూతన హంగులు తెస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో జరిగే సర్వేలు పారదర్శకంగా ఉండేందుకు గాను తాజా నిబంధనలు తయారు చేయాలని, సర్వే మాన్యువల్ తయారీకి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని కోరారు. ఆదివారం సర్వే విభాగంపై సమీక్ష సందర్భంగా పొంగులేటి మాట్లాడారు.

అక్టోబర్ 2 నుంచి లైసెన్సుడు సర్వేయర్ల వ్యవస్థ

అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నాటికి రాష్ట్రంలో లైసెన్సుడు సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. లైసెన్సుడు సర్వేయర్ల నియామకంలో భాగంగా ఈ ఏడాది మే 26 నుంచి జూలై 26 వరకు జిల్లా కేంద్రాల్లో 7 వేల మందికి తొలి విడత శిక్షణ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. గత నెల 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు కూడా ప్రకటించామని, ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి 40 రోజుల పాటు ఇచ్చే అప్రెంటిస్ శిక్షణ కూడా పూర్తి చేశామని చెప్పారు. రెండోదశ శిక్షణ ఈ నెల 18వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నామని, ఈ శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్లకు రిపోర్టు చేయాలని సూచించారు. భూ భారతి చట్టంలో భాగంగా రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. రెవెన్యూ, సర్వే విభాగాల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగా లైసెన్సుడు సర్వే వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని పొంగులేటి వివరించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కలయికే మన దేశం: మహేశ్‌కుమార్‌గౌడ్



గన్‌ఫౌండ్రీ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కలయికే మన దేశమని.. మనం లేకుంటే దేశం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్నవారు మతం పేరుతో విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం రవీంద్రభారతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీస్ సమైక్య జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ మతతత్వ శక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే మనమందరం ఐక్యంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్రలో గెలవడానికి ప్రధాని మోదీ ఓటు చోరీ చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థలు, విద్య ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచామని గుర్తుచేశారు.

- మంత్రి వివేక్ మాట్లాడుతూ సమాజంలో నేటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వివక్షకు గురవుతున్నారన్నారు. ఉద్యోగులు, విద్యావేత్తలు జాతికి మార్గదర్శకం కావాలని, జాతి కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు.
- మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా సామాజిక న్యాయంపై చర్చ జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు ఆయుధమని, ఆ ఓటును తొలగించే దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతమ్, మాజీ ఎంపీ అజారుద్దీన్, అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్‌రాజ్, ఎస్సీ జాతీయ నాయకులు జేబీ.రాజు, ఉదిత్ రాజుల తోపాటు వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

రాహుల్‌కు చరిత్ర తెలియదు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి చరిత్ర తెలియదని, ఆయనకు రాజకీయాలపై కనీస అవగాహన లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. ఆయన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎస్ఎస్‌తో విభేదించిన పార్టీలు రాజకీయపరంగా, సిద్ధాంతపరంగా ఉన్నాయన్నారు. కానీ దేశానికి సంబంధించిన అంశంలో ఆర్ఎస్ఎస్‌ను మించిన సంస్థ మరొకటి లేదని అన్ని పార్టీలు అంగీకరిస్తాయన్నారు. ఆగస్టు 15న మోదీ ప్రసంగం తర్వాత.. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీగా, వారసత్వ పార్టీగా, ఓడిపోయే పార్టీగా, కుంభకోణాలపార్టీగా, దోచుకున్న పార్టీగా, దాచుకున్న పార్టీగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు.



నిజమైన నాయకుడికి ఒంటరిగా నిలబడే ఆత్మవిశ్వాసం,
కఠినమైన నిర్ణయాలు తీసుకునే ధైర్యం,
ఇతరుల కష్టాలను వినే కరుణ ఉంటాయి.
– సుభాష్ చంద్రబోస్, స్వాతంత్ర్య సమర యోధుడు

సాక్షి
సోమవారం, 18 ఆగస్టు 2025

కుక్క కథ

కుక్కల మీద మనిషికి ఎప్పుడూ సదభిప్రాయం ఉన్నట్టు లేదు. 'కుక్క' అనే మాటనే తిట్టుగా వాడగలడు. కుక్క బుద్ధి అని నిందించగలడు. కుక్కల కొట్లాట అని దూషించగలడు. కుక్క బతుకు అని బాధపడగలడు. కుక్క మూతి పిందెలు అని తూలనాడగలడు. కుక్క కాటుకు చెప్పుదెబ్బ అని దెప్పిపొడవగలడు. ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావిడి అని వెక్కిరించగలడు. 'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి' అని పాడగలడు. ఆఖరికి కుక్క చావును తనకు ఇష్టంలేని మనిషి జీవితయాత్రకు భరత వాక్యంగా జోడించగలడు.

కుక్కలను వాటిమానాన వాటిని అడవిలో మననీయకుండా ఇంటిదాకా తెచ్చుకున్నది మనిషే. సుమారు 15,000 సంవత్సరాల క్రితమే మనిషి దాన్ని మచ్చిక చేసుకున్నాడు. మానవులు తొట్టతొలిగా మచ్చిక చేసుకున్న జంతువు కుక్కేనంటారు. కాదు, గొర్రె అని మరో వాదన. ఏమైనా మనిషితో తొట్టతొలిగా స్నేహం చేసిన జంతువుల్లో కుక్క అగ్రభాగాన ఉందన్నది సత్యం. అప్పటినుంచీ అది మనిషికి వేటలో సాయపడింది. పంటలను కాపు కాసింది. మంచులో స్లెడ్జ్ బళ్లను లాగింది. దొంగలు, హంతకుల జాడను పసిగట్టింది. బాంబులను గుర్తించింది. ఒంటరి జీవులకు తోడుగా నిలిచింది. 'దేవదాసు'లకు సాంత్వననిచ్చింది. తెగించి యజమానుల ప్రాణాలను కాపాడింది. మనిషి నాగరికతా ప్రస్థానంలో తనకు తెలియకుండానే విశ్వసనీయమైన పాత్రను పోషించింది. దాని తోక మాత్రమే వంకర కావొచ్చుగానీ దాని పనికి ఏ వంకా లేదు. అంతెందుకు! 1957లో రష్యన్లు 'స్పుత్నిక్'లో తొట్టతొలిగా ఒక జీవిని అంతరిక్షంలోకి పంపాలనుకున్నప్పుడు వాళ్లు ఎంచుకున్నది కూడా ఒక కుక్కనే. అది మాస్కో వీధుల్లో తిరుగాడిన మూడేళ్ల ఆడ ఊరకుక్క. పేరు లైకా. అది ప్రాణాలతో తిరిగిరాదని దానికి తప్ప శాస్త్రవేత్తలందరికీ తెలుసు!

జపాన్‌లో హచికో కుక్కది మరో కథ. తన యజమాని టోక్యో యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసేవాడు. విధులు ముగించుకుని ఆయన సాయంత్రం షిబూయా రైల్వే స్టేషన్‌లో రైలు దిగేవాడు. అప్పటికి రెండేళ్ల వయసున్న హచికో అతడి కోసం అక్కడ వేచివుండేది. ఒక రోజు ఉన్నట్టుండి ఆ ప్రొఫెసర్ విధుల్లోనే బ్రెయిన్ స్ట్రోక్‌తో కుప్పకూలి చనిపోయాడు. ఇదేమీ తెలియని హచికో రోజులాగే యజమాని కోసం స్టేషన్‌కు వచ్చింది. తెల్లారీ వచ్చింది. మరునాడూ వచ్చింది. క్రమం తప్పకుండా వస్తూనే ఉంది, ఎదురుచూస్తూనే ఉంది. అప్పటికిగానీ స్థానికులు దాన్ని గుర్తించలేదు. తనని ప్రేమించిన యజమాని కోసం, తాను ప్రేమించిన యజమాని కోసం 1925– 1935 కాలంలో అది చనిపోయేదాకా సుమారు పదేళ్లపాటు ఆ స్టేషన్‌లో ఎదురుచూసింది. జపాన్‌లో ఇప్పుడు హచికో ఒక సాంస్కృతిక చిహ్నం. కుక్క అంటే విశ్వాసం అనే పేరు దానికి ఊరకే రాలేదు. వేల ఏళ్లుగా లక్షలాది కుక్కలు సమష్టిగా సముపార్జించుకున్న ఘనత అది.

ప్రపంచంలో సుమారు 360 రకాల కుక్కలున్నాయి. వీటన్నింటినీ తిరిగి ఇంటికుక్క, ఊరకుక్క అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఈ రెండింటికీ మధ్య ఉన్నది స్వల్ప భేదమే. ఇది జాతిపరమైనది కాదు. పెంచుకుంటే ఇంటి కుక్క. ఎవరికీ పట్టనిది ఊర కుక్క. 'మనిషిని కుక్క కరిస్తే వార్త కాదు, కుక్కను మనిషి కరిస్తే వార్త' అని జర్నలిజంలో ఒక తొలి పాఠం చెబుతుంటారు. కానీ మనుషులను కుక్క కరిచినా వార్త అవుతుండటం కుక్క కాట్ల తీవ్రతను తెలియజేస్తోంది. ఇది అత్యంత ఆందోళనకరంగా పరిణమించడం వల్లే ఊరకుక్కలను ఊళ్లో ఉంచాలా వద్దా అనే చర్చ దేశమంతా నడుస్తోంది; వాటికి అనుగుణంగా, వ్యతిరేకంగా ఎన్నో వాదనలు వినబడుతున్నాయి.

జాక్ లండన్ రాసిన 'కాల్ ఆఫ్ ద వైల్డ్' నవలలోని బక్ కుక్క 'దుడ్డుకర్ర చేతగలవాడిది పైచేయి' అని ఇట్టే అర్థం చేసుకుంటుంది. ఆ పాఠాన్ని జీవితంలో ఎన్నడూ మరవదు. మనిషి సాధారణంగా ద్వంద్వ జీవి. దుడ్డుకర్రతో కుక్కలకు 'ఆటవిక శాసనాన్ని' పరిచయం చేయగలడు; లైకా అంతరిక్షంలో విలవిల్లాడి చచ్చిపోయిందంటే జీర్ణం చేసుకోలేక దాన్ని గ్రహాంతరవాసులు కాపాడినట్టు ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని సృజించుకోగలడు (ఉదా: జూలియన్ మే రాసిన 'ఇంటర్వెన్షన్'). 'పాతాళ్ లోక్' వెబ్‌సిరీస్‌లో హథోడా త్యాగికి తన గురువు ఒక మాట చెబుతాడు: ఒక మనిషి మంచివాడా కాదా అన్నది తెలుసుకోవడానికి అతడు కుక్కలతో ఎలా ఉంటున్నాడో చూడమంటాడు. దేశంలో సుమారు ఆరు కోట్ల ఊరకుక్కలున్నాయట. మనం వద్దనగానే అవి మాయం కావు. ఈ భూమ్మీది నుంచి ఎక్కడికీ పోవు. వాటిని మననిస్తూ, మనం ఇబ్బందిపడకుండా ఏ శాస్త్రీయ మార్గాలున్నాయో అన్వేషించడమే ఉత్తమ మార్గం. ప్రతి కుక్కకూ ఒక రోజంటూ ఉండాలిగా!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.దశమి సా.6.13 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** రోహిణి ఉ.5.40 వరకు, తదుపరి మృగశిర రా.3.51 వరకు, **వర్జ్యం:** ఉ.10.26 నుండి 11.56 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.29 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.00 నుండి 3.50 వరకు. **అమృత ఘడియలు:** రా.7.31 నుండి 9.02 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

పరిష్కారం



రాజీ పడటాన్ని మించి మరి దేనినీ నేను ఇష్టపడను. కానీ పరిష్కారం కుదరని రాజీ... సమయం వృథా తప్ప మరింకేమీ కాదు.

– మార్కో రూబియో, యూఎస్ విదేశాంగ కార్యదర్శి

పురోగతి



జీవితంలో అర్థవంతమైన పురోగతి సాధించకుండానే వయసు పెరుగుతున్నట్లు అనిపించడం కంటే మనిషికి బాధ కలిగించేది మరొకటి లేదు.

– నిఖిల్ కామత్, 'జెరోధా' కో–ఫౌండర్

ఒకరోజు



నేను ఉదయాన్నే లేచి వెళతాను. ఆలస్యంగా ఇంటికి చేరుకుంటాను. రోజు తర్వాత రోజు... సంవత్సరం తర్వాత సంవత్సరం... ఇలా ఒకరోజు – రాత్రికి రాత్రే విజయం సాధించడానికి నాకు 17 సంవత్సరాల 114 రోజులు పట్టింది.

– లియోనెల్ మెస్సీ, ఫుట్ బాల్ క్రీడాకారుడు

రెండోది



నా మంగోలాయిడ్ రూపురేఖల కారణంగా నేను జాతి వివక్షకు గురయ్యాను. పట్టించుకోక పోవటం, లేదా తిరిగి పోరాడటం... రెండే మార్గాలు నాకు కనిపించాయి. పెద్దయ్యాక నేను రెండోదాన్ని ఎంచుకున్నాను.

– ఏంజలికా అరిబమ్, పొలిటికల్ యాక్టివిస్టు

కాకండి!



దేనికీ ప్రభావితం కాకండి. పరిస్థితులను గమనించండి. వాటిని బట్టి మీ సొంత అభిప్రాయాన్ని ఏర్పరచుకోండి. మీ సొంత అవగాహనకు రండి. మీ సొంత నిర్ణయానికి కట్టుబడండి.

– పరోమితా ఓహ్రా, ఫౌండర్, ఏజెంట్ ఆఫ్ ఇష్క్

దేవుడా!



గట్టి ధార్మిక విశ్వాసాలు ఉండేవాళ్లలో కొందరు ఇతరులను మోసం చేసి డబ్బులు సంపాదిస్తారు. దీన్ని వాళ్లు ఎలా సమర్థించుకుంటారు? దేవుడిని ఏమని కోరుకుంటారు? ఇతరుల పట్ల ఏమాత్రం కనికరం చూపకుండా ఉండే బలాన్నిమ్మనా?

– అమిత్ టాండన్, స్టాండప్ కమెడియన్

మనమంటే మొహం మొత్తిందా?

కామెంట్



కరణ్ థాపర్

ఇండియాపై ట్రంప్‌కు మొహం మొత్తిందా? ఆయన తన చేతల ద్వారా అదే విషయాన్ని తెగేసి చెబుతున్నారా? ఆయన మనపై 50% సుంకాలు విధించారు. సుంకాలపై వివాదం పరిష్కారమయ్యేంత వరకూ వాణిజ్య చర్చలను సుప్తావస్థలో పెడుతున్నట్లు ఆయన తెలిపారు. భారతదేశ మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ నట్టేట మునిగినా తాను లెక్క చేయబోనని కరాఖండీగా చెప్పేశారు. రష్యా చమురును కొంటూ, అమెరికా జాతీయ భద్రతకు భారత్ ముప్పు తెస్తోందని ట్రంప్‌కు వాణిజ్య సలహాదారైన పీటర్ నవారో ప్రకటించారు. పుతిన్‌తో ట్రంప్ చర్చలు విఫలమైతే భారత్‌పై సెకండరీ సుంకాలు పెరగవచ్చని ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ వెల్లడించారు. యూరప్ కూడా భారత్‌పై సెకండరీ సుంకాలు విధించాలని ఆయన కోరారు. అమెరికా స్నేహహస్తం నుంచి భారత్ చేజారిందని ఇవన్నీ సూచిస్తున్నాయా?

చైనా, రష్యాలను హెచ్చరించేందుకు భారత్‌ను ట్రంప్ వాడుకుంటున్నారనే అభిప్రాయమూ ఉంది. అది కూడా సంతోషపడదగ్గ అంశం కాదు. మనం ఆనుషంగిక నష్టాన్ని భరించాల్సి ఉంటుంది. మనం ఏమైపోయినా నిజంగానే, ఆయనకు పట్టదు.

మరోపక్క, ట్రంప్ పాకిస్తాన్‌తో ప్రేమలో పడినట్లు కనిపిస్తోంది. అదీ మనల్ని సంకటంలో పడేసే సంగతే. ఆయన పాక్‌పై 19% సుంకాలే విధించారు. ఆయన ప్రభుత్వం ఇస్లామాబాద్‌ను ఉగ్రవాదంపై పోరాటంలో 'అసాధారణ భాగస్వామి'గా పరిగణిస్తోంది. 'ఉగ్రవాద సంస్థలను అరికట్టడంలో విజయాలను కొనసాగిస్తున్నందుకు' అది ఇటీవల పాకిస్తాన్‌ను కొనియాడింది. ట్రంప్... పాక్ ఫీల్డ్ మార్షల్ మునీర్‌ను విందుకు ఆహ్వానించి, చమురును వెలికితీయడంలో పాక్‌కు సాయపడతామని చెప్పారు. నిజం చెప్పాలంటే, ఏదో ఒక రోజున పాక్ నుంచి భారత్ కూడా చమురును కొనుగోలు చేసే రోజు రావచ్చని, ఆయన మనల్ని కవ్వించారు. అంటే, ఆయనకు పాకిస్తాన్ కొత్త ముద్దుగుమ్మగా మారినట్లా?

రష్యన్ చమురు ఢిల్లీని చీకాకుపరచే అంశంగా మారడమేకాదు, అది పరిష్కారమయ్యేంత వరకూ భారత్‌తో వాణిజ్య చర్చలు జరిపేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు కనుక మొదట దానిపై దృష్టి కేంద్రీకరిద్దాం. పైగా, జరిమానా కింద మరిన్ని సుంకాలు విధిస్తామని బిసెంట్ హెచ్చరించారు.

సత్యం ఏమంటే, రష్యన్ చమురు కొనేటట్లుగా ఇండియాను బైడెన్ ప్రభుత్వం ప్రోత్సహించింది. 'వాస్తవానికి, ధరపై పరిమితి ఉన్న రేటు వద్ద రష్యన్ చమురు కొనుగోలు చేయాల్సిందిగా మేము (అమెరికా) కోరబట్టే వారు (ఇండియా) కొనుగోలు చేశారు... ఎందుకంటే, చమురు ధరలు పెరగడం మాకిష్టం లేదు. వారు ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించారు' అని ఢిల్లీలో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటి 2024 మే నెలలో చెప్పారు. ట్రంప్ ఈరోజు, తనకు ముందున్న ప్రభుత్వ విధానాన్ని కావాలని ఉపేక్షిస్తూ, ఇండియాను నిందిస్తున్నారు.



◆ 'వాస్తవానికి, ధరపై పరిమితి ఉన్న రేటు వద్ద రష్యన్ చమురు కొనుగోలు చేయాల్సిందిగా మేము (అమెరికా) కోరబట్టే వారు (ఇండియా) కొనుగోలు చేశారు... ఎందుకంటే, చమురు ధరలు పెరగడం మాకిష్టం లేదు. వారు ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించారు' అని ఢిల్లీలో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటి 2024 మే నెలలో చెప్పారు.

ఈ విషయంలో ట్రంప్ ఆత్మవంచన తేటతెల్లమవుతోంది. రష్యా నుంచి అమెరికా పాలాడియం, యురేనియం హెక్సాఫ్లోరైడ్, ఎరువులు, రసాయనాలను దిగుమతి చేసుకుంటూనే ఉంది. గత ఏడాదితో పోలిస్తే, గడచిన ఆరు నెలల్లో ఈ దిగుమతుల పరిమాణం గణనీయంగా పెరిగిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఒక వార్తాకథనంలో పేర్కొంది. రష్యా నుంచి అమెరికా స్వేచ్ఛగా దిగుమతి చేసుకుంటున్నప్పుడు లేని అభ్యంతరం, ఇండియా పట్లనే ఎందుకు?

ఇక మూడవ అంశం – ట్రంప్ అసలు ఉద్దేశాలను బయటపెడుతోంది. ఆయన ద్వంద్వ ప్రమాణాలకు ఇది మరో నిదర్శనం. రష్యా చమురును పెద్దయెత్తున దిగుమతి చేసుకుంటున్న, మూడవ పెద్ద దిగుమతిదారులుగా ఉన్న చైనా, తుర్కియేలను ట్రంప్ హెచ్చరించ లేదు. రష్యన్ చమురు దిగుమతి చేసుకుంటున్న హంగరీ, స్లొవేకియా – రెండూ యూరప్ దేశాలు, 'నాటో'లో సభ్యత్వం ఉన్నవీనూ! కానీ ట్రంప్ పల్లెత్తు మాట అనడం లేదు. ఈ ఏడాది జూన్ నుంచి జపాన్ కూడా దిగుమతి చేసుకుంటున్న సంగతిని ఆయన సమయానుకూలంగా విస్మరిస్తున్నారు. చైనాపై సుంకాల విధింపులో ఇచ్చిన విరామాన్ని ఆయన ఇటీవల మరో 90 రోజులు పొడిగించారు. ఆయన ఢిల్లీపైన మాత్రమే మూడవ కన్ను తెరిచారని స్పష్టమవుతోంది.

ఈ సమస్యకు సంబంధించి మరో పార్శ్వం కూడా అంతే కలవరపరుస్తోంది. 'క్వాడ్' (ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా)లోని మిగిలిన మూడు దేశాలతో తనకు అవసరం తీరిపోయిందని ట్రంప్ భావిస్తున్నారని... ఆయన వైఖరి, నడతను బట్టి అర్థం చేసుకోవచ్చా? అదే నిజమైతే, ఇండో–పసిఫిక్ వ్యూహం విషయంలో అమెరికా వైఖరి ఏమిటి? చైనాతో మనకున్న సమస్యల దృష్ట్యా 'క్వాడ్' కూటమి మనకు ఊరటనిచ్చిన మాట నిజం. 'క్వాడ్' పట్ల ట్రంప్ నిబద్ధత చూపకపోతే, అది మనకు మరిన్ని చిక్కులు సృష్టించవచ్చు.

చైనాతో ట్రంప్ ఆర్థిక ఒప్పందానికి వస్తారా? ఊహించడం కష్టం. కానీ, షీ జిన్ పింగ్‌తో శిఖరాగ్ర సమావేశమై ఆయన ఇప్పటికే మాట్లాడుతున్నారు కనుక, అటువంటి దానికి అవకాశం ఉందనిపిస్తోంది. చైనాను రాజకీయంగా మరింత మెరుగ్గా అవగాహన చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందా అనేది ప్రశ్న. బీజింగ్ ప్రాంతీయ ఆకాంక్షలకు అమెరికా మరింత వెసులుబాటు కల్పిస్తుందా? ఒకవేళ అదే కార్యరూపం ధరిస్తే, చైనాతో సరిహద్దు వివాదంపై అమెరికా మద్దతు మనకు కొనసాగుతుందా?

ఈ విషయమై మనం ఎటువంటి వైఖరిని అనుసరించాలన్నది పెద్ద ప్రశ్న? జవాబు కోసం మనం గాభరా పడాల్సిన అవసరం లేదు. మన నుంచి దిగుమతి చేసుకోకపోతే బతకలేమన్నంతగా, అమెరికా మొహం వాచి చూస్తున్నవాటిని మనం ఏమీ అమెరికాకు ఎగుమతి చేయడం లేదు. చైనా వద్ద రేర్ ఎర్త్ ఖనిజాలు, లోహాలు ఉన్నాయి. మనకి లేవు! కనుక, బేరసారాలకి మనకున్న అవకాశం తక్కువ.

మనకున్న ఆశ ఒక్కటే! ఉక్రెయిన్‌పై పుతిన్–ట్రంప్ ఒక ఒప్పందానికి రాగలిగితే, అది మనపై విధించిన సెకండరీ ఆంక్షలను ఎత్తివేయడానికి తోడ్పడవచ్చు. అమెరికా దృష్టిలో భారత్ ఇప్పటికీ ఉందని స్కాట్ బిసెంట్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. అనుకున్నట్లు జరగకపోతే ట్రంప్ తీవ్ర ఆగ్రహ జ్వాలలకు మనం గురికావాల్సిందే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మరపురాని పాటల పూదోటమాలి

'జీయా జలే జాన్ జలే' అన్నట్లు గుల్జార్ కవిత్వం ఒక్కోసారి మంట పెడుతుంది, మరోసారి పదబంధాలతోనే ప్రాణాలు తీయగా లాగేస్తుంది. హిందూస్తానీలో కవిత్వం రాసే విలక్షణ కవి ఆయన. ఈస్థటిక్ సెన్స్‌తో కమర్షియల్ సినిమాలు తీసే మేటి దర్శకుడు. అసలు పేరు సంపూరణ్ సింగ్ కాల్రా. 1934 ఆగస్టు 18న ఓ సిక్కు కుటుంబంలో పుట్టారు. దేశ విభజన తర్వాత బొంబాయి వచ్చి ఓ కార్ షెడ్‌లో పెయింటర్‌గా చేరారు. 'గుల్జార్' పేరుతో కవిత్వం రాయడం మొదలుపెట్టింది అక్కడే. ఆ తర్వాత రైటర్స్ అసోసియేషన్‌లో చేరి బిమల్ రాయ్‌కి దగ్గరయ్యారు. ఆ పరిచయమే 'బందిని' సినిమాలో ఎస్డీ బర్మన్ స్వరపరిచిన 'మోరా గోరా' అనే పాట రాసే అవకాశమిచ్చింది. 'బందిని' తర్వాత రిషికేశ్ ముఖర్జీ సినిమాలకు గుల్జార్ లిరిక్స్ రాశారు. ఇలా పాటలు రాస్తూనే 1971లో తొలిసారి మెగాఫోన్ పట్టుకున్నారు. మీనా కుమారి లీడ్‌గా 'మేరే అప్నే' సినిమా తీశారు. ఆ తర్వాత 'పరిచయ్', 'కోషిష్', 'ఆంధీ', 'ఖుష్బూ', 'మౌసమ్' వంటి కళాఖండాలను తీర్చిదిద్దారు.

గుల్జార్ సినిమాలు మానవ సంబంధాలను కొత్తగా ఆవిష్కరిస్తాయి, ఫ్లాష్‌బ్యాక్ ఎలిమెంట్‌ని చక్కగా పండిస్తాయి. 'మౌసం' దీనికో మంచి ఉదాహరణ.

గుల్జార్ దర్శకత్వం వహించిన 'ఇజాజత్'లోని 'మేరా కుఛ్ సామాన్' అనే పాట విరహపు విషాదంతో దిగులు పుట్టిస్తుంది. ఆటలో తగవొస్తే పిల్లలు తమ బొమ్మలు తిరిగిచ్చేయమన్నట్లు ఒక అమ్మాయి తన వస్తువులు తనకిచ్చేయమని ప్రియుణ్ణి అడుగుతుంది. ఆ వస్తువులేంటి– వర్షంలో తడిసిన రోజులు, మంచం పక్కనే తడిసి ముద్దయిన మనసులు, వెన్నెల రాత్రులు, గిల్లికజ్జాలు! వినూత్నమైన ఈ రచన గుల్జార్‌కు జాతీయ అవార్డు సాధించింది.



గుల్జార్

◆ ఒక అమ్మాయి తన వస్తువులు తనకిచ్చేయమని ప్రియుణ్ణి అడుగుతుంది. ఆ వస్తువులేంటి – వర్షంలో తడిసిన రోజులు, మంచం పక్కనే తడిసి ముద్దయిన మనసులు, వెన్నెల రాత్రులు, గిల్లికజ్జాలు!

గుల్జార్ మాస్టర్ పీసెస్‌లో 'ఆంధీ' ముఖ్యమైనది. ఇందులోని 'ఇస్ మోడ్ సే' అనే పాటలో దారుల గురించి గొప్పగా వర్ణిస్తారాయన. ఈ మలుపు నుంచి మొదలయ్యే దారులు ఒక్కోటి ఒక్కోలా ఉంటాయంటారు. అందరికీ జీవితం ఒకటే, కానీ అది నడిచే దారులు ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటాయని దీని సారాంశం.

'పరిచయ్'లోని 'ముసాసఫిర్ హు యారో' పాట ద్వారా జీవితమే ఓ ప్రయాణం, దాన్ని కొనసాగిస్తూనే ఉండాలని గుల్జార్ చెప్పకనే చెబుతారు.

'కినారా'లోని 'నామ్ గుమ్ జాయేగా' పాట గుల్జార్, ఆర్డీ బర్మన్, లతాజీ కాంబినేషన్‌లో వచ్చిన ఆణిముత్యం. ఈ పాటలో 'వక్త్ కే సితమ్' అంటూ గుల్జార్ కాలం తీరుపై రుసరుసలాడతారు.

రవీంద్రనాథ్ టాగోర్ రాసిన ఓ కథ ఆధారంగా గుల్జార్ రాసి, డైరెక్ట్ చేసిన సినిమా 'లేకిన్'! జీవన్మరణాల మధ్య కొట్టుమిట్టాడే ఓ ఆత్మకథ ఇది. చావుబతుకుల మధ్య ఊగిసలాడే మనందరి కథ కూడా! ఇందులోని 'యారా సీలీ సీలీ' పాట ఆ సంఘర్షణను చక్కగా ఆవిష్కరిస్తుంది. పచ్చికట్టె మండనూ లేదు, ఆరిపోనూ లేదు. అలాగే విరహపు రాత్రి కూడా ఎటూ కాని మంట రేపుతుంది. అది చావూ కాదు, బతుకూ కాదు. లోతైన ఈ పాట గుల్జార్‌కి జాతీయ, ఫిలింఫేర్ అవార్డులు తెచ్చిపెట్టింది.

కాలం మారేకొద్దీ పదునెక్కుతూ వచ్చిన గుల్జార్ రచనకు విశాల్ భరద్వాజ్ స్వరపరిచిన ఛప్పా ఛప్పా, బీడీ జలైలే పాటలు తార్కాణాలు. కానీ కొత్త తరంలో ఆయన పాటకు మరింత పరిమళం అద్దింది మాత్రం ఎ.ఆర్. రెహమానే! 'దిల్‌సే' లోని 'ఏ అజ్నబీ' పాటను గుల్జార్ ఎంత మార్దవంగా రాశారో రహమాన్ అంతే సుతిమెత్తగా స్వరపరిచారు. గుల్జార్, రహమాన్ జోడీలో వచ్చిన 'జయహో' పాట ఏకంగా ఆస్కార్ గెలుచుకొచ్చింది.

గుల్జార్ అద్భుతమైన సినిమాలు తీసి 'దాదాసాహెబ్ పాల్కే' అవార్డు సాధించుకున్నారు, అందమైన కవిత్వం రాసి 'జ్ఞాన్ పీఠ్' పురస్కారం గెలుచుకున్నారు. ఈ రెండింటినీ సాధించిన ఏకైక భారతీయుడాయన!

– శాంతి ఇషాన్ | అనువాదకురాలు

చరిత్ర సృష్టించిన సామాన్యుడు

ఇన్ బాక్స్

రాజ్యాధికారం గురించి సామాన్యుడు ఆలోచించడానికి సాహసించని రోజులలో ఏకంగా గోల్కొండ రాజ్యాన్ని ఏలిన సామాన్యుడు పాపన్న. గౌడ కులంలో పుట్టి 12 మందితో సైన్యాన్ని ప్రారంభించి 12వేలకు సైనిక శక్తిని పెంచి పాలన చేపట్టాడని మన జానపద కథలు చెబుతున్నాయి. మొగల్ ఆస్థానంలో పనిచేసిన ఖాఫీ ఖాన్ రచించిన 'ముంతఖబ్ – అల్ లుబాబ్' పాపన్నను ప్రస్తావించింది.



సర్దార్ పాపన్న గౌడ్

పాపన్న గురించి జేఏ బోయల్ 'ది ఇండియన్ యాంటీ క్వెరీ' 1874 జనవరి సంచికలో 'తెలుగు బల్లాడ్ పొయెట్రీ' అనే శీర్షికతో పాపన్న గురించి రాశాడు. లండన్‌లోని 'విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియం'లో పాపన్న చిత్రపటం ఉంది. కొంపల్లి వెంకట్ గౌడ్... పాపన్నపై చేసిన పరిశోధన ప్రకారం లండన్‌లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో ఉన్న పాపన్న చిత్రపటాన్ని ఆయన సమకాలిక చిత్రకారుడు జగదీష్ మిట్టల్ వేశాడు.

పాపన్న అసలు పేరు నాశగోని పాపన్న గౌడ్. ప్రస్తుత సిద్దిపేట జిల్లా దూల్ మిట్టలో ఉన్న రాతి శాసనం ప్రకారం పాపన్న 1650 ఆగస్టు 18న సర్వమ్మకు జన్మించాడు. ఆయన పుట్టిన ఊరు ప్రస్తుత జనగామ జిల్లాలో రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్. కులవృత్తి కల్లు గీతను విరమించి చిన్న సైన్యాన్ని ఏర్పరచుకొని మొదట తాటికొండ చుట్టుపక్కల గ్రామాలలో ధనవంతులను, భూస్వాములను కొల్లగొట్టాడు. ఆ తర్వాత తన చర్యలను హుస్నాబాద్, జనగాం, షాపురం చుట్టుపక్కలకు విస్తరించాడు. కొలాస్ జమిందారు దగ్గర పనికి కుదిరి ఆ కోట చుట్టుపక్కలా ధనవంతులను దోచుకుని సైన్యాన్ని వృద్ధి చేసుకున్నాడు. సర్వాయిపేట కోటను నిర్మించి స్వతంత్రాన్ని ప్రకటించుకొని విజయయాత్ర ప్రారంభించాడు. హుస్నాబాద్, తాటికొండ, షాపురం వంటి చోట్లా కోటలు నిర్మించాడు. చివరికి 1709లో గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడని అంటారు. అయితే చివరికి మొగల్ సైన్యం చేతికి చిక్కి ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారంలో ఉన్న కథలు చెబుతున్నాయి.


– నర్సింగు కోటయ్య | చరిత్ర అధ్యాపకులు, నల్లగొండ
(నేడు సర్దార్ పాపన్న గౌడ్ జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

విహార యాత్రికులే ఎక్కువ

మన దేశానికి వచ్చే విదేశీ పర్యాటకుల్లో అత్యధికం దేనికోసం వస్తున్నారో తెలుసా? విహార యాత్రల కోసం. వైద్య పర్యాటకం కోసం... అంటే శస్త్రచికిత్సల వంటివి చేయించుకోవడానికీ వస్తుంటారు. వ్యాపారం పనిమీద వస్తుంటారు. ఇంకా తీర్థయాత్రలకూ వస్తుంటారు. కేంద్ర పర్యాటక శాఖ 2025 జనవరి – మార్చి గణాంకాలనే తీసుకుంటే... మొత్తం విదేశీ పర్యాటకుల్లో వైద్య పర్యాటకం కోసం వచ్చింది 3.7 శాతం, వ్యాపార కార్యకలాపాల మీద వచ్చింది 11.7 శాతం. ఇక తమ బంధువుల కోసం వచ్చిన విదేశాల్లో స్థిరపడిన భారతీయులు 29 శాతం. వినోదం, విహార యాత్రల కోసం వచ్చిన విదేశీ పర్యాటకులు 45.9 శాతం. ఏటా వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్యా పెరుగుతోంది... వినోద పర్యాటకం కోసం వచ్చే వారి శాతమూ పెరుగుతోంది.



భారత ప్రశస్తి

జ్యోతిర్మయం

భారతీయ ఇతిహాసాలకు ప్రజల ఆధ్యాత్మిక, సాంఘిక జీవనంలో మార్గదర్శక పాత్ర ఉంది. అందులో భారతం అజ్ఞాన తమస్సును పోగొట్టి జ్ఞానం అనే దివ్యమైన వెలుగు చూపుతుందని భావిస్తారు. చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి మానవునకు ముంజేతి సాధనం ఇది. ఈ భారతేతిహాసం వల్ల మోహం అంటే మానవ సహజమైన భ్రాంతి మటుమాయమవుతుంది. భారతం ఒక మహావృక్షం. సంగ్రహ అధ్యాయం దానికి బీజం. పౌలోమ – ఆస్తీక కథలు మూలం. కురు పాండవ జనన కథ స్కంధం. సభారణ్య పర్వాలు కొమ్మలు, అరణ్య పర్వం రూపం. విరాట – ఉద్యోగ పర్వాలు సారం. భీష్మ పర్వం ప్రధాన శాఖ. ద్రోణ పర్వం ఆకులు. కర్ణపర్వం ఆ చెట్టు పూచిన తెల్లని పువ్వులు. శల్య పర్వం ఆ పువ్వుల పరిమళం. స్త్రీ పర్వం నార. శాంతి పర్వం మహాఫలం. అశ్వమేధ పర్వం ఆ ఫల సంబంధమైన అమృతరసం. ఆశ్రమవాస పర్వం ఆ చెట్టునీడ. మౌసలం శ్రుతి సంగ్రహం. అలాంటి భారత మహావృక్షం కవుల కావ్యకృతికి పోషకం అవుతుంది.

భారత కథ వినడానికి జనమేజయుడు తగిన సమయం నిర్ణయించుకున్నాడు. ఆస్థాన పండితులను సమావేశపరిచాడు. వైశంపాయనుడిని సముచితంగా పూజించాడు. వైశంపాయనుడు ముందుగా హృదయంలో గురుబ్రహ్మకు మొక్కి, ప్రత్యక్షంగా ఉన్న గురుమూర్తికి పాదాభివందనం చేసి, సభ్యులకు చెప్పి, వారి అనుమతితో భారత కథ చెప్పడం మొదలుపెట్టాడు. భారతం శ్రద్ధాభక్తులతో వినే వారికి ఇష్టార్థ సిద్ధినీ, శుభ సంపద్వృద్ధినీ కలిగిస్తుంది. రాజులకు రాజ్యాభివృద్ధినీ, అభ్యుదయాన్నీ సమకూరుస్తుంది. సత్యానికి ప్రాధాన్యం ఇస్తూ ఎన్నో నీతికథలను చెప్పిన మహా ప్రబంధం. అన్ని లోకాలకూ పూజ్యమైనది. ఇతిహాసాలలో అగ్రగణ్య. లౌకిక న్యాయశాస్త్రానికి గురువు. వేద వేదాంత విషయాలను బోధించేది భారతమని వైశంపాయనుడు చెప్పాడు. అంత గొప్పది కాబట్టే 'వింటే భారతం వినాలి' అంటారు.

– యామిజాల జగదీశ్

యూరియా టోకెన్ల కోసం రైతుల ఆందోళన

కేసముద్రం: యూరియా బస్తాల టోకెన్ల కోసం రైతులు గంటల తరబడి బారులుదీరిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో ఆదివారం జరిగింది. కేసముద్రం, ధన్నసరి సొసైటీలకు 20 టన్నుల యూరియా వస్తుందనే సమాచారంతో.. ఉదయం 7 గంటలకు రైతులు పీఏసీఎస్‌ల వద్దకు చేరుకున్నారు. కేసముద్రం రైతు వేదిక భవనంలో యూరియా టోకెన్లు ఇస్తున్నట్లు అధికారులు ఇచ్చిన సమాచారంతో అధిక సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకొని క్యూలో నిల్చున్నారు. 444 బస్తాలకు గాను ఏవో వెంకన్న, పోలీసుల ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి ఒక్కో బస్తా చొప్పున టోకెన్లు ఇచ్చారు. వెయ్యి మందికి పైగా రైతులు మధ్యాహ్నం వరకు క్యూలైన్‌లో నిల్చొని పడిగాపులు పడినా, 444 బస్తాలకు మాత్రమే టోకెన్ ఇవ్వడంతో మిగిలిన రైతులంతా నిరాశతో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద 222 బస్తాల పంపిణీకి అధికారులు టోకెన్లు ఇచ్చేందుకు కౌంటర్లను ఏర్పాటు చేశారు. దీంతో పెద్దసంఖ్యలో చేరుకున్న రైతులు బారులు దీరారు. ఈ క్రమంలో తోపులాట జరగడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో టోకెన్ల పంపిణీ నిలిపివేశారు. అనంతరం రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించారు.


కేసముద్రం రైతువేదిక భవనం వద్ద బారులుదీరిన రైతులు


కాచాపూర్ గోదాం వద్ద ఎరువుల కోసం రైతుల క్యూ

యూరియా కోసం గొడవ

- బడారైతులకు ఎక్కువ బస్తాలు ఇచ్చారని ఆరోపణ
- గోదాం ఇన్‌చార్జిపై చేయి చేసుకున్న రైతు

శంకరపట్నం (మానకొండూర్): యూరియా బస్తాల కోసం ఓ రైతు గోదాం ఇన్‌చార్జితో గొడవపడిన ఘటన ఆదివారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కాచాపూర్‌లో జరిగింది. శంకరపట్నం మండలం గద్దపాక సహకార సంఘం పరిధిలోని కాచాపూర్ గోదాంలో శనివారం లారీ యూరియా లోడ్ వచ్చింది. ఈ క్రమంలో యూరియా కోసం ఎక్కువ మంది రైతులు రావడంతో ఆధార్ జిరాక్స్‌లు తీసుకున్న సిబ్బంది.. ఆదివారం మరో లారీ తెప్పించి ఉదయం 8 గంటలకు పంపిణీ చేస్తామని చెప్పారు. అయితే ఆదివారం ఉదయం 8 గంటలకు వచ్చేసరికి యూరియా పంపిణీ చేస్తుండటంతో సన్నకారు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా రైతులు గోదాంకు రాకున్నా ట్రాక్టర్లలో యూరియా పంపిస్తున్నారని కోపోద్రిక్తుడైన రైతు కొమురయ్య గోదాం ఇన్‌చార్జి మురళిపై చేయి చేసుకున్నాడు. దీంతో హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతితోపాటు మాజీ చైర్మన్ గోదాంకు చేరుకుని నిల్వలను పరిశీలించారు. గోదాంలోని నిల్వలకు, రశీదులకు 30 బస్తాలు తేడా రావడంతో.. నిబంధనల మేరకు పంపిణీ చేయాలని, బడా రైతులు రాకున్నా బస్తాలు పంపించవద్దని ఇన్‌చార్జికి సూచించారు. కాగా, రైతు కొమురయ్యపై గోదాం ఇన్‌చార్జి మురళి కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బర్త్‌డే గిఫ్ట్‌గా.. యూరియా బస్తా


యూరియా బస్తాను అందజేస్తున్న మిత్రుడు

కేసముద్రం: మిత్రుల పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయడం, పలు ఆకర్షణీయమైన వస్తువులను బహుమతిగా అందించడం సహజంగా చూస్తుంటాం. కానీ ఓ వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా తన స్నేహితునికి యూరియా బస్తాను గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఈ ఆసక్తికర సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బొల్లు శివకృష్ణ పుట్టినరోజున ఆయన మిత్రుడు మలిశెట్టి శోభన్ యూరియా బస్తాను గిఫ్ట్‌గా ఇచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో, వినూత్న రీతిలో యూరియా బస్తాను స్నేహితుడికి గిఫ్ట్‌గా ఇచ్చినట్టు శోభన్ తెలిపారు.

గజ్వేల్ రేక్ పాయింట్ ఖాళీ!

- ఎనిమిది జిల్లాలకు యూరియా కేంద్రం
- దిగుమతుల్లేక అత్తెసరు నిల్వలకే పరిమితం

గజ్వేల్: తెలంగాణలోని ఎనిమిది జిల్లాలకు యూరియా సరఫరా కేంద్రంగా ఉన్న గజ్వేల్ రేక్ పాయింట్ ప్రస్తుతం అత్తెసరు నిల్వలకే పరిమితమవుతోంది. రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా సమృద్ధిగా నిల్వలు అందుబాటులో ఉంచడానికి గజ్వేల్‌లో 2022 జూన్ 27న రేక్ పాయింట్‌ను ప్రారంభించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న రేక్ పాయింట్లకు ఇది అదనం. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.36 కిలోమీటర్ల పొడవున ఈ న్యూ బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం జరుగుతుండగా, ఈ లైన్‌పై గజ్వేల్ రైల్వేస్టేషన్ ఉన్నది. ఈ స్టేషన్ వద్ద రేక్ పాయింట్ ఏర్పాటు చేశారు.

పలు పోర్టుల నుంచి ఇక్కడి రైలు మార్గంలో....

గజ్వేల్ రేక్ పాయింట్‌కు తమిళనాడు రాష్ట్రంలోని కరిగెకళ్, ఏపీలోని వైజాగ్, కాకినాడ పోర్టుల నుంచి రైలుమార్గం ద్వారా కాంప్లెక్స్ ఎరువులతోపాటు యూరియా నిల్వలు వస్తాయి. ఇలా వచ్చిన నిల్వలను సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రితోపాటు కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు కేటాయింపుల వారీగా వ్యవసాయశాఖ సరఫరా చేస్తున్నది. గతంలో ఇక్కడకు ఎన్ఎఫ్‌సీఎల్ (నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్), సీఐఎల్ (కోరమాండల్ ఇంటర్నేషనల్ కెమికల్), ఇఫ్‌కో తదితర కంపెనీలకు చెందిన యూరియా వచ్చేది. కానీ ప్రస్తుతం ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా బంద్ కాగా, మిగిలిన కంపెనీల ఉత్పత్తులు వస్తున్నాయి.


గజ్వేల్ రేక్ పాయింట్‌కు వచ్చిన యూరియా నిల్వలను దింపుతున్న దృశ్యం

గతంలో భారీగా నిల్వలు.

రేక్ పాయింట్‌ను ప్రారంభించిన 2022–23 సంవత్సరంలో 15 నుంచి 20 వరకు రేక్‌ల నిల్వలు వచ్చాయి. ఒక్కో రేక్ సామర్థ్యం 1,400 మెట్రిక్ టన్నులు. ఇలా ఆ ఏడాది సుమారుగా 21 వేల మెట్రిక్ టన్నుల నుంచి 28 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు వచ్చి...ఆయా జిల్లాలకు సరఫరా అయ్యాయి. 2024–25లో 10 రేక్‌లకు పైగా వచ్చాయి. ప్రస్తుతం ఇప్పటి వరకు కేవలం మూడు రేక్‌లు మాత్రమే వచ్చాయి. అంటే ఈ సీజన్‌లో కేవలం ఇక్కడకు 4,200 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. దీనివల్ల ఆయా జిల్లాలకు సరఫరా అయ్యే యూరియాలో తీవ్రమైన కోత పడింది. వివిధ దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న కారణంగా యూరియా దిగుమతులు నిలిచిపోవడం వల్ల ఇక్కడకు రావాల్సిన నిల్వల్లో కోత పడింది.

వీఐటీ చెన్నైలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: క్రిస్టల్ కనెక్షన్స్ పేరుతో ఆగస్టు 15న చెన్నై వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. సినిమా ప్రముఖుడు, పార్లమెంటు సభ్యుడు డాక్టర్ కమల్ హాసన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీఐటీ వ్యవస్థాపకుడు–వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీ.వి.విశ్వనాథన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, సంస్థ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీ.వి.సెల్వం అతిథులను స్వాగతించారు. నటుడు కమల్ హాసన్ మాట్లాడుతూ, యువత జీవితంలో వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం వైపు పయనించాలని సూచించారు. వీఐటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.ఎస్. కాంచన భాస్కరన్, చెన్నై ప్రో–వైస్ చాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అవసరానికి మించి యూరియా కొనొద్దు

- ముందస్తు సాగుతో పెరిగిన యూరియా వాడకం
- రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయని కేంద్రం
- చాలా రాష్ట్రాల్లో యూరియా కొరత ఉందని బీజేపీ అధ్యక్షుడికి తెలియదు
- వ్యవసాయశాఖ సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష పార్టీల నాయకులు చెబుతున్న మాటలకు ఆందోళనకు గురై అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన యూరియాను పకడ్బందీగా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం సచివాలయంలో మంత్రి తుమ్మల వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూరియా లభ్యతపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయకుండా చైతన్యపరచాలని చెప్పారు. వానాకాలం సీజన్‌కు కేంద్రం కేటాయించిన 9.80 లక్షల మెట్రిక్ టన్నుల్లో ఈనెల వరకు 2.69 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉండటంతో ఏర్పడిన యూరియా కొరతను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఆదేశించారు. సీజన్ ముందస్తుగా ప్రారంభం కావడం, మొక్కజొన్న లాంటి పంటలు అధికంగా సాగు చేయడం వల్ల గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా అమ్మకాలు కూడా అధికంగా జరిగాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా నల్లగొండ, గద్వాల, కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి లాంటి జిల్లాలలో గత సంవత్సరంతో పోలిస్తే యూరియా అమ్మకాలు అధికంగా జరిగినట్టు తెలిపారు. యూరియాను వ్యవసాయానికి కాకుండా, ఇతర అవసరాల కోసం మళ్లించకుండా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రాష్ట్రంలోనూ యూరియా కొరత లేదని, ఇక్కడే ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు అవగాహనరాహిత్య మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వాస్తవానికి మన రాష్ట్రంలోనే కాకుండా బీజేపీ పాలిత మధ్యప్రదేశ్, రాజస్తాన్‌తోపాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్ లాంటి రాష్ట్రాలలో కూడా యూరియా కొరత ఉందన్నారు.

- వ్యవసాయ శాఖ సంచాలకులు బి.గోపి మాట్లాడుతూ ప్రతి రాష్ట్రానికి సీజన్‌కు ముందే కేంద్రం ఎరువులను కేటాయిస్తుందని, అందులో భాగంగానే తెలంగాణకు కూడా యూరియాతో కలిపి 5 రకాల ఎరువులను కేంద్రం కేటాయించిందని అన్నారు. ఇందులో యూరియా 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ కలిపి 13.95 మెట్రిక్ టన్నులుగా ఉన్నట్టు తెలిపారు. అయితే కేటాయించిన యూరియాను నెలవారీగా పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వల్ల సమస్య ఎదురైందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా ఎండీ చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఎండీ రాములు పాల్గొన్నారు.

కేంద్రం వైఖరితోనే యూరియా కొరత

- భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగానే కొరత ఏర్పడుతోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ విషయంలో ఇప్పటికే ఎరువుల శాఖ మంత్రి నడ్డాను.. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిశారని తెలిపారు. తాను కూడా ఐదారు సార్లు లేఖలు రాశానని పేర్కొన్నారు. కావాల్సినంత యూరియా సరఫరా చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్టు.. కేంద్రం నుంచి జవాబు వచ్చింది తప్ప యూరియా మాత్రం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై పార్లమెంటులో తెలంగాణ రైతాంగ పక్షాన చర్చకు పట్టుబడతామని, సోమవారం వాయిదా తీర్మానం ఇస్తామని ఆ ప్రకటనలో ఎంపీ చామల వెల్లడించారు.

ఏబీఎన్ చానెల్‌ను బ్యాన్ చేయాలి

- బీఆర్ఎస్ నేతల డిమాండ్
- తమ పార్టీనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అవమానించారని ఆగ్రహం
- ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాల్లో నిరసనలు


ఏబీఎన్ చానెల్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌటాల/బోనకల్: తమ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అవమానించిన ఏబీఎన్ చానెల్‌ను బ్యాన్ చేయాలని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కౌటాల మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏబీఎన్ చానెల్ పోస్టర్లను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన నేత ఆర్ఎస్పీని దళిత నేత అంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్ అవమానించిందని ఆరోపించారు. చానెల్ యజమాని వేమూరి రాధాకృష్ణ, న్యూస్ రీడర్ వెంకటకృష్ణపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యజమాన్యం తమ తీరు మార్చుకోకపోతే కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

స్వేరో ఆధ్వర్యంలో రాధాకృష్ణ దిష్టిబొమ్మ దహనం

స్వేరో వ్యవస్థాపకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పట్ల ఏబీఎన్ చానెల్‌లో అవమానకరంగా మాట్లాడారని ఆరోపిస్తూ ఖమ్మం జిల్లా బోనకల్‌లో కూడా ఆదివారం చానెల్ యజమాని రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా స్వేరో మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి సోమపొంగు శ్యాంసుందర్ మాట్లాడుతూ.. మేడిగడ్డ ప్రాజెక్టుపై చర్చలో.. ప్రవీణ్‌కుమార్ దళిత నాయకుడంటూ న్యూస్‌రీడర్ అవమానకరమైన పదజాలంతో సంబోధించారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దీనికి రాధాకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆడుకుంటూ రెండో అంతస్తు పైనుంచి పడి..

- బాలుడు మృతి


హర్షవర్ధన్

పటాన్‌చెరు టౌన్: ఆడుకుంటూ రెండో అంతస్తు పైనుండి పడి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా.. జనగాపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీలో నివాసం ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు హర్షవర్ధన్ (4) ఆదివారం వీరు ఉండే రెండో అంతస్తు పెంట్ హౌస్ టెర్రస్ రైలింగ్ వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు బాలుడి మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తోపుడు బండిపై ఆస్పత్రికి మృతదేహం..

- పోలీసుల చర్యపై విమర్శలు
- నారాయణపేట జిల్లా కోస్గిలో ఘటన

కోస్గి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఓ యువకుడి మృతదేహాన్ని పోలీసులు తోపుడు బండిపై పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ప్రజలంతా చూస్తుండగానే పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఈ ఘటన జరిగింది. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య (28) భార్యాపిల్లలతో కలసి కోస్గి లోని అత్తగారింట్లో ఉంటూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆదివారం అతను ద్విచక్రవాహనంపై బస్టాండ్ వైపు వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్క డే మృతిచెందాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మొగులయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అర కిలోమీటరు దూరంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తోపుడు బండిలో తరలించారు. సంతలో నిమ్మకాయలు విక్రయించేందుకు వచ్చిన ఓ చిరువ్యాపారికి చెందిన తోపుడు బండిని అతని అను మ తి లేకుండానే తీసుకొని పోలీసులు మృతదేహాన్ని తరలించిన తీరును చూ సి అక్కడ గుమిగూడిన జనం అవాక్కయ్యారు. ఈ దృశ్యాన్ని కొందరు వీడియో తీసి ముఖ్యమంత్రి సొంత ఇలాకాలో ఇదీ పరిస్థితి.. అంటూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడంతో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ బాలరాజును వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని చెప్పారు. ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఏఎస్ఐ ఆంజనేయులును వివరణ కోరగా మృతుని కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో తోపుడు బండిపై మృతదేహం తరలించామన్నారు. సమయానికి వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఇలా చేయాల్సి వచ్చిందని చెప్పారు.


తోపుడు బండిపై మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసు

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- 10 మంది బాలికలకు అస్వస్థత
- 14 రోజుల్లో ఇది రెండోసారి..
- హాస్టల్ సిబ్బందిపై తల్లిదండ్రుల ఆగ్రహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కల్లూరు: ఖమ్మం జిల్లా కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 10 మంది విద్యార్థినులు అస్వస్థులయ్యారు. శనివారం రాత్రి క్యాబేజీ పకోడీ, సాంబార్‌తో భోజనం చేసిన తర్వాత.. వీరందరికీ కడుపునొప్పితో పాటు వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో హాస్టల్ సిబ్బంది వారిని కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ 14 రోజుల క్రితమే ఫుడ్ పాయిజన్‌తో 33 మంది బాలికలు ఆస్పత్రిలో చికిత్స పొందడం తెలిసిందే. మళ్లీ ఇలాంటి ఘటనే జరగడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం బాలికల తల్లిదండ్రులు హాస్టల్‌కు చేరుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే నెలలో రెండుసార్లు ఫుడ్ పాయిజన్ అయిందంటే.. నిర్లక్ష్యమేనని ఆరోపించారు. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ప్రభుత్వాస్పత్రి వైద్యుడు వినీత్ తెలిపారు. కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు విద్యార్థులను పరామర్శించారు. హాస్టల్‌కు వెళ్లి ఇన్‌చార్జి వార్డెన్ శ్రీనివాసరావును ప్రశ్నించారు.

అనాథగా అమ్మ!

- షెడ్డులో ఉంటూ.. భారంగా జీవనం
- కొడుకు వదిలేశాడని కన్నీరు


కామారెడ్డి రైల్వే స్టేషన్ షెడ్డులో ఉంటున్న వృద్ధురాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధురాలు.. పది రోజులుగా కామారెడ్డి రైల్వే స్టేషన్ వెనకాల ఉన్న షెడ్డులో ఉంటోంది. ఎవరన్నా ఆహారం పెడితే తింటూ అక్కడ కాలం గడుపుతోంది. వాకింగ్‌కు వెళ్లేవారు, స్టేషన్‌కు వచ్చేవారు ఆమెకు ఏదో ఒకటి తినడానికి సమకూరుస్తున్నారు. ఎవరైనా ఆమెను ప్రశ్నిస్తే.. తన పేరు శకుంతల అని, ఊరు దేవరకొండలోని పెద్దబజార్ అని చెబుతోంది. కొడుకు, కోడలు అక్కడే ఉంటారని, తాను వారికి భారమయ్యానని కంటతడి పెడుతోంది. కొడుకే ఇక్కడ వదిలేసి వెళ్లాడంటోంది. కామారెడ్డి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎంతో మంది అనాథలు ఉంటున్నారు. స్టేషన్ ఆవరణలో కాలం వెళ్లదీస్తున్నారు. ఎవరైనా దయ తలిస్తే నాలుగు మెతుకులు,. లేకుంటే పస్తులు.. శకుంతల పరిస్థితి కూడా అంతే.

'సృష్టి' ఉచ్చులో చిక్కుకున్నారిలా..!

- డాక్టర్ నమ్రతతో చేతులు కలిపి నిందితులుగా మారిన పలువురు సామాన్యులు
- 9 కేసుల నమోదు.. 25 మంది అరెస్ట్
- పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి అనేక కీలక అంశాలు


సంతోషి


పవన్ మోహన్ కృష్ణ


నందిని



హర్ష రాయ్

సాక్షి, హైదరాబాద్: సంతాన సాఫల్య కేంద్రం ముసుగు వేసుకుని, సరోగసి పేరుతో శిశువుల అక్రమ రవాణా, క్రయ విక్రయాలు చేపట్టిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో సూత్రధారిగా ఉన్న డాక్టర్ నమ్రత ఉచ్చులో మిగిలిన నిందితులు ఎలా చిక్కుకున్నారనేది దర్యాప్తు అధికారులు గుర్తిస్తున్నారు. ఈ నేరాలకు సంబంధించి ఇప్పటివరకు 9 కేసులు నమోదు కాగా... 25 మంది నిందితులను అరెస్టు చేశారు. 'సృష్టి'కేంద్రంగా సాగించిన వ్యవహారాన్ని వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తున్న నగర పోలీసు విభాగం, ఈ కేసులో అత్యంత కఠినమైన బీఎన్ఎస్‌లోని సెక్షన్ 111ను జోడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన ఎం.నందిని ఘట్‌కేసర్ సమీపంలోని రాంపల్లిలో నివాసం ఉండేది. ఈమె 2010లో కొన్నాళ్లపాటు జీడిమెట్లకు చెందిన తన స్నేహితురాలి తల్లి వద్ద నివసించింది. ఆమె తరచూ క్లినికల్ ట్రయల్స్ కోసం ల్యాబ్‌లకు వెళుతుండేది. అప్పుడప్పుడు నందినిని తనతో తీసుకువెళ్లేది. ఇలా డబ్బు సంపాదించడం కోసం నందిని కూడా క్లినికల్ ట్రయల్స్‌కు క్లయింట్‌గా మారింది. 2017లో బెంగళూరులో క్లినికల్ ట్రయల్‌కు హాజరవుతున్న సమయంలో సంజయ్ అనే వ్యక్తిని కలిశారు. 2018లో వీళ్లు వివాహం చేసుకుని మౌలాలీలో కాపు రం పెట్టారు. 2025 జనవరిలో నందిని తన అండాన్ని దానం చేయడానికి బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడే ఈమెకు మరో నిందితురాలు హర్ష రాయ్‌తో పరిచయమైంది. అప్పటినుంచి స్నేహితులుగా మారిన వీళ్లు అండాలను దానం చేసే వారి వివరాలు మార్పిడి చేసుకునేవాళ్లు. ఈ నేపథ్యంలోనే వీరికి మరో నిందితురాలు ధనశ్రీ సంతోషితో పరిచయం ఏర్పడింది. సంతోషి ద్వారా నందిని, హర్షరాయ్ నమ్రత ఉచ్చులో చిక్కారు. ఈ నేపథ్యంలో అస్సాంకు చెందిన భార్యాభర్తలు తమకు పుట్టిన చిన్నారిని డాక్టర్ నమ్రతకు విక్రయించారు. ఆమె ఈ చిన్నారిని రాజస్తాన్‌కు చెందిన దంపతులకు అమ్మింది. ఈ దంపతుల ఫిర్యాదుతోనే సృష్టి విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. సంతోషి, హర్ష రాయ్‌లపై మహారాష్ట్రలోని విక్రోలి పోలీసు స్టేషన్‌లోనూ చిన్నారుల అక్రమ రవాణా కేసు ఉంది.

డ్రైవర్‌గా వచ్చి.. కీలకంగా మారి..

అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన ఎం.పవన్ మోహన్‌కృష్ణ నగరానికి వలసవచ్చి పద్మారావు నగర్‌లోని ఓ బాలుర హాస్టల్‌లో ఉండేవాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఇచ్చిన యాడ్ అతడిని ఆకర్షించింది. డ్రైవర్ పోస్టుకు సంబంధించిన ఆ ప్రకటన చూసిన పవన్ మోహన్ ఆ సెంటర్‌లో సంప్రదించాడు. అయితే డ్రైవర్ పోస్టు కోసం వెళ్లిన మోహన్‌ని ఆస్పత్రి నిర్వాహకులు సూపర్‌వైజర్‌గా చేర్చుకున్నారు. ఆ ఉద్యోగంలో చేరడంతోనే డా.నమ్రతతో పరిచయం ఏర్పడి, ఈ కేసులో నిందితుడిగా మారాడు. ఐవీఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీకి ఒప్పించడం విధిగా మార్చుకున్న ఇతడికి, నమ్రత ఒక్కో క్లైంట్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల కమీషన్ ఇచ్చేది. అలా కొన్నాళ్లకు సికింద్రాబాద్‌లోని సృష్టి సెంటర్ నిర్వహణలో ఇతడు కీలకంగా మారాడు.

ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి
సి.పి.రాధాకృష్ణన్



- బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం
- ఏకగ్రీవానికి సహకరించండి
- విపక్షాలకు నడ్డా విజ్ఞప్తి
- 'ఇండియా' కూటమి అభ్యర్థి నేడు ఖరారు!

ఉప రాష్ట్రపతి ఎన్నికలో అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ (67) పేరు ఖరారైంది. ఆదివారం జరిగిన బీజేపీ పార్లమెంట్ బోర్డు భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కూటమి పక్షాలతో చర్చించి ఆయన పేరు ఖరారు చేసినట్టు వెల్లడించారు. రాధాకృష్ణన్ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. "ఈ విషయమై విపక్షాలతో గత వారమే చర్చించారు. ఎన్డీయే అభ్యర్థి తేలాక మద్దతుపై నిర్ణయిస్తామని బదులిచ్చాయి. వాటి మద్దతు కూడగట్టడానికి చర్చలు కొనసాగుతాయి" అని స్పష్టం చేశారు. ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ పేరు ఖరారు కావడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఆయన సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో ఉన్నారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని శనివారం 'ఎక్స్'లో ప్రశంసించారు. అంకితభావం, మానవత్వం, ప్రతిభ కలిగిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. సామాజిక సేవపై ప్రధానంగా దృష్టి పెట్టి పనిచేశారని తెలిపారు. – న్యూఢిల్లీ

గెలుపు లాంఛనమే

ఉప రాష్ట్రపతి ఎన్నికలో విజయానికి అవసరమైన మెజార్టీ ఎన్డీయే కూటమికి ఉన్నందున రాధాకృష్ణన్ గెలుపు లాంఛనమే. 781 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. విజయానికి కనీసం 391 ఓట్లు అవసరం కాగా ఎన్డీఏకు 422 మంది ఎంపీల బలముంది. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. విపక్ష 'ఇండియా' కూటమి ఉమ్మడి అభ్యర్థి తదితరులు బరిలో దిగితే ఎన్నిక అనివార్యమవుతుంది. పోటీపై నిర్ణయం తీసుకునేందుకు 'ఇండియా' కూటమి నేతలు సోమవారం భేటీ అవుతున్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఇటీవల అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఆ పదవికి ఎన్నిక అనివార్యమైంది.

'తమిళ' ఎన్నికలే గురి!

తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలున్నాయి. స్టాలిన్ సారథ్యంలోని అధికార డీఎంకేను ఎలాగైనా ఓడించి అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదలతో ఉంది. ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎంపిక అందులో భాగంగానే కనిపిస్తోంది. ఆయన ఓబీసీ నేత కావడం, క్లీన్ ఇమేజీ ఉండటం ఎన్డీయేకు కలిసొచ్చే అంశం. పైగా అన్ని పార్టీలూ ఆయనను గౌరవిస్తుంటాయి. తమిళనాడులో బీజేపీని బలోపేతం చేయడంలో రాధాకృష్ణన్‌ది కీలకపాత్ర.

తమిళనాడు మోదీ!

సి.పి.రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుప్పూర్‌లో 1957 అక్టోబర్ 20న జన్మించారు. 16 ఏళ్లకే ఆరెస్సెస్‌లో చేరారు. బీజేపీ మాతృసంస్థ జనసంఘ్‌తో ఆయనకు బలమైన అనుబంధముంది. అభిమానులు ఆయనను 'తమిళనాడు మోదీ' అని పిలుస్తుంటారు. 1998, 1999లో కోయంబత్తూరు నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా గెలిచారు. బీజేపీలో బలమైన ఓబీసీ నేతగా ఎదిగిన ఆయనకు పార్టీ పలుమార్లు గవర్నర్‌గా అవకాశమిచ్చింది. జార్ఖండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా సేవలందించారు. 2024 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతున్నారు. రాధాకృష్ణన్ 1974లో జనసంఘ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడయ్యారు. తర్వాత తమిళనాడు బీజేపీ కార్యదర్శి అయ్యారు. పలు పార్లమెంటరీ కమిటీలకు చైర్మన్‌గా, సభ్యుడిగా చేశారు. స్టాక్ మార్కెట్ కుంభకోణంపై విచారణకు సారథ్యం వహించారు. 2004 నుంచి మూడేళ్లు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. 93 రోజులపాటు 19,000 కిలోమీటర్ల మేర రథయాత్ర చేశారు.

అఫిడవిట్ ఇస్తారా... క్షమాపణలు చెప్తారా?



రాహుల్‌కు సీఈసీ డిమాండ్

- ఈసీ భుజాల మీదుగా ఓటర్లపై గురి
- విపక్షాల తీరుపై జ్ఞానేశ్ మండిపాటు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు లోక్‌సభ నియోజకవర్గాల్లో లక్షలాది ఓట్లను తొలగించి పరోక్షంగా ఓటుహక్కును అపహరించారన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపణలను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ''ఆయన ఆరోపణల మేరకు ఓటు చోరీపై ఏడు రోజుల్లో సమగ్ర అఫిడవిట్ సమర్పించాలి. లేని పక్షంలో దేశప్రజలకు తక్షణం క్షమాపణ చెప్పాలి'' అని ఆదివారం ప్రెస్ మీట్‌లో డిమాండ్ చేశారు. ''ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్న వారికి ఏడు రోజుల గడువిస్తున్నా. వారి ఆరోపణలపై ఆలోపు ప్రమాణపత్రం సమర్పించాలి. లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పడం మినహా మరో దారి లేదు. ఎలాంటి రుజువులూ లేకుండా మీరు చేస్తున్న ఈ ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలు. అబద్ధాలతో కొన్ని పార్టీలు ఈసీ భుజాల మీదుగా ఓటర్లకు తుపాకీ గురి పెడుతున్నాయి.'' అన్నారు.

పారదర్శకంగా ఎస్ఐఆర్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్కడ చేపట్టిన ఓటు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అత్యంత పారదర్శకంగా సాగుతోందని సీఈసీ చెప్పారు. ''దీనిపై కొన్ని విపక్షాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. శాశ్వత స్థిరనివాసంలో ఒకటి, వేరే ప్రాంతానికి వలస వెళ్లడం వల్ల మరోటి... ఇలా కొందరికి రెండు ఓటర్ గుర్తింపు కార్డులు ఉండొచ్చు. ఇలాంటి తప్పిదాలను సరిచేసేందుకు పోలింగ్ యంత్రాంగం కృషి చేస్తోంది. ప్రతి ఎన్నికకు ముందూ ఓటరు జాబితాలో తప్పులు దిద్దడం ఈసీ విధి. సవరణపై సలహాలిచ్చేందుకు ఈసీ తలుపులు అందరికీ తెరిచే ఉంటాయి'' అని సీఈసీ అన్నారు. ''అధికార, విపక్షాలనే తేడా లేకుండా అందరినీ ఈసీ ఒకేలా పరిగణిస్తుంది. విపక్ష పార్టీలపై ఎలాంటి వివక్షా ఉండదు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఆరోపణలు, ఫిర్యాదులు సెప్టెంబర్ 1 లోపే చేసేయండి. తర్వాత స్వీకరించబోం'' అన్నారు.

వాళ్ల ఇంటి నంబర్ సున్నాయే

''దొంగ, నకిలీ ఓట్లను చేర్చి వాటి చిరునామాలో ఇంటి నంబర్‌ను సున్నాగా పేర్కొన్నట్టు రాహుల్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. ఇల్లు లేని, వంతెనలు, ఫుట్‌పాత్‌లు, వీధి దీపాలు, అనధికార కాలనీల్లో నివసించే వారికి నిర్దిష్టమైన చిరునామా, నంబర్ ఉండవు. అందుకే ఆ కాలమ్‌ను ఖాళీగా వదిలేయకుండా ఇంటి నంబర్‌ను 'సున్నా'గా పేర్కొంటాం. ఓటేసేందుకు చిరునామా ముఖ్యం కాదు. ఓటరు ఏ బూత్‌లో ఓటేస్తాడనేదే ముఖ్యం'' అన్నారు. ''వేర్వేరు బూత్‌ల్లో ఒకే వ్యక్తి పేర్లు నమోదైనట్టు ఆరోపణలే తప్ప ఆ మేరకు ఇప్పటిదాకా ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. గత ఆరు నెలల్లో బిహార్‌లో 22 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఇవన్నీ గత 20 ఏళ్లలో సంభవించినవి. ఎస్ఐఆర్ వల్లే ఈ గణాంకాలు వెలుగు చూస్తున్నాయి. మెషీన్ రీడబుల్ ఓటర్ జాబితా ఫార్మాట్‌ను పార్టీలకు ఇచ్చే ప్రసక్తే లేదు. అలా ఇవ్వకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ ఫార్మాట్‌లో డేటా బయటికొస్తే ఓటర్ల గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదముంది'' అని చెప్పారు.

ఓట్ల చోరీ బట్టబయలై... ఈసీ బెంబేలు



ఆదివారం సాసారాం సభలో అభివాదం చేస్తున్న రాహుల్, లాలూ, ఖర్గే, తేజస్వి

అందుకే అఫిడవిట్ డిమాండ్లు

- బీజేపీని అడగలేదేం: రాహుల్
- బిహార్‌లో ఓట్ల చోరీ వాస్తవం
- 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఉద్ఘాటన
- పేదల ఓటు హక్కు కాపాడుతామని ప్రతిన

సాసారాం: కేంద్రం ఎన్నికల సంఘం బాగోతం దేశ ప్రజలందరికీ తెలిసిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. అధికార బీజేపీతో చేతులు కలిపి ఎన్నికల్లో ఈసీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరిట గోల్‌మాల్‌కు తెరతీశారన్నారు. అనుకూలురైన వ్యక్తులను ఓటర్ల జాబితాలో చేర్చి, వ్యతిరేకుల పేర్లు తొలగించి ఎన్నికల్లో నెగ్గేలా పెద్ద కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ''ఈసీ–బీజేపీ కుట్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వబోం. ఎన్నికల చోరీని బిహార్ ప్రజలు సహించబోరు. పేదల ఓటు హక్కును కాపాడి తీరతాం'' అన్నారు. బిహార్‌లోని సాసారాంలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఓటర్ అధికార్ యాత్ర'ను రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఓట్ల చోరీని బయటపెట్టాక ఈసీకి దిక్కుతోచడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే అఫిడవిట్ దాఖలు చేయాలనే డిమాండ్లను తెరపైకి తెస్తోందని అన్నారు. ''ఈసీ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న డేటాతోనే ఓట్ల చోరీని బయటపెట్టా. అలాంటప్పుడు మళ్లీ అఫిడవిట్ ఎందుకు? ఓట్ల చోరీపై బీజేపీ నేతలు కూడా ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేశారు. అఫిడవిట్ దాఖలు చేయాలని వారినెందుకు అడగలేదు? ఎన్నికల వీడియో ఫుటేజీ కోరితే ఈసీ స్పందించకపోవడం వెనక మతలబేమిటి?'' అని నిలదీశారు.

ఓట్ల చోరీతోనే విజయం

''ఇటీవల లోక్‌సభతో పాటు పలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీతోనే బీజేపీ గెలిచింది. మహారాష్ట్రలో కోటి మంది కొత్త ఓటర్లను చేర్చి అధికారంలోకి వచ్చింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే కుతంత్రం మొదలైంది. అడ్డదారిలో నెగ్గజూస్తున్నారు. వారి కుట్రలు సాగనివ్వం. బిహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్ సహా ఎక్కడ ఓట్ల చోరీకి పాల్పడినా వారి బండారాన్ని ప్రజల ముందు పెడతాం'' అన్నారు.

మోదీ ప్రమాదకారి: ఖర్గే

ప్రధాని మోదీని ప్రమాదకరమైన వ్యక్తిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. పౌరుల ఓటు భద్రంగా ఉండాలంటే మోదీని ఓడించి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్య్రాన్ని వ్యతిరేకించిన ఆరెస్సెస్, సంఘ్‌ను మోదీ పొగడటం ఏమిటని మండిపడ్డారు. మోదీ పాలనలో యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందన్నారు.

16 రోజులు.. 1,300 కి.మీ.

ఓటర్ అధికార్ యాత్ర బిహార్‌లో 20 జిల్లాల గుండా 16 రోజులు.. 1,300 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగనుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో ముగుస్తుంది. ఆదివారం సభలో ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్, తేజస్వీ యాదవ్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేసి డ్రామాలా?

విపక్షాలపై మోదీ ధ్వజం



ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై నడుస్తున్న మోదీ

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''అధికారంలో ఉండగా రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేసి, చట్టాలను కాలరాసి, అంబేడ్కర్ ఆశయాలను పాతరవేసినవారే నేడు అదే రాజ్యాంగ ప్రతులను తలపై పెట్టుకొని డ్యాన్సులు చేస్తున్నారు. డ్రామాలాడుతున్నారు'' అని మండిపడ్డారు. రూ.11,000 కోట్లతో నిర్మించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్డును ఆదివారం ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. ఢిల్లీ, పొరుగు రాష్ట్రాలైన హరియాణా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి రావడాన్ని విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు. ''సామాజిక న్యాయం గురించి పెద్ద మాటలు చెబుతున్న విపక్షాలు అధికారంలో ఉండగా బడుగు బలహీన వర్గాలను దగా చేసే చట్టాలు, నిబంధనలు తెచ్చాయి. ఆ తిరోగమన చట్టాలను వందలాదిగా రద్దు చేస్తున్నాం'' అని మోదీ వివరించారు.

ఢిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ ప్రజలు బీజేపీ భుజాలపై పెద్ద బాధ్యత పెట్టారని మోదీ అన్నారు. వారి ఆకాంక్షలు నెరవేర్చేలా ఆ రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలు పని చేస్తున్నాయని వివరించారు. ''కొన్ని పార్టీలు

'వికసిత్' నమూనాగా ఢిల్లీ

ప్రజాతీర్పును ఇప్పటికీ అంగీకరించలేకపోతున్నాయి. ప్రజల విశ్వాసానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా బతుకుతున్నాయి. ఢిల్లీలో ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా కొన్ని నెలల క్రితం పెద్ద కుట్రలు జరిగాయి. ఢిల్లీకి వచ్చే తాగునీటిలో హరియాణా ప్రజలు విషం కలిపారంటూ తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. ఆ ప్రతికూల రాజకీయాల నుంచి ఢిల్లీవాసులకు స్వేచ్ఛ లభించింది. వికసిత్ భారత్‌కు ఢిల్లీని ఆదర్శ నమూనాగా తీర్చిదిద్దుతాం'' అన్నారు. జీఎస్టీలో అత్యాధునిక సంస్కరణల రూపంలో దీపావళికి దేశవాసులకు డబల్ బోనస్ దక్కనుందని శ్లాబుల తగ్గింపును ఉద్దేశించి పునరుద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలకు సహకరించాలని ప్రజలను కోరారు. వాటితో పేదలు, మధ్య తరగతి ప్రజలతోపాటు చిన్న, పెద్ద వ్యాపారాలకు మేలు జరుగుతుందన్నారు.

న్యూయార్క్ క్లబ్‌లో కాల్పులు.. ముగ్గురి దుర్మరణం

న్యూయార్క్: అమెరికాలో మళ్లీ తుపాకులు గర్జించాయి. న్యూయార్క్‌లో ఓ క్లబ్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. ఎనిమిది మంది గాయపడ్డారు. టేస్ట్ ఆఫ్ సిటీ లాంజ్ క్లబ్‌లో కిక్కిరిసిన జనంపైకి కొందరు ఆకస్మికంగా కాల్పులకు దిగారని పోలీసులు తెలిపారు. ఖాళీ తూటాలను, తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ తెలిపారు. క్షతగాత్రుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారన్నారు. వీరెవరికీ ప్రాణాపాయం లేదని వివరించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టామన్నారు. గడిచిన ఏడు నెలలుగా నగరంలో కాల్పుల ఘటనలు రికార్డు స్థాయిలో తక్కువగా నమోదయ్యాయని భావిస్తున్న వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం విచారకరమని జెస్సికా పేర్కొన్నారు.

కథువాలో క్లౌడ్ బరస్ట్
కొండచరియలు విరిగి ఏడుగురి మృతి

జమ్మూ: క్లౌడ్ బరస్ట్‌లు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. కిష్త్వాడ్ విషాదాన్ని మరవకముందే కథువా జిల్లాను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. ఆదివారం రెండుచోట్ల క్లౌడ్ బరస్ట్‌తో నలుగురు పిల్లలు సహా ఏడుగురు మృతి చెందారు. జోడ్‌ఘాటిలో ఆకస్మిక వరదలతో ఐదుగురు, జాంగ్లోట్‌లో కొండచరియలు విరిగిపడి ఇద్దరు మరణించారు. జమ్మూ–పఠాన్‌కోట్ జాతీయ రహదారి దెబ్బతింది. రాజ్‌బాగ్‌లోని జోడ్‌ఘాటి, జాంగ్లోట్‌లోని బాగ్రా గ్రామం మధ్య అర్ధరాత్రి దాటిన తరువాత వరదలు ఆకస్మాత్తుగా సంభవించాయి. ఫలితంగా జోడ్ ఘాటిలో అనేక ఇళ్లు శిథిలాల కింద, వరద నీటిలో మునిగిపోయాయి. కథువాలో పోలీస్ స్టేషన్ పూర్తిగా మునిగిపోయింది. రైల్వే ట్రాక్ కూడా దెబ్బతిన్నది.

నవీన్ పట్నాయక్‌కు స్వల్ప అనారోగ్యం

భువనేశ్వర్: బీజేడీ అధినేత, ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. డీహైడ్రేషన్ కారణంగా ఆదివారం ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. 'నవీన్ పట్నాయక్ డీహైడ్రేషన్ కారణంగా ఈరోజు సాయంత్రం 5.15 గంటలకు భువనేశ్వర్‌లోని ఎస్‌యూఎమ్ అల్టిమేట్ మెడికేర్‌లో చేరారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. చికిత్సకు బాగా స్పందిస్తున్నారు' అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, 78 ఏళ్ల నవీన్ పట్నాయక్ గతంలో ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. జూలై 7న ముంబై ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన.. 12న ఒడిశాకు తిరిగి వచ్చారు.

ఉక్రెయిన్ యుద్ధానికి తెర!

త్వరలో 'భారీ పురోగతి' అంటూ ట్రంప్ ఊరింపు

- దోన్బాస్ కావాలంటున్న రష్యా అధ్యక్షుడు పుతిన్?
- బదులుగా ఉక్రెయిన్‌కు 'నాటో' తరహా రక్షణ!



న్యూయార్క్: ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు అమెరికా, ఐరోపా సమాఖ్య చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం స్వీయ సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్ట్ పెట్టారు. ''రష్యా విషయంలో భారీ పురోగతి సాధించాం. త్వరలోనే వివరాలు వెల్లడిస్తా'' అని పేర్కొన్నారు. మరోవైపు, ఉక్రెయిన్ విషయమై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సానుకూల నిర్ణయం తీసుకున్నారని అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ ప్రకటించారు. ''ఉక్రెయిన్‌కు నాటో కూటమి తరహాలో అమెరికా, ఈయూ 'రక్షణ హామీ' ఇచ్చినా అభ్యంతరం లేదని పుతిన్ చెప్పారు. మొత్తం ప్రక్రియలో ఇదొక కీలక మలుపు. ఇకపై ఉక్రెయిన్ భూభాగాలను ఆక్రమించబోమని హామీ ఇచ్చారు. రష్యాతో విజయవంతంగా ఒప్పందం కుదుర్చుకోనున్నాం. నాటో కూటమికి గుండెకాయ అయిన క్లాజ్–5 తరహాలో ఉక్రెయిన్‌కు రక్షణ ఆఫర్ ఇచ్చేందుకు ట్రంప్ సిద్ధపడ్డారు. ఈ ప్రయోజనం కోసమే ఉక్రెయిన్ నాటోలో చేరేందుకు ప్రయత్నిస్తోంది. ఇకపై ఆ అవసరం ఉండదు. ఉక్రెయిన్ నాటోలో చేరొద్దనేదే పుతిన్ ప్రధాన అభ్యంతరం. కనుక ట్రంప్ ఆఫర్ సమస్య పరిష్కారం చూపుతుంది. ప్రక్రియ సజావుగా సాగడానికి సమయం పట్టొచ్చేమో గానీ కచ్చితంగా శాంతి నెలకొంటుంది. మూడున్నరేళ్ల యుద్ధానికి తెర పడుతుంది'' అన్నారు. 5వ క్లాజ్ ప్రకారం 32 నాటో దేశాల్లో దేనిపై శత్రువు దాడి చేసినా అన్ని దేశాలపై ఉమ్మడి దాడిగా పరిగణించి ప్రతిదాడికి దిగుతాయి.

నేడు ట్రంప్–జెలెన్‌స్కీ భేటీ

ట్రంప్ సోమవారం జెలెన్‌స్కీతో వైట్‌హౌస్‌లో భేటీ కానున్నారు. పుతిన్‌తో భేటీ వివరాలు, ప్రతిపాదనలను ఆయన ముందుంచనున్నారు. భేటీ విజయవంతమైతే ఈయూ దేశాల అగ్ర నేతలతోనూ ట్రంప్, జెలెన్‌స్కీ సమావేశం అవుతారు. బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, ఫిన్లండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ తదితరులు పాల్గొంటారు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకున్నా అదే తరహాలో రక్షణ హామీ ఇచ్చేందుకు ట్రంప్ ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నట్టు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డీర్ లేయిన్ చెప్పారు.

దోన్బాస్ ఇచ్చేయండి

దోన్బాస్ తూర్పు ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌పై పుతిన్ అజమాయిషీ కోరుతున్నట్టు జెలెన్‌స్కీకి ట్రంప్ చెప్పారని సమాచారం. అవిచ్చేస్తే యుద్ధం ఆపేస్తానని పుతిన్ ప్రతిపాదించినట్టు వివరించారు. అందుకు జెలెన్‌స్కీ ఒప్పుకోలేదని తెలుస్తోంది. సోమవారం ముఖాముఖిలో ఇందుకు జెలెన్‌స్కీని ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నారు. తూర్పు దోన్బాస్ అంశమే శాంతి ఒప్పందానికి కీలకమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. తూర్పు దోన్బాస్‌ను ఇచ్చేశాక పుతిన్ తాత్కాలికంగా యుద్ధాన్ని ఆపేసినా, తమపై రష్యా భావి దండయాత్రకు అదే కారణంగా మారొచ్చన్నది జెలెన్‌స్కీ ఆందోళనగా కనిపిస్తోంది.

శుభాంశు వచ్చేశాడు

ఐఎస్ఎస్ వీరునికి అపూర్వ స్వాగతం



విమానాశ్రయంలో శుభాంశు అభివాదం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో పాదం మోపిన తొలి భారతీయునిగా సరికొత్త చరిత్ర సృష్టించిన వాయుసేన గ్రూప్ కెప్టెన్, వ్యోమగామి శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకున్నారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటలు దాటాక ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్లా భార్య కామ్నా, కుమారుడు కియష్‌తో పాటు అసంఖ్యాకులైన అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన మంత్రి జితేంద్ర సింగ్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఇస్రో చైర్మన్ వి.నారాయణన్, పలువురు ఉన్నతాధికారులు ఎదురెళ్లి మరీ కరతాళ ధ్వనుల మధ్య శుభాంశును విమానాశ్రయం నుంచి బయటకు తీసుకొచ్చారు. త్రివర్ణ పతాకాలను చేబూని నినాదాలతో హోరెత్తించిన అభిమానులకు ఆయన చిరునవ్వుతో అభివాదం చేశారు. డప్పుచప్పుళ్లు, జయజయధ్వానాలతో పండుగ వాతావరణం నెలకొంది. ''స్వదేశానికి తిరిగిరావడం ఎంతో సంతోషంగా ఉంది. మీరంతా ఇంతటి సాదర స్వాగతం పలికినందుకు కృతజ్ఞతలు'' అని కేంద్ర మంత్రిని ఉద్దేశిస్తూ శుక్లా 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. యాగ్జియం–4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి శుభాంశు జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లడం, ఆ మర్నాడు ఐఎస్ఎస్‌కు చేరుకోవడం తెలిసిందే. అక్కడ 18 రోజులపాటు ఆయన 20 ప్రత్యేక కార్యక్రమాలు, 60కి పైగా ప్రయోగాలు చేశారు. జూలై 15న భూమికి చేరుకున్నారు. నాసా క్వారంటైన్‌లో గడిపి తాజాగా స్వదేశం చేరారు. శుభాంశు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవుతారు. అనంతరం సొంతూరు లఖ్‌నవూ వెళ్తారు. తర్వాత 22, 23వ తేదీల్లో ఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాలో పాల్గొంటారు. శుభాంశు దిగ్విజయ అంతరిక్ష యాత్రపై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగనుంది.

రెప్పపాటు జీవితం!
శుభాంశు భావోద్వేగ పోస్టు

అమెరికా నుంచి భారత్‌కు బయల్దేరుతూ విమానం ఎక్కాక శుక్లా ఇన్‌స్టా గ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. '' దాదాపు 12 నెలల సుదీర్ఘ ఎడబాటు తర్వాత స్వదేశానికి చేరుకుంటున్నా. భారత్‌కు బయల్దేరేందుకు విమానం ఎక్కి సీటులో కూర్చోగానే నా మదిలో ఎన్నెన్నో మధుర స్మృతులు ముప్పిరిగొన్నాయి. యాగ్జియం మిషన్‌లో భాగంగా ఏడాదిగా ఒకే కుటుంబంలా కలిసిన నా స్నేహితులను వీడుతున్నందుకు బాధగా ఉంది. దాన్ని మరిపించేలా భారత్‌లో నా ప్రియ మిత్రులు, కుటుంబం సహా ప్రతి భారతీయుడినీ కలవడం పట్ల ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నా. జీవితమంటే ఇంతే! అన్నీ రెప్పపాటులో అలా మదిలో మెదులుతాయి. యాగ్జియం మిషన్ వేళ, ఆ తర్వాత ప్రతి ఒక్కరి నుంచి అద్భుతమైన తోడ్పాటు అందుకున్నా. అక్కడి సంగతులు, విశేషాలు, జ్ఞాపకాలను నా దేశవాసులతో పంచుకునేందుకు పరితపిస్తున్నా. కొన్ని సందర్భాల్లో కొందరికి వీడ్కోలు పలకడం ఎంతో భారంగా ఉంటుంది. కానీ జీవిత గమనంలో ఇలాంటివి తప్పవు. మార్పు ఒక్కటే శాశ్వతమని నా తోటి వ్యోమగామి, కమాండర్ పెగ్గీ విట్సన్ ఎప్పుడూ చెప్పేవారు. బాలీవుడ్ సినిమా స్వదేశ్‌లో షారుఖ్‌ఖాన్ పాడినట్టు, 'తెరువరీ, సాగిపో. గమనమే వాహనం. కాలమే చక్రం'' అంటూ రాసుకొచ్చారు.



డిస్కంలో ఇంటిదొంగలు

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని పలువురు ఇంజినీర్లు బిల్డర్లతో దోస్తీ చేస్తున్నారు. అనధికారిక భవనాలకు తక్కువ లోడ్‌తో కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు. -8లో



గ్రీన్ గణేశాయ నమః

నగరంలో వినాయ విగ్రహాల సందడి మొదలయ్యింది. పండుగ పచ్చగా.. ప్రకృతి మెచ్చగా.. అన్నట్లు పలు సంస్థలు విత్తన గణేశుల తయారీ వైపు అడుగులు వేస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/22.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



హుస్సేన్‌సాగర్ నెక్లెస్ రోడ్‌లో గంగమ్మ తల్లికి బోనాలను తీసుకువస్తున్న మహిళలు





బోనంతో వస్తున్న యువతి



గంగ తెప్పోత్సవంలో పోతరాజుల విన్యాసాలు



హుస్సేన్‌సాగర్ జలాల్లో శివసత్తి సందడి



గంగ తెప్పోత్సవంలో భాగంగా జరిగిన సమావేశంలో వేదికపై అభివాదం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

కుల వృత్తులను పరిరక్షిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా గంగ తెప్పోత్సవం

ఖైరతాబాద్: కులవృత్తుల పరిరక్షణకు కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఏడు గుళ్ల దేవాలయం నుంచి గంగ తెప్ప, బోనాల ఊరేగింపు హుస్సేన్‌సాగర్ తీరంలోని గంగమ్మ ఆలయం వరకు కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ హెచ్‌ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గీత వృత్తి బతకాలంటే చెట్లు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో చేపల వృత్తి బతకాలంటే చెరువులు, కుంటల్లో చేపలను పెంచాలన్నారు.

కులవృత్తులను మరువొద్దు: మహేష్‌కుమార్ గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎంత ఎత్తుకు ఎదిగినా వారి కుల వృత్తులను మరవకూడదన్నారు. యువత ఫాస్ట్ ఫుడ్స్‌కు అలవాటు పడుతున్నారని, ప్రకృతి పరంగా లభించే చేపల ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

గంగపుత్రులు పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి: దత్తాత్రేయ

హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. గంగపుత్రులు పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. వృత్తిపై ఆధారపడిన వారు తక్కువ వడ్డీలతో పరిశ్రమలు పెట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అందజేసే పథకాలను రాష్ట్రంలో అమలయ్యేలా చూడాలన్నారు.

తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మహేందర్ బాబు మాట్లాడుతూ.. గంగపుత్రుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకునేందుకు అవకాశమివ్వాలని కోరారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, మత్స్య సహకార చైర్మన్ మెట్టు సాయి కుమార్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, గంగ తెప్పోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పూస నర్సింహా, కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, మహిళా మత్స్య సహకార సంఘం అధ్యక్షురాలు కొప్పు పద్మ, సభ్యురాలు అరుణ్ జ్యోతి, గాయకుడు గంగపుత్ర నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ సేవలపై అయోమయం

ఇప్పటికే రిజిస్టర్డ్ పోస్ట్‌సేవల నిలిపివేత నిర్ణయం

- తాజాగా లెటర్ రెడ్ (పోస్ట్) బాక్స్ ఎత్తివేత ప్రచారం
- అవి ఊహాగానాలే అంటున్న తపాలా వర్గాలు
- ఈ- సేవల విస్తరణలో పోస్టల్ శాఖ నిమగ్నం

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ ఈ- సేవల విస్తరణ కోసం సరికొత్త ప్రయోగాలు చేస్తున్న పోస్టల్ శాఖ పాత సేవలను మాత్రం ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోంది. ఇప్పటికే పలుసేవలు రద్దు కాగా.. సెప్టెంబర్ ఒకటి నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. మరోవైపు లెటర్ రెడ్ (పోస్టాట్) బాక్స్‌లను కూడా ఎత్తి వేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రధానంగా పోస్టల్ శాఖ నూతన ఒరవడితో ఈ- సేవల విసర్తణపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలానే. అయితే.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరింత సులువైన సేవలందించేందుకు సాంకేతిక టెక్నాలజీకితో పోస్టల్ డిపార్ట్‌మెంట్ అప్‌గ్రేడ్ అవుతూ వస్తోంది.

రిజిస్టర్డ్ పోస్టులకు మంగళం..

పోస్టల్ శాఖ రిజిస్టర్డ్ పోస్టు సేవలకు మంగళం పాడనుంది. తాజాగా బ్రిటిష్ కాలం నుంచి వస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు సెప్టెంబర్ ఒకటి నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పోస్ట్‌మాస్టర్‌లకు శాఖాపరమైన నోటీసులు జారీ చేసింది. ఒకప్పుడు బంధుమిత్రులకు కబురు పంపాలన్నా.. ముఖ్యమైన పత్రాలు చేరవేయలన్నా పోస్ట్‌కార్డు లేదా రిజిస్టర్డ్ పోస్ట్ మాత్రమే అందుబాటులో ఉండేది.

సుమారు 171 ఏళ్లుగా..

పోస్టల్ వ్యవస్థ ప్రజల జీవితంలో విడదీయరాని భాగమైంది. కాలంతో పాటు మారిన పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇప్పుడు మరింత ఆధునిక సేవలతో ముందుకు వస్తోంది. 1854లో అప్పటి బ్రిటిషర్ లార్డ్ డల్హౌసీ ప్రవేశపెట్టిన ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టంతో సేవలు ప్రారంభమయ్యాయి. అంతకు ముందు 1766లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో 'కంపెనీ మెయిల్' మొదలైంది. దాదాపు 171 ఏళ్లుగా ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి రిజిస్టర్డ్ పోస్ట్ ప్రధాన మార్గంగా నిలిచింది. లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటివాటిని పంపడానికి ఎంతగానో ఉపయోగపడింది. పంపిన వస్తువు అవతలి వారికి చేరినట్లు రసీదు (డెలివరీ ప్రూఫ్) పొందడం ఒక ప్రత్యేకత, చట్టపరంగానూ ఎంతో విలువైనది. ఇది కాస్త మరో రెండు వారాల్లో కనుమరుగు కానుంది!

స్పీడ్ పోస్ట్‌లో విలీనం..

రిజిస్టర్డ్ పోస్ట్ సేవను పూర్తిగా 'స్పీడ్ పోస్ట్' సేవలో విలీనం చేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. తపాలా శాఖ తమ సేవలను ఆధునికీకరించే ప్రయత్నంలో భాగంగా దేశీయ పోస్టల్ సేవల క్రమబద్ధీకరణ, పనితీరును మెరుగుపరచడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం తదితర ప్రక్రియలో భాగంగానే స్పీడ్ పోస్ట్‌లో రిజిస్టర్డ్ పోస్ట్‌ను విలీనం చేస్తున్నట్లు వెల్లడించింది. స్పీడ్ పోస్ట్ అంటే వేగవంతమైన డెలివరీ. ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు స్పీడ్ పోస్ట్‌లో కలపడంతో డెలివరీలు మరింత వేగవంతం కానుంది. స్పీడ్ పోస్ట్ ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇది రిజిస్టర్డ్ పోస్ట్‌లో లేదు. ఒకే సేవ ఉండటం వల్ల పోస్టల్ శాఖ పని మరింత సులభమవుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

రెడ్ పోస్ట్ బాక్స్‌పై ఊహాగానమే..

రిజిస్టర్డ్ పోస్ట్ సేవల రద్దు నేపథ్యంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్ పోస్ట్ బాక్స్‌ల ఎత్తివేత ప్రచారం జోరుగా సాగుతుంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పోస్టల్ అభిమానాలు కలత చెందుతున్నారు.దశాబ్దాలుగా నిస్వార్థంగా నిశ్శబ్దంగా నిశ్చలంగా విశ్వసనీయంగా సేవలు అందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించదన్న బాధ్యత వ్యక్తమవుతోంది. అయితే.. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని. అది ఒక ఊహాగానం మాత్రమేనని పోస్టల్‌వర్గాలు పేర్కొంటున్నాయి. పోస్టల్ శాఖ ద్వారా ఎరుపు పోస్ట్ బాక్సులను ఎత్తేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ లేదని స్పష్టం చేస్తున్నారు. కేవలం రిజిస్టర్డ్ పోస్టల్ సర్వీస్‌ను స్పీడ్ పోస్టులో విలీనం తప్ప ఇది ఎరుపు పోస్ట్ బాక్సులతో సంబంధం లేదని పేర్కొంటున్నారు.

తగ్గిన ఆదరణ.. పెరిగిన సాంకేతికత..

వాస్తవంగా రిజిస్టర్డ్ పోస్ట్ వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సాప్, జీమెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల రాకతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇప్పుడు డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాయి. ఐదేళ్లలో జరిగిన రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్ పరిశీలిస్తే.. 25 శాతానికి పడిపోయింది. స్పీడ్ పోస్ట్, ఇతర కొరియర్ సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్టర్డ్ పోస్ట్‌కు డిమాండ్ తగ్గింది. అయితే.. తాజాగా స్పీడ్ పోస్టుతో చార్జీల మోత తప్పని పరిస్థితి కనిపిస్తోంది. రిజిస్టర్డ్ పోస్ట్ కనీస చార్జీ రూ. 26 నుంచి రూ. 30 వరకు ఉంటుంది. స్పీడ్ పోస్ట్ కనీస చార్జీ రూ.41. ఇది రిజిస్టర్డ్ పోస్ట్‌తో పోలిస్తే 20 నుంచి 25 శాతం ఎక్కువ. ఇక చార్జీలు భరించక తప్పదు.

దండిగా.. నిండుగా..

- నీళ్లతో ప్రధాన జలాశయాలు కళకళ
- రానున్న వేసవి వరకు నగర తాగునీటికి బేఫికర్



నాగార్జున సాగర్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు అందించే ప్రధాన జలాశయాలు నాగార్జున సాగర్, గోదావరితో పాటు మంజీరా, సింగూర్, ఉస్మాన్‌సాగర్, హిమయాత్ సాగర్ జలాశయాల్లో దండిగా నీరు వచ్చి చేరింది. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంటున్నాయి. దీంతో వచ్చే వేసవి వరకు తాగునీటి తరలింపునకు కొరత లేకుండాపోయింది.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా..

మహా నగరానికి నాగార్జున సాగర్, గోదావరి నుంచే సుమారు 75 శాతానిపైగా తాగు నీటి సరఫరా ఉంటుంది. కృష్ణా తాగునీటి సరఫరా పథకం 1, 2, 3 దశల కింద నాగార్జున సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రోజువారీగా 270 ఎంజీడీల నీటిని తరలిస్తుండగా, గోదావరి నీటి సరఫరా పథకం కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 168 ఎంజీడీలు సరఫరా జరుగుతోంది. సింగూర్ నుంచి 75 ఎంజీడీలు, మంజీరా నుంచి 45 ఎంజీడీలు, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి 40 ఎంజీడీల నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. మరోవైపు గోదావరి మూడు, నాలుగో దశ, మంజీరా అదనపు పైపులైన్ ఏర్పాట్లకు జలమండలి సన్నహాలు చేస్తోంది. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా నీటిని సరఫరా చేసేందుకు అదనపు జలాల తరలింపునకు ఏర్పాట్లు చేస్తోంది.

జంట జలాశయాలకు వరద ప్రవాహం

జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం అధికమైంది. హిమాయత్ జలాశయం పూర్తి నీటి మట్టం చెరువవుతుండటంతో గేట్లు ఎత్తి దిగువన నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి కూడా వరద ప్రవాహం పెరిగింది. మొత్తానికి వచ్చే వేసవి నాటికి నగర దాహార్తి తీరేందుకు ఎటువంటి ఢోకా ఉండదు.

నగరానికి తాగు నీటి సరఫరా చేసే జలాశయాల్లో ఇలా...

ప్రధాన జలాశయం	పూర్తిస్థాయి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం (అడుగుల్లో)
నాగార్జున సాగర్	590.000	587.400
శ్రీపాద ఎల్లంపల్లి	485.560	482.799
ఉస్మాన్ సాగర్	1790.000	1987.000
హిమాయత్‌సాగర్	1763.500	1761.800
సింగూర్ (మీ)	1717.932	1711.993
మంజీరా	1651.750	1650.200

కలసి చదివితే కలదు ఫలితం

- సర్కారు బడుల్లో కంబైండ్ స్టడీస్‌కు కార్యాచరణ
- తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థుల గ్రేడింగ్
- ప్రతి ముగ్గురితో ఒక గ్రూప్ చొప్పున ఏర్పాటు
- వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు
- ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు
- సరికొత్త ప్రయోగానికి జిల్లా విద్యాశాఖ సంసిద్ధం



సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థులపై దృష్టి పెట్టి కంబైండ్ స్టడీస్ కార్యాచరణ అమలుకు కసరత్తు చేస్తోంది. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఒత్తిడి తగ్గింపు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, వేగవంతమైన అభ్యాసం, పరస్పర సహకారంతో సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం, పోటీతత్వం పెంచేందుకుకు కంబైండ్ స్టడీస్ దోహదపడుతుందని భావిస్తోంది. ప్రతి రోజు తరగతి గదిలో కంబైండ్ స్టడీస్‌కు ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తోంది.

సమూహంతో సందేహాల నివృత్తి..

కేవలం పరీక్షల సమయంలోనే కాకుండా నిత్యం సమూహంగా చదువుకోవడంతో మంచి ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ భావిస్తోంది. ఒంటరిగా ఒక్కరే చదువుకోవడం కంటే స్నేహితులతో కలిసి స్టడీస్ చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని అంచనా వేస్తోంది. వాస్తవంగా ఒంటరిగా చదువుకోవడం వల్ల కలిగే ఒత్తిడిని కంబైండ్ స్టడీస్‌తో తగ్గిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకరికి వచ్చిన సందేహాలను మరొకరు నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. చదువుకున్న విషయాలు గుర్తుంచుకోవడానికి సహాయపడుతుంది. ఒకరికొకరు సహాయం చేసుకోవడం ద్వారా చదువులో రాణించవచ్చని పేర్కొంటున్నారు.


విద్యార్థులకు గ్రేడింగ్..

పదో తరగతి విద్యార్థులతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను బట్టి గ్రేడింగ్ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. గ్రేడింగ్ చేయడం ద్వారా విద్యా అవసరాలను ముందుగానే గుర్తించవచ్చని భావిస్తోంది. విద్యార్థులను ఎ.బి.సి గ్రేడ్లుగా విభజించి బి. సి. గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా తగిన ప్రణాళిక రూపొందిస్తోంది. వారి నైపుణ్యాలను మెరుగుపరిచి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా చదువులో ప్రతి ముగ్గురిని కలిపి ఒక గ్రూప్ ఏర్పాటు చేసే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

హెచ్ఎంలతో డీఈఓ సమీక్ష

ఇటీవల తొమ్మిదో తరగతి విద్యార్థుల గ్రేడింగ్‌పై ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారిణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో పదో తరగతితో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థులను ఎ.బి.సి. గ్రేడులుగా విభజించాలని ఆదేశించారు. వివిధ సబ్జెక్టుల్లో బి.సి. గ్రేడ్‌ల విద్యార్థుల లోపాలను గుర్తించి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని సూచించారు.

తొమ్మిదో తరగతి నుంచే ప్రత్యేక దృష్టి



పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన కోసం తొమ్మిదో తరగతి నుంచే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. కలెక్టర్ హరిచందన దాసరి సూచనల మేరకు పదో తరగతి విద్యార్థులతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థులను కూడా గ్రేడింగ్ చేసి కంబైండ్ స్టడీస్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. వెనుకబడిన విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే ప్రధాన లక్ష్యం.
– రోహిణి, డీఈఓ, హైదరాబాద్

దత్తత కుక్క పిల్లలను ఆదరించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



కుక్క పిల్లలను దత్తత ఇస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు

బంజారాహిల్స్: దత్తత తీసుకున్న దేశీ కుక్క పిల్లలను కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. బంజారాహిల్స్ జలగం వెంగళరావు పార్కులో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఇండీ పప్పీ దత్తత మేళా'ను ఖైరతాబాద్ జోన్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఆయన ప్రారంభించారు. 'బీ.. ఏ హీరో.. అడాప్ట్ డోంట్ షాప్' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. డీ వార్మ్ చేసిన, వ్యాక్సిన్ వేసిన, ఆరోగ్యంగా ఉన్న అందమైన 39 దేశీ కుక్క పిల్లలను ఈ మేళాలో ప్రదర్శించారు. కుక్కలంటే ఇష్టపడే ప్రజలు మేళాకు హాజరై ఆసక్తిగా తిలకించారు. తొలి దత్తతగా కూకట్‌పల్లికి చెందిన సీహెచ్ సాయికి ఒక కుక్క పిల్లను స్వయంగా కమిషనర్ అందజేసి అభినందించారు. మేళాలో మొత్తం 24 కుక్క పిల్లలను డాగ్ లవర్స్ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దేశీ కుక్క పిల్లలను దత్తత తీసుకున్న వారు వాటిపై చూపుతున్న ప్రేమాభిమానాలు ప్రశంసనీయమన్నారు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ ప్రయత్నానికి అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

దత్తత డ్రైవ్ లక్ష్యం ఇదీ..

నగరంలోని వీధి కుక్కల సంఖ్యను తగ్గించడంతో పాటు వాటికి ప్రేమ గల వాతావరణం కల్పించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఈ డ్రైవ్‌లో దత్తత తీసుకునే కుక్క పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, టీకాలు వేసిన తర్వాతే అప్పగిస్తారు. పెంపుడు జంతువులను కొనడం కంటే దత్తత తీసుకోవడాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని జీహెచ్‌ఎంసీ తెలిపింది. ప్రజలు ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరింది.

అనూహ్య స్పందన..

ఈ డ్రైవ్‌కు సంబంధించి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఎక్స్‌లో పోస్ట్ చేయగా, జంతు ప్రేమికుల నుంచి మంచి స్పందన లభించింది. దత్తత కార్యక్రమం వీధి కుక్క పిల్లలకు కొత్త జీవితాన్ని ఇవ్వడమే కాకుండా వాటిని దత్తత తీసుకునే కుటుంబాలకు మంచి స్నేహితులను అందిస్తుందని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది.



దత్తత తీసుకున్న కుక్కపిల్లతో ఓ మహిళ ఆనందం

నిత్య పెళ్లికొడుకు కోసం పోలీసుల వేట

అత్తాపూర్: ప్రేమ పేరుతో పెళ్లి చేసుకోవడం..కొద్ది రోజుల తరువాత మరో అమ్మాయితో ప్రేమ అంటూ వెంట పడుతున్న నిత్య పెళ్లి కొడుకు కోసం అత్తాపూర్ పోలీసులుగ గాలిస్తున్నారు. పెళ్లి పేరుతో మోసపోయిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవికుమార్ ఎలియాస్ రఫీపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. రవికుమార్ కొంత కాలంగా అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంగా చేస్తున్నట్లు నటించసాగాడు. తన కంటే వయస్సులో కంటే చిన్న వారిని గుర్తించి ప్రేమ పేరుతో నమ్మించి వివాహాలు చేసుకోవడం అలవాటుగా చేసుకున్నాడు. ప్రేమ పేరుతో అమ్మాయిలను లొంగదీసుకోవడంతో పాటు శారీరకంగా మానసికంగా హింసిస్తాడని పోలీసులు తెలిపారు. ప్రేమించుకునే సమయంలో మాట్లాడుతున్న సంభాషణలు వారు గడిపిన ప్రదేశాలను ఆడియో... వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానంటూ బెదిరిస్తూ ఉండటంతో బాధిత యువతులు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. తప్పించుకు తిరుగుతున్న రఫీపై వివిధ కేసులు నమోదు చేశారమన్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ క్రిమినల్స్ టోకరా

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు సైబర్ మోసగాళ్లు షాకిచ్చారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని ఐలాం కాలనీలో నివసించే సీతారత్నం (40) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సెల్‌ఫోన్‌ను నెల క్రితం పోగొట్టుకున్నాడు. అదేరోజు బ్యాంక్ అకౌంట్‌తో పాటు సిమ్‌కార్డును హోల్డ్‌లో పెట్టారు. రెండు రోజుల క్రితం ఆమె పోగొట్టుకున్న ఫోన్ నెంబర్‌ను తిరిగి తీసుకున్నారు. ఫోన్ పే చేయాలని చూడగా ఫెయిల్యూర్ అని వచ్చింది. దీంతో ఆమె యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లి విషయం చెప్పగా నెల క్రితం అకౌంట్‌ను హోల్డ్ చేసినప్పుడు డెబిట్‌కార్డును కూడా హోల్డ్ చేశామని.. మళ్లీ తీసుకోవాలని చెప్పారు. దీంతో ఆమె డెబిట్‌కార్డు మరోసారి తీసుకుంది. యాక్టివేషన్ జరిగిన కొద్దిసేపట్లోనే ఆమె ఫోన్‌కు రూ.50 వేల చొప్పున రెండుసార్లు అకౌంట్ నుంచి డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. పోగొట్టుకున్న తన ఫోన్‌లో నుంచి సిమ్‌కార్డును తీసుకుని సైబర్ మోసగాళ్లు డబ్బులు డ్రా చేసి ఉంటారని భావిస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పెద్దమ్మ ఆలయంలో భక్తురాలి గొలుసు చోరీ..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించేందుకు వచ్చిన ఓ మహిళా భక్తురాలి బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఎల్బీనగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చారు. అదే సమయంలో మొక్కు తీర్చుకుంటుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ చోరీకి గురైంది. అందులో ఉన్న 13 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురికావడంతో ఆమె కొడుకు నరేంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మొక్కు తీర్చుకునేందుకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు తన తల్లి హ్యాండ్‌బ్యాగ్ చోరీ చేశారని, అందులో బంగారంతో పాటు నగదు ఉందని పేర్కొన్నారు. ఇక్కడి సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను చోరీ చేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిస్కంలో ఇంటిదొంగలు!

కలెక్షన్లపైనే నజర్

- బిల్డర్లతో దోస్తీ.. తక్కువ లోడుతో కనెక్షన్లు జారీ
- కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్న ఆర్టిజన్లు
- బస్తీ పర్యటనల్లో పలు లోపాల గుర్తింపు
- సంస్థ నష్టాలకు కారణమవుతున్న ఇంజనీర్లపై వేటుకు రంగం సిద్ధం



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని పలువురు ఇంజనీర్లు బిల్డర్లతో దోస్తీ చేస్తూ అనధికారిక భవనాలకు తక్కువ లోడుతో కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు. ఆ తర్వాత లో ఓల్టేజీని సాకుగా చూపించి సంస్థ నిధులతో డెవలప్‌మెంట్ పనులు చేయిస్తున్నారు. ప్రత్యక్షంగా వినియోగదారుల జేబును గుల్ల చేస్తుండడంతో పాటు సంస్థ అంతర్గత నష్టాలకు కారణమవుతున్నారు. వినియోగదారుని పేరున నమోదు కావాల్సిన ఎల్‌టీఎం అగ్రిమెంట్లు ఒకే వ్యక్తి నంబర్‌పై 843 వెలుగు చూశాయి. కాంట్రాక్టర్ల పేరునే కాదు ఏకంగా ఓ లైన్‌మెన్ నంబర్‌పై 140 ఎల్‌టీఎం అగ్రిమెంట్లు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పరిశీలనలో తేలాయి. సంస్థ నుంచి నెలవారీ వేతనాలు తీసుకుంటూ పరోక్షంగా నష్టాలకు కారణమవుతున్న ఇంజనీర్లు, ఆర్టిజన్ కార్మికులపై సీఎండీ సీరియస్ అయినట్లు తెలిసింది. ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్లతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లోనూ ఇదే అంశంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.

కాంట్రాక్టర్లుగా ఆర్టిజన్లు

గ్రేటర్‌లో పది సర్కిళ్లు ఉండగా, మూడు (మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్) జోన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 30 ఆపరేషన్ డివిజన్లు ఉండగా, 220 వరకు ఆపరేషన్ సెక్షన్లు పని చేస్తున్నాయి. 213 మంది ఆపరేషన్ ఏఈలు 12 వేల మందికిపైగా జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లు పని చేస్తున్నారు. ఇతర విభాగాల్లోని ఉద్యోగులతో పోలిస్తే వీరి వేతనాలు కూడా ఎక్కువే. క్షేత్రస్థాయిలోని కొంత మంది ఏఈలు, జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లు గుట్టుగా కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. బిల్డర్లతో కుమ్మక్కై డిస్కం ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి కొడుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోని నిర్మాణాలకు కొత్త కనెక్షన్లు జారీ చేసే విషయంలో భారీ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు లేని భవనాలకు, అసైన్డ్/ప్రభుత్వ/ భూదాన్ భూముల్లో వెలుస్తున్న భారీ నిర్మాణాలకు గుట్టుగా కనెక్షన్లు జారీ చేస్తున్నారు. కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సమయంలో వినియోగదారుని ఫోన్ నంబర్ కాకుండా ఇతర నంబర్లు నమోదు చేయిస్తున్నారు. నెలవారీ బిల్లుల సమాచారం మాత్రమే కాదు సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య, లైన్ల పునరుద్ధరణ కోసం తీసుకుంటున్న ఎల్సీల వంటి సమాచారం వారికి చేరడం లేదు. అంతేకాదు మూడు నుంచి ఐదు కిలోవాట్ల డిమాండ్ ఉన్న వారికి కేవలం కిలోవాట్ కనెక్షన్ జారీ చేస్తున్నారు. తర్వాత లో ఓల్టేజీ సమస్య తలెత్తుతుండగా ఓల్టేజీ పెంపు పేరుతో సంస్థ నిధులను కొల్లగొడుతున్నారు.

బస్తీ పర్యటనలతో గుట్టు రట్టు

విద్యుత్ లైన్లు, తరచూ సాంకేతిక లోపాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించేందుకు ఇటీవల ఇంజనీర్లు బస్తీబాట పట్టారు. డైరెక్టర్లు సహా సీఎండీ వరకు ఇలా ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ క్రమంలో అక్రమాలను గుర్తించినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఏఈలతో సీఎండీ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లోనూ ఇదే అంశంపై ప్రధానంగా చర్చజరిగినట్లు తెలిసింది. కొంత మంది ఏఈలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. డిస్కం నుంచి నెలవారీ వేతనాలు తీసుకుంటూ గుట్టుగా కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన క్షేత్రస్థాయి ఏఈలు, జేఎల్‌ఎంలు, ఆర్టిజన్లపై కూడా దృష్టిసారించినట్లు తెలిసింది. ప్రజావసరాల కోసం డిస్కం స్టోర్ల నుంచి డ్రా చేసిన మెటీరియల్‌ను ప్రైవేటు అపార్ట్‌మెంట్లు/ సంస్థలకు తరలించిన వారిని సైతం గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారంటూ ఫిర్యాదు

తమపై కూడా దాడి జరిగిందంటున్న ఎక్సైజ్ పోలీసులు

జీడిమెట్ల: నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సోదరుడిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడిచేయించారని కుత్బుల్లాపూర్‌కు చెందిన పవన్ కుమార్ జీడిమెట్ల పోలీసులకు పిర్యాదు చేశారు. అదే విధంగా నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ సైతం తన విధులకు కొందరు అటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఇరువురి పిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- శనివారం రాత్రి ఓ యువకుడి గంజాయి,హష్ ఆయిల్ సేవిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. రెండవ వ్యక్తిని పట్టుకునేందుకు కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్‌కు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ దర్యాప్తు చేస్తుండగా స్థానికంగా ఉన్న హేమంత్, నితీష్, రవితేజ, చరణ్ పోలీసుల విధులకు అటంకం కలిగించారంటూ ఆమె జీడిమెట్ల ఠాణాలో పిర్యాదు చేశారు.
- శనివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు బాలు మహేందర్,హేమంత్ అనే ఇద్దరిని విచారణ చేస్తున్నారు. వెంకటేశ్వర నగర్‌కు చెందిన చంటియాదవ్ చూసి వారిని పట్టుకోవడానికి మీరెవరు అంటూ ప్రశ్నించాడు. దీంతో వారు దాడిచేశారని.. డాక్టర్లు 23కుట్లు వేశారని బాధితుడి సోదరుడు పవన్‌కుమార్ జీడిమెట్ల పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు ఇరు వర్గాల పిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వైద్యుడి అరెస్టు



పోసినపల్లి రాజేందర్‌రెడ్డి

ఫిలింనగర్: పెళ్లి జరిగిన విషయాన్ని దాచిపెట్టి యువతితో సహ జీవనం చేయడమే కాకుండా ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని అడగడానికి వెళ్లిన యువతిపై దాడి చేసిన వైద్యుడిని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లోని ఏషియన్ స్పైన్ హాస్పటల్‌లో బాచుపల్లికి చెందిన డాక్టర్ పోసినపల్లి రాజేందర్‌రెడ్డి (35) ఆర్థోపెడిక్ వైద్యుడిగా పని చేస్తున్నారు. 2024 సెప్టెంబర్‌లో మణికొండ పంచవటి కాలనీకి చెందిన డిజైనర్ (28)తో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఇద్దరూ కలిసి మణికొండలోని డిజైనర్ ఇంట్లోనే సహజీవనం చేస్తున్నారు. కాగా డాక్టర్ రాజేందర్‌రెడ్డికి అంతకు రెండేళ్ల క్రితమే వివాహం కాగా, ఆ విషయాన్ని దాచిపెట్టి డిజైనర్‌తో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని సదరు యువతి పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి రాజేందర్‌రెడ్డిని నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్యా తీవ్ర గొడవ జరగ్గా ఆమెను కొట్టడమే కాకుండా ఫోన్‌ను నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. ఎటూ వెళ్లకుండా కొద్దిసేపు ఆమెను అడ్డగించి వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు డాక్టర్ రాజేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏడేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన

అల్వాల్: ఏడేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం బాలాజీ రైస్ మిల్ సమీపంలో నివసించే ఖాసీం (27) శనివారం సాయంత్రం తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికకు తన ఇంట్లోని ఆక్వేరియం చూపిస్తానని తీసుకెళ్లి బంధించి అసభ్యంగా ప్రవర్తించాడు. కుమార్తె కనిపించకపోవడంతో బాధిత తల్లిదండ్రులు ఖాసీం ఇంట్లో ఉందని తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నింధితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

విద్యాశాఖ మంత్రిని నియమించండి

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయా లని ఏబీవీపీ చేవెళ్ల టౌన్ సంయుక్త కార్యదర్శి కె.వివేకానందరెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటంతో విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థుల సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. విద్యావ్యవస్థ పటిష్ఠతకు, మెరుగైన సౌకర్యాల కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరినట్లు స్పష్టం చేశారు. విద్యారంగాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఆయన సానుకులంగా స్పందించి తప్పకుండా ప్రభుత్వానికి సూచిస్తామని చెప్పారన్నారు.

❖ బోనం.. ఘనం

రంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల ఆదివారం బోనాల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువత తీన్మార్ స్టెప్పుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



యాచారం: కళాకారుల నృత్యాలు



కడ్తాల్: బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

క్రీడాకారులపై దాడి... తీవ్ర గాయాలు

చందానగర్ : ఇద్దరు క్రీడాకారులపై 8 మంది దాడి చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పాపిరెడ్డి కాలనీకి చెందిన రాథోడ్ యుగంధర్, కె.ఆదిత్యలు ఆదివారం సాయంత్రం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రన్నింగ్ చేసుకొని ప్రధాన గేటు వద్ద నిలబడి మాట్లాడుతున్నారు. కార్తీక్ అనే వ్యక్తితో పాటు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మీరు ఎక్కడి నుంచి వచ్చారు అని అడిగారు. యువకులు తాము గచ్చిబౌలి స్టేడియం నుంచి వచ్చామని తెలుపగా...మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు ఇది శాంతినగర్ మీరు ఎందుకు ఇక్కడికి వచ్చారు అని ఇష్టానుసారంగా తిడుతూ వారిపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా మరో ఐదుగురు యువకులను పిలిపించి తిరిగి దాడి చేశారు. అంతే కాకుండా క్రీడాకారుడు ఆదిత్య మెడలో వెండి చైన్ కూడా లాక్కున్నారు. దీంతో క్రీడాకారులు వెంటనే చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

– నిందితుల్లో ఆల్విన్ కాలనీ కార్పొరేటర్

సాక్షి, సిటీబ్యూరో : బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు పేకాట స్థావరం పై దాడి చేసి 11 మందిని ఆదివారం అరెస్టు చేశారు. నిందితుల్లో ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కూడా ఉన్నారు. వీరిని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన మేరకు.. కూకట్ పల్లి వైష్ణవి కాలనీలోని ఒక గెస్ట్ హౌస్ లో పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్టు చేసి రూ.3,62,000 విలువైన వస్తువులను సీజ్ చేశారు. ఇందులో రూ.2,52,000 నగదు, 11 సెల్ ఫోన్లు ఉన్నాయి. వీరిలో కొందరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బంధువులు కూడా ఉన్నట్లు సమాచారం.

సుప్రీం తీర్పునకు నిరసనగా జంతుప్రేమికుల ర్యాలీ



ఖైరతాబాద్: మనుషులతో సమానంగా భూమిపై జంతువులకు జీవించే హక్కు ఉందని, దానిని కాలరాసే హక్కు ఎవరికీ లేదంటూ ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు నిరసనగా ఆదివారం పీపుల్స్ ప్లాజా లవ్ హైదరాబాద్ నుంచి ఇందిరాగాంధీ చౌరస్తా వరకు జంతు ప్రేమికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసరా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వందన గౌరీ మాట్లాడుతూ మనుషులతో సమానంగా ఈ భూమిపై జీవించే హక్కు జంతువులకు ఉందని పేర్కొన్నారు. రోడ్లపై కుక్కలు కనిపించకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తున్నామని అన్నారు. దీనిపై న్యాయపరంగా పోరాడతామని, ఇప్పటికైనా సుప్రీంకోర్టు తమ తీర్పుపై పునరాలోచించాలని పేర్కొన్నారు.

హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య

ఇబ్రహీంపట్నం: హమాలీ కార్మికులకు హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వీరయ్య డిమాండ్ చేశారు. రైస్ మిల్లు హమాలీ కార్మికుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఒకటవ మహాసభను స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. రైస్ మిల్లు యాజమాన్యాలు కార్మికులకు సంవత్సరానికి రూ.7 వేల బోనస్, ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రెండేళ్లకు ఒకసారి అగ్రిమెంట్ రూపంలో కూలీ రేట్లు పెంచాలని కోరారు. అనంతరం హమాలీ కార్మికుల మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా దుర్గయ్య, కోశాధికారిగా జంగయ్య, ఉపాధ్యక్షులుగా జంగయ్య, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, రామ్‌రెడ్డి, జంగయ్య, ఆర్గనైజర్‌గా బుగ్గరాములు, పండిత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యోలమోని స్వప్న, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణలు!

- ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు యథేచ్ఛగా కబ్జా
- రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు

తుర్కయంజాల్: ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు పరాధీనం అవుతున్నాయి. అక్రమార్కులు రెచ్చిపోయి కబ్జాలకు ప్రయత్నిస్తున్నా అధికారుల చర్యలు తూతూ మంత్రంగా ఉంటున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం.. పనులను అడ్డుకోవడం వంటి పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంలో, భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయడంలో, వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దు రాళ్లు నాటుతుండగా..

తుర్కయంజాల్ రెవెన్యూ కమ్మగూడలోని సర్వే నెంబర్లు 227,228లో మను లే అవుట్‌లోని 871 గజాల భూమికి బై నంబర్లు వేసి డాక్యుమెంట్లు చేసిన వ్యక్తులు పలుమార్లు కబ్జాకు ప్రయత్నించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.5 కోట్ల విలువైన ఈ భూమి సాగర్ రహదారికి కూతవేటు దూరంలో ఉండడంతో కమర్షియల్ భవన నిర్మాణాలకు అనుకూలంగా ఉంటుంది. దీంతో అధికారులు ఎన్నిసార్లు ఆపడానికి ప్రయత్నించినా కబ్జాదారులు తమ ప్రయత్నాలు విరమించడం లేదు. తాజాగా వరుసగా సెలవులు రావడంతో ఇదే అదనుగా రెండు రోజుల క్రితం ప్లాట్లకు హద్దు రాళ్లను నాటుతుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. భవన నిర్మాణ అనుమతి కోసం గతంలో హెచ్‌ఎండీఏకు, మున్సిపాలిటీకి పలు మార్లు దరఖాస్తు చేసిన విచారణ సమయంలో తిరస్కరిస్తూ వచ్చారు. ఇటీవల అధికారులు 400 గజాల ప్లాటుకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హెచ్చరిక బోర్డుల తొలగింపు

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి రాగన్నగూడలోని సర్వే నంబర్లు 549, 551, 552లో 1984లో 55 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో శ్రీమిత్ర డెవలపర్స్ వారు వెంచర్‌ను చేసి ప్లాట్లు విక్రయించారు. ఆ సమయంలో ప్రజాప్రయోజనార్థం సుమారు మూడు ఎకరాల ఖాళీ స్థలాన్ని వదిలారు. ఇది హెచ్‌ఎండీఏ, డీటీసీపీ నుంచి అనుమతి వెంచర్ కాకపోవడంతో ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు మరో లే అవుట్‌ను సృష్టించి అమాయకులకు విక్రయించారు. దీనిపై వరుసగా మీడియాలో కథనాలు రావడం, పలువురు స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు నామమాత్రంగా బోర్డులు ఏర్పాటు చేయడం, తరువాత అక్రమార్కులు వాటిని తొలగించడం పరిపాటిగా మారింది. తాజాగా శ్రీశైలం అనే వ్యక్తి 600 గజాల భూమిలో ప్రహరీ నిర్మిస్తుండటంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మూడు ఎకరాల భూమికి సమీపంలో టీసీఎస్, ఔటర్ రింగ్ రోడ్డు వంటివి ఉండటంతో దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్ల పై మాటే.

4,211 గజాల భూమి ప్లాట్లుగా..

సర్వే నంబర్లు 501, 505,530, 533, 657, 658, 659, 660, 661, 662లోని శ్రీమిత్ర వెంచర్‌లో 9వేల 438 చదరపు గజాల స్థలాన్ని ప్రజా ప్రయోజనార్థం మొదటి లే అవుట్‌లో వదిలారు. ఖరీదైన భూమి కావడంతో అక్రమార్కులు 2013లో మరో లే అవుట్‌ను సృష్టించి కేవలం 2వేల గజాల వరకు ప్రజా ప్రయోజనార్థం వదిలారు. సుమారు 7,700 గజాల భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించారు.



ఓ లే అవుట్‌లో పనులు అడ్డుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

దీని విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.15 కోట్ల పైమాటే. ఫిర్యాదులు అందిన ప్రతిసారి అధికారులు బోర్డులు ఏర్పాటుచేయడం అనంతరం తొలగించడం యథావిధిగా మారాయి. ఇవే కాకుండా మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్, మన్నెగూడ, మునగనూర్, తొర్రూర్, కొహెడలోని అనేక పార్కులు, ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

“ చర్యలు తీసుకుంటాం



ప్రజా ప్రయోజనార్థం, పార్కుల కోసం వదిలిన భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కమ్మగూడలోని మను ఎన్‌క్లేవ్‌లోని భూమికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకుంటాం. శ్రీమిత్ర వెంచర్‌లోని స్థలాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– కె.అమరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

యూబీడీ సర్కిల్ మేనేజర్‌గా జ్యోత్స్న ప్రియదర్శిని



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 యూబీడీ(పార్కుల విభాగం) సర్కిల్ మేనేజర్‌గా జ్యోత్స్న ప్రియదర్శిని నియమితులయ్యారు. ఇప్పటి వరకు సర్కిల్–18లో విధులు నిర్వహించిన బాలయ్యను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. జ్యోత్సన ఇప్పటి వరకు సర్కిల్–17 మేనేజర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. జూబ్లీహిల్స్ సర్కిల్ వీవీఐపీ జోన్ కావడం వల్ల అనుభవజ్ఞులైన మేనేజర్‌ను నియమించాలనే ఉద్దేశంతో సర్కిల్–17లో విధులు నిర్వహించిన జ్యోత్స్నకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఖైరతాబాద్ సర్కిల్–17కు సైదులు యూబీడీ మేనేజర్‌గా నియమితులయ్యారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అంజన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నటరాజ్‌నగర్ బస్తీవాసులు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. నటరాజ్‌నగర్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులతో పాటు పలు సమస్యలను బస్తీ సంక్షేమ సంఘం నాయకులు సయ్యద్ సాదత్ అలీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు వివరించారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. స్పందిచిన అంజన్‌కుమార్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నేతలు ఖాజాపాషా, సర్దార్ మహ్మద్, ఎర్ర కృష్ణకుమార్, మహ్మద్ ఇస్మాయిల్, సమీయుద్దీన్ పాల్గొన్నారు.

స్పష్టమైన యువజన విధానాన్ని ప్రకటించాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన యువజన విధానాన్ని ప్రకటించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి నాగిళ్ల నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం యువజన విధానాలు ప్రకటించకుండా పదేళ్ల కాలాన్ని వృథా చేసిందన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలోని యువతకు ఏం చేయబోతున్నారు. యువతకు ఉపాధి స్వయం ఉపాధి మార్గాలు వంటి కల్పించడం ప్రభుత్వం అవసరమైన నిధులను రుణాలను బ్యాంకుల నుంచి తెప్పించేలా చర్యలు చేపట్టాలని నవీన్‌కుమార్ కోరారు. స్వయం సంఘాలకు జీరో వడ్డీ కింద రుణాలు అందజేస్తున్న ప్రభుత్వం విద్యావంతులైన నిరుద్యోగ యువత కూడా రుణాలు ఇప్పించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ఐదు లక్షల మంది యువతకు ఐదు లక్షల చొప్పున రాజీవ్ యువ వికాస్ పథకం కింద అందజేస్తామన్న ప్రభుత్వం ఎప్పట్లో వేస్తారు వెల్లడించాలని విన్నవించారు.

పార్కింగ్ విషయమై గొడవ

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

వెంగళరావునగర్: అకారణంగా వ్యక్తిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఎస్.నర్సింహమూర్తి సినిమా షూటింగ్‌లో పని చేస్తుంటాడు. ఈ నెల 16న తన వాహనాన్ని తాను ఉంటున్న భవనం లోపల పెట్టాలని యజమానికి ఫోన్ చేశాడు. . పానీపూరీ స్టాల్ యజమాని గురునాథ్ వాహనం ఉందని చెప్పాడు. ఆ వాహనాన్ని తీయాలని నర్సింహా మూర్తి కోరగా తన వాహనాన్ని తీయడం కుదరని దూషిస్తూ నర్సింహమూర్తిపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొక్కలు నాటిన కాలనీవాసులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ యూబీడీ సహకారంతో కాలనీలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పలు అపార్టమెంట్ల ఎదుట పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించుకోవడం ద్వారా కాలుష్యానికి దూరంగా ఉండవచ్చన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం మనందరి బాధ్యత అని, అది మొక్కలు నాటి వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు గ్రీన్ సిటీ సుబ్బరాజు, రాజశేఖర్‌చందు, సోమ వెంకట్, బిల్డర్ రాజా, రామసుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం

చేతికొచ్చేదెప్పుడో..?

అయోమయంలో అధికారులు

- నిరాశలో లబ్ధిదారులు
- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రోజూ యువత ఎదురుచూపులు



షేక్‌పేట మండల కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

బంజారాహిల్స్: యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దరఖాస్తులు సమర్పించి సమారుగా నాలుగు నెలలు కావస్తోన్నా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందుదామనుకున్న యువత ఆశలు, అడియాశలు అయ్యాయి. వాస్తవానికి గత జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉండగా ఆఖరు నిమిషంలో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రాయితీ రుణాల పంపిణీపై సందిగ్ధత నెలకొనడంతో దరఖాస్తుదారులు జీహెచ్‌ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం మొత్తం 36,728 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇందులో అన్ని ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత 6,366 మంది దరఖాస్తులు అర్హతకు నోచుకున్నాయి. వీటన్నింటినీ సంబంధిత అధికారులు ఆయా బ్యాంకులకు పంపించారు. బ్యాంక్ అధికారులు వీటిని మళ్లీ స్క్రూటినీ చేసి రుణాలకు అర్హత ఉన్నవారికే ఇవ్వాలని నిర్ణయించారు. ఈ ప్రకియ నిలిచిపోయింది.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే షేక్‌పేట, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావు నగర్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో 53,656 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల ధృవ పత్రాలను స్క్రూటినీ చేసిన అనంతరం 8,776 మంది దరఖాస్తులు అర్హతకు నోచుకున్నాయి. వీటన్నింటినీ సంబంధిత బ్యాంక్‌లకు పంపించారు.
- యువ వికాస పథకానికి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం రూ.50,000ల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీ రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందించడంతో చాలామంది రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్లకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. దరఖాస్తులను ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లో అధికారులు పరిశీలించారు. అంతకముందు క్షేత్రస్థాయిలో 360 డిగ్రీల కోణంలో దరఖాస్తులను పరిశీలించడం జరిగింది. చివరకు దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్, రుణ బకాయిలను తనిఖీ చేసి ఇచ్చిన నివేదికలు, స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన లబ్ధిదారుల జాబితా ఆధారంగా మండల, జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి తాత్కాలికంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకే లబ్ధిదారుల ఎంపిక తుది దశకు చేరుకునే అవకాశం ఉంది.

పాత దరఖాస్తులకు మోక్షమేదీ..?

గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో 16,600 మంది, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 22,000 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో చాలామందికి రుణాలు మంజూరు కాగా, ఆర్థిక శాఖలో పెండింగ్ కారణంగా డబ్బులు వారి ఖాతాల్లో జమ కాలేదు. వీరందరినీ రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా అటు పాత రుణాలు అందక, ఇటు యువ వికాసానికి అవకాశం లేక అసలైన లబ్ధిదారులు అన్ని అర్హతలు ఉండి కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. పాత రుణాలపై సంబంధిత అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రోజూ కార్యాలయాలకు వస్తున్న లబ్ధిదారులకు సమాధానం చెప్పలేకపోతున్నారు.

అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకట స్వామి

మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

రహమత్‌నగర్: అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ నాయకుడు బూత్ స్థాయిలో పనిచేయాలని మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి సూచించారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ ఆధ్వర్యంలో రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–2 కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీ ప్రతినిధులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాయకులు విబేధాలు మరిచి పార్టీ అభ్యర్థి గెలుపును ఛాలెంజ్‌గా తీసుకుని శ్రమించాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధిపై నివేదికలు రుపొందించడం జరుగుతుందన్నారు. పార్టీ నేతల మధ్య విబేధాలను హైకమాండ్ ముందు పరిష్కరించేందుకు తామంత కృషి చేస్తామన్నారు .మాజీ ఎంపీ, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అజ్హారుద్దీన్, ఎమ్మెల్యే పోడేం వీరయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయస్వామి, కార్పొరేటర్ సీఎన్. రెడ్డి, నాయకులు కిరణ్‌యాదవ్, మనోజ్ యాదవ్, జాఫర్ హుస్సేన్, నాగరాజు, మేఘన పద్మ, సువర్ణ, సుందర్, శివ పాల్గొన్నారు.

మంత్రి ముందే బాహాబాహీ..

రహమత్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సమావేశంలో రసాబాసగా మారింది. మంత్రి వివేక్ సమక్షంలో భవానీశంకర్, సీఎన్. రెడ్డి వర్గీయులకు తోపులాట జరిగింది. సీఎన్.రెడ్డి గోబ్యాక్ అంటూ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రక్షణగా నిలిచారు.

యూసుఫ్‌గూడలో..

యూసుఫ్‌గూడలో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, కార్పొరేషన్ల చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్, సంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించాలని ఏఐసీసీ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ గౌతమ్‌కు, మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు సైదులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తప్పుడు తడకగా జరిగిందని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని తెలిపారు. తప్పుడు రోస్టర్ విధానంతో మాలలు, మాల ఉపకులాలకు నష్టం జరిగేలా వర్గీకరణ చేపట్టారని, వెంటనే పునఃసమీక్ష చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత గడ్డం శ్రీనివాస్, కార్తీక్, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ నాయకులు

కాచిగూడ: ఆల్ ఇండియా ఓబీసీ జాతీయ సెమినార్‌లో పాల్గొనడానికి ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ నేతృత్వంలో ఆదివారం బీసీ నేతలు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నీలం వెంకటేష్ మాట్లాడుతూ... ఢిల్లీలో వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అధినేతలను కలిసి 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పోరాడాతామని అన్నారు. చట్టపరంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బంజారాహిల్స్: హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్న పేకాట రాయుళ్లు జూద గృహంగా మార్చగా సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు చేసి ఐదు మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో ఉన్న విజయలక్ష్మి హోటల్‌లో కొంతమంది పేకాటరాయుళ్లు వారం క్రితం ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల కళ్లుగప్పి గదినే జూద గృహంగా మార్చి పేకాడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడులు చేయగా ఐదుగురు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్ పీఎస్ పరిధిలో..

వెంగళరావునగర్: పేకాట ఆడుతున్న ఐదుగురిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. పోలీసులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలోని మిడ్‌టౌన్ గెస్ట్ హౌస్‌లో శనివారం రాత్రి ఐదుగురు పేకాట ఆడుతున్నట్టుగా తెలుసుకుని పోలీసులు చుట్టుముట్టారు. ఆ ప్రాంతానికి వెళ్లగా తన్నీరు స్వామి, ఎస్.గోపాల్, జి.చంద్రశేఖర్, బి.శ్రీనివాసులు, కె.రన్‌హుస్సేన్ పేకాట ఆడుతూ ఉన్నారు. వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న ఫోన్లు, రూ.3వేలు, పేకాట సెట్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మార్వాడి గో బ్యాక్ నినాదాన్ని ఖండిస్తున్నాం'

హిమాయత్‌నగర్: మార్వాడి గో బ్యాక్ నినాదాన్ని సామాజిక తెలంగాణ ఫోరం, స్మార్ట్ రేవ్ మీడియా ఆదివారం తీవ్రంగా ఖండించింది. ఆదివారం సంస్థల ప్రతినిధులు చైర్మన్ డా.హరికాంత్ చరణ్, కుమ్మరి మహేష్, తేజవత్ రవి మాట్లాడుతూ..దేశ పౌరులందరికీ ఏ ప్రాంతంలోనైన వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. గో బ్యాక్ నినాదం వెనుక ఎదో కుట్ర ఉంటుదని, కాబట్టి ప్రజలు, యువకులు, విద్యార్థులు భాగస్వాములై నష్టపోవద్దని సూచించారు. తెలుగాణ ప్రాంతం గంగా, జమున, తెహజీబ్‌కి ప్రతిక అన్నారు. ఇక్కడ కులం, మతం, ప్రాంతం అనే వైరుధ్యాలు, వైషమ్యాలు లేవన్నారు. ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకొని ఆదిరించిన గొప్ప సరస్కతి, చరిత్ర కలిగిన నేల తెలంగాణ అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న అమిత్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ నుంచి కల్పతరు, బ్రిగేడ్ గేటేడ్ కమ్యూనిటీ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి రోడ్డు విస్తరణతో పాటు పలు సమస్యలను తెలుసుకున్నారు. త్వరితగతిన రోడ్డు విస్తరణతో పాటు కాలనీవాసుల సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్పతరు మాజీ ప్రెసిడెంట్, అడ్వకేట్ చేకూరి హనుమంతనాయుడు, సురేష్, వెంకటేశ్వర్లు, శ్యామ్, హనుమంతరావు, రవిగౌడ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలం

సనత్‌నగర్: వివిధ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాల వేలం ఈ నెల 18న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహనరెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి సమక్షంలో ఈ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా తమ ఆధార్‌కార్డు కాపీ, పాన్‌కార్డు కాపీతో పాటు రూ.25,000 నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ముందుగా జమ చేసి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలో వాహనం పొందని వారికి ఇది తిరిగి ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 87126 59644 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీసీలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందని ఆరోపించారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించినా ఇంత వరకు రిజర్వేషన్లు కల్పించకుండా మౌనంగా ఉండడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదించినప్పటికీ రాష్ట్రపతి ఎంత వరకు ఆమోదముద్ర వేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను కేంద్రానికి పంపి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా చట్టబద్ధత కల్పించకపోవడం అంటే ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక ప్రభుత్వంగా నిదుర వేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆరోగ్యం, విద్యా రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది'



డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఫిలింనగర్: ఆరోగ్యం, విద్య రంగాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఫిలింనగర్‌లో ఏర్పాటుచేసిన 'వీ డెంట్స్'మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని, డాక్టర్లు ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే పవిత్రమైన బాధ్యతలను నెరవేరుస్తున్నారన్నారు. ఈ క్లినిక్‌లో ఉన్న ఆధునిక సదుపాయాలను డాక్టర్ వీరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సౌజన్యరెడ్డిలు ప్రజల ప్రయోజనానికి వినియోగించాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది మోహిత్‌కృష్ణ

ఫిలింనగర్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని సుప్రీంకోర్టు న్యాయవాది మోహిత్‌కృష్ణ పిలుపునిచ్చారు. మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, గ్రేటర్ అధ్యక్షుడు బత్తుల మధుసూదన్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోహిత్‌కృష్ణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ చూపిన బాటలో నడుస్తూ విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం సభ్యుడు భాస్కర్‌గౌడ్, మాల వెలుగు సంఘం సభ్యులు దండు మన్యం, మునేందర్, బాలస్వామి, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా గంగ తెప్పోత్సవం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–11లోని గౌరీశంకర్‌కాలనీలో బంజారాహిల్స్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగ తెప్పోత్సవం ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. వర్షాలు బాగా పడాలని, చేపలు బాగా పెరగాలని గంగమ్మ తల్లికి మొక్కు తీర్చుకునేందుకు గౌరీశంకర్‌కాలనీతో పాటు బంజారాహిల్స్ నలుమూలల నుంచి గంగపుత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి స్థానికంగా కొలువుదీరిన పోచమ్మ–మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తుండగా పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గౌరీశంకర్‌కాలనీ నుంచి గంగమ్మ పల్లకి, బోనాల ఊరేగింపు, శోభాయాత్ర గంగమ్మ గుడి వద్దకు చేరుకుని హుస్సేన్‌సాగర్‌లో గంగతెప్ప నిమజ్జనం చేశారు. అత్యంత ఆడంబరంగా ఉత్సాహంగా ఈ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు కంది రమేష్, ప్రధాన కార్యదర్శి బి.చందర్, కోశాధికారి కే దేవదాసు, సంయుక్త కార్యదర్శి ఎర్రబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల అనంతరం బోనాలతో వెళ్తున్న మహిళలు

శాంతియుతంగా చవితి ఉత్సవాలు జరుపుకుందాం

బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

సనత్‌నగర్: శాంతియుతంగా చవితి ఉత్సవాలు జరుపుకుందామని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి అన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాదాపు 250 మంది వినాయక మండప నిర్వాహకులతో ఆదివారం స్థానిక ఫంక్షన్ విల్లాలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా సహకరించాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా పోలీసు విభాగం తరుపున అక్కడ నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించిన సమయం నుంచి నిమజ్జనం పూర్తయ్యేవరకు నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలన్నారు. మండపాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేందుకు సులువవుతుందన్నారు. మండపాల వద్ద సేవా దృక్పథం ఉన్న వలంటీర్లను నియమించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు, భక్తులకు, సామాన్య ప్రజలకు అంతరాయం చూసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని తెలిపారు. డీజే సిస్టంల కారణంగా వృద్ధులకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున గణేశ్ ఉత్సవ సమితి వారు సహకరించాలన్నారు. లౌడ్‌స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. మండపాల వద్ద గానీ, ఊరేగింపులో గానీ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నవీన్, డీఐ శ్రీనివాస్, ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, గౌతమి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణలో భాగస్వాములవుదాం..

'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ' నెలకొల్పడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏసీపీ గోపాలకృష్ణమూర్తి కోరారు. డ్రగ్స్ కారణంగా ఎన్నో జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలంటే తల్లిదండ్రులు పాత్ర కీలకమన్నారు. పోలీసు తనిఖీల్లో డ్రగ్స్ వాడినట్లు, లేదా క్రయవిక్రయాలు జరిపినట్లుగా తేలినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

గోల్డెన్ టెంపుల్‌లో టీపీసీసీ చీఫ్ పూజలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గోల్డెన్ టెంపుల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామివారి చిత్రపటాలను బహూకరించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతలు కాటూరి రమేష్, మచ్చల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యూసీమాస్ పోటీలో అఖిల్‌కు బహుమతి



బౌద్ధనగర్: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 24వ జాతీయ స్థాయి యూసీమాస్ అబాకస్ పోటీల్లో పార్శీగుట్టకు చెందిన అఖిల్ నాలుగవ జాతీయ రన్నరప్‌గా నిలిచాడు. అఖిల్ డీడీ కాలనీలోని అకాడమిక్ హైట్స్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. అబాకస్ జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై పాఠశాల యాజమాన్యం అఖిల్‌ను అభినందించింది. పద్మారావునగర్‌లోని యూసీమాస్ శాఖలో అఖిల్ శిక్షణ పొంది ఈ ఘనత సాధించారు. ఈ విజయం అఖిల్ ప్రతిభకు నిదర్శనమని, మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు అందుకోవాలని అబాకస్ శిక్షణ అందించిన ఉపాధ్యాయురాలు లీలావతి ఆకాంక్షించారు.

కమీషన్ల కోసమే 'ఎక్సైజ్' ప్రమోషన్లకు బ్రేక్

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

హిమాయత్‌నగర్: ఎక్సైజ్ శాఖలో కమీషన్ల కోసమే పదోన్నతులు ఇవ్వకుండా కొందరు అధికారులు కుట్రలు చేస్తున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు. కమిషనర్ కార్యాలయంతోపాటు అన్ని జిల్లాలో ఖాళీ పోస్టులు ఉంటే కొత్త మద్యం పాలసీని ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 8 ఏళ్లుగా బదిలీలు జరగక ఎక్సైజ్ కానిస్టేబుళ్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. డీపీసీ గడువు ఈ నెల 31వ తేదీకి ముగుస్తుందని, అంతలోపు పదోన్నతులు ఇవ్వకుంటే మరో ఏడాదిపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఒక్క రోజులోనే ఫైల్‌ను పరిశీలించి పంపిస్తుంటే మంత్రి పేషీలో మాత్రం నెల రోజులు కావస్తున్నా అతీగతీలేదన్నారు. రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ల పోస్టింగులు సైతం నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని ఆరోపించారు. సమావేశంలో జేఏసీ నాయకులు గోటూరి రవీందర్ గౌడ్, గాలిగళ్ల సాయిబాబా, రేనట్ల మల్లేష్, దివాకర్ గౌడ్, యశ్వంత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఫెస్టివ్ ఎడిషన్ పేరిట సూత్ర ది ఇండియా ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'ది గోలి మార్ ఎడిషన్'పేరిట హై లైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

యువత గుండె గుభేల్

18–40 వయసు వారిలో పెరిగిన కార్డియాక్ అరెస్టులు	ఐడీసీతో హార్ట్ బీట్‌ను క్రమబద్ధీకరించే అవకాశం	సీపీఆర్‌పై పాఠశాల దశ నుంచే అవగాహన అవసరం	కార్డియాక్ అరెస్టుల నేపథ్యంలో వైద్యుల సూచనలు

రెండురోజుల క్రితం ఉప్పల్‌లో బ్యాడ్మింటన్ ఆడుతూ 25 ఏళ్ల యువకుడు కుప్పకూలిపోయాడు. నిమిషాల వ్యవధిలో ఆసుపత్రికి తీసుకెళ్లినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఇటీవల రాష్ట్ర హైకోర్టులో మాజీ స్పెషల్ జీపీ పర్సా అనంత నాగేశ్వర్ రావు అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఆసుపత్రికి వెళ్లేలోపే ప్రాణాలు విడిచారు. జిమ్‌లో వ్యాయామం చేస్తూ, ఆటలు ఆడుతూ, డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కార్డియాక్ అరెస్ట్‌తో చాలా మంది తుదిశ్వాస విడుస్తున్నారు.



ఈఏడీ పరికరం



సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్: కార్డియాక్ అరెస్ట్ అనే పదం వింటేనే జనం గుండెలు గుభేలుమంటున్నాయి. ఎప్పుడొస్తుందో చెప్పలేం. ఆసుపత్రికి తీసుకెళ్లే సమయమూ ఇవ్వడంలేదు. చిన్నారులు, యువత కూడా కార్డియాక్ అరెస్టు బారినపడి తనువు చాలిస్తున్నారు. నిపుణుల విశ్లేషణ ప్రకారం 18–44 సంవత్సరాల వయసు గల వారిలో స్ట్రోక్ కేసులు 14.6 శాతం పెరిగాయి. 45–64 వయస్సు వారిలో ఈ పెరుగుదల 15.7% గా ఉంది. గతంలో 50 ఏళ్లు పైబడిన వారిలో కార్డియాక్ అరెస్టు వచ్చేది. గత కొన్నేళ్లుగా 18–44 ఏళ్ల మధ్య వయసు వారిలో కార్డియాక్ అరెస్టు ఎక్కువగా కనిపిస్తోంది. కార్డియాక్ అరెస్ట్ వచ్చే ముందుగా ఒక్కసారిగా గుండె కండరాల థిక్‌నెస్ పెరిగిపోతుంది. మరికొన్ని సందర్భాల్లో హార్ట్ రేట్‌లో తేడా వస్తుంది. ఒక్కోసారి గుండెనొప్పి వచ్చి 15 నిమిషాల్లో తగ్గిపోతుంది. కళ్లు తిరగడం, నీరసంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇటువంటి సమయంలో ఆలస్యం చేయకుండా ఈసీజీ, 2 డీ ఎకో తీయించుకోవడం మంచిది.

కుటుంబ సభ్యులకు ప్రమాదం..

కార్డియాక్ డెత్ సంభవించిన కుటుంబసభ్యుల్లోనూ హార్ట్‌స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. లాంగ్ క్యూటీ సిండ్రోమ్, బ్రుగాడో సిండ్రోమ్ వంటి జన్యుపరమైన సమస్యలు ఉంటాయి. ఏదైనా కుటుంబంలో కార్డియాక్ బాధితులుంటే, ఆ ఇంట్లోని చిన్న, పెద్ద అందరూ పరీక్షించుకోవాలని హెచ్చరిస్తున్నారు.

హార్ట్‌బీట్‌ను క్రమబద్ధీకరించొచ్చు



కార్డియాక్ అరెస్టును ముందుగా గుర్తిస్తే ఇంప్లాంటబుల్ కార్డియోవర్టర్ డీఫిబ్రిలేటర్ అనే పరికరం వినియోగించి హార్ట్ బీట్‌ను క్రమబద్ధీకరించొచ్చు. ఇప్పటికే విమానాశ్రయాలు, పేరున్న మాల్స్‌లో చిన్నపాటి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చే ఈఏడీ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కమ్యూనిటీల్లోనూ ఏర్పాటు చేసుకోవాలి. శరీరానికి వ్యాయామం అవసరం. ఆహారపు అలవాట్లను పునఃపరిశీలించుకోవాలి.

– డా.భార్గవి, కార్డియాలజిస్ట్, రెయిన్‌బో హార్ట్ ఇనిస్టిట్యూట్

కార్టిసాల్‌తో గుండెకు ప్రమాదం

వేగంగా మారుతున్న జీవితంలో ఆరోగ్య పరీక్షలు, హెచ్చరికలను యువత నిర్లక్ష్యం చేస్తోంది. ఇదే యువతను ఊహించని విధంగా ప్రభావితం చేస్తుంది. తలనొప్పి, నీరసం, చూపు తగ్గడం వంటివాటిని గమనిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. శారీరక మానసిక ఒత్తిడితో కార్టిసాల్ అనే హార్మోన్ పెరిగి, గుండెకు, రక్తనాళాలకు హానికరంగా మారుతుంది. కోవిడ్ తరువాత శరీరంలో ఏర్పడే ఇన్‌ఫ్లమేషన్, బ్లడ్ క్లాట్స్ వల్ల స్ట్రోక్ ప్రమాదం పొంచి ఉంది.

– డాక్టర్ మనోజ్ వాసిరెడ్డి, హార్ట్ స్ట్రోక్ నిపుణులు

ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధత కల్పించాలి

– ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి వైద్యం చేసుకునేందుకు చట్టబద్ధత కల్పించాలని ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మన హెల్త్ ఇండియా, విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ వైద్యుల సమస్యలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని, ఆర్ఎంపీ, పీఎంపీల డాక్టర్లకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. గ్రామీణ వైద్యులు ప్రజలతో సంబంధాలను పెంచుకొని వారి మద్దతుతో డిమాండ్లను సాధించుకోవాలని సూచించారు. వైద్యసేవలు అందించే క్రమంలో చట్టాన్ని అతిక్రమించవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్, మన హెల్త్ ఇండియా చీఫ్ ఎడిటర్ మీరాల రాజేందర్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, గుజరాత్ ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం అధ్యక్షుడు సీఎస్‌రావు, బీహార్ అధ్యక్షుడు హెచ్‌పీ సింగ్, కర్ణాటక నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలి

సెట్విన్ మాజీ చైర్మన్ మీర్ ఇనాయక్ అలీ బాక్రి


మాట్లాడుతున్న మీర్ ఇనాయక్ అలీ బాక్రి

హిమాయత్‌నగర్: హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోలను వెంటనే నిషేధించాలని సెట్విన్ మాజీ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం హైదరాబాద్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలో రెండు లక్షల ఆటో పర్మిట్‌లు, ఉంటే ఇతర జిల్లాలకు చెందిన నాలుగు లక్షల ఆటోలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా రాపిడో, ఓలా, ఉబర్ బైక్‌లను వెంటనే నిషేధించి, మీటర్ రేట్లు, చార్జీలు పెంచాలని కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు వినతిపత్రాలు కూడా అందజేశామని పేర్కొన్నారు. సమావేశంలో అక్రమ్‌ఖాన్, షేక్ మాజిద్, చంద్రశేఖర్, అష్రాఫ్ హుస్సేన్, షేక్ సాజిద్, మహమ్మద్ మోహిన్, మహబూబ్ హుస్సేన్, అల్లా బకాస్, అజార్ గౌరీ, ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

రిఫరీల తీర్పు నైపుణ్యాలను మెరుగుపర్చాలి

రాష్ట్ర యోగాసన సంఘం సలహాదారు మనోహర్‌కుమార్



సాక్షి, సిటీబ్యూరో: యోగాసనాల పోటీల్లో రిఫరీల తీర్పు నైపుణ్యాలను మెరుగుపర్చాలని, సాంకేతిక జ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర యోగాసన క్రీడా సంఘం సలహాదారు మనోహర్ కుమార్ అన్నారు. ఆదివారం తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్ర స్థాయి యోగాసన రిఫరీల రిఫ్రెషర్ కోర్స్ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం యోగా హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసన పోటీల నిర్వహణలో ఆధునిక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. రాబోయే తరాలకు అనుగుణంగా రిఫరీలు సరికొత్త సాంకేతికతలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రిఫరీలు(జడ్జీలు) తాజా నిబంధనలు, మూల్యాంకన విధానాలు, యోగాసన రిఫరింగ్‌లోని ఉత్తమ పద్ధతులపై జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. ఎన్.రెడ్డి, రాష్ట్ర యోగాసన క్రీడా సంఘం సలహాదారు జె.మనోహర్‌కుమార్, స్పోర్ట్స్ యోగ కోచెస్ ఆర్.ప్రసన్న, కుమారస్వామి, రిసోర్స్ పర్సన్స్ మనోజ్‌కుమార్, జె. రాజు, సీహెచ్ జయశంకర్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల రిఫరీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంత్యోత్సవాలు


కూచిపూడి నృత్య కళాకారిణులతో ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

సనత్‌నగర్: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో 66వ శ్రీకృష్ణ జయంత్యోత్సవాలు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 1960లో యల్లావుల కోటేశ్వరరావు యాదవ్, సింగిడి బాలయ్యయాదవ్ ప్రారంభించిన శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ప్రతియేటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే ఈ ఏడాది సైతం రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు పుట్ట సుధాకర్ యాదవ్, బీద రవిచంద్ర, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కోట నీలిమ, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ దామోదర్‌సింగ్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

హెచ్‌పీఎస్‌కు పూర్వ విద్యార్థుల విరాళం రూ.300 కోట్లు!

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో చదివి దిగ్గజ కంపెనీలకు సీఈఓలుగా ఎదిగిన పలువురు తమ స్కూల్ రుణం తీర్చుకునేందుకు ముందుకొచ్చారు. ఏకంగా రూ.300 కోట్ల విరాళం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ ఫండ్స్ ద్వారా మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చాలని భావిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ప్రపంచ బ్యాంక్ గ్రూప్ చైర్మన్ అజయ్ బంగా, ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ చైర్మన్ ప్రేమ్ వాట్సాలు అంత పెద్ద మొత్తాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.

లిడ్‌క్యాప్ భూములను రక్షించుకుంటాం

ఓయూ సదస్సులో మంద కృష్ణమాదిగ


మందకృష్ణను సన్మానిస్తున్న చర్మకారుల సంఘం నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: గచ్చిబౌలి లిడ్‌క్యాప్ భూములను రక్షించుకుంటామని, తెలంగాణ చర్మకారుల సంఘం పోరాటాలకు అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం సెమినార్ హాలులో తెలంగాణ చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో లిడ్‌క్యాప్ భూముల ఆక్రమణలపై సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమానికి సంఘం చైర్మన్ డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ అధ్యక్షత వహించగా మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల డిక్లరేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలోని లిడ్‌క్యాప్ భూముల్లో పరిశ్రమలను స్థాపించి మాదిగ, మాదిగ ఉపకులాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లెదర్ హబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మంద కృష్ణను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మొలుగు రాజు, పల్లెల వీరస్వామి, సాయిబాబా, రాంబాబు, జాన్ దర్శనం, ఓయూ నేతలు డా.మాడుగుల నరసింహ, డా.కొత్తపల్లి తిరుపతి, డా.రవికుమార్, వలిగొండ నరసింహ, శ్యాంసన్, గుమ్మడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ టెంపుల్‌లో శ్రీనందోత్సవం


శ్రీనందోత్సవంలో 1,008 రకాల నైవేద్య పదార్థాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఆదివారం శ్రీనందోత్సవం వైభవంగా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా హరేకృష్ణ మూవ్‌మెంట్(ఇస్కాన్) స్థాపకాచార్యులు, విశ్వగురు శ్రీల ప్రభుపాదుల 129వ వ్యాసపూజ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీల ప్రభుపాదుల శిష్యులు, భక్తులు వారికి 1,008 రకాల నైవేద్య పదార్థాలను సమర్పించారు. ఈ వేడుకలో వ్యాసపూజ–2025 పుస్తకాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యగౌర చంద్రదాస ప్రభూజీ మాట్లాడుతూ ప్రభుపాదుల ఆచరణ, బోధనలు నేటికీ కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. చివరగా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఫారెస్ట్ అకాడమీలో శ్రీగంధం మొక్కల విక్రయం



సుభాష్‌నగర్: దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శ్రీ గంధం మొక్కలు విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు అకాడమీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ ఒక ప్రకటనలు తెలిపారు. శ్రీ గంధం అధిక ఆర్థిక విలువల కలిగిన వృక్షమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో ఉపయోగపడే చెట్టు అని పేర్కొన్నారు. పొలాల్లో, పల్లెల్లో, పట్టణ ఉద్యాన వనాల్లో విస్తృతంగా సాగు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పంట సాగుకు ఎర్రటి ఇసుక నేల, వైవిధ్యం గల వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరగలేదని తెలిపారు. ఒక మొక్కకు రూ.20 ధర నిర్ణయించారు. ఈ అవకాశాన్ని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 85007 71349, 97034 33429 కు సంప్రదించాలని కోరారు.

ఉద్యమంగా బహుజన బతుకమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఊరురా, వాడవాడలా బహుజన బతుకమ్మ వేడుకను ఉద్యమంగా జరుపుకుందామని బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ విమలక్క పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలో బతుకమ్మ నిర్వహణ కమిటీ సమాలోచన సభ జరిగింది. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రకృతి విధ్వంసమంటే ప్రజలపై ఉద్యమమేనంటూ శాంతి, స్వాలంబనను చాటుతామని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో అడవులు ధ్వంసం చేయడం, ఆదివాసీల హక్కులను కాలరాయడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ లక్ష్మీ, కట్ట భగవంత్‌రెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు మల్సూర్, పోతుల రమేష్, రాకేష్, సురేష్, సదానందం, వై.మల్లేషం, లావణ్య, మన్నారం నాగరాజు, కోలా జనార్దన్, బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో క్యూలైన్లకు చెల్లు

స్కాన్ చేయాలి.. ఓపీ చిట్టీ పొందాలి

- 'అభా'తో ఆరోగ్య రికార్డులు భద్రం
- నమోదు చేసుకుంటే 14 అంకెల డిజిటల్ హెల్త్ ఐడీ
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాక్సెస్‌కు వెసులుబాటు

- సికింద్రాబాద్‌కు చెందిన వెంకటేశం తీవ్ర జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ఓపీ చిట్టీ కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డాడు. జ్వరం ఎక్కువై మరింత అస్వస్థతకు గురయ్యాడు.
- నిజామాబాద్‌కు చెందిన భూక్యానాయక్ నగరంలో పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. తరచూ మూర్ఛ వ్యాధికి గురవుతుంటాడు. ఓ రోజు హఠాత్తుగా కిందపడి కాళ్లు, చేతులు కొట్టుకోవడంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అభా నంబరు ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించడంతో కొద్దిసేపటికే కోలుకున్నాడు.



గాంధీఆస్పత్రి : ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి 'ఆయుష్మాన్ భారత్'అభయహస్తం అందిస్తోంది. ఓపీ చిట్టీ కోసం గంటల తరబడి క్యూలో నిల్చొని అవస్థలు పడే పరిస్థితికి క్యూఆర్ కోడ్‌తో ఫుల్‌స్టాప్ పెట్టింది. తక్షణం వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే క్షణాల వ్యవధిలో ఓపీ చిట్టీ మీ చేతుల్లో ఉంటుంది. కౌంటర్‌లో అభా నంబరు ఎంటర్ చేస్తే అప్పటివరకు మీకు అందించిన వైద్యసేవలు, మందులతోపాటు సమగ్ర వివరాలను దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.

పౌరులందరికీ డిజిటల్ హెల్త్ ఐడీ...

ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలను త్వరితగతిన అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా డిజిటల్ హెల్త్ ఐడీని అందించాలని 2021లో నిర్ణయించింది. దీనిని నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్ఏ) అమలు చేస్తోంది. ప్రతిఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ–అభా) ద్వారా ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేస్తూ 14 అంకెల యూనిక్ నంబర్ కేటాయిస్తుంది.

అభా నంబర్‌ను ఇలా క్రియేట్ చేసుకోండి...

గూగుల్ ప్లేస్టోర్ నుంచి అభా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. పేరు, చిరునామా, ఆధార్, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ తదితర వివరాలతో సబ్‌మిట్ చేయాలి. క్రియేట్ న్యూ అభా అడ్రస్ ద్వారా సొంత ఐడీని క్రియేట్ చేసుకుని పాస్‌వర్డ్ పెట్టుకుని, అభా యాప్ ద్వారా లాగిన్ అవ్వాలి. ఏబీడీఎం.జీవోవీ.ఇన్ ద్వారా కూడా అభా నంబరు పొందవచ్చు. ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే టోకెన్ నంబరు వస్తుంది. కౌంటర్ వద్దకు వెళ్లి టోకెన్ నంబరు చూపిస్తే అస్వస్థత, అనారోగ్య వివరాలు తెలుసుకుని సంబంధిత విభాగానికి రిఫర్ చేస్తూ ఓపీ చిట్టీ అందిస్తారు.

ప్రతిఒక్కరూ నమోదు చేసుకోవాలి



ప్రతిఒక్కరు అభా యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ పథకం అమలవుతోంది. గాంధీఆస్పత్రిలో ఇప్పటివరకు సుమారు 3 లక్షల వరకు రోగుల వివరాలు ఆబా యాప్‌లో పొందుపర్చాం. ఈఎన్‌టీ, ఆప్తమాలజీ విభాగాల్లో జరిగే వైద్యపరీక్షల పూర్తి వివరాలు యాప్ ద్వారా పీడీఎఫ్ ఫైల్ రూపంలో రోగులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇతర విభాగాలకు త్వరలోనే వర్తింపజేస్తాం.

– డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, గాంధీ అభా నోడల్ ఆఫీసర్

14 అంకెల నంబరుతో లాభాలు ఎన్నో...

క్యూలైన్లలో గంటల తరబడి నిల్చోకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షణాల వ్యవధిలో సులభంగా అవుట్ పేషెంట్(ఓపీ) చిట్టీ పొందవచ్చు. వైద్యుడు అందించే వైద్యసేవలు డిజిటలైజేషన్ అవుతాయి. దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా ఒక్క క్లిక్‌తో పూర్తి వివరాలు పొందవచ్చు. గతంలో అందించిన వైద్యవివరాలను మరో డాక్టర్ చూసి మరింత మెరుగైన వైద్యం అందించే వెసులుబాటు కలుగుతుంది.

నైపుణ్యాలు ఉంటేనే విజయాలు

– 'అనుసంధాన్'సీఈవో కల్యాణరామన్



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని వృత్తి విద్య శిక్షణను పూర్తి చేసుకున్న వారికి ఆదివారం గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివకుమార్ కల్యాణరామన్ మాట్లాడుతూ సాంకేతికతతో ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతోందని, నైపుణ్యతతో విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. వృత్తిపరంగా పురోగతి సాధించడానికి వర్కింగ్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ రాంగోపాల్‌రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు నిత్య పరిశోధకులుగా పనిచేయాలన్నారు. వృత్తి విద్య నిపుణులు 1,050 మంది ప్రత్యక్షంగా, 7400 మంది వర్చువల్‌గా విద్యనభ్యసించారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ డైరెక్టర్ సుందర్, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం, బిట్స్ పిలానీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 18, ఆగస్టు, 2025

రమణీయం కూచిపూడి నృత్యం

గన్‌ఫౌండ్రీ : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఎస్వీస్ కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ హేమ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అహూతులను ఆకట్టుకున్నాయి. గోదా కళ్యాణం, ముద్దుగారే యశోద వంటి పలు అంశాలపై చిన్నారుల ప్రదర్శించిన భక్తి రసభరిత కృతులు అలరించాయి. ఈ సందర్భంగా గాయకురాలు డాక్టర్ శోభారాజు మాట్లాడుతూ చిన్నారులు ఎంతో చక్కగా తమ ప్రతిభను ప్రదర్శించారని, రానున్న రోజుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ శిష్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





అలరించిన 'కృష్ణ ఉత్సవ్'..

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు, ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సుల్తాన్ బజార్ యంగ్ ఇంప్రూవ్‌మెంట్ హాలులో జరిగిన 'కృష్ణ ఉత్సవ్–2025' విశేషంగా అలరించింది. వైడిఐ ఈవెంట్స్ అండ్ వెడ్డింగ్స్ ఆధ్వర్యంలో యశ్ జోషి నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్ ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు యశ్ జోషి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 65 మంది చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గార్గి శర్మ, సందీప్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ధృవ్ జోషి, యశికా శర్మ, ఉత్తమ రాధా, కృష్ణులుగా ఎంపికయ్యారు.

యుసీఎంఏఎస్ జాతీయ స్థాయి పోటీల్లో..

చాంపియన్‌గా అమీహరిదాస్

- పోటీలకు దేశవ్యాప్తంగా 6వేల మంది హాజరు
- అందరూ 6 నుంచి 13 యేళ్ల మధ్య వయసు విద్యార్థులే
- వివిధ కేటగిరీల్లో 1500 మంది విజేతలకు ట్రోఫీలు ప్రదానం



రాయదుర్గం : యుసీఎంఏఎస్(యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థిమెటిక్ సిస్టమ్)–2025 జాతీయ స్థాయి పోటలకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 6వేల మంది హాజరయ్యారు. ఇందులో ముంబయికి చెందిన అమీహరిదాస్ ముండే విజేతగా నిలిచాడు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 1500 మందికి యుసీఎంఏఎస్ ఇండియా అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ స్నేహల్ కారియా ట్రోఫీలు అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్నవారందరూ 6 నుంచి 13 యేళ్ల లోపువారే కావడం గమనార్హం. మొత్తం 6వేల మంది హాజరుకాగా ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుంచి 2,500 మంది హాజరయ్యారు. ఇందులో తెలంగాణ నుంచి వెయ్యి మంది పాల్గొనడం విశేషం.

సందడిగా స్టేడియం..

గణిత ప్రతిభావంతులు వారి తల్లిదండ్రులతో జీఎంసీ బాలయోగి స్టేడియం సందడిగా మారింది. పోటీల్లో పాల్గొన్న వారిలో 1500 మందికి నిర్వాహకులు వివిధ కేటగిరీల్లో ట్రోఫీలు అందజేశారు. అనంతరం పలువురుని సన్మానించారు. వేలాది మంది ఒకే వేదికపై చేరి తమలోని గణిత నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించడం అభినందించదగ్గ విషయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా చాంపియన్‌తోపాటు విజేతలందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు యుసీఎంఏఎస్ నిర్వాహకులు పాల్గొన్నారు.



గ్రీన్ గణేశాయ నమః..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలకు దూరంగా

పండుగ పచ్చగా.. ప్రకృతి మెచ్చగా..	పర్యావరణహితమే లక్ష్యంగా అడుగులు	నగరవాసుల్లో పెరుగుతున్న అవగాహన	'కలెక్టివ్ ఇమర్షన్' కాన్సెప్ట్ దిశగా ప్రయత్నాలు	అవగాహన కల్పిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థలు

మట్టి గణేశ విగ్రహాలు, విత్తన గణేశ విగ్రహాలకు గిరాకీ

నగరంలో నిర్వహించే వేడుకల్లో అతిపెద్దది, ప్రధానమైనది వినాయక చతుర్థి. మరికొద్ది రోజుల్లో నగరంలో గణేశ ఉత్సవాల సందడి ప్రారంభం కానున్న నేపథ్యంలో 'గ్రీన్ గణేశ' కాన్సెప్ట్ తెరపైకి వచ్చింది. గత కొంతకాలంగా పర్యావరణహిత ఉత్సవాలపై అవగాహన పెరిగినప్పటికీ పూర్తిస్థాయి ఎకో ఫ్రెండ్లీ దిశగా నగరం ముందుకు కదులుతోంది. ఇందులో భాగంగా పర్యావరణానికి మేలు చేసేలా విగ్రహాలు, ఉత్సవాలకు సంబంధించిన ఇతర ఉత్పత్తులను, అలంకరణ సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నారు.

మట్టితో మమేకమయ్యేలా..

వినాయకుడు అంటేనే ప్రకృతి హితుడు. ప్రకృతో మమేకమయ్యి జరుపుకునే ఉత్సవమే వినాయక చతుర్థి. పండుగ అర్థం.. పరమార్థం కూడా అదే.. అందుకే వినాయకునికి పెట్టే పత్రి కూడా ప్రకృతికి సంబంధించినవే ఉంటుంది. అందుకే మట్టి గణపతులనే వినియోగించాలని గత కొన్నేళ్లుగా పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చేసిన కృషి ఫలితంగా పూర్తిగా పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) నివారించకపోయినా.. మెజారిటీ ప్రజలు మట్టి గణపతులనే ఆరాధిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. చాలా మంది పండుగ పచ్చగా.. ప్రకృతి మెచ్చగా అన్నట్లు ప్రకృతి సహజ సిద్ధంగా లభ్యమయ్యే ఆకులు, పూలతోనే అలంకరణ చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారు.

గణేశ చతుర్థి సమీపిస్తోంది. నగరంలో ఇప్పటికే వినాయ విగ్రహాల సందడి మొదలయ్యింది.. అయితే నగరవాసుల్లో పర్యావరణ పరిరక్షణపై పెరుగుతున్న అవగాహన మట్టి గణపతులవైపు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తోంది. పండుగ పచ్చగా.. ప్రకృతి మెచ్చగా అన్నట్లు విత్తన గణేశులు తయారీ వైపు అడుగులు వేస్తున్నాయి పలు సంస్థలు. దీనికి తోడు పలు గేటెడ్ కమ్యూనిటీలు 'కలెక్టివ్ ఇమర్షన్' కాన్సెప్ట్‌తో ఇప్పటికే ప్రణాళికలు రచిస్తున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర పర్యావరణ హాని చేకూర్చే రసాయనాలు, రంగులు అద్దిన విగ్రహాలకు దూరంగా ఉండాలనే ఆలోచన చేస్తున్నారు నగరవాసులు. పండుగ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించే దిశగా అడుగులు వేయాలని పర్యావరణ నిపుణులు సైతం సూచిస్తున్నారు..

– సాక్షి, సిటీబ్యూరో



ఆలోచనలు అంకురించి..



పర్యావరణం పట్ల ప్రజల్లో పెరుగుతున్న అవగాహన రీత్యా పలు సంస్థలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. మట్టితో తయారు చేసిన విగ్రహాల్లో విత్తనాలను ఉంచుతున్నారు. పండుగ పూర్తయ్యాక వీటిని బయటి చెరువుల్లో నిమజ్జనం చేయాల్సిన పనిలేకుండా పెరడులోనే ఉంచుకునే విధంగా ప్రతిమలను తయారు చేస్తున్నారు. మట్టి విగ్రహాలను కుండీల్లో ఉంచి నీరు పోయడం ద్వారా అందులో ముందుగానే ఉంచిన విత్తనాలు మొలకెత్తుతాయి.. ప్రకృతి ప్రేమికులకు అనుకూలంగా వారు మెచ్చే రీతిలో కావాల్సిన విత్తనాలతో వీటిని తయారుచేసి అమ్ముతున్నారు. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకూ వీటికి ఆకర్షితులవుతున్నారు. కొన్ని సంస్థలైతే వీటికి ఉపయోగించే కుండీలను కూడా సహజసిద్ధంగా ప్రకృతిలో దొరికే చెక్క, వేర్లు, ఇతర పీచుతో తయారు చేస్తున్నారు. విగ్రహంతోపాటే వీటినీ అమ్మకానికి ఉంచుతున్నారు.

కలెక్టివ్ ఇమర్షన్ వైపు అడుగులు..

నగరంలో ఏటా విగ్రహాల నిమజ్జనానికి భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ పరిస్థితి వారం రోజులకు పైగా కనిపిస్తుంది.. దీన్ని సైతం నివారించేందుకు కొన్ని గేటెడ్ కమ్యూనిటీలు 'కలెక్టివ్ ఇమర్షన్' వైపు అడుగులు వేస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లోని ఇళ్లల్లో ఏర్పాటు చేసే ప్రతిమలు మట్టివే ఉండాలని, వీటిని పండుగ పూర్తయ్యాక ఆ కమ్యూనిటీల్లోనే ఒకే ప్రదేశంలో నిమజ్జనం చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. వీరికి అనుకూలంగా స్టార్టప్స్, పర్యావరణ సంస్థలు గ్రీన్ గణేశుడి విగ్రహాల తయారీకి ముందుకొస్తున్నాయి. చార్మినార్, కూకట్‌పల్లి, బేగంపేట వంటి ప్రాంతాల్లో ప్రత్యేక స్టాళ్లు, ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫాంల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని ఎన్‌జీవోలు మట్టి ప్రతిమలను పబ్లిక్ ప్రదేశాలు, పార్కులు, మాల్స్‌లో ఉచితంగా అందిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.



సామాజిక మాధ్యమాలు, స్వచ్ఛంద సంస్థలు..

ఇప్పటికే పండుగ నిర్వహణపై ప్రచారం ఊపందుకుంది. ఓ వైపు సామాజిక మాధ్యమాలు, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు దీనికి ఊతమిస్తున్నాయి. కొన్ని సంస్థలు పాఠశాలలు, కళాశాలలు, ప్రయివేటు కార్యాలయాల్లో మట్టి ప్రతిమల తయారీపై వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో సైతం దీనికి సంబంధించిన వీడియోలు విస్తృతంగా చెక్కర్లు కొడుతున్నాయి. ప్రకృతి నుంచి లభ్యమయ్యే వస్తువుల నుంచి కూడా వినాయకుని విగ్రహాలు తయారీ చేసే క్రాఫ్ట్స్‌పైనా శిక్షణనిస్తున్నారు పలువురు ఔత్సాహిక కళాకారులు. మొత్తానికి గ్రీన్ గణేశ కాన్సెప్ట్ ప్రచారం భారీగానే జరుగుతున్నా.. అమలులో ఏమాత్రం విజయం సాధిస్తామో వేచిచూడాలి అంటున్నారు విశ్లేషకులు.

'సితారే'లో సంయుక్త..

త్వరలోనే ప్రేక్షకుల ముందుకు | సినీతార సంయుక్త మీనన్



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు ప్రేక్షకుల ముందుకు త్వరలో ఓ ప్రాజెక్టుతో వస్తున్నానని, మహిళల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేది అలంకరణేనని, ఇందులోనూ ముఖ్యంగా బంగారం, వజ్రాల ఆభరణాలు కీలక పాత్ర పోషిస్తాయని సినీతార సంయుక్త మీనన్ అన్నారు. తన సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరవ్వడం సంతోషంగా ఉందని నగరంలోని సితారే గోల్డ్ అండ్ డైమండ్స్ వేదికగా అన్నారు. చందాపూర్‌లో ఏర్పాటు చేసిన మొదటి షోరూమ్‌ను ఆమె ప్రారంభించారు. వరల్డ్ క్లాస్ యాంబియన్స్‌తో స్టోర్ ఏర్పాటు చేశామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రథీష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి..

'చతుర్భుజ'మై..

ఆదర్శంగా నిలుస్తున్న స్వర్ణచతుర్భుజి పార్కు | మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కృతమై | ఘనంగా రజతోత్సవ వేడుకలు జరుపుకుంటూ

చేయి చేయి కలిపి చతుర్భుజమై.. కదలి వద్దాం కలను నిజం చేద్దాం.. అందరూ ఒక్కటై అడుగులేద్దాం.. అనుబంధం పెంచుదాం, ఆనందం పంచుదాం.. అన్న ఓ రచయిత మాటలను గుర్తు చేసేలా ఆ ప్రాంత మహిళా శక్తి మొత్తం ముందుకు కదిలింది.. కబ్జా దారుల కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ స్థలాన్ని విడిపించారు.. అనేక ఆటుపోట్లను అధిగమించి.. బెదిరింపులు, ఇబ్బందులకు ఓర్చి అనుకున్న లక్ష్యాన్ని చేరారు.. వారే మలక్‌పేటలోని శ్రీపురం కాలనీ మహిళ సంక్షేమ సంఘం వారు.. కాలనీ వాసులకు ప్రయోజనం చేకూర్చేందుకు ముందడుగేశారు.. చివరికి 'స్వర్ణచతుర్భుజి' పేరుతో పార్కును ఏర్పాటు చేశారు.

– లక్ష్మీకాపూర్

ఒకప్పుడు అంటే 2000 సంవత్సరానికి ముందు.. ఆ ప్రాంతమంతా దుర్గంధంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి ఉండేది.. అలాంటి స్థలం కొందరు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుంది.. కాలనీ వాసుల ప్రయోజనార్థం స్థానిక మహిళా సంక్షేమ సంఘం నాయకులు చుట్టుపక్కల వారి సహకారంతో గుండవరం వేణుగోపాల్ రావు, పద్మలు కోర్టును ఆశ్రయించి పురాతన బావితో సహా స్థలాన్ని కాపాడి చక్కటి నందనవనంగా తీర్చిదిద్దారు.. అనేక బెదిరింపులు, ఇబ్బందులకు ఓర్చి చివరికి 'స్వర్ణచతుర్భుజి' పేరుతో పార్కుగా అభివృద్ధి చేశారు. పార్కు ఏర్పడి నేటికి సరిగ్గా 25 సంవత్సరాలు పూర్తికావడంతో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రజతోత్సవాలు జరుపుకున్నారు. పార్కు అవతరణకు సహకరించిన ఆత్మీయులు రాజేశ్వరరావు, రాజేందర్, నరేందర్, ప్రవీణ్, స్వర్ణ, శకుంతల, అనిత, హేమ తదితరులను ఆహ్వానించి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాలనీవాసులతో నాటి విశేషాలను పంచుకున్నారు.







ఆహ్లాదాన్ని పంచుతూ..

ప్రస్తుతం స్థానిక కాలనీవాసులకు పచ్చని వాతావరణంతో, చెట్లతో ఆహ్లాదాన్ని పంచుతోంది. స్థానిక ప్రజల అవసరాలు తీర్చేలా రూపొదిద్దిన పార్కులో నడక మార్గం, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వివిధ రకాల ఆట సామగ్రి ఇలా సకల వసతులూ ఏర్పాటు చేసుకున్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి, అలసట తగ్గించుకునేందుకు అనువుగా పచ్చటి వాతావరణం ఆహ్లాదాన్ని పంచుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.


ఆకట్టుకున్న పురాతన కరెన్సీ ప్రదర్శన

- నిజాం కాలం నాటి కరెన్సీ, నాణేలకు డిమాండ్
- ఉర్దూఘర్‌లో మూడు రోజుల పాటు నిర్వహణ
- అబ్బురపరుస్తున్న 150 యేళ్ల నాటి నాణేలు, నోట్లు



చార్మినార్ : పాతబస్తీలోని మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఏర్పాటు చేసిన కరెన్సీ ప్రదర్శన ఆకట్టుకుంటోంది. మూడు రోజుల పాటు సందర్శకులకు అందుబాటులో ఉంచిన ఈ ప్రదర్శనలో 150 యేళ్ల నాటి నిజాం స్టేట్‌లో చెలామణిలో ఉన్న నాణేలు, నోట్లు అబ్బురపరుస్తున్నాయి. సందర్శకుల్లో చాలా మంది పురాతన నాణేలు, కరెన్సీ పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. పలువురు ఆ నాణేలు, కరెన్సీని వేల రూపాయలు పెట్టి ఖరీదు చేస్తున్నారు. ఎక్కువ మంది వీటిపై మక్కువ చూపిస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఏర్పడిందని నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు నగరంలోని ఔత్సాహిక సందర్శకులతో ప్రదర్శన సందడిగా మారింది. పలువురు నగరవాసులు వారి వద్ద ఉన్న పురాతన నాణేలను, నోట్లను ప్రదర్శనలోని నిర్వాహకులకు విక్రయించారు. నిజాం స్టేట్‌లో రూ.10 నోటు ప్రస్తుతం రూ.25 వేలు పలుకుతోంది. అలాగే 2021కు చెందిన ఆజాద్ కీ అమృత్ రూ.5 కాయిన్‌కు మార్కెట్‌లో రూ.50వేల వరకూ డిమాండ్ ఉంది. 150 యేళ్ల నాటి నిజాం కాలం రూ.5 నోటుకు కూడా వేలల్లో డిమాండ్ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ ప్రదర్శనలు పలు స్టాల్స్ కూడా ఏర్పాటయ్యాయి.





జూనియర్ ఎన్టీఆర్ బుడ్డా ఫక్కీర్..
వాని సినిమాలు ఆడనిస్తానా..?

లోకేశ్‌ను తిట్టిన వాడి సినిమాలు ఎలా ఆడనిస్తాననుకున్నారు?

అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆడియో వైరల్


ఎమ్మెల్యే దగ్గుపాటి

సాక్షి ప్రతినిధి, అనంతపురం/అనంతపురం క్రైం : 'జూనియర్ ఎన్టీఆర్ ఒక బుడ్డా ఫక్కీర్.. వాడి సినిమాలు ఇక్కడ ఎలా ఆడనిస్తానని అనుకున్నారు.. లోకేశ్‌ను తిట్టిన వాడి సినిమాలు ఎలా ఆడనిస్తాను.. వానెమ్మ.. లం.. కొడుకు.. వాని సినిమాలు ఆడనిస్తానా.. మీరెలా ఆడనిస్తారా గాడిదల్లారా.. నా పర్మిషన్ లేకుండా వేయిస్తారా.. ఈ సినిమా ఆడదు..'అంటూ అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నోరు పారేసుకున్నారు. నిత్యం ఏదో ఒక వివాదంతో వార్తల్లోకెక్కుతున్న ఈ ఎమ్మెల్యే తాజాగా సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'వార్-2'సినిమా విడుదల నేపథ్యంలో ఎమ్మెల్యే ఇటీవల ఎన్టీఆర్ అభిమాన సంఘం నేత ధనుంజయనాయుడుతో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్-2 రిలీజ్ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతకు ఫోన్ చేశారు. 'ఈ సినిమాకు ఎన్ని థియేటర్లు అనుమతించారు.. ఎవరు అనుమతి ఇచ్చారు.. ఎలా ఆడనిస్తారు? ఆ సినిమాను ఆడనిచ్చేది లేదు.. వాడు బుడ్డా ఫక్కీర్.. లోకేష్‌ను తిట్టిన వాడి సినిమాలు ఎలా ఆడనిస్తాను.. వానెమ్మ.. లం..కొడుకు ఈ టైమ్‌లో వాని సినిమాలు ఆడనిస్తానా.. మీరెలా ఆడనిస్తారా గాడిదల్లారా? నా పర్మిషన్ లేకుండా వేయిస్తారా? ఈ సినిమా ఆడదు.. వాడు బుడ్డా ఫక్కీర్ గాడు లోకేశ్ గురించి మాట్లాడతాడా? ఈ సినిమా ఆడదు. నాకు తెలియకుండా సినిమా ఎట్లా ఆడుతుంది.. నేను అనంతపురం ఎమ్మెల్యే.. బుడ్డా ఫక్కీర్ నా కొడుకు.. సార్ గురించి మాట్లాడతాడా? గాడ్ ప్రామిస్‌గా చెబుతున్నా.. ఈ సినిమా ఆడదు.. ఆపేయిస్తున్నా.. నేను ఊరుకుంటానా.. పంపించేయండి అందరినీ'అని హుకుం జారీ చేశారు.

అది నా ఆడియో కాదు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫోన్లో జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఆ ఆడియో తనది కాదని, ఎవరో మార్ఫింగ్ చేసి పెట్టారని వివరణ ఇచ్చుకున్నారు. తాము తొలి నుంచీ ఎన్టీఆర్ అభిమానులమని, కావాలని ఎవరో ఇలా చేశారని చెప్పారు. ఈ ఆడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అన్నా.. ఇలా బెదిరింపులు సరికాదు

దగ్గుపాటి వివరణ ఇస్తూ వీడియో విడుదల చేసిన కాసేపటికే జూనియర్ ఎన్టీఆర్ అభిమాని, టీఎన్ఎస్ఎఫ్ నేత గుత్తా ధనుంజయ నాయుడు వాయిస్ రికార్డు బయట పెట్టారు. జూనియర్ ఎన్టీఆర్‌ను తిడుతూ.. తనను ఎమ్మెల్యే ఫోన్లో బెదిరించిన అనంతరం ఆయన ఒక ఆడియోను రికార్డు చేసి ఎమ్మెల్యేకు పంపినట్లు తెలుస్తోంది. 'అన్నా.. మీరంటే గౌరవం ఉంది. దయచేసి చెబుతున్నా.. ఎవరో చెప్పిన మాటలు విని అలా మాట్లాడవద్దు. జూనియర్ ఎన్టీఆర్‌కు సినిమా పరంగా ముందు నుంచీ అభిమానిని. ఈ విషయాన్ని నారా లోకేశ్ ముందు చెప్పమన్నా చెబుతా. అంతేగానీ ఎవరి కోసమో పని చేయలేదు నేను. దయచేసి నన్ను కాంట్రవర్సీలోకి లాగొద్దు. సినిమా మీద కాంట్రవర్సీ ఎందుకు? నన్నెందుకు మీరు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు? అసభ్యంగా మాట్లాడితే నేను పడను. నాకు ఫోన్ చేసి బెదిరించడం తప్పు. ఎన్టీఆర్ గాడు.. గీడు అని మాట్లాడవద్దు. మీరు నాతో మాట్లాడిన ప్రతిదీ వాయిస్ రికార్డు చేశాను. ఈ రికార్డులన్నీ నారా రోహిత్ అన్నకు పంపినా. నా మీద నీకేం హక్కుంది మాట్లాడేందుకు? నన్ను చంపుతావా.. చంపు. నన్ను చంపావంటే మా వాళ్లు ఊరికే ఉండరు. నువ్వు నోరు జారినావంటే బాగుండదు'అని గుత్తా ధనుంజయ నాయుడు ఎమ్మెల్యేకు పంపిన వాయిస్ రికార్డులో పేర్కొన్నారు. దీంతో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మరింతగా రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాదులో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం ఉమ్మడి రాష్ట్ర కన్వీనర్లు, ముఖ్య నేతలు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కాగా, ఎమ్మెల్యే ఆడియో సామాజిక మాధ్యమాల్లోకి రాకమునుపే రెండ్రోజుల ముందు టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి.. దగ్గుపాటి ప్రసాద్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ 'నువ్వు జూనియర్ ఎన్టీఆర్ గురించి ఏం మాట్లాడావో నా దగ్గర రికార్డులున్నాయి. నీ బండారం బయటపెడతా'నని హెచ్చరించారు.

ఆగ్రహించిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలతో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తమ అభిమాన హీరోను నోటికొచ్చినట్లు తిట్టడాన్ని వారు జీర్ణించుకోలేక పోయారు. ఆదివారం ఉదయం అనంతపురం శ్రీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపైకి దాడికి దిగారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే భారీ ఫ్లెక్సీలను చింపేసి నిరసన తెలిపారు. 'అవసరమైనప్పుడు పార్టీకి పని చేసిన వ్యక్తి జూనియర్ ఎన్టీఆర్. ఆ విషయం తెలియదా? మీతో ఇలా ఎవరు మాట్లాడించారో చెప్పాలి. మేము కూడా ఓట్లేస్తేనే మీరు ఎమ్మెల్యే అయ్యారు. అలాంటిది మా అభిమాన నాయకుణ్ని దూషిస్తారా? మాకు రాజకీయాలతో పని లేదు. నాలుగు గోడల మధ్య కూర్చొని క్షమాపణ చెబితే సరిపోదు. బయటకు వచ్చి.. మీరు, మీతో మాట్లాడించిన వారు బహిరంగ క్షమాపణ చెప్పాలి'అని డిమాండ్ చేశారు.

ఆ వాయిస్ ఎమ్మెల్యేదే

ఆడియోలో ఉన్న వాయిస్ తనది కాదని ఎమ్మెల్యే అంటున్నారు. అది నిజం కాదు. అది ఎమ్మెల్యే వాయిస్సే. అతని వాయిస్ కాదనుకుంటే ఆడియోలో ఇంకో వైపు మాట్లాడింది ధనుంజయ నాయుడు (టీఎన్ఎస్ఎఫ్) వాయిస్ ఫేక్ కాదు కదా?! అంత పెద్ద హీరో తల్లిని అనరాని మాటలు అనడం తప్పు. ఎవరి తల్లి అయినా తల్లే కదా? ఎన్టీఆర్ అభిమాన సంఘాల నేతలు రేపు హైదరాబాద్‌లో సమావేశానికి పిలుపునిచ్చారు. అధికారం ఉంది కదా అని అనంతపురంలో అభిమాన సంఘం నేతలను, కార్యకర్తలను నోరు మూయించవచ్చు. ప్రభుత్వం మాది.. ఏమైనా చేస్తామంటే కుదరదు. ఇది ఇక్కడితో ఆగదు. ఎమ్మెల్యే కచ్చితంగా మీడియా వేదికగా, అభిమానుల ముందు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే.

– మహేష్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాని


ఐటీ ముసుగులో భూములు 'లిఫ్ట్'!

ఎంత భూమైనా సరే.. 99 పైసలకే విక్రయిస్తాం

మీకు నచ్చిన రేటుకు తెగనమ్ముకోండి..!

బాబు సర్కారు భలే ఎత్తుగడ.. 'రియల్'దందాకు రెడీ

- దేశంలో ఎక్కడా లేనివిధంగా లోకేష్ మార్కు విధానం.. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పేరుతో ప్రత్యేక పాలసీ
- ఊరూ పేరు లేని ఉర్సా లాంటి కంపెనీలు సృష్టించి ధారాదత్తం చేసే ఎత్తుగడ
- ఉర్సాకు కారుచౌకగా కట్టబెట్టే యత్నాలపై విమర్శలు రావడంతో తెరపైకి మరో పాలసీ
- ఇక ఏపీ అంతటా పప్పు బెల్లాల మాదిరిగా అదే విధానంలో పందేరం..
- "ఫార్చ్యూన్ 500 యూరోప్"పై ఉన్నతాధికారుల్లో అనుమానాలు



సాక్షి, అమరావతి: ఏ ప్రభుత్వమైనా ఓ కంపెనీకి ఉదారంగా భూములివ్వాలంటే ముందుగా దాని ట్రాక్ రికార్డు చూస్తుంది! కంపెనీ శక్తి, సామర్థ్యాలు ఏమిటి? ఎంతమందికి ఉపాధి కల్పిస్తుంది? రాష్ట్రానికి పారదర్శకంగా ఎన్ని పెట్టుబడులు వస్తాయో చూస్తుంది. అంతటా నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తుంది. కానీ ఇలాంటివి ఏవీ పట్టించుకోకుండా పప్పు బెల్లాల మాదిరిగా భూముల పందేరానికి టీడీపీ కూటమి సర్కారు సిద్ధమైంది. ఐటీ కంపెనీల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర తీసింది. ఎన్ని ఎకరాల భూమి అయినా సరే కేవలం 99 పైసలకే ఇస్తాం...! ఐటీ పేరుతో వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకోండి..! ఆ తరువాత మార్కెట్ ధరకు అమ్మేసుకోండి..! అంటూ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పేరుతో విలువైన భూములను కొట్టేసేందుకు ప్రభుత్వ పెద్దలు స్కెచ్ వేశారు. ఐటీ కంపెనీలను ఆకర్షిస్తున్నామంటూ పక్కా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సన్నాహాలు చేశారు. తొలుత ఒకటి రెండు ప్రముఖ కంపెనీలను తెరపైకి తీసుకొచ్చి కనీసం పాలసీ కూడా సిద్ధం కాకముందే విశాఖలో 99 పైసలకే భూములను కట్టబెట్టారు. ఈ క్రమంలో ఊరూ పేరు లేని ఉర్సాకు కారుచౌకగా భూములను కట్టబెట్టే యత్నాలపై తీవ్ర విమర్శలు వ్యక్తం కావడంతో ఉలిక్కిపడి 'లిఫ్ట్'పేరుతో ఓ పాలసీని తీసుకొచ్చారు. ఉర్సా లాంటి వందలాది సత్తాలేని కంపెనీలను సృష్టించి తమకు కావాల్సిన వారికి భూములు అప్పనంగా అప్పగించేందుకు సిద్ధపడ్డారు. అసలు టెక్నాలజీతో సంబంధం లేని కంపెనీలకు భూములను ధారాదత్తం చేస్తున్నారు! తొలుత విశాఖలో ఐటీ కంపెనీలను ప్రోత్సహించి ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా భూములను కేటాయించనున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నామినల్ రేటు అంటే 99 పైసలు..

ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు ఇప్పటికే ఏపీ ఐటీ అండ్ గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ (జీసీసీ) పాలసీ 2024–29 ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు కేటాయించడం కోసం ప్రత్యేకంగా 'లిఫ్ట్'పాలసీని తెరపైకి తెచ్చింది. ముందుగా ఐటీ లేదా జీసీసీతో అభివృద్ధి చేసే వాణిజ్య సముదాయంలో 20 శాతం కొనుగోలు లేదా లీజుకు తీసుకునేలా ఒప్పందం చేసుకుంటే చాలు.. అడిగినంత భూమిని కేవలం 99 పైసలకే కట్టబెట్టనుంది. మిగిలిన 80 శాతంలో 30 శాతం ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు, జీసీసీలకు ఇస్తే చాలు 50 శాతం భూమిని వాటికి నచ్చినట్లుగా విక్రయించుకోవచ్చని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ''నామినల్ రేటు అంటే 99 పైసలు..''అని అందులో పేర్కొనడం గమనార్హం.

ప్రత్యేకంగా 'ఫార్చ్యూన్ 500 యూరప్'ఎందుకు?

ఐటీ, ఐటీఈఎస్, జీసీసీలకు 99 పైసలకే భూమి ఇస్తామంటూనే ''ఫార్చ్యూన్ 500 యూరోప్''ను ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకోవడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిలో నాన్ ఐటీ కంపెనీలే ఉన్నాయి. టెక్నాలజీతో ఏమాత్రం సంబంధంలేని యూరోప్ ఫార్చ్యూన్ 500 ఇండెక్స్‌ను ఎంపిక చేసుకోవడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి. ఈ ఇండెక్స్‌లో నల్లధన రాజధాని స్విట్జర్లాండ్‌కు చెందిన 36కిపైగా కంపెనీలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ఫార్చ్యూన్ 500 యూరోప్ తేవడంపై ఉన్నతాధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

డెవలపర్స్ ముసుగులో 'రియల్'వ్యాపారం

ఐటీ పార్కు డెవలపర్స్, జీసీసీ డెవలపర్స్‌కు కూడా ఈ పాలసీ కింద 99 పైసలకే భూమిని కేటాయిస్తారు. జీసీసీ డెవలపర్స్ కనీసం ఒక ఎకరా భూమిలో 1,00,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే విధంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుందని జీవోలో పేర్కొన్నారు. ఫార్చ్యూన్, ఫోర్బ్స్ కంపెనీల్లో ఒక దానిని యాంకర్ కంపెనీగా ఎంపిక చేసుకొని అభివృద్ధి చేసిన భూమిలో 20 శాతం తీసుకునే విధంగా ఒప్పందం చేసుకోవాలి. ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి కల్పించాలి. ఇలా అభివృద్ధి చేసిన భూమిలో కనీసం 50 శాతం భూమిని ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలు, జీసీసీలకు ఇవ్వాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు . అదే ఐటీ పార్కు డెవలపర్స్ అయితే ఎకరాకు 1,00,000 చదరపు అడుగులు చొప్పున కనీసం 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అంటే ఐటీ డెవలపర్స్‌కు కనీసం 10 ఎకరాల భూమిని కేటాయిస్తారు.

క్లుప్తంగా...

శాంతియుతంగానే మహాధర్నా: శ్రీపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు శాంతియుతంగానే మహాధర్నా చేస్తారని, వారిని అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని పోలీసు యంత్రాంగానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలీసులు కోరే ప్రతీ సమాచారం వారికి ఇవ్వాలని జిల్లా నాయకులకు సూచించారు. మహాధర్నాకు వచ్చే ప్రతి ఉపాధ్యాయుడు.. ఆ రోజు విధిగా సెలవు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దు కోరుతూ పీఆర్‌టీయూటీఎస్ నేతృత్వంలో సెప్టెంబర్ 1వ తేదీన మహాధర్నా చేపట్టాలని నిర్ణయించడం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డితో కలిసి శ్రీపాల్ రెడ్డి ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ శ్రేణులు తరలి వచ్చేందుకు సిద్ధమయ్యారని, ఈ నేపథ్యంలో పోలీసులు వారి వివరాలు సేకరించడం సహజమని శ్రీపాల్ వ్యాఖ్యానించారు.

డీటీఎఫ్ అధ్యక్షునిగా సోమయ్య


సోమయ్య


లింగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ 15వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.శంతన్, వి.రాజిరెడ్డి, బి.రేణుక, టి.శ్రీశైలం, చాప బాబు, కార్యదర్శులుగా ఎం.సామ్యూల్, జె.రామస్వామి, ఎ.శ్రీనివాసరెడ్డి, బి.శ్యామ్, ఆర్.లింగయ్య ఎన్నికైనట్టు డీటీఎఫ్ కార్యాలయం వెల్లడించింది. అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకునిగా డాక్టర్ ఎ.గంగాధర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్ రెడ్డి, సభ్యులుగా సీహెచ్.వెంకటేశ్వర్లు, బి.సదానందం వ్యవహరిస్తారని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం: ప్రీతం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ ఎస్సీ సెల్ విభాగం చైర్మన్, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో ఆదివారం టీపీసీసీ ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రీతం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపులో ఎస్సీ సెల్ కీలక పాత్ర పోషించాలని కోరారు.

ఆందోళనకరంగా ఆత్మహత్యలు

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సమాధానమిచ్చింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దేశంలోని తొలి ఐదు రాష్ట్రాల జాబితాలో తెలంగాణతో పాటు కేరళ, తమిళనాడు కూడా ఉండడం గమనార్హం. కాగా 2023 నుంచి 2025 వరకు జరిగిన ఆత్మహత్యల వివరాలను ఎన్‌సీఆర్‌బీ వెల్లడించలేదు.

దేశంలో ఐదేళ్లలో 7.62 లక్షల ఆత్మహత్యలు

ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2018లో దేశవ్యాప్తంగా 1,34,516 ఆత్మహత్యలు (రేటు 10.2) నమోదు కాగా, 2022లో ఆ సంఖ్య 1,70,924 (రేటు 12.4)గా నమోదైంది. ఆందోళనకర స్థాయిలో ఈ ఐదేళ్లలో మొత్తం 7,61,648 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. అంటే దేశంలో లక్ష జనాభాకు సగటున 11.26 రేటుతో ఆత్మహత్యలు నమోదయ్యాయన్న మాట. లక్ష జనాభాను పరిగణనలోకి తీసుకొని లెక్కలేస్తే సిక్కిం రాష్ట్రంలో అత్యధికంగా ఐదేళ్లలో సగటున 37.5 రేటు నమోదైంది. 26.42 రేటుతో ఛత్తీస్‌గఢ్ తర్వాతి స్థానంలో ఉంది. మూడో స్థానంలో కేరళ (25.44)ఉండగా, నాలుగో స్థానంలో (23.3) తెలంగాణ, ఐదో స్థానంలో తమిళనాడు (21.8) ఉన్నాయి.

నిరుద్యోగం, కుటుంబ సమస్యలూ కారణం..

నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, మానసిక ఒత్తిడి ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా గుర్తించగా.. పంటలు సరిగా పండక పోవడం వల్ల రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య కూడా దేశంలో ఏయేటికాయేడు పెరుగుతోంది. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి మానసిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్య 2018లో 10,134 మంది ఉంటే 2022లో ఆ సంఖ్య 14,600గా నమోదైంది. తెలంగాణలో ఐదేళ్లలో 2,590 మంది మానసిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఎన్‌సీఆర్‌బీ తెలిపింది. కాగా కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్‌లలో ఆత్మహత్యల రేటు అధికంగా ఉండగా, లక్షద్వీప్‌లో అతి తక్కువగా నమోదైంది.

దక్షిణ భారత దేశంలో ఆత్మహత్యల తీరు ఇదీ...

రాష్ట్రం	2018	2019	2020	2021	2022
తెలంగాణ	7845	7675	8058	10171	9980
తమిళనాడు	13896	13493	16883	18925	19834
కేరళ	8237	8556	8500	9549	10162
కర్ణాటక	11561	11288	12259	13056	13606
ఆంధ్రప్రదేశ్	5319	6465	7043	8067	8908
పుదుచ్చేరి(యూటీ)	500	493	408	504	481

ఆత్మహత్య ఆలోచనల నుంచి మళ్లిస్తున్న టెలి మానస్

చిన్న సమస్యను సైతం పెద్దగా ఆలోచించి ఆత్మహత్య వైపు అడుగువేసే ధోరణి పెరుగుతుండడంపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యను నివారించేందుకు వీలుగా 2022 అక్టోబర్‌లో 'నేషనల్ టెలి మెంటల్ హెల్త్ ప్రోగ్రాం (టెలి-మానస్)'ను ప్రారంభించింది. ప్రస్తుతం దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 53 టెలి మానస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. మొబైల్ యాప్, వీడియో కన్సల్టేషన్ సౌకర్యాలు కూడా అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణలోని ఎర్రగడ్డ మానసిక వైద్య ఆసుపత్రిలో మానస్ కేంద్రం ఏర్పాటు చేయగా, ఈ కేంద్రానికి ఇప్పటివరకు 1,61,477 ఫోన్‌కాల్స్ వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఫోన్ రాగానే మానసిక నిపుణులు బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, ఆత్మహత్య ఆలోచనల నుంచి దూరం చేస్తున్నట్లు వివరించింది. దేశవ్యాప్తంగా 53 టెలీ మానస్ కేంద్రాలకు ఇప్పటి వరకు 24.52 లక్షల కాల్స్ వచ్చాయి.

5 నుంచి పద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 2న సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం జరుగనుంది. 5న పవిత్రప్రతిష్ఠ, 6న పవిత్ర సమర్పణ, 7న పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగనున్నాయి. రూ.750 చెల్లించి గృహస్తులు ఈ సేవలో పాల్గొనవచ్చునని, వారికి 2 లడ్డూలు, 2 వడలు అందజేస్తామని తెలిపారు. 4న అంకురార్పణ సందర్భంగా తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సెప్టెంబరు 5న అభిషేకానంతర దర్శనం, లక్ష్మీ పూజ సేవలను రద్దు చేశారు.

తిరుమలలో వైభవంగా ఉట్లోత్సవం

తిరుమల: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో ఆదివారం ఉట్లోత్సవం వేడుకగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరునాడు ఉట్లోత్సవాన్ని(శిక్యోత్సవం) నిర్వహించడం ఆనవాయితీ. దీన్లో భాగంగా శ్రీమలయప్ప స్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ పలు ప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు. ముందుగా మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పెద్దజీయర్ మఠానికి వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం చేపట్టారు. ఆ తరువాత శ్రీవారి ఆలయం ఎదుట ఉట్లోత్సవం ఉత్సాహంగా జరిగింది.

'అమృత్‌భారత్' ఈసారైనా పట్టాలెక్కేనా?

- ఇప్పటికే రెండు దశల్లో ప్రవేశపెట్టిన రైళ్లు
- దక్షిణమధ్య రైల్వేకు మాత్రం మొండిచేయి
- తాజాగా అమృత్‌భారత్ 3.0 వెర్షన్ తయారీ
- హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు భారీ డిమాండ్


ఒక్క రైలు కూడా రాలేదు

సాక్షి, హైదరాబాద్: తక్కువ చార్జీ..ఎక్కువ వేగంతో ప్రయాణ సదుపాయం అందించే సామాన్యుడి రైలే అమృత్‌భారత్ ట్రైన్. ఇప్పటివరకు రెండు దశల్లో ఈ రైళ్లను ప్రవేశపెట్టారు. అయితే దక్షిణమధ్య రైల్వేలో మాత్రం ఒక్క అమృత్‌భారత్ కూడా పట్టాలెక్కలేదు. 'అమృత్ భారత్ 1.0', 'అమృత్‌భారత్ 2.0'శ్రేణుల తర్వాత ఇప్పుడు తాజాగా 'అమృత్ భారత్ 3.0'వెర్షన్ రైళ్లను అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. ఇటీవల స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా కూడా అమృత్ భారత్ 3.0 ప్రస్తావనకు వచ్చింది. ఈ కొత్త వెర్షన్‌లో ఏసీ, నాన్ ఏసీ సదుపాయం ఉన్న రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికైనా హైదరాబాద్ కేంద్రంగా ఈ సామాన్య ప్రయాణికుల రైలును పట్టాలెక్కిస్తారా..లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

- హైదరాబాద్ నుంచి పట్నా, వారణాసి, షిరిడీ తదితర ప్రాంతాలకు భారీ డిమాండ్ ఉంది.
- సికింద్రాబాద్ నుంచి తిరుపతి, విశాఖపట్టణం, కాకినాడ మార్గాల్లో అన్ని రెగ్యులర్ రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. పండుగలు, వరుస సెలవులతో నిమిత్తం లేకుండా వందల్లో వెయిటింగ్ లిస్ట్ ఉంటోంది. కొత్తగా రానున్న మూడో వెర్షన్ అమృత్‌భారత్ రైళ్లను హైదరాబాద్ కేంద్రంగా అందుబాటులోకి తేవాలని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2023లో అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. మధ్యతరగతి, పేద ప్రజలు, వలస కార్మికులను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్ల చార్జీలను రూపొందించారు.

- ఏసీ సదుపాయం లేని అమృత్‌భారత్ రైళ్లలో 11 జనరల్ క్లాస్ కోచ్‌లు, 8 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, ఒక ప్యాంట్రీ కార్, మరో రెండు సెకండ్ క్లాస్-కమ్-లగేజ్-కమ్-గార్డ్ వ్యాన్‌లు, దివ్యాంగులకు ఒక కంపార్ట్‌మెంట్ ఉంటుంది.
- తాజాగా చెన్నై ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమవుతున్న అమృత్‌భారత్ 3.0 వెర్షన్ రైళ్లలో ఏసీ, నాన్ ఏసీ కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి.
- ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అమృత్‌భారత్ రైళ్లు నడుస్తున్నాయి. అందులో 6 అమృత్ భారత్ రైళ్లు బిహార్‌కే కేటాయించారు. ఆ రాష్ట్రంలోని మోతీహారి, పట్నా, దర్భంగా, సీతామర్హి తదితర నగరాల నుంచి వివిధ ప్రాంతాలకు ఈ రైళ్లు నడుస్తున్నాయి.
- మరో రెండు అమృత్ భారత్ రైళ్లు పశ్చిమబెంగాల్‌లోని మాల్డా టౌన్ నుంచి, ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో (గోమతినగర్) నుంచి 2 అమృత్ భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.
- ముంబయి, బెంగళూరుకు కూడా ఒక్కొక్క అమృత్ భారత్ రైళ్లను కేటాయించారు.
- తెలంగాణ రాష్ట్రం మీదుగా ఒక అమృత్‌భారత్ రైలు కూడా అందుబాటులో లేదు. హైదరాబాద్ నుంచి బిహార్‌కు ప్రయాణికుల రద్దీ భారీగా ఉంటుంది.
- సికింద్రాబాద్ నుంచి కాజీపేట్, పెద్దపల్లి, మంచిర్యాల రూట్‌లో ప్రయాగ్‌రాజ్, వారణాసి మీదుగా పట్నా వరకు అమృత్‌భారత్ సూపర్‌ఫాస్ట్ డైలీ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెస్తే వలస కార్మికులతోపాటు వారణాసి, ప్రయాగకు వెళ్లే భక్తులకు సైతం ఎంతో ప్రయోజనం కలుగుతుంది.
- ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దానాపూర్ పట్నా ఎక్స్‌ప్రెస్ ఒక్కటే ఈ రూట్‌లో రాకపోకలు సాగిస్తోంది. ఈ రైలుకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రతి రోజు వందలాది మంది వెయిటింగ్ లిస్ట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు.

తెలంగాణ సంపర్క్ క్రాంతి ఏదీ?

ప్రతి రాష్ట్ర రాజధాని నుంచి న్యూఢిల్లీకి సంపర్క్ క్రాంతి రైళ్లు నడుస్తున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సంపర్క్‌క్రాంతి రైళ్లను ప్రవేశపెట్టలేదు. ప్రస్తుతం తెలంగాణ ఎక్స్‌ప్రెస్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. తెలంగాణ సంపర్క్‌క్రాంతిని నడపాలని ప్రయాణికులు, ప్రయాణికుల సంఘాలు రైల్వే వినియోగదారుల సమావేశాల్లో ప్రతిపాదించారు. విజ్ఞప్తులు చేశారు. ఎంపీల సమావేశంలోనూ ప్రతిపాదనలొచ్చాయి. కానీ రైల్వేశాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు.


గోపన్‌పల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్జీవోస్ నేతలు, ఉద్యోగులు

మా స్థలాలు మాకివ్వాలి

టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని మా స్థలాలు.. మాకు ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. గోపన్‌పల్లిలో భాగ్యనగర్ టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళన ఆదివారం 33వ రోజుకు చేరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగ సంఘాలు, నాయకులు ఈ ఆందోళనలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ గోపన్‌పల్లిలో మా సంఘానికి చెందిన 18 ఎకరాలు ప్రైవేటుపరం కాగా, కలెక్టర్, మంత్రిని కలవగా న్యాయపోరాటం చేయమని చెప్పారని, ఈ న్యాయపోరాటంలో మొదటి విజయం తమకు లభించిందని చెప్పారు. టీఎన్జీవోస్ అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ న్యాయపరంగా కోర్టును ఆశ్రయించడంతో ఆర్డర్‌పై స్టే ఇచ్చిందన్నారు. గాంధేయమార్గంలో జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ముజీబ్ నాయకత్వంలో పెద్ద ఎత్తున అందరూ శాంతియుత పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్నట్టు టీఎన్జీవోస్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్ చెప్పారు. ప్రభుత్వం జీఓ ఇచ్చి తమకు స్థలాలు కేటాయించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీజేఏ న్యూస్ ఫొటోగ్రఫీ-25 ఫలితాలు విడుదల


ఫొటో పోటీల ఫలితాలు విడుదల చేస్తున్న అకాడమీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: ఈనెల 19న 186వ 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎస్‌పీజేఏ) నిర్వహించిన 23వ రాష్ట్ర స్థాయి ఫొటో పోటీల ఫలితాలను ఆదివారం వెల్లడించింది. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆగస్టు 19న మంత్రి పొన్నం ప్రభాకర్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తారని తెలిపారు. న్యూస్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌కు వచ్చిన దాదాపు 250కి పైగా ఫొటోల్లోంచి ఉత్తమ చిత్రాలను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఎంపిక చేశారు. తెలంగాణ ఫొటో అకాడమీ కోశాధికారి సీనియర్ ఫొటోగ్రాఫర్ విశ్వేందర్‌రెడ్డి, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సత్తిరెడ్డి, ఏపీ ఫొటో అకాడమీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి చిత్రాలను ఎంపిక చేశారు. మొదటి బహుమతిగా ఇంగు శ్రీనివాస్ (ఈనాడు–నిజామాబాద్), రెండో బహుమతిగా ఎ.కృష్ణ (ది హన్స్ ఇండియా–హైదరాబాద్) మూడో బహుమతిగా జి.బాలస్వామి (సాక్షి–హైదరాబాద్), పది కన్సొలేషన్ బహుమతులకు ఎన్.రాజేశ్‌రెడ్డి (సాక్షి–హైదరాబాద్) జి.శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ–హైదరాబాద్), ఎ.జాన్ (సాక్షి–హైదరాబాద్), ఆర్.రాజు (సాక్షి–ఖమ్మం), పి.వరప్రసాద్ (సాక్షి–వరంగల్), ఎం.శ్రీనివాస్ (ది హన్స్ ఇండియా–నల్లగొండ), జి.వేణుగోపాల్ (సాక్షి–జనగామ), ఎం.అనిల్ కుమార్ (ఆంధ్రజ్యోతి–హైదరాబాద్), వి.రజినీకాంత్‌గౌడ్(నమస్తే తెలంగాణ–హైదరాబాద్), ఎ.జ్వాలా కోటేశ్వర్‌రావు (ఆంధ్రజ్యోతి–హైదరాబాద్)లు ఎంపికయ్యారు. టీఎస్‌పీజేఏ ప్రెసిడెంట్ అనుమల్ల గంగాధర్, జనరల్ సెక్రటరీ కె.ఎన్.హరి పాల్గొన్నారు.



మంచిమాట

సమయపాలన జీవితాన్ని తీర్చిదిద్దే కళ

జీవితంలో అత్యంత అరుదైన, విలువైన బహుమతి ఏదైనా ఉందంటే అది కాలమే. ఈ అమూల్యమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే విజయం, ఆనందం సాధించగలం. సమయం అనేది నిరంతర ప్రవాహం. దానిని సక్రమంగా వినియోగించుకుంటేనే మన జీవితం ఒక అద్భుతమైన గమ్యాన్ని చేరుకుంటుంది, అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతాం.



కాలాన్ని సక్రమంగా వినియోగించుకుంటే వృద్ధి కలుగుతుంది. కాలాన్ని నిర్లక్ష్యం చేస్తే క్షీణత తప్పదు. సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోతే ప్రతిదీ నశించిపోతుంది అనడంలో సందేహం లేదు. ఈ సూక్తి సమయపాలన అనివార్యతను, అది జీవితంలో వృద్ధికి లేదా క్షీణతకు ఎలా దారితీస్తుందో స్పష్టంగా వివరిస్తుంది.

సమయం ఎవరి కోసం ఆగదు; కాలచక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. ఈ నిరంతర ప్రవాహంలో, సమయపాలన అనే కళ ద్వారా మనం మన జీవితాన్ని ఒక సుందరమైన శిల్పంలా మలచుకోవచ్చు. సనాతన ధర్మంలో సమయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రతి శుభకార్యానికి ఒక ముహూర్తం, ప్రతి పనికి ఒక నిర్దిష్ట కాలం కేటాయించడం దీనిలో భాగమే. వేదకాలం నుండే మన ఋషులు కాలాన్ని నిశితంగా అధ్యయనం చేసి, దాన్ని విభజించి, ప్రతి క్షణాన్నీ ఎలా సద్వినియోగం చేసుకోవాలో లోకానికి బోధించారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు యుద్ధంలో ప్రతి కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకోవాలని అర్జునుడికి ఉపదేశిస్తాడు. అలాగే, రామాయణంలో లక్ష్మణుడు నిద్ర లేకుండా సీతారాములకు సేవ చేస్తూ, కాలరహిత నిబద్ధతతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించి, సమయపాలనకు ఆదర్శంగా నిలిచాడు.

సమయానికి సమానమైన మిత్రుడు గానీ, శత్రువు గానీ మరొకటి లేదు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే అది మనకు అత్యుత్తమ మిత్రునిగా మారి విజయాన్ని ప్రసాదిస్తుంది. నిర్లక్ష్యం చేస్తే, అది శత్రువై మనల్ని పతన పథంలోకి నెడుతుంది. ఈ సూక్తి సమయపాలన ప్రాధాన్యతను, దానిని ఆచరణలో పెట్టడం ద్వారా జీవితంలో విజయాలు ఎలా సాధించవచ్చో వివరిస్తుంది.

కాలం సమస్త జీవరాశిని పరిపక్వం చేస్తుంది, కాలమే ప్రజలను సంహరిస్తుంది. అందరూ నిద్రిస్తున్నప్పుడు కూడా కాలం మేల్కొని ఉంటుంది. కాలాన్ని దాటడం ఎవరికీ సాధ్యం కాదు. ఈ శ్లోకం కాలం అజేయ శక్తిని, దానిని గౌరవించి సద్వినియోగం చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేస్తుంది.

సమయపాలన కేవలం పనులను పూర్తి చేయడం కాదు, అది జీవితాన్ని అర్థవంతంగా, క్రమబద్ధంగా జీవించే ఒక గొప్ప కళ. ప్రతి క్షణాన్నీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా మనం ఉన్నత లక్ష్యాలను సాధించగలం, ఒత్తిడిని తగ్గించుకొని, అంతర్గత శాంతిని పొందగలం. జీవితాన్ని పరిపూర్ణంగా, ప్రయోజనకరంగా మలచుకోవడానికి సమయపాలన ఒక అమూల్యమైన సాధనం. ఈ కళను నేర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో సరికొత్త ఉన్నతిని సాధించగలరు.

– కె. భాస్కర్ గుప్తా

ప్రపంచంలోని అనేకమంది విజేతలు సమయపాలనను తమ అపార విజయానికి ప్రధాన కారణం అంటారు. వారు ప్రతీ నిమిషాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకోవడం ద్వారానే అసాధారణ ఫలితాలు సాధించారు. ఉదాహరణకు, ఒక విద్యార్థి సకాలంలో పాఠాలు పూర్తి చేస్తే ఉత్తమ ఫలితాలు పొందగలడు. అలాగే, ఒక ఉద్యోగి గడువులోగా పనులు అప్పగిస్తేనే వృత్తిలో పురోగమిస్తాడు. కచ్చితమైన సమయపాలన తోనే రవాణా వ్యవస్థలు, ప్రాజెక్టులు సమర్థవంతంగా సాగి, లక్షలాది మంది జీవితాలకు ఆసరా అవుతాయి. ఇవన్నీ మన ధర్మంలో సమయానికి ఇచ్చిన ఉన్నత స్థానాన్ని, దాని ఆచరణ విలువను స్పష్టం చేస్తాయి.

ఆధ్యాత్మికథ

బొమ్మా... బొరుసూ

నలభై రోజుల అయ్యప్ప దీక్ష అనంతరం గురుస్వామితో కలిసి ఒక యువకుడు శబరిమలై బయలుదేరాడు. వారు పంబా నదిలో స్నానం చేసి కొండ ఎక్కే సమయంలో భోరున వర్షం ప్రారంభమయ్యింది.

''ఈ వానకి నేను కొండ ఎక్కగలనా గురూజీ?'' అని అడిగాడు ఆ యువకుడు.

గురుస్వామి నవ్వి ''అంతా అయ్యప్ప చూసుకుంటాడు'' అని బదులిచ్చాడు.

మరికొంత దూరం నడిచిన యువకుడు ''నావల్ల కావడం లేదు, డబ్బులిచ్చి డోలీలో వెళ్దాము'' అన్నాడు.

''వయసులో ఉన్నవాడివి. ఈ కొండ ఎక్కడం నీకు సాధ్యమవుతుంది. నువ్వు నడవడం కొనసాగిస్తే అంతా అయ్యప్ప చూసుకుంటాడు'' అని ధైర్యం చెప్పాడు గురుస్వామి.

నడిచే ఓపికల్లేక ఆ యువకుడు ఓ చెట్టు కింద నిలబడి ''దేవుడిని ఎవ్వరూ చూడలేదు కదా. అసలు దేవుడున్నాడా?'' అని అడిగాడు యువకుడు.

గురుస్వామి నవ్వి ''కుడి కన్ను ఎడమ కన్నును చూడగలదా? ఎడమ కన్ను కుడి కన్నును చూడగలదా?'' అని అడిగాడు.

''అది సాధ్యం కాదు!' అని గంట కొట్టినట్లు చెప్పాడు యువకుడు.

''అలా చూడటం కుదరక, కుడి కన్ను లేదని ఎడమ కన్ను, ఎడమ కన్ను లేదని కుడి కన్ను అనుకోవడం సమంజసమా?'' అని ప్రశ్నించాడు గురుస్వామి.

''ఎలాంటి పరిస్థితుల్లోనూ కాదు!'' అన్నాడు యువకుడు.

ఇంతలో వాన ఆగింది. సూర్యుడు ఆకాశంలోకి వచ్చాడు. ఆకాశంలో ఇంద్ర ధనుస్సు కనుల విందు చేసింది. మారు మాట్లాడకుండా యువకుడు గురుస్వామితో పాటు 'స్వామీ శరణం, అయ్యప్ప శరణం' అంటూ కొండ ఎక్కాడు. ఇద్దరూ పద్దెనిమిది మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకుని గుడి ముందరున్న రావిచెట్టు కింద చేరారు.



ఇరుముడి సంచిలోని నెయ్యిని అయ్యప్ప అభిషేకానికి సమర్పించాలని సంచులు తెరిచారు. అందులోని బియ్యాన్ని, నెయ్యిని వేరు చేసే సమయంలో గురుస్వామి ''అయ్యప్ప ఆదరణ దొరికిందా? అయ్యప్ప స్వామి నీకు కనిపించి తోడు వచ్చాడా?'' అని అడిగాడు.

యువకుడు నవ్వి బియ్యంలో భక్తులు వేసి ఉన్న నాణేన్ని చూపిస్తూ ''బొమ్మ లేదని బొరుసు, బొరుసు లేదని బొమ్మా అనుకుంటే కుదురుతుందా? రెండూ ఉంటేనే నాణెమవుతుంది. ఒక్కటే ఉంటే అది చెల్లని కాసు అవుతుంది. అలాగే, దైవం నీడ ఎల్లప్పుడూ మన వెంటే ఉంటుంది. కంటికి కనిపించకుండానే ఆపదల్లో సహాయం చేస్తుంది. అదేవిధంగా అయ్యప్ప నాతోనే ఉండి నన్ను కొండ ఎక్కించాడు'' అని సమాధానమిచ్చాడు.

శిష్యుడు దారిలో పడ్డాడని గ్రహించి సంతోషించాడు గురుస్వామి. ఇద్దరూ అయ్యప్ప అభిషేకానికి నెయ్యి సమర్పించి శరణాలు పలుకుతూ కొండ దిగడం ప్రారంభించారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

ఆత్మదర్శిని


విశ్రాంతి అంటే..?



నీవు నీవుగా మిగిలిపోవడమే అసలైన విశ్రాంతి. ఎందుకంటే నీవు నీవుగా మిగిలిపోవడానికి ఏమైనా శ్రమ ఉందా? అస్సలు లేదు. కానీ మనిషి నేను ఇలా ఉండాలి, అలా ఉండాలి, ఇలా కావాలి, అలా కావాలి అనుకుంటూ విశ్రాంత స్థితి నుండి పక్కకు వెళ్ళిపోతున్నాడు. నీవు నీవు కావడానికి ఏమైనా శక్తి కావాలా? లేక ప్రయత్నం కావాలా? అసలు అలా ఉన్నప్పుడు అలసటనేదే ఉండదు.

నీ పేరు మైత్రేయ అనుకుందాం. ఎప్పుడైతే నీవు మైత్రేయ అనే వ్యక్తివి ఐనావో, నాకు ప్రాముఖ్యత కావాలి. నన్ను సమాజం గుర్తించాలి, నన్ను గౌరవించాలి అనుకున్నావు. అదే నువ్వు ఆత్మగా ఉన్నపుడు, సాక్షిగా ఉన్నపుడు ఇలా అనిపించదు.

అంటే సమాజంలో ఎప్పుడూ ఒక వ్యక్తిలా ఉండాలని ప్రయత్నం చేస్తున్నావు. నీవు ఏది కాదో అది నిరూపించుకోవాలని అనుకుంటున్నావు. అలా ఏదో నిరూపించాలని అనుకుంటున్నావు కాబట్టే నీలో ఎప్పుడూ ఏదో అలసట ఉండే తీరుతుంది. అందుకే చూడు ఎప్పుడైనా నీవు బయటికి వెళ్ళేటప్పుడు బాగా బిగుసుకొనిపోతావు. ఇంటికి రాగానే రిలాక్స్ ఐపోతావు. ఎందుకంటే ఇంటికొచ్చాక నీవు నీవైపోతున్నావన్నమాట. అంటే రిలాక్సేషన్‌కి కారణం నీవు నీ అంతరాత్మతో ఉండటమే.



నీవు సమాజంలో కలిసినప్పుడల్లా నీవు కానిది చూపించాలనుకొని ఏదో ఒకటి నటిస్తూ వ్యక్తిత్వం అనే ముసుగును వేసుకుంటూ నీ అంతరాత్మకు దూరంగా జరిగిపోతున్నావు. నీ నిజతత్వమైన ప్రశాంతతకు విశ్రాంతికి చాలా దూరమవుతున్నావు.

నీవు ఆత్మగా మిగిలిపోవడానికి ఏమీ చేయనవసరం లేదు. నీవు నీవుగా ఈ క్షణంలో సంపూర్ణత్వంతో మిగిలిపోతే నీవే ఆత్మ. ఆత్మ స్వయం ప్రకాశం అంటారు భగవద్గీతలో కూడా. సహజంగానే నీవు శాంతి, విశ్రాంతి మూర్తీభవించిన మనిషివి. నీలో లేనిది ఏమీ లేదు. కానీ మనం ఎప్పుడూ ఇంకా ఏదో కావాలి అని వ్యక్తిగా కోరుకుంటూనే ఉంటాం. భగవద్గీత ప్రకారం ఆత్మ ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. దానికి చావులేదు. పుట్టుక లేదు. ఆత్మగా మిగిలిపోవడానికి ఏమైనా కావాలా? ఆత్మకు వస్తువులు, విషయాలు కావాలా? ఏమీ అఖ్ఖర్లేదు. ఆత్మగా ఏదీ నీకు చెందదు. నీవు ఎవరికీ చెందవు. కానీ అన్నీ నీవే ఒక ఆత్మగా... దేవునిగా. అందుకే ఆత్మగా నీవు ఎప్పుడైతే ఉంటావో అప్పుడు నీవు అంతులేని ప్రకాశానివి, నీవే దైవానివి.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

సాక్షి సినిమా

డబుల్ బొనాంజ



● 'ది రాజాసాబ్'లో నిధి

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది రాజాసాబ్'. ఈ సినిమాలో నిధీ అగర్వాల్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ ఇతర హీరోయిన్స్ పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం (ఆగస్టు 17) నిధీ అగర్వాల్ బర్త్ డే సందర్భంగా 'ది రాజాసాబ్'లోని ఆమె కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో విడుదల కానుంది.

దసరాకి టైటిల్: నిధీ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించనున్న కొత్త సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ ఈ దసరా పండగకి రానుంది. ఎస్. నిఖిల్ కార్తీక్ దర్శకత్వంలో పువ్వుల అప్పలరాజు ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఇది హారర్ థ్రిల్లర్ మూవీ. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ ఎవరూ ఊహించని కొత్త పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్రలో ఆమె కనబరిచే నటన ఆమె కెరీర్‌లో మైల్‌స్టోన్‌లా నిలిచిపోతుంది'' అని పువ్వుల అప్పలరాజు పేర్కొన్నారు. ఇలా రెండు సినిమాల అప్‌డేట్స్‌తో ఫ్యాన్స్‌కు డబుల్ బొనాంజ ట్రీట్ ఇచ్చారు నిధీ అగర్వాల్.

హలగలి... ఓ చిరస్మరణీయ పోరాటం



● లక్ష్మీ శ్రీనివాస్, సప్తమి గౌడ, డాలీ ధనంజయ, సుకేష్ నాయక్, కల్యాణ్ చక్రవర్తి

''హలగలి (కర్ణాటకలోని ఓ గ్రామం) అనేది కర్ణాటకలో ఓ గొప్ప ఎమోషన్. ఈ కథ వినగానే ఈ సినిమాలో నటించాలనిపించింది. ఈ సినిమా చేయడం నా అదృష్టం. తెలుగు ప్రేక్షకులు నాపై చూపిస్తున్న ప్రేమకి కృతజ్ఞతలు. ఈ సినిమా ప్రేక్షకులకు ఓ గొప్ప అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని డాలీ ధనంజయ అన్నారు. డాలీ ధనంజయ, సప్తమి గౌడ ప్రధాన పాత్రధారులుగా సుకేష్ నాయక్ దర్శకత్వంలో రూపొందుతున్న హిస్టారికల్ మూవీ 'హలగలి'. 1857లో జరిగిన ఓ వాస్తవ సంఘటనతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యార్లగడ్డ లక్ష్మీ శ్రీనివాస్ సమర్పణలో కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుకేష్ మాట్లాడుతూ – ''ఇది ఒక్క భాగంలో చెప్పే కథ కాదు. ఈ కథ వెనకాల గొప్ప చరిత్ర ఉంది. అందుకే రెండు భాగాలుగా విడుదల చేస్తాం'' అని తెలిపారు. ''చరిత్రలో హలగలి అనేది ఒక అధ్యాయం. బ్రిటిష్‌కి వ్యతిరేకంగా జరిగిన చిరస్మరణీయ పోరాటం. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు కల్యాణ్ చక్రవర్తి. ''హలగలి' మన నేల కథ'' అని తెలిపారు సప్తమి గౌడ.

థ్రిల్లర్ జానర్‌కి సై?



● రవితేజ

'నిన్ను కోరి' (2017), 'మజిలీ' (2019), 'ఖుషి' (2023) వంటి ప్రేమకథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శివ నిర్వాణ కాస్త రూట్ మార్చి ఓ థ్రిల్లర్ కథను సిద్ధం చేసుకున్నారు. ఇటీవల ఈ స్టోరీని హీరో రవితేజకు వినిపించగా ఆయన ఈ సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. ఈ థ్రిల్లర్ జానర్ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ప్రస్తుతం రవితేజ చేతిలో కిశోర్ తిరుమల దర్శకత్వంలోని 'అనార్కలి' (వర్కింగ్ టైటిల్), భాను భోగవరపు డైరెక్షన్‌లోని 'మాస్ జాతర' సినిమాలు ఉన్నాయి. ఈ రెండు సినిమాల చిత్రీకరణలు పూర్తయిన తర్వాత శివ నిర్వాణతో చేయాల్సిన సినిమాపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అలాగే 'మ్యాడ్, మ్యాడ్ 2' చిత్రాల ఫేమ్ కల్యాణ్ శంకర్ కూడా ఓ సూపర్ హీరో జానర్‌లో రవితేజకు కథ వినిపించారు. మరి... రవితేజ ఏ దర్శకుడితో ముందుగా తన సినిమాను సెట్స్‌కు తీసుకువెళ్తారో తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

త్వరలో సమస్య పరిష్కారమవుతుంది


- నిర్మాత సి. కల్యాణ్



తెలుగు సినీ కార్మికుల వేతన పెంపు విషయంలో సమ్మె కారణంగా కొన్ని రోజులుగా తెలుగు చిత్రపరిశ్రమలో చిత్రీకరణలు నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారం కోసం నిర్మాతలు, సినీ కార్మికుల సంఘం, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇటీవల ఈ సమస్య పరిష్కారం కోసం యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్‌లోని కొందరు నిర్మాతలు చిరంజీవిని కలిసి, మాట్లాడారు. ఇదే విషయమై ఆదివారం చిరంజీవిని కలిసిన అనంతరం మీడియాతో సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''ఈ సమస్య పరిష్కారానికి తన వంతుగా కార్మికులతో మాట్లాడతానని చిరంజీవిగారు చెప్పారు. ఓ పెద్ద మనిషిగా ఇరు వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఉన్నారాయన. ఈరోజు (సోమవారం) ఫెడరేషన్ వారు చిరంజీవిగారిని కలవనున్నారు. నిర్మాతలు కూడా చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. చిన్న నిర్మాతలు బాగా ఇబ్బందిపడుతున్నారు. లేబర్ కమిషనర్ రికార్డ్ రూల్స్ ప్రకారం సినిమాలకు వర్క్ చేయలేమని కార్మికులు అంటున్నారు త్వరలో ఇష్యూ సాల్వ్ అవుతుందని నమ్ముతున్నాను'' అని అన్నారు. అలాగే ఆదివారం సాయంత్రం చిరంజీవి ఇంటికి కొందరు చిన్న నిర్మాతలు వెళ్లి, సినీ కార్మికుల సమ్మె, చిన్న నిర్మాతల ఇబ్బందులపై చర్చించారు. ఈ నేపథ్యంలో ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ ప్రెసిడెంట్ వెంకట కృష్ణ మాట్లాడుతూ– ''రేవంత్ రెడ్డిగారు, కోమటి రెడ్డిగారు మాకు అండగా ఉన్నారు. చిరంజీవి, బాలయ్య, మోహన్‌బాబుగార్లకు మా గోడు వినిపిస్తాం. సినీ పెద్దలు, ప్రభుత్వం కలుగజేసుకొని మా కష్టాలను తీరుస్తారని ఆశిస్తున్నాం'' అని పేర్కొన్నారు.

ఓ ఆటగాడి కథ

విజయ రామరాజు టైటిల్ రోల్‌లో రూపొందిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా యాంథమ్‌ని విడుదల చేశారు. చిత్ర సంగీత దర్శకుడు విఘ్నేష్ భాస్కరన్ స్వరపరచిన ఈ పాటకు విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించారు. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్య కుమార్, విఘ్నేష్ పాయ్ ఆలపించారు. విజయ రామరాజు ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కి సంబంధించిన విజువల్స్ ఈ పాటలో కనిపిస్తాయి. ఓ కబడ్డీ ప్లేయర్ నిజ జీవిత కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ''ఎమోషనల్ కథాంశంతో రూపొందించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందనే నమ్మకం ఉంది'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.



● విజయ రామరాజు


మిడిల్ క్లాస్ కుర్రాడు



● అమర్‌దీప్

అమర్‌దీప్, సైలీ జంటగా నటించిన చిత్రం 'సుమతీ శతకం'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో ఎమ్ఎమ్ నాయుడు దర్శకత్వంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా నుంచి అమర్ దీప్ ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. ''ఈ చిత్రంలో ఓ మిడిల్ క్లాస్ కుర్రాడిలా అమర్‌దీప్ కనిపిస్తారు. దసరాకి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

కుటుంబ అనుబంధాలతో...



● ఎస్ఎస్ఆర్ చౌదరి

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలతో పాటు హీరోగా నటించి, 'నేను నా లల్లి' అనే చిత్రాన్ని నిర్మించారు ఎస్.ఎస్.ఆర్. చౌదరి. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం గురించి ఆదివారం ఎస్.ఎస్.ఆర్. చౌదరి మాట్లాడుతూ – ''నిర్మాణానంతర పనులన్నీ చకచకా సాగుతున్నాయి. ఒక కుటుంబంలో ఉండే అమ్మ, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు... ఇలా అందర్నీ ఈ సినిమా ఆలోచింప జేసేలా చేస్తుంది. కుటుంబ అనుబంధాలతో సాగే ఈ కథ మీద ఉన్న నమ్మకంతో నేనే దర్శకత్వం వహించి, నిర్మించా'' అన్నారు. ''ఈ చిత్రంలోని నా పాత్ర ఫ్యామిలీ ఆడియన్స్‌కి గుర్తుండిపోతుంది'' అన్నారు హీరోయిన్ తస్లీమ్.

ఓటీటీ

ఇది చూడొచ్చు

తండ్రి వేదన... తనయుడి ఆవేదన

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సర్ జమీన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మనవాడు అనేవాడు మనకోసం ఎప్పటికీ నిలబడతాడు. పగవాడు మన పతనం కోసం ఆరాటపడతాడు. మంచిని దూరం చేసుకుని చెడు మార్గాన వెళుతూ మనవాడు కూడా పగవాడైతే... అదే 'సర్ జమీన్' సినిమా. ఇదో దేశభక్తి స్ఫూర్తిగా అల్లుకున్న కథ. దర్శకుడు కాయోజీ ఇరానీ తెరకెక్కించిన ఈ సినిమాలో ముఖ్య పాత్రధారులుగా మలయాళ నటుడు పృథ్వీరాజ్, బాలీవుడ్ నటి కాజోల్, నటుడు సైఫ్ అలీఖాన్ కొడుకు ఇబ్రహీం అలీఖాన్ నటించారు. నాలుగు ముఖ్య పాత్రలు, రెండున్నర గంటల నిడివితో దేశ సరిహద్దు వివాదాంశంపై సైనిక నేపథ్యంలో కూడిన సినిమా తీయడం అంటే మాటలు కాదు. ఈ సినిమా స్క్రీన్ ప్లేతో ప్రేక్షకుడిని ఉగ్రుత ఊగించారు దర్శకుడు. అంతలా ఏముందీ కథలో ఓసారి చూద్దాం. జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో కల్నల్ విజయ్ మీనన్ పోస్టింగ్ జరుగుతుంది. విజయ్ మీనన్ మహా దేశభక్తుడు. అతనికి హర్మన్ అనే కొడుకుంటాడు. దేశమా, ప్రాణమా అంటే నిర్మొహమాటంగా దేశం అని ఎంచుకునే రకం విజయ్. ఈ విషయంలోనే తన తండ్రి విజయ్ పై ద్వేషం పెంచుకుంటాడు హర్మన్. పైగా తను భయస్తుడు కూడా. ఓసారి తీవ్రవాదుల ఘర్షణలో హర్మన్‌ను టెర్రరిస్టులు కిడ్నాప్ చేస్తారు. తమ ముఖ్య అనుచరుడిని విడిపించాలని... లేదంటే నీ కొడుకుని చంపేస్తామని టెర్రరిస్టులు విజయ్‌ని హెచ్చరిస్తారు. ఇవన్నీ పట్టించుకోకుండా తాను బంధించిన టెర్రరిస్టులపై కాల్పులు జరుపుతాడు విజయ్. ఆ తరువాత విజయ్, అతని భార్య మెహర్ తమ బిడ్డ చనిపోయాడని భావిస్తారు. కానీ తీవ్రవాదులు హర్మన్‌కి తండ్రి మీదున్న ద్వేషాన్ని ఆయుధంగా చేసుకుని హర్మన్‌ని తీవ్రవాదిగా తయారు చేసి, మళ్ళీ విజయ్ దగ్గరకు పంపుతారు. ఆ తరువాత విజయ్, అతని భార్య తమ కొడుకు టెర్రరిస్ట్ అని కనిపెడతారా? లేదా అన్నదే సినిమా. దేశం మీద మమకారం పెంచుకున్న తండ్రి వేదన గెలుస్తుందా... లేక తండ్రి మీద తనయుడు పెంచుకున్న ద్వేషం గెలుస్తుందా? అన్నది హాట్ స్టార్‌లోనే చూడాలి. ఈ సినిమా ఓ సూపర్ పేట్రియాటిక్ థ్రిల్లింగ్ ఫీలింగ్ ఇస్తుంది. ఆఖర్లో వచ్చే ట్విస్ట్ సినిమా మొత్తానికే హైలైట్. మస్ట్ వాచ్.



– హరికృష్ణ ఇంటూరు



రన్నరప్ అనాహత్ సింగ్

న్యూసౌత్‌వేల్స్ స్క్వాష్ బేగా ఓపెన్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 53వ ర్యాంకర్ అనాహత్ సింగ్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తుది పోరులో అనాహత్ ఓటమి చవిచూసింది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన అనాహత్ ఫైనల్లో 11-9, 5-11, 8-11, 4-10తో రెండో సీడ్ హాబిబా హానీ (ఈజిప్ట్) చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్‌ను దక్కించుకున్న అనాహత్ ఆ తర్వాత రెండు గేమ్‌లను చేజార్చుకుంది. మూడో గేమ్‌లో స్కోరు 4-10 వద్ద అనాహత్ గాయపడటంతో మ్యాచ్ నుంచి వైదొలిగింది.

కాంస్య పతకం కోసం విశాల్ పోరు



ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ విశాల్ కాంస్య పతకం కోసం పోటీపడనున్నాడు. బల్గేరియాలో ఆదివారం ఈ మెగా ఈవెంట్ మొదలైంది. 97 కేజీల విభాగం సెమీఫైనల్లో విశాల్ 9-11 పాయింట్ల తేడాతో మగోమెదోవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో విశాల్ 12-9తో నోవా లెబౌట్జ్ (జపాన్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-0తో ఖాడునూ (పోలాండ్)పై గెలిచాడు.

ఆసియా కప్ హాకీ టోర్నీ మస్కట్ 'చాంద్' ఆవిష్కరణ

రాజ్‌గిర్ (బిహార్): ఈ నెలాఖరులో భారత్ ఆతిథ్యమిచ్చే ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీకి సంబంధించి కనువిందు చేసే 'మస్కట్'ను ఆదివారం ఆవిష్కరించారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధికారిక మస్కట్‌గా 'చాంద్' (చందమామ)ను ఆవిష్కరించారు. భారత దివంగత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ ప్రాక్టీస్ స్ఫూర్తితో పాటు బిహార్‌లోని ప్రఖ్యాత వాల్మీకి టైగర్ రిజర్వ్‌లోని పులుల శౌర్యానికి ప్రతీకగా 'చాంద్'ను ఆవిష్కరించినట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) తెలిపింది. ఫ్లడ్‌లైట్లు కాదు కదా... కనీసం పూర్తిస్థాయి వీధి దీపాలు లేని ఆ రోజుల్లో చందమామ పంచిన వెన్నెల వెలుగుల్లోనే ధ్యాన్‌చంద్ తన ప్రాక్టీస్‌ను పూర్తి చేసేవారు. ఆ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఆయన పుట్టిన రోజున (ఆగస్టు 29) మొదలయ్యే ఆసియా కప్ టోర్నీకి 'చాంద్' మస్కట్‌ను ఖరారు చేశారు. సెప్టెంబర్ 7 వరకు రాజ్‌గిర్‌లోని స్టేడియంలో ఈ టోర్నీ జరుగుతుంది. ఆసియా దేశాలు పాల్గొనే ఈ టోర్నీలో మొదట్లో ఆసక్తి కనబరిచిన దాయాది పాకిస్తాన్ జట్టు చివరకు వైదొలగింది. పాకిస్తాన్ స్థానంలో బంగ్లాదేశ్ బరిలోకి దిగనుంది. ఆసియా కప్ టోర్నీ విజేత వచ్చే ఏడాది ఆగస్టులో బెల్జియం-నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది. 16 జట్లు పోటీపడే ప్రపంచకప్ టోర్నీకి ఇప్పటికే ఆస్ట్రేలియా, స్పెయిన్, అర్జెంటీనా, జర్మనీ, న్యూజిలాండ్ జట్లు అర్హత సాధించాయి.



భారత జూనియర్ జట్టు హెడ్ కోచ్ శ్రీజేశ్‌కు మస్కట్‌తో కూడిన జ్ఞాపికను అందజేస్తున్న బిహార్ సీఎం నితీశ్ కుమార్



బాబర్, రిజ్వాన్‌లకు చుక్కెదురు

ఆసియా కప్ జట్టులో దక్కని చోటు ● 17 మందితో పాక్ జట్టు ప్రకటన



లాహోర్: సీనియర్ బ్యాటర్లు బాబర్ ఆజమ్, మొహమ్మద్ రిజ్వాన్‌లకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) షాక్ ఇచ్చింది. వచ్చే నెలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా జరగనున్న ఆసియా కప్ టి20 టోర్నమెంట్ కోసం ప్రకటించిన జాతీయ జట్టులో ఈ ఇద్దరికీ చోటు కల్పించలేదు. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఆసియాకప్ కోసం పీసీబీ ఆదివారం 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. 2021 టి20 వరల్డ్‌కప్‌లో భారత జట్టుపై పాకిస్తాన్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన ఈ ఇద్దరు ఓపెనర్లు ఇటీవలి కాలంలో మెరుగైన ప్రదర్శన కనబర్చలేకపోతుండటంతో సెలెక్టర్లు వీరిద్దరినీ పక్కన పెట్టారు. ఈ ఇద్దరూ గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఫార్మాట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఆసియా కప్ ప్రారంభానికి ముందు యూఏఈ వేదికగా... అఫ్గానిస్తాన్, యూఏఈతో కలిసి పాక్ జట్టు ముక్కోణపు సిరీస్ కూడా ఆడనుంది. పాకిస్తాన్ హెడ్ కోచ్ మైక్ హెసన్ మాట్లాడుతూ... 'బాబర్‌లాంటి ఆటగాడి సేవలు అందుబాటులో లేకపోవడం కష్టమైందే. ఒకటీ రెండు మ్యాచ్‌ల్లో ప్రదర్శన ఆధారంగా అతడి ప్రతిభను అంచనా వేయలేం. అయితే స్పిన్‌ను ఎదుర్కోవడంతో పాటు స్ట్రయిక్ రేట్ పెంచుకునే విషయంలో అతడు నిరంతరం శ్రమిస్తున్నాడు. ఇటీవలి ప్రదర్శన ఆధారంగానే జట్టు ఎంపిక జరిగింది. ఫర్హాన్ గత ఆరు మ్యాచ్‌ల్లో మూడింట ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌లు అందుకున్నాడు' అని అన్నాడు. ఇక సీనియర్ పేసర్ షాహీన్ అఫ్రిదికి ఈ జట్టులో చోటు దక్కింది. అతడితో పాటు మొహమ్మద్ వసీమ్, సల్మాన్ మీర్జా కూడా టీమ్‌లో ఉన్నారు. ఎనిమిది దేశాలు పాల్గొంటున్న ఆసియా కప్‌లో భారత జట్టుతో కలిసి పాకిస్తాన్ గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగనుంది.

పాకిస్తాన్ జట్టు: సల్మాన్ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారీస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుసేన్ తలత్, ఖుష్‌దిల్ షా, మొహమ్మద్ హారీస్, మొహమ్మద్ నవాజ్, మొహమ్మద్ వసీమ్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ షా అఫ్రిది, సూఫియాన్ మొఖీమ్.

అలీసా అదరహో

85 బంతుల్లో 23 ఫోర్లు, 3 సిక్స్‌లతో 137 నాటౌట్

- **మూడో వన్డేలో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు విజయం**
- 9 వికెట్లతో భారత 'ఎ' జట్టు ఓటమి
- రాణించిన షఫాలీ వర్మ, యస్తిక
- 2-1తో టీమిండియాదే సిరీస్



షఫాలీ



అలీసా హీలీ

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా గడ్డపై ఇప్పటికే వన్డే సిరీస్ చేజిక్కించుకున్న భారత మహిళల 'ఎ' జట్టు చివరి మ్యాచ్‌లో పరాజయం పాలైంది. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో ఓడి 2-1తో సిరీస్ ఖాతాలో వేసుకుంది. స్టార్ బ్యాటర్ అలీసా హీలీ (85 బంతుల్లో 137 నాటౌట్; 23 ఫోర్లు, 3 సిక్స్‌లు) విజృంభించడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు అలవోకగా విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఎ' జట్టు 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షఫాలీ వర్మ (59 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధశతకంతో మెరవగా... వికెట్ కీపర్ యస్తిక భాటియా (54 బంతుల్లో 42; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించింది. నందిని కశ్యప్ (53 బంతుల్లో 28; 2 ఫోర్లు), రాఘ్వీ బిస్త్ (32 బంతుల్లో 18; 2 ఫోర్లు), తనూశ్రీ సర్కార్ (22 బంతుల్లో 17), కెప్టెన్ రాధా యదవ్ (22 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. తేజల్ హసబ్నిస్ (1) విఫలమైంది. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు బౌలర్లలో తహిలా మెక్‌గ్రాత్ 40 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. సియానా జింజర్ 50 పరుగులిచ్చి 2 వికెట్లు, ఎల్లా హేవార్డ్ 43 పరుగులిచ్చి 2 వికెట్లు, అనిక లెరాయిడ్ 16 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 27.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 222 పరుగులు చేసింది. హీలీ అజేయ శతకంతో చెలరేగగా... తహీలా విల్సన్ (51 బంతుల్లో 59; 8 ఫోర్లు) అర్ధశతకం సాధించింది. భారత బౌలర్లలో రాధా యాదవ్ ఒక వికెట్ పడగొట్టింది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి ఇక్కడే ఏకైక అనధికారిక టెస్టు మ్యాచ్ జరగనుంది.

దంచికొట్టిన హీలీ..

గాయం నుంచి కోలుకొని వచ్చిన అలీసా హీలీ... భారత 'ఎ' జట్టుతో పరిమిత ఓవర్ల సిరీస్‌లను సంపూర్ణంగా వినియోగించుకుంది. మొదట టి20 సిరీస్‌తో లయ అందుకున్న హీలీ... వన్డే సిరీస్‌లో అదరగొట్టింది. గత మ్యాచ్‌లో త్రుటిలో సెంచరీ చేజార్చుకున్న అలీసా... ఈ మ్యాచ్‌లో అజేయ శతకంతో అదరగొట్టింది. 7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హీలీ ఇచ్చిన క్యాచ్‌ను భారత ఫీల్డర్లు నేలపాలు చేయగా... దాన్ని వినియోగించుకున్న ఆస్ట్రేలియా సీనియర్ జట్టు రెగ్యులర్ కెప్టెన్ బౌండరీలతో చెలరేగింది. రెండో ఓవర్‌లో ఫోర్‌తో మోత ప్రారంభించిన హీలీ... భారీ సిక్స్‌తో లక్ష్యఛేదనను పూర్తి చేసేంతవరకు అదే జోరు కొనసాగించింది. ఆంధ్రప్రదేశ్ బౌలర్ షబ్నమ్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన హీలీ... మిన్ను మణి, తనూజ కన్వర్ ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టింది. మరో ఎండ్ నుంచి తహిలా విల్సన్ కూడా ధాటిగా ఆడటంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. షబ్నమ్ ఓవర్‌లో మరో రెండు ఫోర్లు కొట్టిన హీలీ 30 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. తొలి వికెట్‌కు 137 పరుగులు జోడించిన అనంతరం తహిలా వెనుదిరగగా... హీలీ మాత్రం అదే జోష్ కనబర్చింది. మిన్ను మణి వేసిన ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో 4, 4, 6 కొట్టి 64 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకుంది. మరో ఎండ్ నుంచి రాచెల్ (21 నాటౌట్) సహకారం లభించడంతో హీలీ జట్టును విజయతీరాలకు చేర్చింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఈపీఎఫ్‌వోలో అకౌంట్స్ ఆఫీసర్

కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖలోని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్‌వో). ఈ సంస్థలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఈ నేపథ్యంలో.. ఈపీఎఫ్‌వోలో ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదితర సమాచారం..

» 230 ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు
» రాత పరీక్ష, ఇంటర్వ్యూతో ఎంపిక



- మొత్తం పోస్టుల సంఖ్య: 230

పోస్టుల వివరాలు

- **ఈపీఎఫ్ఓలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్:** 156 పోస్టులు. ఇవి శాశ్వత, గ్రూప్ బి నాన్ మినిస్టీరియల్ పోస్టులు.
- **ఈపీఎఫ్ఓలో అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్:** 74 పోస్టులు. ఇవి శాశ్వత, గ్రూప్ ఏ నాన్ మినిస్టీరియల్ పోస్టులు.

అర్హతలు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన అర్హత ఉండాలి. కంపెనీ లా/లేబర్ లాస్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.

వయసు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లలోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టులకు 35 ఏళ్లలోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు 7వ సీపీసీ ప్రకారం- లెవెల్-8 వేతన శ్రేణి అందుతుంది.
- అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టులకు 7వ సీపీసీ ప్రకారం- లెవెల్-10 వేతన శ్రేణి అందుతుంది.

ప్రొబేషన్

ఎంపికైన అభ్యరులకు రెండేళ్ల ప్రొబేషన్ ఉంటుంది. సంస్థ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉన్నప్పటికీ.. దేశంలో ఎక్కడైనా నియమించే అవకాశం ఉంది.

ఎంపిక విధానం

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పెన్-పేపర్ విధానంలో కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీఆర్‌టీ) నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల తరహాలో పరీక్ష జరుగుతుంది. అన్ని ప్రశ్నలకు సమాన మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కును తగ్గిస్తారు.
- సీఆర్‌టీలో చూపిన ప్రతిభ ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా 78 కేంద్రాల్లో సీఆర్‌టీ ఉంటుంది. సీఆర్‌టీ, ఇంటర్వ్యూ మార్కులకు 75: 25 నిష్పత్తిలో వెయిటేజీ ఇచ్చి తుది ఎంపిక చేపడతారు.

సిలబస్ అంశాలు

- అభ్యర్థి ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరీక్షించేలా జనరల్ ఇంగ్లిష్ విభాగంలో ప్రశ్నలు ఉంటాయి. దీనికోసం ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీపై అవగాహన పెంచుకోవాలి. పద ప్రయోగం తెలుసుండాలి.
- భారత దేశ చరిత్ర-సంస్కృతి, వారసత్వం, స్వాతంత్ర్యోద్యమంపై ప్రశ్నలు అడుగుతారు.
- భారత ఆర్థిక వ్యవస్థలో తాజా పరిణామాలతో పాటు డెవలప్‌మెంటల్ అంశాలపైనా ప్రశ్నలు ఉంటాయి.
- భారత రాజ్యాంగం, గవర్నెన్స్‌పై ప్రశ్నలు అడుగుతారు.
- జనరల్ సైన్స్, అదేవిధంగా బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీపై ప్రశ్నలు అడుగుతారు.
- ఇండస్ట్రియల్ రిలేషన్స్, లేబర్ లాస్, సోషల్ సెక్యూరిటీ ఇన్ ఇండియా నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- ప్రిన్సిపుల్స్ ఆఫ్ అకౌంటెన్సీ, ఆడిటింగ్, ఇన్సూరెన్స్‌పై ప్రశ్నలు అడుగుతారు.
- అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కరెంట్ ఈవెంట్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 29.07.2025
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 18.08.2025
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం



ఇస్రో-ఎల్‌పీఎస్‌సీ, తిరువనంతపురంలో 23 పోస్టులు

తిరువనంతపురంలోని ఇస్రోకి చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్‌సీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-12, సబ్ ఆఫీసర్-01, టెక్నీషియన్ బి-06, హెవీ వెహికల్ డ్రైవర్ ఏ-02, లైట్ వెహికల్ డ్రైవర్ ఏ-02.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సబ్ ఆఫీసర్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్, హెవీ వెహికల్ డ్రైవర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 18 ఏళ్లు నిండిఉండాలి.
» **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400, సబ్ ఆఫీసర్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, టెక్నీషియన్‌కు రూ.21,700 నుంచి రూ.69,100, హెవీ వెహికల్ డ్రైవర్‌కు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2025
» **వెబ్‌సైట్:** https://www.isro.gov.in

బీఐఎస్, న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్).. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** డిగ్రీ(సైన్స్/ఇంజనీరింగ్/బీఈ/బీటెక్), ఎంబీఏ లేదా తత్సమాన ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.
» **వయసు:** 01.08.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ప్రాక్టికల్, రాతపరీక్ష, టెక్నికల్ నాలెడ్జ్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.09.2025
» **వెబ్‌సైట్:** https://www.bis.gov.in

జిప్‌మర్‌లో 98 ఫ్యాకల్టీ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) పుదుచ్చేరి, కరైకల్ క్యాంపస్‌లలో రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 98.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-36, అసిస్టెంట్ ప్రొఫెసర్-62.
» **విభాగాలు:** అనెస్థీషియాలజీ, అనాటమీ, క్లినికల్ ఇమ్యునాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, గెరియాట్రిక్ మెడిసిన్, మైక్రోబయాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పీడియాట్రిక్స్,ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంఎస్సీ, ఎంసీహెచ్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18.09.2025 నాటికి ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2025
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ నర్స్ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ నర్స్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 26.09.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.24,000. (రూ.20,000+18% హెచ్ఆర్ఏ).
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.09.2025
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

నాల్కో, భువనేశ్వర్‌లో అడ్వైజర్ పోస్టులు

భువనేశ్వర్‌లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో).. ఒప్పంద ప్రాతిపదికన అడ్వైజర్(ల్యాండ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 29.08.2025నాటికి 63 ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.60,000 నుంచి రూ.80,000.
» **ఎంపిక విధానం:** పని అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీజీఎం(హెచ్ఆర్) ఆర్‌పీ, రిక్రూట్‌మెంట్ సెల్, నాల్కో భవన్, పీ/1, నయాపల్లి, భువనేశ్వర్-751013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.08.2025.
» **వెబ్‌సైట్:** https://mudira.nalcoindia.co.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 58	నిఫ్టీ ▲ 12
80,598	24,631

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	21,623	▽	88
డోజోన్స్	44,946	▲	35
ఎఫ్‌టీఎస్ఈ 100	9,139	▽	38
డాక్స్	24,360	▽	18
షాంఘై	3,697	▲	30
నికాయ్	43,378	▲	729

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.00	119.99
€	యూరో	ఎస్‌బీఐ	101.20	103.93
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.28	58.53
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.46	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.95	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

సిప్ సరే.. ఇక సిఫ్ చేస్తారా!

కొత్తగా స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్

సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్‌కు భిన్నం

కనీస పెట్టుబడి రూ.10 లక్షలు

పీఎంఎస్, ఏఐఎఫ్ సాధనాలూ ఉన్నాయ్

రిస్క్, రాబడుల ఆధారంగా ఎంపిక

రూ.33.47 లక్షల కోట్లు
2025 జూన్ చివరికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం)

రూ.32 లక్షల కోట్లు
2025 ఏప్రిల్ చివరికి పీఎంఎస్‌ల నిర్వహణలోని ఆస్తులు

రూ.13.49 లక్షల కోట్లు
2025 మార్చి చివరికి ఏఐఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ



పెట్టుబడుల ప్రపంచం ఎప్పుడూ ఒకే మాదిరి ఉండదు. ఎప్పటికప్పుడు కొంగొత్త సాధనాలు అందుబాటులోకి వస్తుంటాయి. ఒకప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎల్ఐసీ ఎండోమెంట్ పాలసీల హవా. ఇప్పుడు మెజారిటీ పెట్టుబడులు ఈక్విటీల వైపే. ఇందులోనూ స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్ఐఎఫ్–సిఫ్) పేరుతో కొత్త సాధనం అందుబాటులోకి వచ్చింది. దీనికితోడు ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్‌లు)కు సైతం ఆదరణ పెరుగుతోంది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) ఎప్పటి నుంచో ఉన్నదే. ఈ భిన్న సాధనాల్లో రిస్క్, రాబడుల పరంగా ఎంతో వ్యత్యాసం గమనించొచ్చు. ఇన్వెస్టర్లందరికీ ఈ సాధనాలు అనుకూలమని చెప్పలేం. తమ ఆకాంక్షలకు అనుగుణంగా సరైన సాధనాన్ని ఎంపిక చేసుకుని, దీర్ఘకాలం పాటు కొనసాగితే సంపద సృష్టి సాధ్యమే.

సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, పీఎంఎస్, ఏఐఎఫ్, సిఫ్ మధ్య పోలికలు తక్కువ. వైరుధ్యాలే ఎక్కువ. రాబడుల్లోనూ స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది. అన్ని ఆదాయ వర్గాల వారికీ అందుబాటులో ఉన్న సాధనం సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్. ఇక సిఫ్, పీఎంఎస్, ఏఐఎఫ్ అన్నీ కూడా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టే వారికి ఉద్దేశించినవి. వీటి నిర్వహణ తీరులోనూ వైరుధ్యం కనిపిస్తుంది. వీటన్నింటిపైనా సెబీ నియంత్రణ, పర్యవేక్షణ ఉంటుంది. ఎంపిక బాధ్యత మాత్రం ఇన్వెస్టర్లదే.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్

ఈక్విటీయే కాకుండా డెట్, గోల్డ్, రియల్ ఎస్టేట్ తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్ వీలు కల్పిస్తున్నాయి. విడివిడిగా, లేదంటే వీటి కలయికతో కూడిన హైబ్రిడ్ ఫండ్స్‌ను సైతం ఆఫర్ చేస్తున్నాయి. వేలాది పథకాల నుంచి ఇన్వెస్టర్లు తమకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవచ్చు. రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సెబీ పర్యవేక్షణ, నియంత్రణల మధ్య పనిచేస్తుంటాయి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా వారం, పక్షం, నెలకొకసారి చొప్పున పెట్టుబడులు పెట్టుకోవచ్చు. పెట్టుబడి నుంచి ఆదాయం కోరుకుంటే సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ద్వారా ప్రతి నెలా నిర్ణీత మొత్తం ఉపసంహరించుకోవచ్చు. లక్షలాది మంది ఇన్వెస్టర్లను ఉద్దేశించి రూపొందించిన సాధనాలు ఇవి. పదుల సంఖ్యలో విభాగాల నుంచి తమకు అనుకూలమైన ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. లిక్విడిటీ ఎక్కువ. అంటే కోరుకున్నప్పుడు పెట్టుబడులను సులభంగా, వేగంగా వెనక్కి తీసుకోగలరు. ఇందులో యాక్టివ్, ప్యాసివ్ ఫండ్స్ ఉంటాయి. ప్యాసివ్ ఫండ్స్‌లో 0.2 శాతం (మొత్తం పెట్టుబడుల విలువలో), యాక్టివ్ ఫండ్స్‌లో 0.5 శాతం నుంచి ఎక్స్‌పెన్స్ రేషియో ప్రారంభమవుతుంది.

రాబడులు: ఎంపిక చేసుకున్న విభాగం, పథకం ఆధారంగా 5–20 శాతం మధ్య దీర్ఘకాలంలో ఉంటాయి. పన్ను బాధ్యత: ఈక్విటీ ఫండ్స్(ఈక్విటీల్లో కనీసం 65 శాతం పెట్టుబడులు పెట్టే), ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో పెట్టుబడులను ఏడాదిలోపు విక్రయించినప్పుడు వచ్చిన లాభంపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఏడాది తర్వాత విక్రయించినప్పుడు వచ్చిన లాభం మొదటి రూ.1.25 లక్షలపై పన్ను లేదు. తర్వాతి మొత్తంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఇక డెట్ ఫండ్స్‌లో పెట్టుబడిని ఎప్పుడు విక్రయించినా వచ్చిన లాభంపై పన్ను ఒకే మాదిరి ఉంటుంది. లాభాన్ని వ్యక్తిగత వార్షిక ఆదాయానికి కలిపి పన్ను చెల్లించాలి.

పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)



ఇన్వెస్టర్ల రాబడుల ఆకాంక్షలకు అనుగుణంగా పెట్టుబడుల సేవలు అందించేవి పీఎంఎస్ సంస్థలు. అనుభవజ్ఞులైన ఫండ్ మేనేజర్లు ఇన్వెస్టర్ల ఖాతాల నుంచే వారి తరఫున పెట్టుబడుల వ్యవహారాలను నిర్వహిస్తారు, పర్యవేక్షిస్తుంటారు. కనీసం రూ.50 లక్షలు అంతకుమించి పెట్టుబడి పెట్టాలి. ఇన్వెస్టర్ల రాబడి ఆకాంక్షలు, ఎంత రిస్క్ తీసుకుంటారు తదితర అంశాల ఆధారంగా వారి కోసమే ప్రత్యేకమైన పోర్ట్‌ఫోలియోని నిర్వహిస్తారు. కొత్త అవకాశాలను గుర్తించినప్పుడు పోర్ట్‌ఫోలియోలో మార్పులు చేర్పులు చేస్తుంటారు.

పీఎంఎస్‌లోనూ డిస్క్రీషినరీ, నాన్ డిస్క్రీషినరీ అని రెండు రకాలు ఉంటాయి. డిస్క్రీషినరీలో అయితే ఫండ్ మేనేజర్ తన విచక్షణ ఆధారంగా స్వతంత్రంగా పెట్టుబడుల నిర్ణయాలు అమలు చేస్తుంటారు. నాన్ డిస్క్రీషినరీలో క్లయింట్ అనుమతి తీసుకున్న తర్వాతే లావాదేవీలు నిర్వహిస్తుంటారు. ఈ రెండూ కాకుండా అడ్వైజరీ పేరుతో మరో విభాగం కూడా ఉంది. ఇక్కడ ఇన్వెస్టర్‌కు పోర్ట్‌ఫోలియో మేనేజర్ సలహాలు ఇవ్వడం వరకే పరిమితం అవుతారు. వాటిని పాటించడం, పాటించకపోవడం ఇన్వెస్టర్ అభీష్టమే. మ్యూచువల్ ఫండ్స్‌లో లక్షలాది మంది ఇన్వెస్టర్లను దృష్టిలో పెట్టుకుని పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తుంటారు. పీఎంఎస్‌లలో ఒక్కో ఇన్వెస్టర్ అవసరాలకు అనుగుణంగా విడిగా పోర్ట్‌ఫోలియో ఉంటుంది. ఫండ్స్ మాదిరే పీఎంఎస్‌ల్లోనూ పారదర్శకత ఎక్కువ. పెట్టుబడిదారులకు ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలి. కానీ, మ్యూచువల్ ఫండ్స్ మాదిరి వీటి పనితీరు, పోర్ట్‌ఫోలియో తదితర సమాచారం ఓపెన్ ప్లాట్‌ఫామ్‌లపై (ఆన్‌లైన్ ప్రపంచం) ఉండదు. పీఎంఎస్ ఇన్వెస్టర్లకే తెలుస్తుంది. ఈక్విటీలతోపాటు డెరివేటివ్స్ పొజిషన్ల ద్వారా అధిక రాబడినిచ్చే విధంగా పీఎంఎస్‌లు పనిచేస్తాయి. సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్ కంటే ఇందులో లిక్విడిటీ కొంచెం తక్కువ. వీటిలో ఫీజులు 3.5 శాతం నుంచి 5.5 శాతం వరకు ఉంటాయి. ఫీజును ఇన్వెస్టర్ స్వయంగా చెల్లించడం వీలుకానప్పుడు, పోర్ట్‌ఫోలియోలోని కొన్ని స్టాక్స్‌ను విక్రయించడం ద్వారా పీఎంఎస్ సంస్థ తన ఫీజులను రాబట్టుకుంటుంది.

రాబడులు: గత ఏడాది కాలంలో సగటు రాబడులు 30 శాతంగా, ఐదేళ్ల కాలంలో 18.99 శాతం, పదేళ్లలో 17.35 శాతం చొప్పున ఉన్నాయి.

పన్ను బాధ్యత: పీఎంఎస్ ఫండ్ మేనేజర్లు కొనుగోలు చేసిన షేర్లు ఇన్వెస్టర్ డీమ్యాట్ ఖాతాలోనే ఉంటాయి. ఇన్వెస్టర్ పేరిటే చేస్తుంటారు కనుక ఈక్విటీలకు మాదిరే స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలోని కంపెనీలు జారీ చేసే డివిడెండ్ ఆదాయం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఫండ్ మేనేజర్లు పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్‌ను ఎంత తరచుగా మార్పులు, చేర్పులు చేస్తున్నారనే దాని ఆధారంగా పన్ను బాధ్యత ఆధారపడి ఉంటుంది.

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్‌లు)



ప్రైవేటు ఈక్విటీ, స్టార్టప్‌లు, హెడ్జ్ ఫండ్స్, డిస్ట్రెస్డ్ అసెట్స్ (ప్రాపర్టీ), డెట్, రియల్ ఎస్టేట్ తదితర సాధనాల్లో ఏఐఎఫ్‌లు పెట్టుబడులు పెడుతుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి కోటి రూపాయలు. ఇన్వెస్టర్లు అందరికీ అనుకూలమైన సాధనాలు కావు. వీటిలో మూడు కేటగిరీలు ఉన్నాయి. కేటగిరీ–1 ఫండ్స్.. ఆరంభ దశలోని వెంచర్లు, సోషల్ వెంచర్లు, సామాజిక ప్రభావం చూపించే ప్రాజెక్టులు, ఇన్‌ఫ్రాపై పెట్టుబడులు పెడతాయి. కేటగిరీ–2 ఏఐఎఫ్‌లు ప్రైవేటు ఈక్విటీ (పీఈ), రియల్ ఎస్టేట్ ఫండ్స్, డిస్ట్రెస్డ్ అసెట్స్ (ప్రాపర్టీ), డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కేటగిరీ–3 ఏఐఎఫ్‌లు హెడ్జింగ్ వ్యూహాలను అమలు చేస్తుంటాయి. లిస్టెడ్‌తోపాటు అన్‌లిస్టెడ్ కంపెనీలు, డెరివేటివ్స్‌లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. అవసరమైతే రుణం తీసుకుని మరీ ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. మూడు విభాగాల్లోనూ కేటగిరీ–3లో రిస్క్ చాలా ఎక్కువ. వీటిలో సాధారణంగా మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో లిక్విడిటీ తక్కువ. అధిక రిస్క్ తీసుకునే ధనిక ఇన్వెస్టర్లు (హెచ్ఎన్ఐలు), ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అనుకూలం.

సంప్రదాయ డెట్, ఈక్విటీలకు ప్రత్యామ్నాయంగా ఇతర పెట్టుబడుల అవకాశాలను ఇవి అందిస్తుంటాయి. వీటిలో స్పెక్యులేషన్ ఉండదు. కనుక అస్థిరతలు తక్కువ. అదే సమయంలో రిస్క్ ఎక్కువ. వీటిలో అసెట్ మేనేజ్‌మెంట్ ఫీజు 2 శాతం మేర ఉంటుంది. అంతే కాదు ఇన్వెస్టర్ల రాబడిపై 20 శాతం లెవీ కింద వసూలు చేస్తుంటాయి. లిక్విడిటీ తక్కువ. పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలంటే నిర్ణీత కాలం వరకు వేచి ఉండాల్సి వస్తుంది. ఏఐఎఫ్‌లు సెబీ నియంత్రణల పరిధిలో పనిచేస్తుంటాయి. సంప్రదాయ సాధనాలకు వెలుపల పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలని భావించే వారు, అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం, అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టగలిగే వారికి ఇవి ప్రత్యేకం.

రాబడులు: ఎంపిక చేసుకున్న విభాగం ఆధారంగా రాబడి భిన్నంగా ఉంటుంది.

పన్ను బాధ్యత: కేటగిరీ 1, 2 ఏఐఎఫ్‌లో మూలధన లాభాలపై 12.5 శాతం పన్ను చెల్లించాలి. ఒకవేళ వ్యాపార ఆదాయంగా పరిగణిస్తే అప్పుడు 30 శాతం పన్ను పడుతుంది. ఇక కేటగిరీ 3 ఏఐఎఫ్‌లలో లాభంపై పన్ను ఫండ్ స్థాయిలోనే అమలవుతుంది. ఇన్వెస్టర్ ప్రత్యేకంగా ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు.

స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (సిఫ్)




సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, పీఎంఎస్/ఏఐఎఫ్ మధ్య అంతరాన్ని భర్తీ చేసేందుకు సిఫ్ సాధనాన్ని సెబీ గతేడాది మార్చిలో ప్రవేశపెట్టింది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల పరంగా ఉన్న సౌలభ్యం వీటిల్లోనూ ఉంటుంది. పీఎంఎస్‌లో మాదిరి ఇన్వెస్టర్ల ఆకాంక్షలకు తగిన పెట్టుబడుల విధానాలు సిఫ్‌లలో ఉంటాయి. అన్‌లిస్టెడ్ సెక్యూరిటీలు, రియల్ ఎస్టేట్, స్ట్రక్చర్డ్ డెట్‌లో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛతో ఉంటాయి. కనీసం రూ.10లక్షల పెట్టుబడి పెట్టాలి. ఆధునిక ధోరణి కలిగి, అధిక రాబడి కోరుకునే దూకుడైన ఇన్వెస్టర్లకు అనుకూలం. డెరివేటివ్స్‌లోనూ పెట్టుబడులు పెడతాయి. లాంగ్–షార్ట్ వ్యూహాలను అమలు చేస్తుంటాయి. సమీప కాలంలో విలువ పెరుగుతుందని భావించినప్పుడు కొనుగోలు చేయడం (లాంగ్), స్టాక్స్ ధరలు ఖరీదుగా మారి సమీప కాలంలో దిద్దుబాటుకు గురవుతాయని భావించినప్పుడు డెరివేటివ్స్‌లో షార్ట్ చేస్తాయి (అమ్మకం). ఇందుకు ఫండమెంటల్స్‌తో పాటు, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో ఓపెన్ ఎండెడ్ (ఎప్పుడైనా కొనుగోలు, విక్రయాలకు అందుబాటులో), క్లోజ్ ఎండెడ్ (నిర్ణీత కాలం వరకు లాకిన్) ఉంటాయి.

పోర్ట్‌ఫోలియో వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాలి. సంప్రదాయ ఈక్విటీ ఫండ్స్ మాదిరే సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ఆప్షన్లు ఇందులో ఉంటాయి. ఈక్విటీ, డెట్ లేదంటే ఈక్విటీ–డెట్ కలిసిన హైబ్రిడ్ విధానాల్లో ఏదో ఒకదానినే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో పెట్టుబడి విలువ ఏదేనీ కారణంతో రూ.10 లక్షల లోపునకు తగ్గిపోతే.. ఇన్వెస్టర్ ఆ మేరకు తిరిగి సమకూర్చాల్సి ఉంటుంది. ఇందుకు 30 రోజుల గడువు ఉంటుంది. అప్పటికీ సర్దుబాటు చేయలేకపోతే పెట్టుబడులను ఏఎంసీ విక్రయించి వెనక్కి ఇచ్చేస్తుంది. ఇందులో పెట్టుబడుల ఉపసంహరణ గడువు 15 రోజులు. సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్‌తో పోలిస్తే సిఫ్‌లలో ఫండ్ మేనేజర్లు అధిక రాబడుల దృష్ట్యా అగ్రెస్సివ్ పెట్టుబడుల విధానాలను అనుసరించొచ్చు. ఈ విభాగంలో ఇటీవలే క్వాంట్ మ్యూచువల్ ఫండ్ 'సిఫ్ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్'ను ప్రారంభించింది. ఇందులో డెరివేటివ్స్‌కు కీలక పాత్ర ఉంటుంది.

రాబడి: ఇటీవలే అందుబాటులోకి వచ్చిన సాధనం. ఒకటి రెండేళ్లు గడిస్తే కానీ వీటిపనితీరును విశ్లేషించలేం.

పన్ను బాధ్యత: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మాదిరే వీటి రాబడులపైనా పన్ను అమలవుతుంది.

అదానీ ఎనర్జీ	మిరే అసెట్	కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 775 టార్గెట్: రూ. 990

ఎందుకంటే: విద్యుత్ ప్రసారం, పంపిణీ రంగ దిగ్గజం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఆర్డర్ బుక్ విలువ రూ. 59,000 కోట్లను అధిగమించింది. దీంతో రానున్న 4–5 ఏళ్లలో ట్రాన్స్‌మిషన్(ప్రసారం) అసెట్ బేస్ మూడు రెట్లకు జంప్‌చేయవచ్చని భావిస్తున్నాం. ఈ విభాగంలో పటిష్ట టెండరింగ్ కారణంగా ఆర్డర్‌బుక్ పుంజుకునే అవకాశముంది. 2025లో టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్(టీబీసీబీ) బిడ్స్‌లో 28 శాతం మార్కెట్ వాటా ఆక్రమించింది. ప్రభుత్వ భారీ పునరుత్పాదక ఇంధన(ఆర్ఈ) లక్ష్యం నేపథ్యంలో రూ. 84,000 కోట్ల విలువైన విద్యుత్ ప్రసార బిడ్స్‌లో కంపెనీ 20–25 శాతం పొందే వీలుంది. ఇక పంపిణీ(డిస్ట్రిబ్యూషన్) బిజినెస్‌లో అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్(ఏఈఎంఎల్), అనుబంధ సంస్థ ఎంయూఎల్ ప్రధాన నగదు ఆర్జనా కంపెనీలుగా పేర్కొనవచ్చు. డిస్కమ్‌ల ప్రయివేటైజేషన్ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో కంపెనీ ముందువరుసలో నిలిచే అవకాశముంది. పేరలల్ లైసెన్సింగ్ ద్వారా కొత్త ప్రాంతాలలో విస్తరించేందుకు వీలుంది. దీంతో వాణిజ్య, పారిశ్రామిక(సీఅండ్ఐ) కస్టమర్లకు సేవలు అందించవచ్చు. ఓవైపు యూపీ ప్రయివేటైజేషన్‌తోపాటు.. మరోపక్క నవీ ముంబైలో పేరలల్ లైసెన్సింగ్ ద్వారా లబ్ధి పొందేందుకు వీలు చిక్కుతుంది. కాగా.. రోజుకి 27,000 మీటర్ల ఏర్పాటు ద్వారా స్మార్ట్ మీటరింగ్ విభాగంలో కంపెనీ ముందుంది. మీటర్ల జీవితకాలం, ఎంబెడెడ్ పరిమితులు, అడ్వాన్స్‌డ్ మీటరింగ్ మౌలిక సదుపాయాలు తదితర అంశాల కారణంగా కంపెనీకి అవకాశాలు కొనసాగనున్నాయి. ప్రస్తుత ఆర్డర్లలో పురోభివృద్ధి, ప్రత్యేకతరహా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు వీటికి దన్నుగా నిలవనున్నాయి.

షేర్లు స్టాక్స్

స్విగ్గీ లిమిటెడ్	బీఎన్‌పీ పారిబా	కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 398 టార్గెట్: రూ. 480

ఎందుకంటే: ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ దిగ్గజం స్విగ్గీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో మిశ్రమ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1) పనితీరులో సానుకూలతలు ఉన్నప్పటికీ ప్రత్యర్థి దిగ్గజం జొమాటో సాధించిన పటిష్ట ఫలితాల కారణంగా మరుగునపడినట్లుగా భావించవచ్చు. ప్రధానంగా ఫుడ్ డెలివరీలో స్థూల ఆర్డర్ విలువ(జీవోవీ), క్విక్‌కామర్స్‌లో సగటు ఆర్డర్ విలువ(ఏవోవీ)లో స్విగ్గీ ప్రోత్సాహకర వృద్ధిని అందుకుంది. అయితే ఈ రెండు విభాగాలలోనూ నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు మా అంచనాలకంటే దిగువస్థాయిలో నమోదయ్యాయి. మరోవైపు రెండు బిజినెస్‌లలోనూ అంచనాలకంటే అధికంగా ఆదాయం సాధించింది. దీంతో నష్టాలు సైతం అధికంగా నమోదయ్యాయి. ఫుడ్ డెలివరీ బిజినెస్‌లో మార్జిన్లు సీజనల్‌గా మారిపోతుంటాయి. జొమాటో విషయంలోనూ ఇది కనిపిస్తుంటుంది. ఇక క్విక్‌కామర్స్ విభాగంలో అధిక నష్టాలు నమోదైనప్పటికీ స్విగ్గీ భవిష్యత్‌పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. వెరసి ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో లేదా వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) తొలి త్రైమాసికంలో క్విక్‌కామర్స్ బిజినెస్ నష్టాల నుంచి బయటపడే(బ్రేక్‌ఈవెన్) వీలున్నట్లు అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న రెండేళ్ల(2026–27, 2027–28)లో ఫుడ్ డెలివరీ బిజినెస్ ఇబిటా అంచనాలలో 0.3–0.4 శాతంమేర, క్విక్‌కామర్స్‌లో 0.1–0.2 శాతం మేర జీవోవీలో కోత పెడుతున్నాం. అయితే మధ్యకాలంలో నమోదుకానున్న నష్టాల కారణంగా క్విక్‌కామర్స్‌లో ప్రస్తుతం సరైన విలువ కనిపించకపోవడాన్ని కీలక రిస్కుగా పరిగణించవచ్చు. ఫుడ్ డెలివరీలో మార్కెట్ వాటా పెంచుకోవడం సానుకూల అంశం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

యూనియన్ ఎంఎఫ్.. డైవర్సిఫైడ్ ఈక్విటీ ఎఫ్‌వోఎఫ్




యూనియన్ మ్యుచువల్ ఫండ్ సంస్థ తాజాగా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్)ను ఆవిష్కరించింది. ఇది సెప్టెంబర్ 1న ప్రారంభమై 15న ముగుస్తుంది. ఈ ఎఫ్‌వోఎఫ్ ప్రధానంగా యూనియన్ ఎంఎఫ్‌కి చెందిన లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ ఈక్విటీ స్కీముల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీనితో మార్కెట్ టైమింగ్, దేనికి ఎంత కేటాయించాలి, ఒక ఫండ్ నుంచి మరో ఫండ్‌కి మారేటప్పుడు పడే పన్ను ప్రభావాలు మొదలైన వాటి గురించి ఆలోచించాల్సిన బాదరబందీ ఉండదని సంస్థ ఎండీ మధు నాయర్ తెలిపారు. స్వల్పకాలికం నుంచి దీర్ఘకాలికం వరకు వివిధ కాలావధుల వ్యూహాలతో, ఈక్విటీ ఫండ్‌లకు వర్తించే పన్ను ప్రయోజనాలను అందించేలా ఈ ఫండ్ ఆఫ్ ఫండ్ ఉంటుందని వివరించారు.

ఎడెల్‌వీజ్... మల్టీ అసెట్ ఓమ్ని ఎఫ్‌వోఎఫ్



ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ తాజాగా 'ఎడెల్‌వీజ్ మల్టీ అసెట్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్' (ఎఫ్‌వోఎఫ్) పేరుతో కొత్త పథకాన్ని ఇన్వెస్టర్ల కోసం తీసుకొచ్చింది. ఈ పథకం ఈక్విటీతోపాటు బంగారం, వెండి, డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతుంది. లంప్‌సమ్ లేదా సిప్ రూపంలో అయినా కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. 65% పెట్టుబడులను దేశీ ఈక్విటీలకు కేటాయిస్తుంది. పసిడి ఈటీఎఫ్‌లకు 10%, వెండి ఈటీఎఫ్‌లకు 10%, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు 15% చొప్పున కేటాయిస్తుంది. పెట్టుబడులను వైవిధ్యం చేసి, దీర్ఘకాలంలో స్థిరమైన రాబడిని అందించడం ఈ పథకం ఉద్దేశం. ఈ నెల 23న ఎన్ఎఫ్‌వో ముగుస్తుంది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్ కావడంతో తిరిగి సెప్టెంబర్ 11 నుంచి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. పెట్టుబడులను 90 రోజుల్లోపు ఉపసంహరించుకుంటే 1% ఎగ్జిట్ లోడ్ పడుతుంది.

మహిళల కోసం టాటా ఏఐఏ లైఫ్ శుభ్ శక్తి పాలసీ



ముంబై: జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్.. ప్రత్యేకంగా మహిళల కోసం శుభ్ శక్తి పేరిట టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ప్రెగ్నెన్సీ సమయంలో ప్రీమియం హాలిడే, పురుషుల పాలసీలతో పోలిస్తే ప్లాన్ వ్యవధి ఆసాంతం ప్రీమియంపై 15% సుమారు డిస్కౌంటు, సింగిల్ మదర్స్‌కి దీనికి అదనంగా 1% మేర జీవితకాల డిస్కౌంటులాంటి ఫీచర్లు ఈ పాలసీలో ఉంటాయి. అలాగే సర్వికల్ క్యాన్సర్, హెచ్‌పీవీ మొదలైన వాటికి టీకాలపరమైన మద్దతు, ఐవీఎఫ్ కౌన్సెలింగ్, స్పెషలిస్ట్ కన్సల్టేషన్లు, వార్షిక హెల్త్ చెకప్‌ల వంటి ప్రయోజనాలు ఉంటాయని సంస్థ చీఫ్ కాంప్లయెన్స్ ఆఫీసర్ గాయత్రి నాథన్ తెలిపారు.

ఆర్థిక ప్రణాళికకు ఇది అనుసరణీయమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



బడ్జెట్‌కు సంబంధించి 50/30/20 సూత్రం గురించి విన్నాను. నా ఆర్థిక ప్రణాళికకు దీన్ని అనుసరించడం మంచి మార్గమేనా?

– కరుణాకరన్

బడ్జెట్‌కు సంబంధించి బాగా ప్రాచుర్యంలో ఉన్నదే 50/30/20 నియమం. మీ నెలవారీ ఆదాయాన్ని మూడు భాగాలుగా వర్గీకరించడం ఇందులోని సూత్రం. ఇందులో 50 శాతాన్ని మీ అవసరాల కోసం కేటాయించుకోవాలి. అంటే ఇంటి అద్దె, గ్రోసరీ, విద్యుత్, రుణ వాయిదా చెల్లింపులు, స్కూల్ ఫీజులు అన్నీ కలిపి 50 శాతంలోపే ఉండాలి. మరో 30 శాతం అన్నది కోరికల కోసం. అంటే రెస్టారెంట్లో విందులు, ఓటీటీ చందాలు, విహార యాత్రలు, షాపింగ్ వంటివన్నీ 30 శాతం బడ్జెట్‌కు పరిమితం కావాలి. మిగిలిన 20 శాతాన్ని భవిష్యత్తు కోసం, దీర్ఘకాల లక్ష్యాల కోసం పొదుపు, మదుపు చేసుకోవాలి. ఇది ఒక సాధారణ సూత్రమే కానీ, అందరికీ వర్తించేది కాదు. మీ ఆదాయం ఎంత వస్తోంది? జీవన వ్యయాలు ఎంత? వ్యక్తిగత బాధ్యతలు ఏ మేరకు ఇలాంటి విషయాలన్నీ బడ్జెట్‌ను నిర్ణయిస్తాయి. ఉదాహరణకు ఓ యువ ఉద్యోగి నెలవారీ రూ.40,000 ఆదాయం సంపాదిస్తున్నాడని అనుకుందాం. అతను ఉండేది మెట్రోలో. ఇంటి అద్దె, రవాణా వ్యయాలకే 50 శాతం ఖర్చవుతుంది. అప్పుడు ఇతర అవసరాలు, కోరికలు, పొదుపులకు మిగిలేది పెద్దగా ఉండదు. అదే రూ.2లక్షల వేతనం సంపాదించే వ్యక్తి కేవలం 30–35 శాతం బడ్జెట్‌లోనే అవసరాలను తీర్చుకోగలరు. అప్పుడు సదరు వ్యక్తి 30–40 శాతం ఆదా చేయగలరు. కనుక ఆదాయాన్ని బట్టి ఈ ప్రణాళిక ఆధారపడి ఉంటుంది. 50/30/20 అన్నది బడ్జెట్ మొదలు పెట్టడానికి అనుసరించొచ్చు. ముఖ్యంగా మీ జీవన వ్యయాలు ఆదాయాన్ని మించకుండా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా ఆదాయంలో 20 శాతాన్ని తప్పకుండా ఆదా చేసుకోవాలి. కోరికలకు సంబంధించిన బడ్జెట్‌లో రాజీ పడినా ఫర్వాలేదు. పొదుపు విషయంలో రాజీ పడకూడదు.



ఈక్విటీ మార్కెట్లలో తరచుగా కనిపించే అస్థిరతలను ఎలా అధిగమించాలి?

– శ్యామల

ఈక్విటీల్లో అస్థిరతలన్నవి సర్వసాధారణం. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లు చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలాగో తెలిసి ఉండాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాలి. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్‌లు అదనపు పెట్టుబడుల అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, ప్రతికూల సమయాల్లో చాలా మంది భయంతో పెట్టుబడులకు వెనుకాడుతుంటారు. కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోవడానికి వీలుంటుంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
జీఎస్టీ సంస్కరణలే దిక్సూచి
బెంగళూరు ఫాక్స్‌కాన్ ప్లాంట్ షురూ



హ్యూమనాయిడ్ రోబోలు ఆటగాళ్లు.. అమ్మలు..

హ్యూమనాయిడ్ రోబోలు.. అచ్చం మనలానే ఉండే, ఆలోచించగలిగే రోబోలు. ఇవి మన జీవితంలో భాగమై పోయే రోజులు మరెంతో దూరంలో లేవు. చైనాలో జరుగుతున్న రోబో గేమ్స్.. ఏకంగా గర్భం దాలుస్తున్న రోబో.. రోబోల షాపింగ్ మాల్‌లే ఇందుకు నిదర్శనం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

రోబోల గేమ్స్

చైనాలోని బీజింగ్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి హ్యూమనాయిడ్ రోబో గేమ్స్.. శుక్రవారం నుంచి 3 రోజులపాటు జరిగాయి. అమెరికా, జర్మనీ, జపాన్ వంటి 16 దేశాలకు చెందిన హ్యూమనాయిడ్ రోబో క్రీడాకారులు పాల్గొన్నారు.

- **ఏయే క్రీడలు:** ఫుట్‌బాల్, పరుగు పందేలు, మార్షల్ ఆర్ట్స్, డ్యాన్స్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, ఔషధాలు వేరు చేయడం, వస్తువులను జాగ్రత్తగా తీసుకోవడం, క్లీనింగ్ సేవలు వగైరా
- **ఎన్ని టీములు:** 280
- **మొత్తం ఎన్ని రోబోలు:** సుమారు 500కుపైగా
- **టికెట్ ధర:** సుమారు రూ.1,600 నుంచి రూ.7,000 వరకు
- **విశేషాలు:** ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో నాలుగు రోబోలు ఒకరినొకరు ఢీకొట్టి పడిపోయాయట. లేవలేకపోతుంటే.. వాటిని నిర్వాహకులు లేపుతుంటే చూసిన వాళ్లంతా తెగ నవ్వుకున్నారట. 1500 మీటర్ల పరుగు పందెంలో మరో రోబో పరిగెడుతూ పరిగెడుతూ హఠాత్తుగా పడిపోయిందట. 'చార్జింగ్ అయిపోయిందేమో' అని తెగ జోకులు వేసుకున్నారట. విజేత సుమారు 6.29 నిమిషాల్లోనే గమ్యం చేరుకుందట. ఈ విభాగంలో మనుషుల వరల్డ్ రికార్డు 3.26 నిమిషాలట.
- **ముక్తాయింపు:** ఏతావాతా తేలిందేంటంటే.. ఈ హ్యూమనాయిడ్లు పూర్తిస్థాయిలో తమంతట తాము పనిచేయలేకపోయాయట. మనుషుల సాయం కావాల్సి వచ్చిందట.



ఏ పనైనా చేసిపెడతాయ్!



రోబోలు బాబూ.. రోబోలు..
ఇళ్లు తుడిచి, బట్టలు ఉతికే రోబోలు..
మీ దుకాణంలో నమ్మకంగా,
సమర్థంగా పనిచేసే రోబోలు..
ఇలాగే అమ్ముతూ ఉంటారేమో అక్కడ.

- **ఎక్కడ:** బీజింగ్‌లో.. ప్రపంచంలోనే మొట్టమొదటి రోబో షాపింగ్ మాల్ తెరిచారట. అక్కడి హైటెక్ ఈ–టౌన్ డిస్ట్రిక్ట్‌లో ఈ మాల్‌లో 100 రకాల రోబోలు అమ్మకానికి పెట్టారట.
- **కనీస ధర:** సుమారు రూ.25వేలు. గరిష్ఠంగా లక్షల నుంచి కోట్ల వరకు ఉందట.
- **ఆకర్షణ:** అల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను పోలిన హ్యూమనాయిడ్. దీని ధర 97,000 డాలర్లు... అంటే రూ.85 లక్షలే.
- **ఏం చేస్తాయి?:** వంట, కాఫీ తయారీ, పెయింటింగ్, ఆటలు వగైరా.

రోబో గర్భిణి

ఇక భవిష్యత్తులో ఆడవాళ్లే గర్భం దాల్చాలన్న అవసరం ఉండకపోవచ్చు. దానికీ మేమున్నాం అంటూ హ్యూమనాయిడ్ రోబోలు వచ్చేస్తున్నాయి.

- **ఎవరు?:** సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జాంగ్ కిఫెంగ్ ప్రపంచంలోని మొట్టమొదటి గర్భిణి రోబోను రూపొందించారు.
- **ఎలా?:** మహిళలు ఎలాగైతే 9 నెలలూ గర్భం మోసి బిడ్డలను కంటారో ఈ రోబో కూడా అలాగే చేస్తుంది.
- **ఏంటిది?:** ఇదంతా పూర్తిగా కృత్రిమ గర్భ సాంకేతికత. రోబో కడుపులో దీన్ని ఏర్పాటుచేస్తారు. ఇందులో బిడ్డ ఎదగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశారట. మహిళల్లో ఉమ్మనీరు ఎలా ఉంటుందో.. ఇందులోని అలాంటి ద్రవాన్నీ ఉంచారట. ఈ సాంకేతికత ఇప్పటికే పరిణత దశలో ఉంది. దీన్ని రోబో గర్భంలో ప్రవేశపెట్టడమే మిగిలి ఉందట.

కొత్తదా? అయితే ఇదేమీ కొత్తది కాదని జాంగ్ అంటున్నారట. గతంలో అపరిపక్వ దశలో ఉన్న గొర్రె పిల్లను ఇలాంటి కృత్రిమ గర్భంలోనే పెట్టి, ఒక పిల్లను సృష్టించారట. అది బతికే ఉందనీ.. ఇదీ అలాంటి ప్రక్రియే అంటున్నారాయన.

- **ఎప్పటికి?:** వచ్చే ఏడాదికి సిద్ధమైపోతుందట.
- **ధర:** సుమారు రూ.12.96 లక్షలు
- **భవిష్యత్తు:** ఇదే నిజమైతే.. ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో ఊహించడం కష్టం. ఎందుకంటే.. మహిళలకు ఇక, గర్భధారణ కష్టమే ఉండదు. ఇక, ఎంతమంది పిల్లలనైనా రోబోలు కనొచ్చు. ఎవరి అండం, వీర్య కణాలతోనైనా రోబోల్లో ప్రవేశపెట్టి పిల్లలను పుట్టించవచ్చు. ఏమో.. ఏం జరుగుతుందో.. వేచి చూడాల్సిందే.

21న ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించనున్న సీఎం



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓయూ వీసీ ప్రొ.కుమార్. చిత్రంలో మంత్రులు పొన్నం, అడ్లూరి

సాక్షి, హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నిర్మించిన కొత్త హాస్టల్ భవనాలు, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 21న ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి 21వ తేదీన ప్రారంభోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు హాస్టళ్ల భవనాలను ప్రారంభించడంతో పాటు గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నిర్మించనున్న మరో రెండు కొత్త హాస్టల్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులను సైతం సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపై ముఖ్యమంత్రి.. ప్రొఫెసర్లు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. కాగా, గత ఇరవై ఏళ్ల కాలంలో ఓయూకు ముఖ్యమంత్రి వచ్చి ప్రసంగించడం ఇదే ప్రథమమని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో 'సీఎం రీసెర్చ్ ఫెలో షిప్'తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నామని వీసీ తెలిపారు.

లీజుకు ఆర్టీసీ భూములు

తొలిదశలో 22 ప్రాంతాల్లోని 65 ఎకరాల గుర్తింపు ● వాటి కేటాయింపునకు టెండర్లు పిలిచిన సంస్థ

సాక్షి, హైదరాబాద్: వివిధ జిల్లాల్లో ఉన్న భూములను లీజుకు ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి విలువైన ప్రాంతాల్లో భూములున్నాయి. వాటిల్లోంచి ప్రస్తుతం 22 ప్రాంతాల్లో ఉన్న 65 ఎకరాల భూములను తాజాగా లీజు కోసం టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. నగర శివారులోని తుర్కయాంజాల్, శంషాబాద్ సమీపంలోని రషీద్‌పురా, శామీర్‌పేట, హకీంపేట, కరీంనగర్, ఖమ్మం, వనపర్తి, గద్వాల సహా మొత్తం 22 ప్రాంతాల్లో ఈ భూములున్నాయి.



నెలకు రూ.85 లక్షల ఆదాయం వస్తుందని అంచనా..

ముఖ్య ప్రాంతాల్లోని చిన్నచిన్న బిట్లను గతంలో పెట్రోలు బంకుల ఏర్పాటుకు కేటాయించింది. కొన్ని పెద్ద భూములను షాపింగ్‌మాల్ లాంటి వాటికి ఇచ్చింది. అయితే, అవి పరిమితంగానే ఉన్నాయి. మిగతా భూములను భవిష్యత్ అవసరాల దృష్ట్యా తన వద్దే ఉంచుకుంది. గతంలో ఓ పర్యాయం ప్రభుత్వం ఈ భూములను అమ్మి నిధులు సమీకరించబోతోందన్న వార్తలు వెలువడ్డాయి. భూములను అమ్మడమంటే, త్వరలో సంస్థను ప్రైవేటీకరించే నిర్ణయం తీసుకున్నట్టేనని ఆరోపిస్తూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. భూములను అమ్మే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశాయి. ఆర్టీసీ స్థలాలను అమ్మే ఆలోచన తనకు లేదని ఆ సమయంలో ప్రభుత్వం ప్రకటించింది. మళ్లీ ఇంతకాలం తర్వాత ఆ భూముల్లో కొన్నింటిని లీజుకు ఇవ్వాలని టెండర్లు పిలిచింది. ఈ లీజు ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.65 లక్షల నుంచి రూ.85 లక్షలు సమకూరుతాయని అంచనా వేస్తోంది. ఆర్టీసీకి ప్రస్తుతం రోజువారీ ఆదాయం బాగా పెరిగింది. మహాలక్ష్మి పథకం రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం ఠంచన్‌గా సంస్థకు చెల్లిస్తే, సంస్థ కొంతమేర లాభాల్లోకి చేరుకుంటుంది. గతంలో ఉన్న నష్టాలను దాదాపు అధిగమించినట్టయ్యింది. అయితే, పెద్దమొత్తంలో పేరుకుపోయిన బకాయిలు, అప్పులు, వాటిపై వడ్డీలు చెల్లించేందుకు మాత్రం ఈ ఆదాయం సరిపోదు. ప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో కూడా ఎలాంటి కేటాయింపులు లేనందున కచ్చితంగా అప్పు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల రూ.400 కోట్ల అప్పు తీసుకుంది. ఈ తరుణంలో అదనపు ఆదాయం సమకూరితే కొన్ని బకాయిలు తీర్చేందుకు కొంతమేర ఉపయోగంగా ఉంటుందని సంస్థ భావిస్తోంది. ఈ భూములకు ఎంత ధర నిర్ణయించవచ్చో తేల్చేందుకు ఓ ప్రైవేట్ సంస్థకు బాధ్యత అప్పగించింది. ఆ సంస్థ ఇచ్చిన ధరలనే ఖరారు చేస్తూ టెండర్లు పిలిచింది. దానికంటే ఎక్కువ మొత్తం కోట్ చేసిన సంస్థలు, వ్యక్తులకు ఆ భూములను కేటాయించనున్నారు.

రాజకీయ నేతల చేతుల్లోకి చేరితే..

గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ రాజకీయ నేత కీలక ప్రాంతంలో ఉన్న ఆర్టీసీ భూమిని లీజుకు తీసుకొని బడా షాపింగ్ మాల్ నిర్మించి ఆదాయాన్ని పొందుతూ సంస్థకు మాత్రం లీజు మొత్తాన్ని చెల్లించకుండా బకాయిపెట్టారు. ఎన్నిమార్లు నోటీసులు జారీ చేసినా లీజు చెల్లించకుండా మొండికేశారు. భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఆర్టీసీ ప్రయత్నించగా రాజకీయంగా ఉన్న పలుకుబడితో అది కుదరకుండా చేశారు. చివరకు ఇటీవల సంస్థ దూకుడుగా వ్యవహరించటంతో దిగివచ్చాడు. ఇప్పుడు లీజుకు ఇచ్చే భూములను అలాంటి నేతల చేతుల్లోకి చేరకుండా సంస్థ జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే వాటి వల్ల ఆదాయం రాకపోగా, తిరిగి ఆ భూములను స్వాధీనం చేసుకోవటం కూడా ఆర్టీసీకి కష్టంగా మారుతుందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.



సాగర తీరంలో గంగ తెప్పోత్సవం



హైదరాబాద్‌లో ఖైరతాబాద్ ఏడుగుళ్ల దేవాలయం నుంచి గంగ తెప్ప, బోనాల ఊరేగింపు హుస్సేన్‌సాగర్‌లోని గంగమ్మ ఆలయం వరకు ఆదివారం కనుల పండువగా సాగింది. 250 మంది మహిళలు బోనాలు ఎత్తుకొని రాగా, పోతరాజులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన గంగపుత్రులు వల పందిళ్లతో సందడి చేశారు.

హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళ్తోంది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: హైదరాబాద్‌లో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాల మేరకు నిర్మాణరంగ సంస్థలు పనిచేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో క్రెడాయ్ నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రాపర్టీషోలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల దృష్ట్యా బిల్డర్స్ స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని సూచించారు. నిర్మాణ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. నిర్మాణరంగ వ్యాపారులు ఇళ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. ఇప్పటికే హైదరాబాద్, ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకెళుతుందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని చెప్పారు. సాంకేతిక కారణాల వల్ల మెట్రో పెండింగ్‌లో ఉందన్నారు. దానిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సికింద్రాబాద్‌లో రూ.720 కోట్లతో రైల్వే పనులు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ క్రెడాయ్ బాధ్యులు బి.వినోద్‌రెడ్డి, ఎ.గోపాల్‌రెడ్డి, సి.అమరేందర్‌రెడ్డి, క్రాంత్ కిరణ్‌రెడ్డి, ఎస్.జయదీప్ రెడ్డి, నితీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమల: తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. వర్షం పడుతున్నా భక్తులు లెక్కచేయకుండా శ్రీవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. టీటీడీ అధికారులు ఎప్పకప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. శ్రీవారి దర్శనాన్ని ముగించుకొని బయటకు వస్తున్న భక్తులు పరుగులు తీస్తూ చలవ పందిళ్లకు కిందకు చేరుకుంటున్నారు. వర్షం కారణంగా తిరుమలలోని కొన్ని దుకాణాలు మూతపడ్డాయి. శ్రీవారి దర్శనానికి 24 గంటలు సమయం పడుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 87,759 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా 42,043 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి హుండీ రూపంలో రూ.4.16 కోట్ల ఆదాయం వచ్చింది.

వ్యవసాయ, అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

- ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ
- వ్యవసాయకూలీల పిల్లలకు బీఎస్సీ (ఏజీ), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ)లో ప్రత్యేక కోటా

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయాల పరిధిలోని వివిధ వ్యవసాయ, అనుబంధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు మొదటిదశ సంయుక్త కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్.విద్యాసాగర్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్ రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ప్రతిరోజు ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వ్యవసాయ కూలీల పిల్లలకు తొలిసారిగా బీఎస్సీ (అగ్రికల్చర్), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) సీట్లలో ప్రత్యేక కోటా అమలు చేస్తున్నట్టు తెలిపారు. బీఎస్సీ(అగ్రికల్చర్)లో 15 శాతం సీట్లు, బీఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో 15 శాతం సీట్లు వ్యవసాయ కూలీల పిల్లలకు కేటాయించినట్టు చెప్పారు. విద్యార్థులు 4వ తరగతి నుంచి 12వ తరగతుల విద్యాభ్యాసంలో కనీసం నాలుగేళ్లు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో చదివినవారు ఈ ప్రత్యేక కోటాకు అర్హులని తెలిపారు. విద్యార్థి లేదా, వారి తల్లిదండ్రుల పేరుపై ప్రభుత్వం జారీ చేసిన గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్డు కలిగి ఉన్నవారే ఈ కోటకు అర్హులన్నారు. పై అర్హతలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని చెప్పారు. పూర్తి వివరాలు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్ www.pjtau.edu.in లో చూడొచ్చని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

నేటినుంచి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: 'ఏఐ–లీడ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ తెలంగాణ'అనే అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం నుంచి డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో నిర్వహించనున్నారు. ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ పరిధిలో ఈ వర్క్‌షాప్‌ను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. తొలి విడత సోమవారం నుంచి ఈనెల 20 వరకు, రెండో విడత సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు, మూడో విడత సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ తెలిపారు.

నేడు, రేపు ఇంజనీరింగ్ సీట్ల స్లైడింగ్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కళాశాలల్లో అంతర్గత బ్రాంచీల మార్పిడిని సోమ, మంగళవారాల్లో చేపడుతున్నట్టు ఈఏపీసెట్ క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్నల్ స్లైడింగ్ కోరుకునే విద్యార్థులు 19వ తేదీ నాటికి ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 22వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23లోగా కాలేజీలో రిపోర్టు చేయాలని క్యాంప్ కార్యాలయం అధికారి శ్రీనివాస్ సూచించారు. ఇంటర్నల్ స్లైడింగ్ పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వర్తిస్తుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పాపికొండల్లో వైల్డ్ డాగ్స్

పెద్ద పులులను సైతం ఎదిరించే ధైర్యం ఈ కుక్కల సొంతం

ఆహారం కోసం నిరంతరం సంచారం


అడవిలో సంచరించే వైల్డ్ డాగ్స్



బుట్టాయగూడెం: అరుదైన జంతు జాలానికి నిలయమైన పాపికొండల అభయారణ్యంలో క్రూర జంతువులైన అడవి కుక్కలు (వైల్డ్ డాగ్స్) గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇవి అటవీ ప్రాంతంలోని అనేక జంతువులను వేటాడుతుంటాయి. పులిని సైతం అడవి కుక్కలు భయపెట్టగలవని చెబుతుంటారు. అడవి కుక్కలు సంచరించే ప్రదేశాల్లో పులులు కూడా సంచరించవని.. వాటి ఉనికిని కనిపెట్టి తప్పించుకుని తిరుగుతాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. పరిమాణంలో ఊరకుక్కల కంటే కొంచెం పెద్దవిగా ఉండే వైల్డ్‌డాగ్స్ వాటి కంటే బరువు, శక్తి కలిగిన పెద్ద పులులను సైతం సమూహ శక్తితో తరిమికొట్టగలవు. అడవిలో సంచరించే అడవి పందిని ఈ వైల్డ్‌డాగ్స్ చిటికెలో వేటాడి ఆహారంగా మార్చుకుంటాయి. వాటి బరువుతో పోల్చుకుంటే ఎన్నో రెట్లు పెద్దవైన కణితి(సాంబార్ డీర్), మనిమేగం లాంటి పెద్ద జింక జాతి జంతువులను కూడా ఈ అడవి కుక్కల సమూహం వెంటాడి వేటాడతాయి. ఈ వైల్డ్‌డాగ్ గుంపులు ఒకే ప్రదేశంలో స్థిరంగా ఉండకుండా నిరంతరం వేర్వేరు ప్రాంతాలకు తిరుగుతూనే ఉంటాయి. ఇవి ఊర కుక్కల కంటే కాస్త పెద్దవిగా ఉంటాయి. వీటి తోకకు వెంట్రుకలు కుచ్చుగా ఉంటాయి. ఇవి యూరప్ దేశాల్లో నల్ల మచ్చలతో కనిపిస్తాయి.

అభయారణ్యాల్లో అధికంగా సంచారం

అభయారణ్యాలుగా ఉన్న పాపికొండలు, నాగార్జున సాగర్, శ్రీశైలం అభయారణ్యం, గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యంలో అడవి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో కూడా అడవి కుక్కల సంచారం అధికంగా ఉన్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. పాపికొండల అభయారణ్యంలో సుమారు 200 కుక్కలకు పైగా గుంపులుగా సంచరిస్తున్నట్లు గుర్తించామని ప్రస్తుతం వాటి జాడ అల్లూరి సీతారామరాజు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో గ్రామాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఇవి స్వేచ్ఛగా సంచరించడానికి మరింత అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సమతుల్యతకు ప్రధాన భూమిక

వైల్డ్ డాగ్స్ జీవావరణ సమతుల్యతలో ప్రధాన భూమిక పోషిస్తుంటాయి. మాంసాహార జంతువులైన చిరుత పులి, పెద్దపులి, అడవి కుక్కల సంఖ్య తగ్గిపోతే వాటి ఆహార జంతువులైన వివిధ జంతువులు, జింకల సంఖ్య అమాంతంగా పెరిగి అడవిలోని వృక్షాలు తగ్గిపోతాయి. రైతులకు ఇబ్బంది కలిగించే అడవి పందులు, జింకల సంఖ్య పెరుగుదల ప్రమాదకరంగా మారకుండా నియంత్రణలో ఈ అడవి కుక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయని అధికారులు అంటున్నారు.

క్లుప్తంగా...

22న పిఠాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సాక్షి,అమరావతి: చివరి శ్రావణ శుక్రవారం పాదగయ క్షేత్రంలోని ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతికా అమ్మవారి ఆలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా 10 వేల మంది ఆడపడుచులకు చీరలు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లపై ఆలయ, పోలీసు అధికారులు, జనసేన నాయకులతో ఆదివారం చర్చించారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

కె.రామకృష్ణ విమర్శ



నెల్లూరు (వీఆర్సీసెంటర్): డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు తీస్తుందని కూటమి పార్టీల నేతలు ప్రచారం చేశారని, అయితే ఇందుకు భిన్నంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 14 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.75 లక్షల కోట్ల అప్పు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. సీపీఐ నెల్లూరు జిల్లా 26వ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ మహాసభల్లో తొలిరోజు కలెక్టరేట్ దగ్గర నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు కోటమిట్టలోని షాదీమంజిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య తదితరుల నాయకులు పాల్గొన్నారు.

50 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల కలయిక



తంబళ్లపల్లె: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1974–75 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు 50 ఏళ్ల తరువాత కలుసుకోవడం విశేషం. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి విద్యార్థులు సుమారు 34 మంది హాజరయ్యారు. అందరూ ఒకరినొకరు పలకరించుకుంటూ గత స్మృతులు నెమరువేసుకున్నారు. నాటి గురువులను స్మరించుకున్నారు. మృతి చెందిన గురువులు, సహచర విద్యార్థుల ఆత్మశాంతి కలగని మౌనం వహించి సంతాపం తెలిపారు. అనంతరం విందు భోజనాలతో సంతోషాన్ని పంచుకున్నారు.

సమస్యలు చెట్టుముట్టాయి

కుంగదీస్తున్న కొబ్బరి పంట | పది వేల ఎకరాల్లో ఎండిపోయిన చెట్లు | 20 వేల మంది రైతుల పరిస్థితి తారుమారు | ఉప్పునీటి ప్రభావమే ప్రధాన కారణం


కేశనపల్లిలో ఎండిపోయి కళావిహీనంగా మారిన కొబ్బరి తోటలు

మలికిపురం: 'ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయనే' నిజాన్ని ప్రస్తుతం కోనసీమ జిల్లా రాజోలు దీవి ప్రజలు కళ్లారా చూస్తున్నారు. కొడుకుని నమ్ముకునే కంటే కొబ్బరి చెట్టును నమ్ముకుంటే చాలు, జీవితం గడిపేయచ్చని ఓ సినిమాలో సన్నివేశం ఉంది. ఇక్కడ కొడుకులను అవమానించడం కాదు కాని కొబ్బరి గొప్పదనం అది. అటువంటి పంట ప్రమాదంలో చిక్కుకుంది. కోనసీమలో ప్రతి ఇంటి ఆవరణలో ఉండే పది కొబ్బరి చెట్ల సాయంతో కుటుంబం నడిపే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం రాజోలు దీవిలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్న తీరు కుంగదీస్తోంది. ఇప్పటికే సుమారు 20 వేల మంది రైతుల ఆర్థిక పరిస్థితి తారుమారు అయ్యిందని అంచనా.

ఉప్పు.. అదే ముప్పు

రాజోలు దీవిలో సుమారు 45 వేలకు పైగా ఎకరాల్లో కొబ్బరి సాగు ఉండేది. 2020 సంవత్సరం నుంచీ ఇక్కడ ఉప్పునీటి బారిన పడి కొబ్బరి తోటలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. ఇప్పటికే సుమారు పది వేల ఎకరాలకు పైగా కొబ్బరి తోటలు మోడుబారాయి. మరిన్ని తోటలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మారుతున్న భౌగోళిక కారణాలతో పాటు ఓఎన్జీసీ వంటి ఆయిల్ సంస్థల అన్వేషణ, చమురు వెలికితీత, ఇష్టానుసారంగా రొయ్యల సాగు వంటి కారణాలతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ దీవిలో ప్రధానంగా శంకరగుప్తం క్రీక్ (డ్రైన్) పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంది. శంకరగుప్తం డ్రైన్‌లో కలిసే కూనవరం, వేప చెట్టు, గోగన్నమఠం మీడియం డ్రైన్ల పరివాహక ప్రాంతాల భూముల్లో కూడా ఈ దుస్థితి నెలకొంది. సముద్ర పోటు ప్రభావంతో ఉప్పునీరు ఈ క్రీక్‌లోకి వస్తోంది. మామిడికుదురు మండలం కరవాక నుంచి ప్రవేశించే ఈ డ్రైన్ గోగన్నమఠం, కాట్రేనిపాడు, గొల్లపాలెం, తూర్పుపాలెం, పల్లిపాలెం, గూడపల్లి, గుబ్బలపాలెం, కేశనపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం, బట్టేలంక, కత్తిమండ, అడవిపాలెం, చింతలమోరి మోరిపోడు, మోరి, కేశవదాసుపాలెం గ్రామాల మీదుగా కేశవదాసుపాలెం వద్ద సముద్రం వద్ద ముగుస్తుంది. ఇందులో రాజోలు దీవిలోని అన్ని ప్రధాన మీడియం, మైనర్ డ్రైన్లు కలసి మురుగు నీటిని కరవాక, గోగన్నమఠం గ్రామాల వద్ద వైనతేయ నదిలో కలుపుతుంది. ఈ డ్రైన్ పరిధిలో వేలాది ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అయితే ఉప్పునీటి ప్రభావం నానాటికీ అధికం కావడంతో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయి. దీనివల్ల కొబ్బరి తోటల ఆదాయంతోనే ఆధారపడిన అనేక మంది రైతులు, నిరు పేదలు తీవ్రంగా నష్ట పోతున్నారు. కొబ్బరిపై ఆధార పడిన రైతులు, వ్యాపారులు, కార్మికులు కూడా రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దీని నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ నాలుగేళ్లుగా వారు పోరాటం చేస్తూనే ఉన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి ఉద్యాన, కొబ్బరి పరిశోధన శాస్త్రవేత్తలు వచ్చారు, వెళ్లారు. డ్రైనేజీ ఉన్నతాధికారులు సైతం పరిశీలన చేశారు.

అంచనా వేసి.. అధ్యయనం చేసి

గత కొన్నేళ్లుగా సముద్ర నీటిమట్టం పెరుగుతోందని శాస్త్రవేత్తల అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఉప్పునీటి బెడద అధికమవుతోంది. అంతర్వేది నుంచి కరవాక వరకూ ఉప్పునీరు పైకి రావడం వల్ల ఈ సమస్య తీవ్రమైంది. ఫలితంగా ఇప్పటికే సుమారు 10 వేల ఎకరాల్లో చెట్లు చనిపోగా, మరో 20 వేల ఎకరాలకు ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలపై కేంద్రం నుంచి వచ్చిన బృందం ఇప్పటికే నాలుగు సార్లు పరిశీలించింది. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కేరళ నుంచి వచ్చిన కొబ్బరి అభివృద్ధి బోర్డు సభ్యులు, అధికారులు ఇక్కడ అధ్యయనం చేశారు. ఇక్కడ ఉప్పునీటి ప్రభావం వల్లే కొబ్బరి చెట్లు చనిపోతున్నాయని ఆ బృందం గుర్తించింది.

రక్షణ చర్యలు అవశ్యం

ఇక్కడ శంకరగుప్తం డ్రైన్‌లోకి పోటు వల్ల ఉప్పు నీరు వస్తుంది. ఇది కొబ్బరి తోటలను ముంచెత్తుతుంది. ఇలా నీరు కొబ్బరి తోటల్లోకి ప్రవేశించకుండా రిటైనింగ్ వాల్, లేక స్లూయిజ్ నిర్మించాలి. అప్పుడే తోటలకు రక్షణ ఉంటుందని రైతులు అధికారులకు చెబుతూనే ఉన్నారు. దీనికి నిధులు ఎక్కడ నుంచి సమీకరించాలనే అంశంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. శంకరగుప్తం మేజర్ డ్రైన్‌కు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలంటే ఖర్చు అధికంగా అవుతుంది. సుమారు 26 కిలోమీటర్ల పొడవు గల ఈ డ్రైన్ పరిధిలో పోటు ప్రభావం అధికంగా ఉండే కరవాక నుంచి శంకరగుప్తం వరకూ అయినా సుమారు 15 కిలోమీటర్ల మేర అత్యవసర ప్రాంతాల్లో వాల్ కట్టాలంటే దాదాపు రూ.100 కోట్ల ఖర్చు అవుతుందని డ్రైనేజీ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. డ్రైన్‌కు స్లూయిజ్ కడితే రూ.30 కోట్ల లోపు అవుతుంది. ఇతర చర్యల కంటే స్లూయిజ్ నిర్మాణంతోనే అధిక ఫలితం ఉంటుందని డ్రైనేజీ అధికారులు అంటున్నారు.

నిధులు ఇవ్వకుంటే ఆందోళనే



రాజోలు దీవి అత్యంత ప్రమాదంలో ఉంది. కొబ్బరి పంట నాశనం అయ్యింది. రైతుల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా మారిపోయింది. దీంతో కూలి పనులకు వెళ్లే స్థితిలో ఉన్నారు. కొబ్బరి కార్మికులకు పనులు లేవు. అయినా ప్రభుత్వం ఉదాసీనంగా ఉంది. ముంపు సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వాలి. లేకుంటే ఆందోళన చేస్తాం.

– గొల్లపల్లి సూర్యారావు, మాజీ మంత్రి

గట్ల నిర్మాణం జరగాలి



శంకరగుప్తం డ్రైన్‌కు డ్రెడ్జింగ్‌తో పాటు సమాంతరంగా గట్ల నిర్మాణం జరగాలి. అప్పుడే ముంపు సమస్య తీరి రైతుల సమస్య పరిష్కారం అవుతుంది. దీనికోసం అంచనాలు వేశారు. ఆర్థిక శాఖ వద్ద ఫైల్ ఉంది. కేబినెట్‌లో పెట్టాలని అధికారులు అంటున్నారు.

– ఎంవీవీ కిశోర్, డ్రైన్స్ ఈఈ, కాకినాడ

టెంకాయ అ'ధర'హో

ద్వారకాతిరుమల: కొబ్బరికాయల ధరలు టాపు లేపుతున్నాయి. ఆలయాల వద్ద సైజును బట్టి రూ.25 నుంచి రూ.40కు విక్రయిస్తుండడంతో భక్తులు షాక్ అవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తారు. అందులో అధిక శాతం మంది భక్తులు ఆలయంలో కొబ్బరికాయలు కొడతారు. అయితే కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గడంతో గత మూడు నెలల క్రితం వాటి ధరలు రెట్టింపయ్యాయి. ప్రస్తుత శ్రావణమాసంలో వివాహాది శుభకార్యాలు జరుపుకునే వారు, ఆలయాల్లో మొక్కులు తీర్చుకునే సాధారణ భక్తులు కొబ్బరికాయలు కొనేందుకు ఇబ్బంది పడుతున్నారు. ధరలు పెరగక ముందు వ్యాపారులు దళారుల వద్ద రూ.10 లకు కొన్న కొబ్బరి కాయను రూ.15కు, రూ.15 కాయను రూ.20 నుంచి రూ.25కు విక్రయించేవారు. ప్రస్తుతం దళారుల వద్ద రూ.20కు కొన్న కాయను రూ.25కు, రూ.25 కాయను రూ.30 నుంచి రూ.40కు అమ్ముతున్నారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద ఇదే పరిస్థితి ఉంది.

నెలకు 50 వేలకు పైగా విక్రయాలు

శ్రీవారి క్షేత్రంలో చిన్నాపెద్దా మొత్తం 15 వరకు కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా వ్యాపారులు నెలకు 50 వేలకు పైగా కొబ్బరి కాయలు విక్రయిస్తారు. అయితే కొబ్బరికాయలు ధరలు బాగా పెరగడంతో గత మూడు నెలల నుంచి విక్రయాలు బాగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో అవసరమైన వారు తప్పక కొబ్బరికాయలు కొంటున్నారు. కొందరు భక్తులైతే కొబ్బరికాయలు కొనకుండా ఆ డబ్బులను స్వామివారి హుండీల్లో వేసి దండం పెట్టుకుంటున్నారు.



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొంటున్న భక్తురాలు

బంధం.. బహుదూరం

విచ్ఛిన్నమవుతోన్న ఉమ్మడి కుటుంబాలు | ఉద్యోగ రీత్యా దూరంగా వెళ్తోన్న సభ్యులు | వృద్ధాప్యంలో ఒంటరిగా పలువురి అవస్థలు

ఆస్తి తగాదాలూ విచ్ఛిన్నం కావడానికి కారణమే



సాక్షి, పుట్టపర్తి: ప్రస్తుత సమాజంలో బంధాలు బహుదూరం అవుతున్నాయి. ఒకప్పుడు అమ్మానాన్న, అన్న, తమ్ముడు, చెల్లె, బావ, అక్క, వదిన, అత్తామామ.. ఇలా బంధుత్వాలు బలంగా ఉండేవి. ఆపద వచ్చినా.. అందరూ మేమున్నామంటూ వెంటనే వాలిపోయి.. ధైర్యం చెప్పేవారు. ఆత్మీయులు మృతి చెందితే ఆ కుటుంబానికి వెన్నంటి ఉండి వారిని ఓదార్చి మనోధైర్యం నింపేవారు. కానీ ప్రస్తుతం ఆస్తిపాస్తులు, చిన్నపాటి గొడవలతో హత్యలకు పూనుకుంటున్నారు. చాలా చోట్ల హత్యలకు ఆస్తి తగాదాలు కారణం అవుతున్నాయి. దీనికి తోడు ఉద్యోగ రీత్యా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. వివాహమైన వెంటనే ఎవరికి వారుగా వేరు కాపురాలు పెడుతున్నారు. దీంతో ఆ తర్వాత పుట్టే చిన్నారులకు కూడా బంధుత్వాల గురించి తెలియడం లేదు. ఫలితంగా మూడు దశాబ్దాలు గడవక ముందే వాళ్లు కూడా తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. ఎక్కడ చూసినా చిన్న కుటుంబాలే దర్శనం ఇస్తున్నాయి. ఫలితంగా చాలా రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- పుట్టపర్తికి చెందిన కూలి పనులు చేసుకునే దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరినీ ఉన్నత చదువులకు పంపించారు. ఉద్యోగం వచ్చిన తర్వాత ఒకరు విదేశాలకు వెళ్లగా.. ఇంకొకరు బెంగళూరులో స్థిరపడ్డారు. వృద్ధాప్యంతో ఇద్దరు కుమారులు తోడు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా ఎంత డబ్బు అయినా ఇస్తాం.. కానీ ఇక్కడకు వచ్చి ఉండటం కుదరదని కుమారులు చెబుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు. దీంతో ఇల్లు వదిలి ఆశ్రమంలో చేరారు. ప్రతి నెలా కుమారులే అద్దె చెల్లిస్తున్నట్లు వివరించారు. అందరూ ఉన్నా.. ఎవరూ లేని అనాథలుగా ఆశ్రమాల్లో ఉండటం ఇష్టం లేదని బంధువులతో నిత్యం ఆవేదన వ్యక్తం చేస్తుంటారు.

బోసిపోతున్న పల్లెటూర్లు..

మారుతున్న పరిస్థితులు కుటుంబాలను చిన్నవిగా చేస్తున్నాయి. పల్లెల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం, నగరాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉండటంతో చాలామంది పల్లెల్లో సొంతిల్లు వదిలేసి.. నగరాల్లో అద్దె ఇళ్లలో చేరుతున్నారు. ఫలితంగా పట్టణాల మాదిరిగానే.. పల్లెల్లో కూడా ఉమ్మడి కుటుంబాలు కనిపించడం లేదు. పిల్లలు, పెద్దలు, వృద్ధులతో కళకళలాడే పెద్ద పెద్ద ఇళ్లన్నీ బోసిపోతున్నాయి. అదే సమయంలో సొంతూళ్లలోనే ఉంటున్న కొందరు వేరు కాపురాలు పెడుతూ ఉమ్మడి కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తూ.. చిన్న ఇళ్లకు మారుతున్నారు. ఫలితంగా మనుషుల మధ్య దూరం చాలా పెరిగింది. నాటి తరం ఊళ్లలో ఉండగా.. తర్వాత తరం పట్టణాలకు చేరింది. ఆ తర్వాత మూడోతరం విదేశాలకు వెళ్తోంది. ఏ గ్రామంలో చూసినా ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఆస్తి తగాదాలతో బంధాలకు బీటలు..

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి ఆస్తి తగాదాలు కారణంగా చెబుతున్నారు. కుటుంబ పెద్దకు తోడుగా సంపాదించే వారు ఇంకొకరు తయారైన వెంటనే ఆర్థికపరమైన లావాదేవీల్లో విభేదాలు వస్తున్నాయి. నేను సంపాదిస్తున్నాను.. బతకగలను అనే తెగింపులో చాలామంది ఇల్లు వదిలి బయటికి వస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆస్తులను పంచి పెట్టాలంటూ తల్లిదండ్రులపై రుబాబు చేస్తున్నారు. ఆస్తి తగాదాల్లో తేడాతో చాలా కుటుంబాల్లో బంధాలు బీటలువారుతున్నాయి. కొన్ని దశాబ్దాల పాటు కలవకుండా ఉండిపోతున్నారు.

ఆశ్రమాల్లో అమ్మానాన్న..

ఆస్తి ఆగాదాలు, ఉద్యోగ రీత్యా పట్టణాలకు వెళ్లిపోవడం.. అక్కడి నుంచి విదేశాలకు వెళ్లి నాలుగైదేళ్లకు ఓసారి వచ్చి వెళ్లడం.. వేరు కాపురాలు పెడుతుంటం కారణంగా వృద్ధాప్యంలో చాలామంది ఉద్యోగుల తల్లిదండ్రులు ఆశ్రమాల్లో చేరుతున్నారు. ఆలనాపాలనా చూసేవారు లేక.. డబ్బు ఉన్నా.. వండుకుని తినే సామర్థ్యం లేక డబ్బు చెల్లించి ఆశ్రమాల బాట పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆశ్రమాలకు డిమాండ్ పెరిగింది.

కువైట్‌లో నాటుసారా మృతులు.. ఉమ్మడి కడప జిల్లాలో గుబులు

23 మంది మృత్యువాత ● మృతుల్లో నలుగురు కడప వాసులు ఉన్నట్లు ప్రచారం



రాజంపేట : కువైట్‌లో చోటుచేసుకున్న కల్తీమద్యం/నాటుసారా దుర్ఘటనలు ఉమ్మడి కడప జిల్లాలోని గల్ఫ్ కుటుంబీకులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అక్కడ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో ఇక్కడి వారి కుటుంబాల్లో ఆందోళన కూడా పెరుగుతోంది. వీరిలో తెలుగు వారు ఉన్నారని, పైగా.. కడపకు చెందిన వారు నలుగురు ఉన్నారనే వార్తలు మరింత కలకలం రేపుతున్నాయి. వివరాలివీ..

ఉమ్మడి కడప జిల్లాలోని కడప, రాజంపేట, రాయచోటి, బద్వేలు, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో అనేకమంది కువైట్‌లో వివిధ రకాల చిన్నాచితక పనులకు వెళ్లారు. ఇలా అప్పులు చేసుకు వెళ్లిన పేదవర్గాలను అక్కడి నాటుసారా తయారీ ముఠా సభ్యులు ఆకట్టుకుని, కొద్దికాలంలోనే అప్పులు తీర్చుకోవచ్చని ఆశచూపి, వారిని బరిలోకి దింపుతున్నారు. కువైట్‌లో మద్యం లభ్యం కాదు కాబట్టి అక్కడ అక్రమంగా నాటు సారాతో పాటు నకిలీ మద్యం వీరి ద్వారా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అహమది, ఫెహల్, మంగాఫ్ ప్రాంతాల్లోని ప్రైవేటు అపార్టుమెంట్‌లలో రహస్యంగా నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నాయని కువైట్ పోలీసులు గుర్తించి ఇటీవల వాటిపై దాడులు చేసి బట్టీలు ధ్వంసం చేశారు. నిర్వాహకులను అరెస్టుచేశారు. ఇలా అక్కడ నాటుసారా వ్యాపారం చేస్తున్న వారిలో రాజంపేట, రైల్వేకోడూరుకు చెందిన కొంతమంది ఉన్నారని తెలిసింది.



అపార్ట్‌మెంట్‌లో కల్తీ మద్యం సేవించిన వారిని తరలిస్తున్న కువైట్ ఎమర్జెన్సీ మెడిసిన్ సర్వీసెస్ బృందం (ఇన్‌సెట్‌లో) వివిధ బ్రాండుల పేరిట నాటుసారా అందించే మద్యం సీసాలు

23 మంది మృతి..

మరోవైపు.. అక్కడ మిథనాల్–కలుషిత ఆల్కహాల్ సేవించి పలువురు మృత్యువాత పడిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ దుర్ఘటనలో 23 మంది మరణించారు. వీరిలో ఆసియా దేశాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. తెలుగువారి వివరాలు అధికారికంగా వెలువడలేదు. కానీ, మృతుల్లో.. చికిత్స పొందుతున్న వారిలో ఉమ్మడి కడప జిల్లా వారున్నారని వస్తున్న వార్తలు ఇక్కడి వారి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అక్కడ నాటుసారా తాగే వారిలో మనవారున్నారన్న ప్రచారం జరుగుతోంది. అలాగే, కల్తీ మద్యం బారిన పడి కొంతమంది కంటిచూపు కోల్పోయారని.. మరికొందరు పక్షవాతానికి గురయ్యారని.. ఇంకొందరి కిడ్నీలు పాడైనట్లు వస్తున్న వార్తలు వీరిని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి.



మేఘాలయ టూర్
అంబరాన్నంటే అద్భుతం

**మేఘాలయ టూర్ మేఘాల్లో విహరించినట్లే ఉంటుంది.
సముద్ర మట్టానికి ఆరువేల ఐదువందల అడుగుల ఎత్తు.
ఆకాశపుటంచులను తాకుతున్నట్లు సాగే ప్రయాణాలు.
షిల్లాంగ్ బసలతో చిల్ అవుతూ సాగే పర్యటన ఇది.
ఈశాన్య సంస్కృతి దర్పణం డాన్‌బాస్కో మ్యూజియం.
వాన జల్లులతో పర్యాటకులను పలకరించే చిరపుంజి.
జలధారలను కలిపి జడ అల్లినట్లు ఎలిఫెంట్ ఫాల్స్.
ప్రకృతి అద్భుతాన్ని ఒట్టేసి చెప్పే మావ్ స్మాయ్ కేవ్స్.
గాల్లో ఉన్నట్లు భ్రమ కల్పించే ఉమ్‌న్‌గోట్ పడవ విహారం.
నన్ను చూసి నేర్చుకోండి అంటున్న మావ్ లిన్నాంగ్ గ్రామం.
చెరగని చరిత్రకు శిలాజ్ఞాపకం నార్తియాంగ్ మోనోలిథ్ పార్క్.
బోనస్‌గా... కామాఖ్య సందర్శనం... బ్రహ్మపుత్ర విహారం.
కంచె ఆవల ఉన్న బంగ్లాదేశ్‌లోకి తొంగిచూడవచ్చు కూడా.
ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తున్న ఈ టూర్ వీటిని చూపిస్తుంది.**



1 వ రోజు గువాహటి రైల్వే స్టేషన్ లేదా ఎయిర్ పోర్ట్ నుంచి (ఈ ప్యాకేజ్‌లో టూర్ బుక్ చేసుకున్న పర్యాటకులు రైలు, విమాన మార్గాల్లో ఏ మార్గాన గువాహటికి చేరుతున్నారనే వివరాలను నిర్వాహకులకు ముందుగా తెలియచేయాలి) రిసీవ్ చేసుకుని హోటల్ దగ్గర డ్రాప్ చేస్తారు. హోటల్ గదిలో చెక్ ఇన్ అయిన తర్వాత ఆ రోజు విశ్రాంతిగా గడపడం, రాత్రి భోజనం, బస అక్కడే. ఆసక్తిని బట్టి తమకు తాముగా సాయంత్రం నగర విహారానికి వెళ్లవచ్చు.

అసోమ్ నుంచి టూర్ షురూ!

గువాహటిలో పగలు చూడాల్సిన ప్రదేశాల్లో కామాఖ్య ఆలయం, పీకాక్ ఐలాండ్, ఉమానంద ఆలయం, నెహ్రూ పార్క్, అస్సాం స్టేట్ జూ, స్టేట్ మ్యూజియం, పోబితోరా వైల్డ్‌లైఫ్ సాంక్చురీ ఉన్నాయి. సాయంత్రం బ్రహ్మపుత్ర రివర్ ఫ్రంట్ షికార్ బాగుంటుంది. షాపింగ్‌కి ఫ్యాన్సీ బజార్‌కు వెళ్లవచ్చు. రెండవ రోజు టూర్ షెడ్యూల్‌లో కామాఖ్య ఆలయం, ఆరవ రోజు బ్రహ్మపుత్ర నదిలో విహారం ఉన్నాయి. కాబట్టి మొదటి రోజు చేతిలో ఉన్న కొద్ది సమయంలో చూడగలిగినవి, సమీపంలో ఉన్న ప్రదేశాలను ఎంచుకోవాలి.



2 వ రోజు గువాహటి నుంచి షిల్లాంగ్‌కు ప్రయాణం. ఉదయం బ్రేక్ ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి కామాఖ్య దర్శనానికి వెళ్లాలి. దర్శనం తర్వాత షిల్లాంగ్‌కు ప్రయాణం. షిల్లాంగ్‌లో హోటల్ చెక్ ఇన్, డాన్ బాస్కో మ్యూజియం వీక్షణం, లేడీ హైదరీ పార్క్‌లో విహారం, సాయంత్రం విశ్రాంతి, రాత్రి భోజనం, బస షిల్లాంగ్ హోటల్‌లోనే. ఆసక్తి ఉన్న వాళ్లు సాయంత్రం విశ్రాంతి సమయంలో సొంతంగా నగర పర్యటన చేయవచ్చు.

సాహిత్య కథనం

కామాఖ్య ఆలయం గురించి జనబాహుళ్యంలో అనేక కథనాలు ఉన్నాయి. కామదేవ్ అనే రాజు దీనిని నిర్మించాడని చెబుతారు. అంతకంటే ముందు బిశ్వకర్మ శిల్పచాతుర్యంతో మహాగొప్ప నిర్మాణం చేశాడని పై భాగం విధ్వంసానికి గురైందని చెబుతారు. దేవీ భాగవతం, దేవీ పురాణం, కాళికా పురాణం, యోగిని తంత్ర, హేవజ్ర తంత్ర సాహిత్యాల్లో ఈ ఆలయం ప్రస్తావన ఉంది. శైవం ప్రాచుర్యంలోకి వచ్చిన తర్వాత ఈ ఆలయం ప్రాభవం తగ్గింది. బ్రహ్మపుత్ర లోయలోని రాజ్యాన్ని పాలించిన నరక అనే రాజు ఈ ఆలయాన్ని పునర్నిర్మించాడనే కథనం కూడా ఉంది. చారిత్రక ఆధారాలు పెద్దగా లేకపోవడంతో సాహిత్యం, వ్యవహారికంలో ఉన్న కథనాలే ఆధారం.

ఏడంతస్థుల మ్యూజియం

షిల్లాంగ్‌లో నెలకొల్పిన మ్యూజియానికి మూలం రోమ్ నగరం. ఇక్కడి ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలతోపాటు వారు అనుసరించే జీవనశైలిలో దాగిన శాస్త్రీయతను అధ్యయనం చేసిన మీదట వాటిని ప్రోదిచేస్తూ ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆలోచన బ్రిటిష్ పాలకులకు వచ్చింది. ఏడంతస్థుల భారీ నిర్మాణంతో మ్యూజియానికి ఏర్పాట్లు జరిగాయి. అందులో స్థానిక జాతుల భాషల వివరాలతో లైబ్రరీ కూడా ఉంది. ఆదివాసీ జీవితం కళ్లకు కట్టే విధంగా చిత్రాలు, శిల్పాల అమరిక ఉంది. మిషనరీ ఆధ్వర్యంలో నడుస్తున్న చర్చ్ కూడా ఉంది. పదేళ్ల కిందట ఈ మ్యూజియాన్ని ఏడాదికి 70 వేల మంది సందర్శించేవారు. ఆ నంబరు ఏడాదికేడాదికీ పెరుగుతూ ఇప్పుడు లక్ష దాటింది.









3 వ రోజు షిల్లాంగ్ నుంచి చిరపుంజికి ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత చిరపుంజికి విహారయాత్ర. దారిలో ఎలిఫెంటా ఫాల్స్, ద్వాన్ సైయిమ్ వ్యూ పాయింట్, నోహ్ కలైకాల్ ఫాల్స్, మావ్ స్మాయ్ గుహలు, సెవెన్ సిస్టర్ జలపాతాల విహారం తర్వాత రాత్రికి తిరిగి షిల్లాంగ్ చేరాలి. రాత్రి భోజనం, బస షిల్లాంగ్‌లో.

ఐదు వందల ఏళ్ల వంతెన

చిరపుంజి అనగానే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రదేశంగానే మనకు పరిచితం. కానీ ఈ ప్రదేశం లివింగ్ బ్రిడ్జిలు కూడా ప్రసిద్ధి. అంటే బతికున్న వంతెనలు. చెట్ల వేళ్లతో అల్లిన వంతెనలన్నమాట. చెట్ల నుంచి వేళ్లను వేరు చేయరు, అలాగే సాగదీసి తాడులా అల్లుతారు. ఆ వేరు అలాగే ముందుకు పెరుగుతూ ఉంటుంది. దానిని కూడా అల్లికలో కలుపుతూ ఉంటారు. ఒక వంతెన ఏర్పడాలంటే పది నుంచి పదిహేనేళ్లు పడుతుంది. ఇలాగ ఐదు వందల ఏళ్ల నాటి వంతెన నేటికీ ఉంది. ఈ వంతెనలు ఒక్కోచోట రెండంతస్థుల వంతెనలు కూడా ఉంటాయి.


ఇంతకీ ఇక్కడ ఇంత స్థాయిలో వర్షం కుండపోతగా కురవడానికి కారణం ఏమిటంటే... బంగాళాఖాతం నుంచి ఆవిరైన నీటితో ఏర్పడిన మబ్బులు ప్రయాణించే దారిలో ఎత్తుగా ఉన్న ఖాశి పర్వత శ్రేణులను తాకుతాయి. మబ్బులను గాలి బలంగా తోస్తూ ఉంటుంది. ముందుకు వెళ్లడానికి వీల్లేకుండా పర్వత శ్రేణి అడ్డుకుంటుంది. దాంతో మబ్బులు ఒక్కసారిగా కుండపోతగా కురుస్తాయి.

ఏనుగు జలపాతం

షిల్లాంగ్ నగరం దాటిన తర్వాత పది కిలోమీటర్ల దూరాన ఉందీ జలపాతం. షిల్లాంగ్ వాసులకు వీకెండ్ పిక్‌నిక్‌లాంటిదన్న మాట. ఈ జలపాతం విశాలంగా ఉంటుంది. కర్నాటకలోని హొగెనక్కల్ జలపాతం పాయలు పాయలుగా విడిపోయి ఊరంత విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. మేఘాలయలోని ఈ జలపాతం జలధారలన్నీ ఒకే చోట చేరినట్లు ఉంటుంది. ఒత్తైన జుత్తు వీపంతా పరుచుకున్నట్లు నల్లటి రాళ్ల మీద పరుచుకున్న తెల్లటి జలధారలివి. ఇక్కడ ఒక రాయి ఏనుగు ఆకారంలో ఉండడంతో దీనికి బ్రిటిష్ వాళ్లు ఎలిఫెంట్ ఫాల్స్ అని పేరు పెట్టారు. అంతకంటే ముందు స్థానిక ఖాసీ తెగ వాళ్లు తమ ఖాసీ భాషలో దీనికి పెట్టుకున్న పేరు 'కా క్షైద్ లాయ్ పతెంగ్ ఖోసియో'.

ఒట్టు బండ

ఖాసీ భాషలో మావ్ స్మాయ్ అంటే 'ఒట్టు బండ' అని అర్థం. ఈ గుహలకు పేరు స్థిరపడింది. ఈ గుహలకు వెళ్లాలంటే చిరపుంజి నుంచి అరవై కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. ఇవి మన కర్నూలులో ఉన్న బెలుం గుహలు, అరకులో ఉన్న బొర్రా గుహల్లాంటి స్టాలక్‌టైట్, స్టాలగ్‌మైట్ గుహలు. అయినప్పటికీ ఇలాంటి ప్రకృతి వింతలను ఎన్నిసార్లయినా చూడాల్సిందే.





4 వ రోజు షిల్లాంగ్ నుంచి దావ్‌కీ కి ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పర్యటన దావ్‌కీ వైపు సాగుతుంది. ఆ తర్వాత మావ్‌లీన్నాంగ్ గ్రామ సందర్శనం. సాయంత్రానికి తిరిగి షిల్లాంగ్‌కి చేరాలి. రాత్రి భోజనం, బస షిల్లాంగ్ హోటల్‌లో.

గాల్లో పడవ

ఇక్కడున్న ఫొటో చూడండి. నీటి మీద ఉండాల్సిన పడవ గాల్లో తేలుతున్నట్లు ఉంటుంది. గూగుల్‌లో దొరికిన ఈ ఫొటో మీద ముచ్చటపడి పీసీ డెస్క్‌టాప్ పిక్ గా, ఫోన్‌లో స్క్రీన్ పిక్‌గా పెట్టుకుంటుంటాం. ఇది మేఘాలయలోని ఉమ్‌న్‌గోట్ నది. నీటి స్వచ్ఛతకు ప్రత్యక్ష నిదర్శనం ఈ ఫొటో. నీటి అడుగున నేల స్పష్టంగా కనిపిస్తుంటుంది. ఈ నది దావ్‌కీ పట్టణంలో ఉంది. ఈ పట్టణం మనదేశ సరిహద్దు. పట్టణ శివారులో కంచె ఉంటుంది. కంచె ఆవల బంగ్లాదేశ్. ఇందులో పడవ ప్రయాణం చేసి, రెండంతస్థులుగా ఉన్న వేళ్ల వంతెన మీద నడిచి, ఇండో–బంగ్లా ట్రేడ్ రూట్ చూసి, బోర్డరులో కంచె దగ్గర నిలబడి ఫొటో తీసుకుంటే టూర్‌లో థ్రిల్ సగం సొంతమైనట్లే.

స్వచ్ఛమైన గ్రామం

మావ్ లిన్నాంగ్ గ్రామం మనదేశంలో మాత్రమే కాదు ఆసియా ఖండంలోనే రికార్డు సృష్టించిన గ్రామం. 'డిస్కవర్ ఇండియా' మ్యాగజైన్ నిర్వహించిన పోటీలో క్లీనెస్ట్ విలేజ్ గుర్తింపు తెచ్చుకుంది. ఈ గ్రామంలో తొమ్మిది వందల మంది నివసిస్తున్నారు. 90 శాతం అక్షరాస్యత సాధించిన గ్రామం. వ్యవసాయం మీద ఆధారపడిన వాళ్లే అందరూ. గ్రామం మొత్తం తిరిగి చూస్తే ఎక్కడా ఒక్క ఆకు నేల మీద కనిపించదు. రోడ్లు అద్దంలా మెరుస్తుంటాయి. ఇది కూడా ఇండో– బంగ్లా సరిహద్దులో ఉన్న గ్రామమే.

5 వ రోజు షిల్లాంగ్ నుంచి జోవాయ్‌కి ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ప్రయాణం జాంతియా హిల్స్ వైపు సాగుతుంది. తడ్లాస్కీన్ సరస్సు, తైరిషి ఫాల్స్, క్రాంగ్సురీ ఫాల్స్, దుర్గా మందిరం, నార్తియాంగ్ మోనోలిథ్ పార్క్ చూసుకుని సాయంత్రం షిల్లాంగ్‌కు తిరుగు ప్రయాణం. రాత్రి భోజనం, బస షిల్లాంగ్‌లోనే.



స్మారక శిలలు

వ్యక్తులు, రాజుల జ్ఞాపకార్థం కానీ గౌరవార్థంగా కానీ సమాధులు నిర్మిస్తారు. స్మారక భవనాలను నిర్మిస్తారు. ఈజిప్టులో పిరమిడ్‌లు నిర్మిస్తారు. మేఘాలయలో కనిపించే మోనోలిథ్, మెగాలిథ్‌లు కూడా ఇలాంటి స్మారకాలే. జాంతియా రాజ్యాన్ని పాలించిన రాజుల స్మారకంగా ప్రతిష్ఠించిన ఏకశిల, బృహత్ శిలలివి. వీటిలో రాజులు తమ విజయాలకు చిహ్నంగా ప్రతిష్ఠించిన శిలలు కూడా ఉన్నాయి. మొత్తానికి ప్రతి ఏకశిల, బృహత్ శిల వెనుక ఒక చరిత్ర ఉంటుంది. నార్తియాంగ్ అనే ప్రదేశంలో ఉన్న మోనోలిథ్, మెగాలిథ్‌లు అత్యంత ఎత్తైనవిగా గుర్తింపు పొందాయి.

ముత్యాల జలపాతం

క్రాంగ్‌షురి జలపాతం ఓ అద్భుతం. అద్భుతం అనడం ఎందుకంటే జలపాతపు నీరు మడుగులో కనిపించే టర్కోయిస్ నీలిరంగే ఆ అద్భుతం. నీరు నేలను తాకి తటాకంగా మారినప్పుడు కనిపించే నీలిరంగు ఇక్కడ కనిపించదు. ఏ జలపాతానికైనా జలధారలు ముత్యాల వానను తలపిస్తుంటాయి. నేలను తాకిన తర్వాత తటాకం చిక్కటి నీలవర్ణంలో లేదా ఆకుపచ్చటి రంగులో కనిపిస్తుంది. మేఘాలయలో కొండల నుంచి జాలువారిన నీరు అత్యంత స్వచ్ఛమైనది.

6 వ రోజు షిల్లాంగ్ నుంచి గువాహటికి ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. గువాహటికి చేరే మధ్యలో ఉమియుమ్ లేక్‌లో విహారం. గువాహటికి చేరిన తర్వాత హోటల్ గదిలో చెక్ ఇన్. మధ్యాహ్నం తర్వాత బ్రహ్మపుత్ర నదిలో క్రూయిజ్ విహారం (ఇది ప్యాకేజ్‌లో వర్తించదు). సాయంత్రం గువాహటి లోకల్ మార్కెట్‌లో షాపింగ్. హోటల్ గదికి చేరి రాత్రి భోజనం, బస.

బ్రహ్మపుత్రలో విహారం

బ్రహ్మపుత్ర నదిలో విహరించకుండా మేఘాలయ, అస్సామ్ టూర్ ముగిస్తే ఆ టూర్‌కి దక్కాల్సిన గౌరవం దక్కలేదనే చెప్పాలి. బ్రహ్మపుత్ర నదికి దానికంటూ ఓ గొప్పదనం ఉంది. ప్రపంచంలోని పెద్ద నదుల్లో ఇదొకటి. హిమాలయ శ్రేణుల్లో టిబెట్ దగ్గర పుట్టి ఇండియాలో విస్తరించి బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి నుంచి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఇక్కడి సంస్కృతి వీక్షణానికి అన్ని సౌకర్యాలున్న క్రూయిజ్‌లో బ్రహ్మపుత్ర నదిలో ప్రయాణించడం సులువైన మార్గం. వైవిధ్యమైన బౌద్ధ నిర్మాణాల ఆర్కిటెక్చర్, హిందూ ఆలయాల నిర్మాణశైలి, ఇస్లాం, క్రైస్తవ ప్రార్థనమందిరాలతోపాటు సామాన్యులు నివసించే ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రత్యేకంగా పరిశీలించాలి. సంప్రదాయ నిర్మాణాలతోపాటు ఆధునిక నిర్మాణాల్లో కూడా స్థానిక ప్రత్యేకతలు కనిపిస్తాయి.

7 వ రోజు బ్రేక్‌ఫాస్ట్,గది చెక్ అవుట్ తర్వాత పర్యాటకులు తిరుగు ప్రయాణానికి చేసుకున్న ఏర్పాట్ల ప్రకారం నిర్వాహకులు రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేయడంతో పర్యటన పూర్తవుతుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

గమనిక: కామాఖ్య దర్శనం కోసం వీఐపీ పాస్‌లు కావాలనుకునే వాళ్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వీఐపీ టికెట్ ధర 501 రూపాయి. లింక్ https://mkdonline.in



ఇది మేఘాలయ టూర్. ఏడు రోజుల పర్యటన. ప్యాకేజ్ పేరు 'ఎసెన్స్ ఆఫ్ మేఘాలయ గ్రూప్ ప్యాకేజ్ ఎక్స్ గువాహటి'. ఈ ప్యాకేజ్‌లో గువాహటి, షిల్లాంగ్, చిరపుంజి, దావ్‌కీ కవర్ అవుతాయి. ఇది వీక్లీ టూర్. శనివారం మొదలై శుక్రవారంతో పూర్తవుతుంది.

ప్యాకేజ్ కోడ్ : https://irctctourism.com/ pacakage_ description? packageCode= EGH05

టికెట్ ధరలిలాగ: సింగిల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 35 వేల రూపాయలవుతుంది. డబుల్ ఆక్యుపెన్సీలో దాదాపుగా 28 వేలు, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో 26 వేలవుతుంది. ఇది గువాహటి నుంచి మొదలై గువాహటికి చేరడంతో పూర్తవుతుంది. పర్యాటకులు తాము ఉన్న ప్రదేశం నుంచి గువాహటికి చేరడం, గువాహటి నుంచి తిరిగి తమ ప్రదేశానికి చేరే ప్రయాణ ఖర్చులు ప్యాకేజ్‌లో వర్తించవు.





పెట్టుబడి విషయంలో [illegible] ముందు
సౌకర్యవంతంగా [illegible]
అరుదుగా లాభాలనిస్తాయి.
- రాబర్ట్ అర్నాట్, అమెరికా వ్యాపారవేత్త

జీఎస్‌టీ సంస్కరణలే దిక్సూచి

- సావరిన్ క్రెడిట్ రేటింగ్‌తో బూస్ట్
- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలతో డీలా
- యూఎస్, ఉక్రెయిన్, రష్యాపై కన్ను
- ఈ వారం మార్కెట్లపై అంచనాలు

స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దీపావళికల్లా వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ)లో భారీ సంస్కరణలకు తెరతీయనున్నట్లు ప్రకటించడం దేశీయంగా సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోపక్క గత వారం ఎస్‌అండ్‌పీ రెండు దశాబ్దాల తదుపరి దేశ సావరిన్ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడం ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు తెలియజేశారు. అయితే ఉక్రెయిన్, తదితర అంశాలపై ట్రంప్, పుతిన్ సమావేశం ఎటూ తేల్చకపోవడంతో అంతర్లీనంగా అనిశ్చితి సైతం కనిపించనున్నట్లు విశ్లేషించారు. వివరాలు చూద్దాం...

- సాక్షి, బిజినెస్ డెస్క్

రానున్న దీపావళికల్లా జీఎస్‌టీలో శ్లాబులను, రేట్లను కనిష్టానికి సవరించనున్నట్లు ప్రధాని మోదీ పేర్కొనడంతో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు జోష్ లభించనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. గత 8 ఏళ్లుగా అమలు చేస్తున్న జీఎస్‌టీలో భారీ సంస్కరణలను తీసుకురానున్నట్లు ప్రధాని తెలియజేశారు. జీఎస్‌టీ నిబంధనల అమలు, పన్ను ఎగవేతలు, వివాదాలు ముసురుగొనడం వంటి సవాళ్లకు చెక్ పెట్టే బాటలో శ్లాబులను, రేట్లను తగ్గించనున్నట్లు సంకేతమిచ్చారు. దీంతో స్టాక్ మార్కెట్లో సెంటిమెంటు బలపడే వీలున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. సరైన సమయంలో జీఎస్‌టీ 2.0కు తెరతీయనుండటంతో దేశ ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ లభించనున్నట్లు ఈవై ఇండియా ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచవ్యాప్త వాణిజ్య ఆందోళనల మధ్య ఇవి కేవలం విధానపరమైన మార్పులు కాదని, అత్యంత ఆవశ్యకమైన నిర్మాణాత్మక సంస్కరణలని పేర్కొన్నారు. జీఎస్‌టీలో సంస్కరణల కారణంగా వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు పరిష్కారంకావడంతోపాటు.. పోటీ ప్రపంచంలో ఎగుమతులకు దన్ను లభించనున్నట్లు వివరించారు.

జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ కీలకం..

కొన్ని నెలలుగా రష్యా- ఉక్రెయిన్ మధ్య తలెత్తిన యుద్ధ పరిస్థితులకు చెక్ పెట్టే బాటలో గత వారాంతాన అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ సమావేశమైన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి వ్యక్తమైంది. అయితే సమావేశ వివరాలు వెల్లడికానప్పటికీ.. ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీపై మార్కెట్లు దృష్టిపెట్టనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలియజేశారు. అయితే ముందు ప్రకటించినట్లు ఈ నెల 27నుంచి కొత్త టారిఫ్‌లు అమలుకాకపోవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ అభిప్రాయపడ్డారు. ఇది మార్కెట్లలో సానుకూలతకు దోహదపడే వీలున్నట్లు అంచనా వేశారు.

ఫెడ్ మినిట్స్

ఈ వారం యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ గత పాలసీ సమీక్షా నిర్ణయాల వివరాలు(మినిట్స్) వెల్లడికానున్నాయి. ఫండ్స్ రేట్లను 4.25-4.5 శాతంగా కొనసాగించేందుకే ఫెడ్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. మరోపక్క చైనా కేంద్ర బ్యాంకు 1-5 ఏళ్ల కాలావధి రుణాలపై వడ్డీ రేట్లను ప్రకటించనుంది. ఇవికాకుండా యూఎస్ హౌసింగ్ గణాంకాలు తదితరాలు వెలువడనున్నాయి. దేశీయంగా హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సర్వీసుల పీఎంఐ ఇండెక్స్‌లను ప్రకటించనున్నారు. వీటితోపాటు.. దేశీ స్టాక్స్‌లో విదేశీ ఇన్వెస్టర్ల తీరు, డాలరు మారకం, ముడిచమురు ధరలు వంటి అంశాలు సైతం కీలకంగా నిలవనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు తెలియజేశారు. వెరసి కన్సాలిడేషన్ బాటలో సాగుతున్న మార్కెట్లు ఈ వారం ఆటుపోట్ల మధ్య కదిలే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

రేటింగ్ ఎఫెక్ట్

గత వారం రేటింగ్ దిగ్గజం ఎస్‌అండ్‌పీ సుమారు 18 ఏళ్ల తరువాత దేశ సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసింది. స్థిరత్వంతో కూడిన ఔట్‌లుక్‌తో బీబీబీ రేటింగ్‌ను ప్రకటించింది. పటిష్ట ఆర్థిక పురోభివృద్ధి, ద్రవ్యలోటు కట్టడికి ప్రభుత్వ కట్టుబాటు, ద్రవ్యోల్బణ అదుపునకు ఆర్‌బీఐ అనుసరిస్తున్న సానుకూల పరపతి విధానాలు ఇందుకు పరిగణనలోకి తీసుకున్నట్లు ఎస్‌అండ్‌పీ వివరించింది. వెరసి ఇన్వెస్టర్లకు జోష్ లభించనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు తెలియజేశారు.

గత వారమిలా..

నాలుగు రోజులకే పరిమితమైన గత వారం (11-14) ట్రేడింగ్‌లో ఎట్టకేలకు 6 వారాల వరుస నష్టాలకు చెక్ పడింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 740 పాయింట్లు(0.9 శాతం) పుంజుకుని 80,598 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 268 పాయింట్లు(1.1 శాతం) ఎగసి 24,631 వద్ద ముగిసింది. అయితే బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం, స్మాల్ క్యాప్ 0.6 శాతం చొప్పున క్షీణించాయి.



సాంకేతికంగా చూస్తే..

ఆరు వారాల తదుపరి మార్కెట్లు గత వారం సానుకూలంగా ముగిసినప్పటికీ నష్టాల నుంచి బయటపడిన సంకేతాలు పూర్తిగా వెలువడనట్లు సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా మరో రెండు వారాలు కన్సాలిడేషన్ కొనసాగవచ్చని అంచనా వేశారు. వీరి విశ్లేషణ ప్రకారం ఈ వారం మార్కెట్లు బలహీనపడితే ఎన్ఎస్ఈ నిఫ్టీకి సాంకేతికంగా తొలుత 24,450 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభించవచ్చు. ఇలాకాకుండా 24,700ను దాటి బలపడితే.. 24,800 వద్ద, 25,000 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. అమ్మకాలు అధికమై 24,450 దిగువకు చేరితే 24,000 సమీపానికి చేరే అవకాశముంది.

ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్

ఈ నెలలో రూ. 21,000 కోట్లు వెనక్కి

ఇటీవల దేశీ స్టాక్స్‌లో నిరవధిక విక్రయాలకు పాల్పడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెలలో ఇప్పటివరకూ(1-14) రూ. 21,000 కోట్ల పెట్టుబడులను నికరంగా వెనక్కి తీసుకున్నారు. యూఎస్ వాణిజ్య సుంకాల భారం, తొలి త్రైమాసిక ఫలితాల నిరుత్సాహం, రూపాయి బలహీనత ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వెరసి ఈ కేలండర్ ఏడాదిలో ఇప్పటివరకూ దేశీ ఈక్విటీల నుంచి రూ. 1.16 లక్షల కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం జూలైలోనూ ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 17,741 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా.. మార్చి-జూన్‌మధ్య కాలంలో రూ. 38,673 కోట్లు ఇన్వెస్ట్ చేశారు!



ఐపీవో బాటలో పవరికా

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 1,400 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: పవర్ సొల్యూషన్లు అందించే పవరికా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. మరో రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా మొత్తం రూ. 1,400 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రమోటర్లలో నరేష్ ఒబెరాయ్ కుటుంబ ట్రస్ట్ రూ. 490 కోట్లు, కబీర్, కిమయా ఫ్యామిలీ ప్రయివేట్ ట్రస్ట్ రూ. 210 కోట్ల విలువైన ఈక్విటీని ఆఫర్ చేయనున్నాయి. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 525 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. కాగా.. కంపెనీ ఇంతక్రితం 2019లోనూ సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పటికీ ఐపీవో చేపట్టకపోవడం గమనార్హం! కంపెనీ ప్రధానంగా డీజిల్ జనరేటర్(డీజీ) సెట్లు, మధ్యస్థాయి స్పీడ్ భారీ జనరేటర్లు(ఎంఎస్ఎల్‌జీ), తత్సంబంధ సర్వీసులను అందిస్తోంది.

బెంగళూరు ఫాక్స్‌కాన్ ప్లాంట్ షురూ

- ఐఫోన్ 17 ఉత్పత్తితో ఆరంభం
- రూ.25,000 కోట్లతో ఏర్పాటైన యూనిట్



న్యూఢిల్లీ: తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ బెంగళూరులోని తన యూనిట్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. స్వల్ప స్థాయిలో ఐఫోన్ 17 ఉత్పత్తిని ఆరంభించింది. చైనా తర్వాత రెండో అతిపెద్ద తయారీ కేంద్రాన్ని బెంగళూరు సమీపంలోని దేవనహళ్లి వద్ద 2.8 బిలియన్ డాలర్లతో (రూ.25,000 కోట్లు) ఫాక్స్‌కాన్ ఏర్పాటు చేయడం గమనార్హం. ఐఫోన్ తయారీలో ఫాక్స్‌కాన్ అతిపెద్ద సంస్థగా ఉంది. బెంగళూరులోని యూనిట్లో ఐఫోన్ 17 ఉత్పత్తితో కార్యకలాపాలు మొదలు పెట్టినట్లు.. చెన్నై యూనిట్‌లోనూ ఐఫోన్ 17 తయారీ చేస్తున్నట్లు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు తెలిపాయి. ఇటీవలే ఫాక్స్‌కాన్ బెంగళూరు యూనిట్ నుంచి వందలాది చైనా ఇంజనీర్లు, నిపుణులు అర్ధంతరంగా వెనక్కి వెళ్లిపోవడం తెలిసిందే. అవసరం అయితే తైవాన్ నుంచి అయినా నిపుణులను తెచ్చుకోగల సామర్థ్యం ఫాక్స్‌కాన్‌కు ఉండడంతో దీని ప్రభావం పెద్దగా పడలేదు.

60 మిలియన్ ఐఫోన్లు

ఐఫోన్ తయారీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 60 మిలియన్ యూనిట్లకు పెంచే ప్రణాళికతో ఫాక్స్‌కాన్ ఉంది. 2024-25లో 35-40 యూనిట్లను తయారు చేసింది. 2025 జూన్‌లో అమెరికాలో విక్రయించిన మెజారిటీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవేనని యాపిల్ సీఈవో టిక్‌కుక్ జూలై 31న ప్రకటించడం గమనార్హం. అంతేకాదు, జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించిన ఐఫోన్లు సైతం భారత్ నుంచి రవాణా చేసినవిగా ఫలితాల అనంతరం సమావేశంలో ప్రకటించారు. భారత్‌లోని యాపిల్ సరఫరాదార్లు 2025 మొదటి ఆరు నెల్లో 5.9 మిలియన్ యూనిట్లన సరఫరా చేశారు. గతేడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 21.5 శాతం అధికం. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ అంచనా ప్రకారం 2024లో అమెరికాలో ఐఫోన్ల అమ్మకాలు 75.9 మిలియన్ యూనిట్లుగా ఉన్నాయి.

స్పిక్ లాభం అప్

క్యూ1లో రూ. 67 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో వ్యవసాయ పోషకాలు, ఎరువుల రంగ కంపెనీ సదరన్ పెట్రోకెమికల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్(స్పిక్) పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6% వృద్ధితో రూ. 67 కోట్లకు చేరింది. ముడివ్యయాలు తగ్గడం, నిర్వహణ సామర్థ్యం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 63 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 756 కోట్ల నుంచి రూ. 798 కోట్లకు బలపడింది. కాగా.. కంపెనీ బోర్డు గతేడాది(2024-25)కిగాను వాటాదారులకు షేరుకి రూ. 2 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు అనుమతించినట్లు స్పిక్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 18-8-2025	
విశాఖ	515-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

పక్కదారి పడుతున్న 'పన్ను రహిత దిగుమతి'

- దీనికి ప్రభుత్వం చెక్ పెట్టాలి
- జీటీఆర్ఐ సూచన



న్యూఢిల్లీ: ఎగుమతిదారులకు తయారీ వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో తీసుకొచ్చిన డ్యూటీ ఫ్రీ ఇంపోర్ట్ ఆథరైజేషన్ (డీఎఫ్ఐఏ) పథకం (పన్ను రహిత దిగుమతి ధ్రువీకరణ పథకం) దుర్వినియోగం అవుతున్నట్లు ప్రైవేటు పరిశోధన సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వెలుగులోకి తెచ్చింది. దోపిడీకి ఇది లైసెన్స్‌గా మారినట్టు ఆరోపించింది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని దీనికి చెక్ పెట్టాలని సూచించింది. లేదంటే ఎగుమతుల ప్రోత్సాహక విధానంపై ఉన్న నమ్మకం పోతుందని, నిజాయితీ పరులైన ఎగుమతిదారులు వ్యాపారానికి దూరం కావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. గత ఐదేళ్లలో కంపెనీలకు ఈ పథకం కింద జారీ చేసిన లైసెన్స్‌లపై ఫోరెన్సిక్ ఆడిట్ అవసరమని పేర్కొంది. సుంకాల్లేని మోసపూరిత దిగుమతులతో లబ్ధి పొందిన కంపెనీల నుంచి వసూళ్లు చేయాలని సూచించింది. డీఎఫ్ఐఏ కింద గత ఐదేళ్లలో దిగుమతి అయిన వాటిని పరిశీలించి, ఆశించిన ప్రయోజనాలకు విరుద్ధమైనవి ఏవైనా ఉంటే వాటిని పథకం నుంచి మినహాయించాలని జీటీఆర్ఐ కోరింది. ఈ పథకం దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) దర్యాప్తు చేస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ స్పష్టత ఇచ్చింది.

దుర్వినియోగం ఇలా..

''వాస్తవానికి డీఎఫ్ఐఏ అన్నది ఎగుమతిదారులకు తయారీ వ్యయాలను తగ్గించేందుకు ఉద్దేశించినది. కానీ, దోపిడీకి లైసెన్స్‌గా మారింది. అధిక విలువైన వే ప్రొటీన్, కుంకుమపువ్వు, వాల్‌నట్, లిథియం అయాన్ బ్యాటరీలను సున్నా కస్టమ్స్ డ్యూటీపై ట్రేడర్లు దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని బిస్కెట్లు, పచ్చళ్లు, ట్రాక్టర్లకు ముడి సరుకులుగా చూపిస్తున్నారు. వాస్తవానికి వాటిని ఎందుకూ వినియోగించడంలేదు'' అని జీటీఆర్ఐ వివరించింది.

ఫైలింగ్ యాప్‌లతో జాగ్రత్త..



ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ప్రాక్టీస్ చేస్తున్న సీఏలు, సీఎంఏలు, లాయర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు.. ఇలా వృత్తి నిపుణులు ఉన్నారు. డిపార్టుమెంటు దగ్గర రిజిస్టర్ చేసుకుని, ఇన్‌కం ట్యాక్స్ ప్రాక్టీషనర్లుగా చలామణీ అయ్యే వారితోను ఫైల్ చేయించుకోవచ్చు. మీరే స్వయంగా చేసుకోవచ్చు. అనుభవం ఉన్న ఫ్రెండ్స్ సహాయంతో ఫైలింగ్ చేసుకోవచ్చు. కొన్ని సంస్థలు కూడా ఈ ఫైలింగ్ పనులు చేస్తున్నాయి. వీరందరితో మీరు స్వయంగా మాట్లాడవచ్చు. కలవవచ్చు. డిస్కస్ చేసి, రిటర్నులు వేయొచ్చు.

ప్రస్తుతం ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ప్రతి పనికి మనం ఎన్నో అప్లికేషన్లను వాడుతున్నాం. చేతిలో సెల్ ఫోన్ ఉంటే చాలు. అరచేతిలో స్వర్గం చూస్తున్నట్లు యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేస్తున్నాం. వాడుతున్నాం. ఆదాయపు పన్ను ఫైలింగ్‌కి కూడా రకరకాలుగా యాప్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మీరెంతో ఆలోచించాలి. ఒక విషయం గుర్తు పెట్టుకోండి. ఫైలింగ్ అంటే నాలు గంకెలను నాలుగు కాలమ్‌లలో నింపి, అప్‌లోడ్ చేసి క్లిక్ కొట్టడం కాదు. చట్టంలోని సెక్షన్లు, వాటిలో ఇమిడి ఉన్న చిక్కులు, లెక్కలు, వాటి ప్రభావం తెలిసి ఉండాలి. అప్లికేషన్స్ వల్ల ఎండమావుల్లాగా కంటికి కనిపించే ప్రయోజనాలు.

- చాలా త్వరగా పూర్తవుతుంది.
- అతి తక్కువ ఖర్చు.
- మీ సీటులో నుంచి కదలక్కర్లేదు. కానీ, ఈ యాప్‌లను చెక్ చేసుకోకుండా వాడటం వల్ల చాలా ఇబ్బందులుంటాయి. అవేంటంటే..

- చాలా త్వరగా ఫైలింగ్ చేయొచ్చు. ఇంత చౌకగా సర్వీసులు అందిస్తున్నారంటే, వారు పూర్తిగా కృత్రిమ మేథస్సు మీద ఆధారపడుతున్నారన్న మాట. కృత్రిమ మేథస్సు వల్ల త్వరగా అవుతుందేమో గానీ, ఎన్నో అంశాల్లో జడ్జిమెంట్ కావాలి.
- కేవలం కాగితాల్లో ఉన్న అంకెలను చదివి, వాటిని నింపడం/రాయడం/ఎక్కించడం మాత్రమే చేస్తారు. గతంలో మనం చదివాం. ఫారం 16లో తప్పులు, ఫారం 26ఏఎస్‌లో తప్పులు, డబుల్ ఎంట్రీలు, మీకసలు వర్తించని అంశాలు, మీకు సంబంధం లేని అంశాలు, అలాగే టీఐఎస్‌లో కూడా తప్పులు, డబుల్ ఎంట్రీలు, మీవి కాని/సంబంధం లేనివి ఉంటాయి. వాటిని చెక్ చేసి, విశ్లేషించే ప్రక్రియ ఉండదు. మక్కికి మక్కీ మాత్రమే కొడతారు.
- ఏ తప్పులు దొర్లినా, ఎటువంటి బాధ్యతలు వహించరు. తప్పుల మేరకు సరిదిద్దాలంటే డబ్బులు అడుగుతారు. అడగడం కాదు గుంజుతారు.
- జడ్జిమెంటు. సహజసిద్ధమైన మానవ మేథస్సును వాడకపోవడం వల్ల మనకు డ్యామేజీ జరగవచ్చు. ఎక్కువ పన్ను చెల్లించడం, రిఫండు తగ్గిపోవడంలాంటివి జరిగే అవకాశం ఉంది.
- డిడక్షన్లను తప్పుగా క్లెయిం చేసే అవకాశం ఉంది. కొత్త విధానమా, పాత విధానమా అనేది ఎంచుకోవడంలో తప్పు జరగవచ్చు. క్యాపిటల్ గెయిన్స్ విషయంలో వర్గీకరణ తప్పుగా చేయొచ్చు. సర్దుబాటు చేయాల్సిన నష్టాలు తీసుకోకపోవచ్చు. నష్టాల బదిలీ జరగకపోవచ్చు.
- నోటీసులు వస్తే ప్రమాదం. పెనాల్టీ పడితే వాళ్లు పరార్.
- వందల అంశాలు మీతో ముఖాముఖి చర్చించే పరిస్థితికి బదులు ఎకాయెకిన ఫేస్‌లెస్‌గా, బేస్‌లెస్‌గా ఒక క్లిక్ చేస్తే, అర్థం లేని ఫైలింగ్‌తో మీరు అనర్థాలు కొనుక్కుంటారు.
- సాఫ్ట్‌వేర్‌లో తప్పులున్నా.. ఉండొచ్చు. అలా వేసే ప్రక్రియలో ఆలోచనలకు, విశ్లేషణలకు తావుండదు.
- మహా అయితే, ఫారం 1 విషయంలో రిస్క్ తీసుకుని 'మమ' అనిపించవచ్చు. కానీ, మిగతా ఫారాల విషయంలో ఎటువంటి ప్రయోగం చేయొద్దు.
- ఇదేమీ గేమ్ యాప్ కాదు. చౌకగా సర్వీసులు దొరికాయని సంబరపడకండి. వందల రూపాయలు మిగిలాయని, మితిమీరి సంతోషపడితే వేలల్లో/లక్షల్లో నష్టాన్ని చూడాల్సి రావొచ్చు. కేవలం ఆర్థికంగానే కాదు.. చట్టాలని పాటించనందుకు గాను ఎన్నో చిక్కుల్లో పడతారు.

చివరగా, ఏడాదికోసారి, జాతి సేవలో పాలుపంచుకునేందుకు ఇదొక చక్కటి అవకాశం. నీతి, నిజాయితీతో ఆదర్శంగా ఉండే అంశం. సజ్జనుడిలాగా సగౌరవంగా సాగించాల్సిన సాలుసరి సత్కార్యం. కాబట్టి, వృత్తి నిపుణులను సంప్రదించండి. స్వయంగా టచ్‌లో ఉండండి. అన్ని కాగితాలు ఇవ్వండి. డిస్కస్ చేయండి. రిటర్న్ సరిగ్గా ఫైల్ చేయండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

యాక్సిస్ స్మాల్‌క్యాప్ ఫండ్

రాబడుల దన్ను!





స్మాల్‌క్యాప్ స్టాక్స్ ఆర్థిక అస్థిరతలకు ఎక్కువగా ప్రభావితం అవుతుంటాయి. దీంతో స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి (7 ఏళ్లలోపు) వీటిల్లో అస్థిరతలు ఎక్కువ. కానీ, దీర్ఘకాలంలో ఇవి మెరుగైన రాబడులను ఇస్తాయని చారిత్రక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీల్లోనే ఆటుపోట్లు ఎక్కువ. ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో స్మాల్‌క్యాప్ స్టాక్స్ పేకమేడల్లా పడిపోతుంటాయి. ఆ సందర్భాలను పెట్టుబడులకు అనుకూలంగా మలుచుకుని, అవసరమైతే అదనంగా ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మంచి సంపద సృష్టి సాధ్యపడుతుంది. ఆర్థిక వ్యవస్థలు మంచి పనితీరు చూపిస్తున్న తరుణంలో ఇతర కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీలు వేగవంతమైన వృద్ధిని చూపిస్తాయి. అందుకని దీర్ఘకాలంలో మంచి ఫండ్‌ను సమకూర్చుకోవాలని భావించే వారు తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో యాక్సిస్ స్మాల్‌క్యాప్ ఫండ్ ఒకటి. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఒకే విడత పెట్టుబడి కంటే.. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడం మెరుగైన మార్గం అవుతుంది. దీనివల్ల అస్థిరతల సమయంలోనూ పెట్టుబడులు సాధ్యపడతాయి.

రాబడులు..

ఈ పథకం గత ఏడాది కాలం మినహా అన్ని కాలాల్లోనూ అద్భుతమైన రాబడులను అందించింది. గత ఏడాది కాలంలో మార్కెట్లు ఒక శ్రేణి పరిధిలోనే చలిస్తుండడం చూస్తున్నాం. కనుక ఇతర కాలాల పనితీరును ఇక్కడ పరిశీలించాలి. గడిచిన మూడేళ్ల కాలంలో వార్షిక రాబడి రేటు 20.50 శాతంగా ఉంది. ఐదేళ్లలో చూస్తే ఏకంగా 29 శాతానికి పైనే ఏటా వార్షిక రాబడిని ఈ పథకం ఇన్వెస్టర్ల పెట్టుబడులపై సమకూర్చింది. ఏడేళ్లలో 23 శాతం, పదేళ్లలో 19.52 శాతం చొప్పున (డైరెక్ట్ ప్లాన్) వార్షిక రాబడి నిచ్చింది. బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌తో పోల్చి చూసినప్పుడు దీర్ఘకాలంలో ఈ పథకంలోనే రాబడి అధికంగా ఉంది. స్మాల్‌క్యాప్ సగటు రాబడులతో పోల్చి చూసినా యాక్సిస్ స్మాల్‌క్యాప్ పథకమే దీర్ఘకాలంలో అధిక రాబడులను ఇచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2013 నవంబర్‌లో ఈ పథకం మొదలైంది. నాటి నుంచి చూస్తే వార్షిక రాబడి రేటు 23 శాతానికి పైనే ఉంది. ప్రతికూల సమయాల్లోనూ బలంగా నిలబడడమే కాకుండా, మంచి రాబడులను ఇస్తున్న ఈ పథకాన్ని ఇన్వెస్టర్లు దీర్ఘకాల పెట్టుబడులకు పరిశీలించొచ్చు.

పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

మంచి యాజమాన్యం, ఆయా రంగాల్లో మంచి పోటీతత్వం ఉన్న కంపెనీలను యాక్సిస్ స్మాల్ క్యాప్ పెట్టుబడులకు ఎంపిక చేసుకుంటుంది. ముఖ్యంగా స్మాల్‌క్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్ కంపెనీలకు సైతం ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంది. పోర్ట్‌ఫోలియోలో వెయిటేజీని పరిస్థితులకు అనుగుణంగా స్మాల్, మిడ్‌క్యాప్ కంపెనీల మధ్య మారుస్తుంటుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.26,143 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. వీటిల్లో 90.56 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. 7.46 శాతం పెట్టుబడులను డెట్ సాధనాలకు కేటాయించింది. 2 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో 133 స్టాక్స్ ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించగా.. స్మాల్‌క్యాప్ కంపెనీలకు మొత్తం పెట్టుబడుల్లో 32.66 శాతాన్ని కేటాయించింది., దీనికంటే అధికంగా 58.72 శాతం మేర మిడ్‌క్యాప్ విభాగంలో ఇన్వెస్ట్ చేసింది. ఈ కంపెనీ ఇన్వెస్ట్ చేసిన స్మాల్‌క్యాప్ కంపెనీలు మిడ్‌క్యాప్ కంపెనీలుగా ఎదగడం ఫలితంగా ఇందులో పెట్టుబడులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 8 శాతానికి పైగా పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 19.76 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 15 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 14 శాతం, హెల్త్‌కేర్ కంపెనీల్లో 13.62 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
కిమ్స్	3.09
బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్	2.37
చోళమండలం ఫైనాన్షియల్	2.32
సీసీఎల్ ప్రొడక్ట్స్	2.27
జేబీ కెమికల్స్	2.02
ఎంసీఎక్స్	1.94
కేనెస్ టెక్	1.92
నారాయణ హెల్త్	1.85
బ్లూస్టార్	1.73
పీబీ ఫిన్‌టెక్	1.66

గుకేశ్‌పైనే దృష్టి

- నేటి నుంచి సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నీ
- బరిలో ప్రజ్ఞానంద





సెయింట్ లూయిస్ (అమెరికా): ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తిరిగి క్లాసికల్ చెస్ పోటీల్లో తలపడేందుకు సిద్ధమయ్యాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా ఐదో టోర్నీ అయిన సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత్ తరఫున గుకేశ్‌తోపాటు ప్రజ్ఞానంద విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. పదిమంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతుంది. సోమవారం నుంచి ఇక్కడ జరిగే ఈ టోర్నీలో అమెరికా గ్రాండ్‌మాస్టర్లు ఫాబియానో కరువానా, వెస్లీ సో, లెవోన్ అరోనియన్, స్యామ్ సేవియన్‌లతో పాటు ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమి వాచియెర్ లాగ్రెవ్, అలీరెజా ఫిరూజా... పోలాండ్ స్టార్ జాన్ క్రిస్టోఫ్ డూడా... ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్బెక్ అబ్దుసత్తోరోవ్ కూడా పాల్గొంటున్నారు. అయితే ప్రపంచ నంబర్‌వన్, మాజీ ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ ఆడకపోవడమే టోర్నీకి ప్రధాన లోటు అని చెప్పొచ్చు. ఈ నార్వే గ్రాండ్‌మాస్టర్ క్లాసికల్ చెస్‌ను ఆస్వాదించలేకపోతున్నానని ఇదివరకే ఎన్నోసార్లు స్పష్టం చేశాడు. అందువల్లే ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. అయితే చెస్ దిగ్గజం కార్ల్‌సన్ లేకపోయినప్పటికీ భారత ఆటగాళ్లకు ప్రధానంగా అమెరికా ఆటగాళ్లు ఆరోనియన్, కరువానా, అలీరెజా నుంచి గట్టిపోటీ తప్పదు. సెయింట్ లూయిస్‌లోనే జరిగిన గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో గుకేశ్ ఆశించినంతగా రాణించలేకపోయాడు. అయితే తనకు పట్టున్న క్లాసికల్ ఫార్మాట్‌లో సత్తా చాటుకోవడానికి గుకేశ్ రెడీగా ఉన్నాడు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 3,50,000 డాలర్లు (రూ. 3 కోట్ల 6 లక్షలు). విజేతకు 1,00,000 డాలర్లు (రూ.87 లక్షల 51 వేలు) అందజేస్తారు. రన్నరప్‌గా నిలిచిన ప్లేయర్‌కు 65 వేల డాలర్లు (రూ. 56 లక్షల 88 వేలు), మూడో స్థానం పొందిన ప్లేయర్‌కు 48 వేల డాలర్లు (రూ. 42 లక్షలు) లభిస్తాయి.



‘మళ్లీ సత్తా చాటుతాం’

వరల్డ్ చాంపియన్‌షిప్‌పై సాత్విక్-చిరాగ్ ఆత్మవిశ్వాసం

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో సంచలన జోడీగా ఘన విజయాలు అందుకున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి గత కొంత కాలంగా అంచనాలకు అనుగుణంగా రాణించలేకపోతున్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, థామస్ కప్‌లో స్వర్ణంతో పాటు ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు గెలుచుకొని రెండేళ్ల క్రితమే వరల్డ్ నంబర్‌వన్ జంటగా నిలిచారు. అయితే గాయాలు తదితర కారణాలతో వెనుకబడిన వీరికి 2025లో కూడా కలిసి రాలేదు. ఏడాది కాలంగా సాత్విక్-చిరాగ్ ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. అయితే ప్రదర్శన మరీ పేలవంగా ఏమీ లేదు కానీ ట్రోఫీలు మాత్రం సాధించలేకపోతున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగిన తర్వాత వరుసగా మూడు టోర్నీల్లో వారు సెమీ ఫైనల్ చేరారు. ఇటీవల కూడా సింగపూర్, చైనా ఓపెన్ టోర్నీల్లో కూడా సెమీఫైనల్ వరకు రాగలిగారు. తాము విఫలమవుతున్న విషయాన్ని వీరు కూడా అంగీకరించారు. ‘పారిస్ ఒలింపిక్స్ తర్వాత పరిస్థితి కొంత ఇబ్బందికరంగా మారింది. నేను గాయపడ్డాను. ట్రైనర్‌ను మార్చాల్సి వచ్చింది. అంత మళ్లీ కొత్తగా మొదలు పెట్టినట్లు అనిపించింది. గాయాలు, వ్యక్తిగత సమస్యలతో లయ కోల్పోయాం. మొత్తంగా చూస్తే మెరుగ్గానే ఆడినా ఇంకా ఫలితాలు రావాల్సింది. అయితే త్వరలోనే అది జరుగుతుందని నమ్ముతున్నాం. వరుసగా టోర్నీలు ఆడితే అది సాధ్యమవుతుంది’ అని సాత్విక్ వ్యాఖ్యానించాడు. ఆల్ ఇంగ్లండ్ టోర్నీ తర్వాత చిరాగ్‌కు గాయం కావడంతో రెండు నెలలు ఆటకు దూరం కావాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన సింగపూర్ టోర్నీలో ఊహించిదానికంటే మెరుగైన ప్రదర్శనే చేసారు. ‘సింగపూర్ టోర్నీలో మేం ఒక గేమ్ గెలవడం కూడా గగనంగా అనిపించింది. తొలి రౌండ్ దాటలేం అనుకున్న స్థితిలో కూడా సెమీస్ చేరగలిగాం’ అని చిరాగ్ గుర్తు చేశాడు. అయితే తాము పూర్తి స్థాయిలో ఫిట్‌గా లేమని మాత్రం సాత్విక్- చిరాగ్ వెల్లడించారు. ‘గత ఏడాది కాలంలో మేం పూర్తి ఫిట్‌గా ఉండి ఆడిన మ్యాచ్‌లు లేవు. ఏదో చిన్న చిన్న సమస్యలతోనే ఆడుతూ పోయాం. గాయాలు మా ఆటలో జోరును నిలువరిస్తున్నాయి. మేం 100 శాతం ఫిట్‌గా మారాల్సిన అవసరం ఉంది. అప్పుడే వరుస విజయాలు దక్కుతాయి’ అని ఈ భారత ద్వయం పేర్కొంది. ఈ నెల 25 నుంచి పారిస్‌లో వరల్డ్ చాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో వీరిపై గెలుపు అంచనాలు ఉన్నాయి. తమ ఫిట్‌నెస్ మెరుగవుతోందని, పూర్తి స్థాయిలో కోలుకొని మళ్లీ సత్తా చాటుతామన్న డబుల్స్ జంట వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలమని విశ్వాసం వ్యక్తం చేసింది.

‘స్పిన్ సవాలు ఎదుర్కోవాల్సిందే’

మహిళల వన్డే ప్రపంచకప్‌పై అలీసా హీలీ వ్యాఖ్య



బ్రిస్బేన్: భారత్ వేదికగా జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్‌లో స్పిన్ సవాలు ఎదురవడం ఖాయమని ఆస్ట్రేలియా మహిళల జట్టు కెప్టెన్ అలీసా హీలీ పేర్కొంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో ఏడుసార్లు వరల్డ్‌కప్ టైటిల్ గెలుచుకున్న ఆస్ట్రేలియా జట్టు ఎనిమిదోసారి ట్రోఫీ చేజిక్కించుకునేందుకు సిద్ధమవుతోంది. 2022లో న్యూజిలాండ్ వేదికగా జరిగిన వరల్డ్‌కప్‌లో ఆసీస్ ఘన విజయం సాధించగా... డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అదే తీవ్రత కొనసాగించాలని భావిస్తున్నట్లు హీలీ వెల్లడించింది. భారత మహిళల ‘ఎ’ జట్టుతో మూడో వన్డేలో హీలీ అజేయ శతకంతో చెలరేగడంతో ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం హీలీ మాట్లాడుతూ... భారత్, శ్రీలంక వేదికగా వచ్చే నెలలో ప్రారంభంకానున్న వరల్డ్‌కప్‌లో స్పిన్ కీలక పాత్ర పోషించనుందని వెల్లడించింది. ‘భారత్ ‘ఎ’ జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. వరల్డ్‌కప్‌లో మాకు మరింత స్పిన్ సవాలు ఎదురుకానుంది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడం కీలకం’ అని హీలీ పేర్కొంది. ఆస్ట్రేలియా ‘ఎ’తో వన్డే సిరీస్‌లో భారత ‘ఎ’ జట్టు తరఫున రాధ యాదవ్, మిన్ను మణి, తనూజ కన్వర్, ప్రేమ రావత్ స్పిన్ బాధ్యతలు నిర్వర్తించారు. మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన హీలీ... రెండో వన్డేలో 91 పరుగులతో సెంచరీ చేజార్చుకుంది. ఇక ఆదివారం జరిగిన సిరీస్ చివరి వన్డేలో 85 బంతుల్లోనే 23 ఫోర్లు, 3 సిక్స్‌లతో అజేయంగా 137 పరుగులు చేసి ఫామ్ చాటుకుంది. ప్రపంచకప్ ప్రారంభానికి ముందు హీలీ సత్తాచాటడం ఆస్ట్రేలియా జట్టుకు ఎంతో మేలు చేస్తుందని ఆసీస్ మహిళల ‘ఎ’ జట్టు కోచ్ డాన్ మార్ష్ అన్నాడు. ‘భారత్‌లో వన్డే ప్రపంచకప్ వంటి మెగా టోర్నీకి ముందు అలీసాకు మంచి మ్యాచ్ ప్రాక్టీస్ దక్కింది. భారత ‘ఎ’ జట్టుతో టి20, వన్డే సిరీస్‌లతో హీలీ చక్కటి ప్రదర్శన కనబర్చింది. చివరి వన్డేలో సాధించిన అజేయ శతకం మెగా టోర్నీకి ముందు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది’ అని మార్ష్ పేర్కొన్నాడు.

మోహన్ బగాన్‌పై ఈస్ట్ బెంగాల్ విజయం

కోల్‌కతా: చిరకాల ప్రత్యర్థుల సమరంలో మోహన్ బగాన్‌ను ఈస్ట్ బెంగాల్ కంగుతినిపించింది. డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఈస్ట్ బెంగాల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఈస్ట్ బెంగాల్ 2-1 స్కోరుతో మోహన్ బగాన్‌పై నెగ్గింది. తొలి అర్ధభాగం మొదలైన 18 నిమిషాలకు మొరాకోకు చెందిన ఫార్వర్డ్ హమిద్ అహదాద్ గాయపడటంతో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి దిగిన గ్రీస్ స్ట్రయికర్ దిమిత్రియోస్ డైమంతకొస్ ఈస్ట్‌బెంగాల్ పాలిట గేమ్ చేంజర్ అయ్యాడు. 38వ నిమిషంలో పెనాల్టీని గోల్‌గా మలచి జట్టును 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. ద్వితీయార్ధం మొదలైన ఏడు నిమిషాలకు మళ్లీ డైమంతకొస్ రెండో గోల్ చేసి బెంగాల్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. 68వ నిమిషంలో అనిరుధ్ థాపా గోల్‌పోస్ట్‌కు చాలా దూరం నుంచి కొట్టిన షాట్... లక్ష్యాన్ని చేరడంతో ఈస్ట్ బెంగాల్ ఆధిక్యాన్ని 2-1కు తగ్గించగలిగాడు కానీ విజయాన్ని అయితే దూరం చేయలేకపోయాడు.

విజేత సర్వీసెస్

అహ్మదాబాద్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా పురుషుల వాటర్ పోలో ఈవెంట్‌లో సర్వీసెస్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో సర్వీసెస్ జట్టు 11-10 తో రైల్వేస్ జట్టుపై గెలిచింది. నిర్ణీత సమయం ముగిసేవరకు రెండు జట్లు 9-9తో సమంగా నిలిచాయి. ‘షూటౌట్’లో ఐదు షాట్‌లు తర్వాత రెండు జట్లు 10-10తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత సర్వీసెస్ ప్లేయర్ షాట్ లక్ష్యానికి చేరగా... రైల్వేస్ గురి తప్పడంతో సర్వీసెస్‌కు టైటిల్ ఖరారైంది.

ఛెత్రికి తలుపులు తెరిచే వున్నాయి

- భారత ఫుట్‌బాల్‌లో అతనో దిగ్గజం
- హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ స్పష్టీకరణ





బెంగళూరు: భారత స్టార్ ఫుట్‌బాలర్, మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రికి తలుపులు ఇంకా తెరిచే ఉన్నాయని కొత్త కోచ్ ఖాలిద్ జమీల్ అన్నారు. సెంట్రల్ ఏషియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (సీఏఎఫ్‌ఏ) నేషన్స్ కప్ కేవలం సన్నాహక టోర్నీ మాత్రమే అని, దీని కోసం ఎంపిక చేసిన ప్రాబబుల్స్‌లో ఛెత్రి పేరు లేనంత మాత్రాన అతని ఆటకు తెరపడినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు. తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లలో జరిగే నేషన్స్ కప్ కోసం 35 మంది సభ్యులతో కూడిన జట్టును ఆదివారం ప్రకటించారు. అయితే ఇందులో స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రి పేరు లేకపోవడంతో మీడియాలో వస్తున్న ఊహాగానాలకు హెడ్ కోచ్ ముగింపు పలికే ప్రయత్నం చేశారు. ఆసియా కప్ క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్‌లకు ఛెత్రి సహా ఇతర కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉంటారని అన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్‌లో భారత్ ఇంటాబయటా సింగపూర్‌తో రెండు మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. 9న సింగపూర్‌లో, 14న సొంతగడ్డపై ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ‘భారత ఫుట్‌బాల్‌లో సునీల్ ఒక దిగ్గజం. మన సాకర్‌కు అతనో రోల్ మోడల్. అంతేకాదు... నా ఫేవరెట్ ఆటగాడు కూడా! అతడితో తలపడిన (క్లబ్, లీగ్) సందర్భాలెన్నో ఉన్నాయి’ అని జమీల్ తెలిపినట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ప్రకటనను విడుదల చేసింది. తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లు ఉమ్మడిగా నిర్వహించబోయే నేషన్స్ కప్‌లో భారత్ గ్రూప్ ‘బి’లో ఉంది. ఈ నెల 29న తొలి మ్యాచ్‌లో తజికిస్తాన్‌తో భారత్ పోటీపడుతుంది. సెప్టెంబర్ 1న ఇరాన్, 4న అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది. మూడో స్థానం సహా ఫైనల్ పోటీలు 8న తాష్కెంట్‌లో జరుగుతాయి. ఈ టోర్నీ కోసం శనివారమే ప్రాబబుల్స్‌కు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 22 మంది ఆటగాళ్లు శిబిరంలో ఉండగా... మిగతా 13 మంది డ్యూరాండ్ కప్ ముగిసిన వెంటనే క్యాంప్‌లో పాల్గొంటారు.

ఫైనల్లో రిత్విక్ జోడీ



సాక్షి, హైదరాబాద్: సర్వ్ ఫస్ట్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ ఫైనల్లోకి ప్రవేశించాడు. అమెరికాలోని సౌత్ కరోలినాలో జరుగుతున్న ఈ టోర్నీలో సెమీఫైనల్లో రిత్విక్ చౌదరీ-శ్రీరామ్ బాలాజీ (భారత్) ద్వయం 7-5, 7-6 (8/6)తో వాసిల్ కిర్కోవ్ (అమెరికా)-బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జంటపై విజయం సాధించింది. 1 గంట 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బాలాజీ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. తొలి రౌండ్‌లో ‘బై’ పొందిన నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన రిత్విక్-బాలాజీ 6-4, 4-6, 12-10తో ‘సూపర్ టైబ్రేక్’లో ప్యాట్రిక్ హార్పర్ (ఆస్ట్రేలియా)-ప్రుచాయ ఇసారో (థాయ్‌లాండ్)లపై గెలుపొందారు.



‘డైమండ్’ ఫైనల్‌కు నీరజ్

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్ ఈవెంట్‌కు భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అర్హత సాధించాడు. డైమండ్ లీగ్ ఫైనల్ ఆగస్టు 27, 28వ తేదీల్లో స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ నగరంలో జరుగుతుంది. శనివారం పోలాండ్‌లో జరిగిన సిలేసియా డైమండ్ లీగ్ మీట్‌లో నీరజ్ బరిలోకి దిగలేదు. ఈనెల 22న బ్రెస్సెల్స్ జరిగే చివరి డైమండ్ లీగ్ మీట్‌లో కూడా నీరజ్ ఆడేది అనుమానమే. నిర్ణీత నాలుగు డైమండ్ లీగ్ మీట్‌ల తర్వాత టాప్-6లో నిలిచే వారు ఫైనల్‌కు అర్హత పొందుతారు. బ్రస్సెల్స్ మీట్ ఫలితాలతో సంబంధం లేకుండా... ప్రస్తుతం టాప్-3లో ఉన్న కెషార్న్ వాల్కట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో; 17 పాయింట్లు), జూలియన్ వెబెర్ (జర్మనీ; 15 పాయింట్లు), నీరజ్ చోప్రా (15 పాయింట్లు) ఫైనల్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు.

డాక్టర్ వేస్ పేస్ అంత్యక్రియలు పూర్తి



కోల్‌కతా: ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ క్రీడా వైద్యుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వేస్ పేస్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. పార్కిన్‌సన్స్ వ్యాధితో బాధపడ్డ 80 ఏళ్ల వేస్ గురువారం కన్నుమూయగా... ఆదివారం కోల్‌కతాలోని సెయింట్ థామస్ చర్చ్‌లో జరిగిన ఆయన అంత్యక్రియల్లో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, హాకీ ఇండియా (హెచ్‌ఐ) అధ్యక్షుడు దిలీప్ టిర్కీ సహా పలు క్రీడా రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. భారత హాకీకి ఆయన చేసిన సేవలకు గుర్తుగా... వేస్ పార్థివ దేహానికి యువ ఆటగాళ్లు హాకీ స్టిక్‌లతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వేస్ కుమారుడు లియాండర్ పేస్‌ను గంగూలీ ఓదార్చాడు. మాజీ క్రికెటర్ అరుణ్ లాల్, తృణముల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఒబ్రియన్‌తో పాటు ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్, హాకీ బెంగాల్, కోల్‌కతా క్రికెట్ క్లబ్, ఫుట్‌బాల్ క్లబ్‌ల ప్రతినిధులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. 1972 మ్యూనిక్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత హాకీ జట్టులో వేస్ సభ్యుడు కాగా... ఆటకు వీడ్కోలు పలికిన అనంతరం వైద్యుడిగా భారత క్రీడారంగానికి ఆయన ఎనలేని సేవలు అందించారు. బీసీసీఐ, ఆసియా క్రికెట్ కౌన్సిల్, అఖిల భారత ఫుట్‌బాల్ సంఘం, భారత ఒలింపిక్ సంఘం, భారత డేవిస్ కప్‌కు వేస్ వైద్య కన్సల్టెంట్‌గా పనిచేశారు.

వేస్ సేవలు వెలకట్టలేనివి: టిర్కీ

హాకీ, రగ్బీ, ఫుట్‌బాల్, టెన్నిస్ ఇలా అనేక క్రీడల్లో ప్రవేశం ఉన్న వేస్... ఆ తర్వాతి కాలంలో భారతీయ క్రీడా వైద్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ‘వేస్ పేస్ లోటు పూడ్చలేనిది. ఆటతో సంబంధం లేకుండా భారతీయ క్రీడారంగానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. ప్లేయర్‌గా, డాక్టర్‌గా, మెంటార్‌గా, కన్సల్టెంట్‌గా, క్రీడా పరిపాలకుడిగా ఆయన జీవితంలో ఎన్నో విభిన్న పాత్రలు పోషించారు. జాతీయ శిబిరాల సమయంలో ఆయన ఎలాంటి పారితోషికం తీసుకోకుండా ప్లేయర్లతో పాటే ఉండి వారి బాగోగులు చూసుకునేవారు. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్ సమయంలో ఆయన సేవలను దగ్గర నుంచి చూశా. ప్రస్తుతం క్రీడా రంగంలో వైద్యుల ప్రాధన్యత పెరిగింది. అవేవీ లేని సమయంలో ఆయనే అన్నీ అయి నడిపించారు’ అని టిర్కీ గుర్తుచేసుకున్నాడు. వేస్‌ది పూర్తి స్పోర్ట్స్ ఫ్యామిలీ అని... ఒకే కుటుంబం నుంచి వేస్ హాకీలో ఒలింపిక్స్ పతకం నెగ్గితే ఆయన కుమారుడు లియాండర్ పేస్ టెన్నిస్‌లో ఆ కల తీర్చుకున్నాడని.. వేస్ భార్య జెన్నిఫర్ భారత బాస్కెట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారని టిర్కీ గుర్తు చేశాడు.

ఉక్రెయిన్ స్నైపర్ ప్రపంచ రికార్డు

రష్యా సైనికులను 13 వేల అడుగుల దూరం నుంచి కాల్చిన షూటర్

కీవ్: సుదూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించడం ద్వారా ఉక్రెయిన్ ఆర్మీ స్నైపర్ షూటర్ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో పొక్రొవ్స్క్ ప్రాంతంలో ఆగస్టు 14వ తేదీన ఈ ఘటన జరిగింది. 13,000 అడుగులకు దూరంలోని ఇద్దరు రష్యా సైనికులను తమ స్నైపర్ షూటర్ అత్యంత ఖచ్చితత్వంతో గురిచేసి కాల్చిచంపాడని ఉక్రెయిన్ ఆర్మీ ఆదివారం ప్రకటించింది. అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ కాంప్లెక్స్ నుంచి కృత్రిమ మేధ సాయంతో 14.5 ఎంఎం అలిగేటర్ రైఫిల్‌ను వాడి స్నైపర్ ఈ కాల్పులు జరిపి ప్రపంచ రికార్డు బద్దలు కొట్టినట్లు మిలటరీ జర్నలిస్ట్ యూరి బుటుసోవ్‌ను ఉటంకిస్తూ కీవ్ పోస్ట్ వెల్లడించింది. ఇటీవలి కాలంలో పొక్రొవ్స్క్‌పై రష్యా దాడులు ఒక్కసారిగా పెరిగిపోయిన నేపథ్యంలోనే స్నైపర్‌లను ఉక్రెయిన్ ఆర్మీ రంగంలోకి దించింది. గతంలో సుమారు రెండు మైళ్ల దూరంలోని లక్ష్యాన్ని హారిజన్స్ లార్డ్ అనే హైటెక్ రైఫిల్‌తో గురిచూసి కాల్చిన గత ప్రపంచ రికార్డు సైతం ఉక్రెయిన్ స్నైపర్ పేరునే ఉండటం గమనార్హం.



ప్రత్యర్థి రోబోపై పిడిగుద్దులు కురిపిస్తూనే కాలితో తన్నుతున్న మరో రోబోట్. ప్రపంచ హ్యూమనాయిడ్ రోబోట్స్ క్రీడల్లో భాగంగా ఈ బాక్సింగ్ పోటీ నిర్వహించారు. ఆదివారం బీజింగ్‌లో తీసిందీ ఫొటో

ప్రేమించిన అమ్మాయికి 'బాంబు' కానుక

ఆమె భర్తకు పంపిన ప్రబుద్ధుడు

ఖైరాగఢ్ (ఛత్తీస్‌గఢ్): మ్యూజిక్ సిస్టమ్‌లో బాంబు పెట్టి ప్రేమించిన మహిళ భర్తకు బహుమతిగా పంపాడో వ్యక్తి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో జరిగింది. ఖైరాగఢ్‌లోని కుసామి గ్రామానికి చెందిన వినయ్ వర్మ ఎలక్ట్రీషియన్. కాలేజీ చదివే ప్పటినుంచే ఓ యువతిని ప్రేమించాడు. ఆ విషయాన్ని ఆమెకూ చెప్పలేదు. ఈలోపు ఆమెకు పెళ్లయిపోయింది. ఎలాగైనా ఆమె భర్త ఖాన్‌ను చంపాలనుకున్నాడు. గూగుల్‌లో శోధించాడు. ఆన్‌లైన్ ట్యుటోరియల్స్ చూసి మ్యూజిక్ సిస్టమ్ స్పీకర్‌లో ఐఈడీని అమర్చాడు. మ్యూజిక్ సిస్టమ్ ప్లగిన్ చేయగానే బాంబు పేలిపోయేలా రూపొందించాడు. పార్సిల్‌ని మాన్పూర్‌లోని అఫ్సర్‌ఖాన్‌కు పంపించాడు. అయితే పార్సిల్ అందుకున్న ఖాన్ అనుమానంతో పోలీసులకు సమాచారం అందించాడు. బాంబు స్క్వాడ్ వచ్చి ప్యాకేజీని పరిశీలించగా, స్పీకర్ లోపల దాచిన 2 కిలోల ఐఈడీ దొరికింది. హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. వినయ్‌వర్మను, అతనికి సహకరించిన మిత్రులను అరెస్టు చేశారు. వర్మకు వీటిని అందించిన స్మగ్లింగ్ ముఠాను పట్టుకున్నారు.

ఎయిమ్స్‌ను వీడుతున్న వైద్యులు

2022-2024 మధ్య 429 మంది వైద్యుల రాజీనామా

ఢిల్లీ ఎయిమ్స్ నుంచి అత్యధికంగా 52 మంది

రాజీనామాల్లో అధికభాగం ఉన్నత స్థాయిలోనే

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎయిమ్స్.. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థ తీవ్ర అనారోగ్యంతో ఉంది. ఒకప్పుడు ఇందులో చేరడానికి వైద్యులు పోటీపడ్డ సంస్థను ఇప్పుడు వైద్యులు వీడుతున్నారు. ఎంతో ప్రతిష్ట ఉన్న సంస్థ. ఆ సంస్థతో అంతే విడదీయలేని అనుబంధం. కొంతమంది డాక్టర్లయితే.. వారి పేరుతో కాకుండా.. ఎయిమ్స్‌తోనే గుర్తింపు. అలాంటి గుర్తింపును కూడా ఎందుకు వదులుకొంటున్నారు? పేగుబంధం లాంటి అనుబంధాన్ని తెంచేసుకుంటున్నారు? ఇటీవల పార్లమెంటుకు ప్రభుత్వం ఇచ్చిన నివేదిక చెప్పిన సత్యాలేంటో చూద్దాం.

ఢిల్లీ ఎయిమ్స్ నుంచే ఎక్కువగా...

దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌ల్లో 429 మంది రాజీనామా చేశారు. 2022 నుంచి 2024 మధ్య రెండేళ్ల కాలంలోనే, రాజీనామాలు సంభవించాయి. ఢిల్లీలోని ఎయిమ్స్ నుంచి అత్యధికంగా 52 మంది వైద్యులు రాజీనామా చేసి వెళ్లిపోయారు. అయితే ఇది కేవలం ఢిల్లీకే పరిమితం కాలేదు. రిషికేశ్‌లో 38 మంది, రాయ్‌పూర్‌లో 35, బిలాస్‌పూర్‌లో 32, మంగళగిరిలో 30 మంది, భోపాల్‌లో 27 మంది వైద్యులు రాజీనామా చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 1,000 మందికంటే ఎక్కువ మంది అధ్యాపకులు, విభాగాధిపతులు, కేంద్రాల అధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారు. అయితే.. ఇక్కడ జరిగిన రాజీనామాలలో ఎక్కువ భాగం ఉన్నత స్థాయిలోనే జరిగాయి.

అత్యున్నత స్థాయివారే అత్యధికం..

రాజీనామా చేసినవారిలో మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా వంటి ప్రముఖులు ఉండటం గమనార్హం. ఆయన వీఆర్‌ఎస్ తీసుకుని గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శివ్ చౌదరి రాజీనామా చేసి ఫోర్టిస్ ఎస్కార్ట్‌లో చేరారు. న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ శశాంక్ శరద్ కాలే అపోలోకు మారారు. రాజీనామా చేసిన ప్రముఖుల్లో ఈఎన్‌టీ విభాగం, నేషనల్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ మాజీ అధిపతి డాక్టర్ అలోక్ టక్కర్, రోటరీ కేన్సర్ హాస్పిటల్ అనస్థీషియాలజీ అధిపతి డాక్టర్ సుష్మా భట్నాగర్, న్యూరాలజీ విభాగం మాజీ అధిపతి, న్యూరోసైన్సెస్ సెంటర్ చీఫ్ డాక్టర్ పద్మ శ్రీవాస్తవ, ఆర్థోపెడిక్ విభాగం మాజీ అధిపతి డాక్టర్ రాజేష్ మల్హోత్రా కూడా ఉన్నారు. వీరంతా ఎయిమ్స్‌లోనే ఎదిగి, 3 దశాబ్దాలకు పైగా ఇక్కడే సేవలందించడం గమనార్హం.

అపనమ్మకం.. అసమర్థత...

ఢిల్లీలోని ఎయిమ్స్ అంటే.. తక్కువ ఖర్చుతో అత్యున్నతమైన వైద్యం అందుతుందనే అపారమైన నమ్మకం ఉంటుంది. అందుకే.. ఇప్పటికీ ప్రతిరోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. అలాంటి సంస్థ చిత్రం మొత్తం మారిపోయింది. సరైన నాయకత్వం లేకపోవడం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అపాయింట్‌మెంట్ల కోసం గంటల తరబడి క్యూలు, శస్త్రచికిత్సల కోసం నెలలపాటు సుదీర్ఘ నిరీక్షణలు సర్వసాధారణం అయ్యాయి. ఇప్పుడు వ్యవస్థ మొత్తం నిత్యం ఒత్తిడిలో ఉంటోంది. గతంలో ఎయిమ్స్ డైరెక్టర్ అంటే.. గొప్ప గౌరవం. కానీ ఇప్పుడు అపనమ్మకం, అసమర్థతతో కూడిన వాతావరణాన్ని సృష్టించారు. ఇక విభాగాధిపతులైతే తమ శాఖలకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకోలేని స్థితికి తీసుకొచ్చారు. వారి ప్రతిపాదనలన్నీ కాగితాలపైనే నిలిచిపోతున్నాయి. రోజువారీ పనితీరు కూడా కష్టమవ్వడం వల్లే ఎయిమ్స్‌ను వీడామని పలువురు చెబుతున్నారు.

రోటరీ హెడ్‌షిప్ విధాన అమలే లేదు..

ఇక్కడ మరో వివాదాస్పద అంశం రోటరీ హెడ్‌షిప్ విధానం. రోటరీ హెడ్‌షిప్ అనేది వైద్య కళాశాల విభాగాల అధిపతులను రొటేషన్ పద్ధతిలో నియమించే విధానం. దీని ప్రకారం, ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి, ఒక అధ్యాపకుడు ఆ విభాగానికి అధిపతిగా ఉంటారు. ఆ తర్వాత మరొకరు ఆ స్థానాన్ని తీసుకుంటారు. అధ్యాపకులందరికీ నాయకత్వ అవకాశం కల్పించడం, వారి అనుభవాన్ని పెంచడం లక్ష్యంగా దీన్ని రూపొందించారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలలో అమలు చేసే వ్యవస్థ. ఢిల్లీలోని ఎయిమ్స్, చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో దీనిని అమలు చేయాలని 2023లో కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2024 జూన్ వరకు గడువు విధించింది. అయినా ఈ విధానం అమలు కాలేదు.

రాజకీయాలతో విశ్వసనీయతకు మచ్చ..

ఎయిమ్స్‌తో 30 నుంచి 35 ఏళ్ల అనుబంధం కలిగి ఉండి కూడా.. జరుగుతున్న నష్టాన్ని చూస్తూ భరించలేక వీడామని సీనియర్లు అంటున్నారు. నిబద్ధతతో ఉన్న వైద్యులపై రాజకీయాలు చేయడం, తక్కువ అనుభవం ఉన్నవారికి సంస్థలో నిర్ణయాధికారాలు కట్టబెట్టే ధోరణి సీనియర్లకు ఇబ్బందికరంగా మారింది. తప్పని పరిస్థితుల్లోనే అంత గొప్ప సంస్థను వీడామంటున్నారు. తాము వేతనాలకోసమే అయితే ఎప్పుడో వెళ్లిపోయేవారమని, ఇన్ని దశాబ్దాల తరువాత సంస్థను వీడాల్సి రావడానికి సంస్థలో రాజకీయాలే కారణమని చెబుతున్నారు. ఈ సామూహిక వలసలతో సీనియర్ స్థాయి వైద్యుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఎక్కువ మంది అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో నిండిపోయింది. ఇది ఎయిమ్స్ ఢిల్లీ వంటి ప్రఖ్యాత వైద్య సంస్థ విశ్వసనీయతపై ప్రశ్నలను లేవత్తుతోంది.

సౌకర్యాల కొరతతో పోస్టులు ఖాళీ..

ఎయిమ్స్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. అక్కడ సరిపోను క్వార్టర్స్ ఉండటం లేదు. కనెక్టివిటీ తక్కువగా ఉంటోంది. దగ్గరలో ఉన్నతస్థాయి పాఠశాలలు ఉండటం లేదు. షాపింగ్ కాంప్లెక్సులు సరికదా.. చివరకు ఇంటర్నెట్ సౌకర్యంగా కూడా సరిగా ఉంటం లేదు. ఇక వీరు ఉంటున్న ప్రాంతాలు టైర్-3 నగరాలుగా గుర్తించి హోమ్ అలవెన్స్ తక్కువగా ఇస్తున్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేదు. దీంతో ఇక్కడికి రావడానికి వైద్యులు అంతగా ఆసక్తి చూపడం లేదు. రాయ్‌బరేలిలో 201 ఫ్యాకల్టీ పోస్టులకు 88 భర్తీ కాలేదు. జమ్మూలోని ఎయిమ్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయిలో 183కి గాను 68 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు మూడేళ్లుగా ఖాళీలను భర్తీ చేయడం లేదు. గత మూడేళ్లలో ఒక్క ఢిల్లీలోని ఎయిమ్స్‌లోనే 1,191 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో 827 భర్తీ అయ్యాయి. ఇక దేశవ్యాప్తంగా 2023-24లో 1,207 పోస్టులు మంజూరు కాగా, 850 భర్తీ అయ్యాయి. 2024-25లో 1,235 పోస్టులు మంజూరు కాగా, 803 భర్తీ అయ్యాయి. 2025-26 సంవత్సరానికి 1,306 పోస్టులు మంజూరు కాగా, 844 భర్తీ అయ్యాయి. దేశవ్యాప్తంగా మొత్తం 12 ఎయిమ్స్‌ల్లో సగానికి పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండటం గమనార్హం.

యూట్యూబర్ నివాసం వద్ద కాల్పుల కలకలం

గురుగ్రామ్: గురుగ్రామ్‌లోని ప్రముఖ యూట్యూబర్ ఎల్విష్ యాదవ్ నివాసం వెలుపల జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపుతోంది. ఆదివారం ఉదయం 5.30 గంటల సమయంలో ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గురుగ్రామ్ సెక్టార్ 57లోని ఎల్విష్ యాదవ్ నివాసం వద్దకు చేరుకున్నారు. పాతిక రౌండ్లకుపైగా కాల్పులు జరిపారు. కొన్ని సెకన్ల తర్వాత గేట్ వద్దకు చేరుకుని లోపలికి తొంగి చూసి, మరోసారి కాల్పులు జరిపి పరారయ్యారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. పోలీసులు ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు. ఆగంతకులు పేల్చిన తూటాలు భవనం గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్‌లకు తాకాయి. ఆ సమయంలో ఎల్విష్ యాదవ్ నివాసంలో లేరని సమాచారం. ఆ ఇంట్లో ఉన్న తండ్రి రాం అవతార్ యాదవ్, ఇతర కుటుంబసభ్యులెవరికీ కాల్పులతో ఎటువంటి ప్రమాదం వాటిల్ల లేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు తామే కారణమంటూ భావ్ గ్యాంగ్‌కు చెందిన నీరజ్ ఫరీద్‌పూర్, భావ్ రిటోలియాలు ప్రకటించుకున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం ద్వారా ఎల్విష్ యాదవ్ ఎన్నో కుటుంబాలను నాశనం చేశాడని సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్ట్‌లో రిటోలియా ఆరోపించాడు. ఇలాంటివాటికి పాల్పడితే ఇతర సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం బుల్లెట్లు, బెదిరింపు కాల్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ హెచ్చరించాడు.

ఆఫీసులో సినిమా పాట పాడినందుకు.. తహశీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

లాతూర్: బదిలీ అయిన తహశీల్దార్ ఒకరు ఆఫీసులో ఏర్పాటైన వీడ్కోలు సమావేశంలో హిందీ పాట పాడిన పాపానికి సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నాందేడ్ జిల్లా ఉమ్రిలో తహశీల్దార్‌గా ఉన్న ప్రశాంత్ థోరట్ ఇటీవల పొరుగునే ఉన్న లాతూర్ జిల్లా రెనాపూర్‌కు బదిలీ అయ్యారు. జూలై 30వ తేదీన ఉమ్రిలో ఆయనకు కార్యాలయం సిబ్బంది సెండాఫ్ పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంత్ థోరట్ ఉత్సాహంతో 1981నాటి అమితాబ్ బచ్చన్ సినిమా యారానాలోని 'యారా తేరీ యారీ కో..'అంటూ పాటపాడారు. అక్కడి వారంతా చప్పట్లతో ఆయన్ను ఉత్సాహ పరిచారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో ప్రశాంత్ థోరట్ వెనుక తాలూకా మేజిస్ట్రేట్ అనే నేమ్ ప్లేట్ స్పష్టంగా కనిపిస్తోంది. థోరట్ ప్రవర్తన అధికార హోదాకు తగినట్లుగా లేదంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు మహారాష్ట్ర సివిల్ సర్వీసెస్ ప్రవర్తన నిబంధనావళి-1979కు విరుద్ధంగా వ్యవహరించారనే కారణంపై థోరట్ సస్పెన్షన్‌కు శనివారం ఆదేశాలిచ్చారు.

మాతృమూర్తిపైనే దారుణం

దేశ రాజధానిలో అరాచకం

ఢిల్లీ: ఓ కిరాతకుడు సొంత తల్లిపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. దేశ రాజధాని ఢిల్లీలోని హౌజ్ ఖాజీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. తల్లి ప్రవర్తన సరిగా లేదంటూ ముద్ర వేసి మరీ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. బాధితురాలు జూలై 25న తన భర్త (72), కుమార్తె (25)తో కలిసి ఆధ్యాత్మిక యాత్ర కోసం సౌదీ అరేబియా వెళ్లి ఆగస్టు 1న తిరిగొచ్చింది. ఉద్యోగం లేక ఖాళీగా తిరుగుతున్న కుమారుడు మొహమ్మద్ ఫిరోజ్ అలియాస్ సుహేల్ (39) మర్నాడు ఆమెపై దాడికి ప్రయత్నించాడు. భయాందోళనకు గురైన ఆమె బంధువుల ఇంట్లో తలదాచుకుంది. 11న ఇంటికి తిరిగొచ్చిన తల్లిని ఫిరోజ్ గదిలో బంధించాడు. కత్తితో బెదిరించి అత్యాచారం చేశాడు. షాక్‌కు గురైన ఆమెపై 14న మరోసారి అఘాయిత్యం చేశాడు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రేపటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కీలక సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కీలక సమావేశాలు నిర్వహించనున్నది. మంగళ, బుధవారాల్లో ఆర్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశాలకు సంస్థ సర్ కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలే, ఆరుగురు సహ కార్యవాహ్‌లు సహా వివిధ విభాగాలకు చెందిన సుమారు 60 మంది నేతలు హాజరు కానున్నారు. భారత్‌పై అమెరికా విధించిన 50శాతం టారిఫ్‌లపైనే ప్రధానంగా లోతైన చర్చ ఉంటుందని సమాచారం. అమెరికా టారిఫ్‌ల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకు ఒక వ్యూహాన్ని వీరు రూపొందిస్తారని తెలుస్తోంది. అలాగే, బీజేపీకి నూతన అధ్యక్షుడి ఎంపిక, ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపైనా చర్చిస్తారని సమాచారం.

చైనాలో వరదలు.. 9 మంది మృతి

బీజింగ్: చైనా ఉత్తర ప్రాంతంలోని ఇన్నర్ మంగోలియాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో 9 మంది చనిపోగా మరో ముగ్గురు గల్లంతయ్యారు. బయన్నూర్ నగర సమీపంలో అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నదికి సంభవించిన వరదల్లో టెంట్లలో బస చేసిన 13 మంది పర్యాటకులు కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని సహాయక సిబ్బంది శనివారం రక్షించారు. తొమ్మిది మృతదేహాలు లభ్యం కాగా, మరో ముగ్గురి జాడ తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. వీరి జాడ కనుగొనేందుకు 700 మంది సిబ్బందిని రంగంలోకి దించారు.

దుస్తులు చించి, భౌతిక దాడి

మహిళా కానిస్టేబుల్‌పై ఇంటి యజమాని దారుణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో దారుణం జరిగింది. మహిళా కానిస్టేబుల్‌పై ఆమె నివాసముంటున్న ఇంటి యజమాని కుటుంబం దాడి చేసింది. ఆగస్టు 15న సాయంత్రం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లక్నోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహిళ తన గదిలో ఉండగా.. ఇంటి యజమాని సల్మా షేక్ వచ్చాడు. ఆమె వాహనాన్ని ఇంటి బయట పార్కింగ్ చేయడంపై అభ్యంతరం చెప్పాడు. ఇంటిని ఖాళీ చేయాలన్నాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. సల్మా షేక్ కుమారులు సుహాస్, ఇమ్రాన్ ఆమెను కులపరంగా దూషించడమే కాదు.. భౌతికంగా దాడి చేశారు. అనుచితంగా తాకారు. సర్వీసు నుంచి సస్పెండ్ చేయిస్తామని బెదిరించారు. దాడితో కానిస్టేబుల్ బట్టలు చిరిగిపోయాయి. స్పృహ కోల్పోయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి నిధులు పాత బకాయిలకే

- రూ.86 వేల కోట్ల బడ్జెట్‌లో రూ.23,446 కోట్ల బకాయిలు
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలో వెల్లడి
- కనీస పని దినాలను 150కు పెంచాలని కేంద్రానికి సిఫార్సులు

సాక్షి, న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో పావు వంతు సొమ్ము పాత బకాయిలు తీర్చడానికే ఖర్చవుతున్నట్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వెల్లడించింది. 2023-24 నుంచి ఈ పథకానికి బడ్జెట్‌ను పెంచకపోవడాన్ని తప్పుబట్టింది. దేశంలో ద్రవ్యోల్బణం, గ్రామాల్లో పనులకు డిమాండ్ పెరుగుతున్నా నిధుల కేటాయింపులు ఆ స్థాయిలో పెరగకపోవడం సరైంది కాదని పేర్కొంది. ఉపాధి హామీ పథకంలో ప్రతిఏటా కనీస పని దినాలను 100 నుంచి 150కు పెంచాలని, కూలీలకు వేతనాలను నిజమైన ద్రవ్యోల్బణ సూచికకు అనుగుణంగా సవరించాలని స్టాండింగ్ కమిటీ ఇటీవల కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ మేరకు ఒక నివేదిక సమర్పించింది.

పథకం ఉద్దేశం దెబ్బతింటోంది

ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో దాదాపు రూ.86 వేల కోట్లు కేటాయించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పెండింగ్ వేతనాలు రూ.12,219.18 కోట్లు, పెండింగ్ మెటీరియల్ ఖర్చులు రూ.11,227.09 కోట్లు ఉన్నాయి. అంటే రూ.23,446.27 కోట్ల బకాయిలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇవి ఏకంగా 27.26 శాతం కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్త పనులకు ఖర్చు చేయడానికి రూ.62,553.73 కోట్ల నిధులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. పాత బకాయిల భారం వల్ల పథకం ఉద్దేశం దెబ్బతింటోందని పార్లమెంటరీ కమిటీ ఆక్షేపించింది. ఈ పథకం కింద చెల్లిస్తున్న వేతనాల విషయంలో రాష్ట్రాల మధ్య విపరీతమైన వ్యత్యాసం ఉంటోందని పేర్కొంది. కనీస వేతనాలు చాలా తక్కువగా ఉండటంతో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం గ్రామాల నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయని స్పష్టం చేసింది. వేతనాలను లెక్కించేందుకు పాటిస్తున్న విధానం ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని సరిగ్గా ప్రతిబింబించడం లేదని, కొత్త సూచిక అవసరమని సిఫార్సు చేసింది. దేశవ్యాప్తంగా ఒకే రకమైన వేతన రేటు అమలు చేసే అవకాశాలు కూడా పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది.

పనుల విస్తరణ.. పనిదినాల పెంపు

ఉపాధి హామీ పథకంలో కూలీలకు కల్పించే పనుల రకాలను విస్తరించడం ద్వారా సంవత్సరానికి కనీస పని దినాలను 150కి పెంచే అవకాశం ఉందని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చి 17 ఏళ్లు గడిచినా.. పథకంలో గణనీయమైన మార్పులు చేర్పులు చేయలేదని ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. వేతనాల చెల్లింపుల కోసం ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్‌ను తప్పనిసరి చేయొద్దని స్పష్టం చేసింది. ఇలాంటి చెల్లింపుల వ్యవస్థఅమల్లోకి వస్తే గ్రామీణ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరించింది.

ఐదేళ్లలో ఎరువుల రాయితీ రూ. 9.7 లక్షల కోట్లు

రైతుల కోసం ఆర్థిక భారం మోస్తున్న ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రైతన్నలపై ఎరువుల ధరల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో రికార్డు స్థాయిలో రాయితీ చెల్లించింది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆగస్టు 7వ తేదీ వరకు ఎరువుల తయారీదారులు, దిగుమతిదారులకు రాయితీ కింద రూ.9.7 లక్షల కోట్లకు పైగా విడుదల చేసినట్లు కేంద్ర ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ ఇటీవల రాజ్యసభలో ప్రకటించారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎరువుల సబ్సిడీ రూ.83,467.85 కోట్లు కాగా, 2020-21లో అది రూ.1,31,229.51 కోట్లకు చేరింది. 2021-22లో రూ.1,57,640.08 కోట్లు, 2022-23లో రికార్డు స్థాయిలో రూ.2,54,798.93 కోట్లు, 2023-24లో రూ.1,95,420.51 కోట్లు, 2024-25లో రూ.1,77,129.50 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆగస్టు 7 వరకు రూ.62,983.61 కోట్ల సబ్సిడీ భారం భరించినట్లు మంత్రి వెల్లడించారు.

పెరిగిన ఉత్పత్తి.. తగ్గిన దిగుమతులు

2019-20లో దేశంలో 425.95 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉత్పత్తి కాగా, 2023-24 నాటికి ఇది 503.35 లక్షల టన్నులకు చేరుకుంది. 2024-25లో 517.90 లక్షల టన్నులు ఉత్పత్తి కాగా, 2025-26లో జూన్ వరకు 120.63 లక్షల టన్నుల ఎరువులు ఉత్పత్తి అయిననట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు. మరోవైపు విదేశాల నుంచి ఎరువుల దిగుమతులు క్రమంగా తగ్గుతుండడం ప్రభుత్వానికి ఊరటనిస్తోంది. దిగుమతులు 2019-20లో 184.09 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 2023-24లో 176.95 లక్షల టన్నులకు, 2024-25లో 160.29 లక్షల టన్నులకు తగ్గాయి. 2025-26లో జూలై వరకు 48.54 లక్షల టన్నుల ఎరువులు దిగుమతి అయ్యాయి.

రాహుల్ గాంధీపై సాత్యకి సావర్కర్ కేసు

ముంబై: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ న్యాయస్థానాన్ని ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ స్వాతంత్ర్యయోధుడు వీర్ సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ కేసు వేశారు. వీర్ సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియో తనకు అందలేదంటూ జూలై 29వ తేదీన రాహుల్ గాంధీ సమర్పించిన అఫిడవిట్ అబద్ధమని సాత్యకి పేర్కొన్నారు. రాహుల్ ప్రసంగం ఉన్న సీడీ సహా పిటిషనర్ అందజేసిన అన్ని పత్రాలు తమకు అందాయంటూ ఆయన లాయర్ కోర్టు ఎదుట అంగీకరించారని సావర్కర్ లాయర్ సంగ్రామ్ కొల్హాట్కర్ పేర్కొన్నారు. వీడియోతో కూడిన పెన్‌డ్రైవ్ తమకు అందిందని, అయితే అది పనిచేయడం లేదని అంతకుముందు మే 28న రాహుల్ తెలిపారన్నారు. తాము అందజేసిన మరో పెన్‌డ్రైవ్ సరిగ్గానే పనిచేస్తోందని, కోర్టులో గాంధీ లాయర్ సమక్షంలో అందులోని వీడియోను ప్రదర్శించామని కొల్హాట్కర్ వివరించారు. ఆ వీడియో ఇప్పుడు కోర్టు కస్టడీలోనే ఉందన్నారు. ఇవన్నీ చూస్తుంటే రాహుల్ గాంధీ తప్పుడు పత్రాలు చూపుతూ వివాదాస్పద వ్యాఖ్యల వివాదం నుంచి తప్పించుకోజూస్తున్నట్లు కనిపిస్తోందని కొల్హాట్కర్ తెలిపారు.

ప్రాకృతిక ఉత్పాతాలా... మన పాపాలా?



- హిమాలయాల్లో తారెత్తిస్తున్న ఆకస్మిక వరదలు
- గ్లోబల్ వార్మింగ్‌తో కరిగిపోతున్న మంచు
- సహజ ప్రవాహాలకు ఆటంకంగా నిర్మాణాలు

ప్రకృతి ఏదీ అట్టిపెట్టుకోదు. మనం ఏదిస్తే దాన్నే అంతకుమించి తిరిగిచ్చేస్తుంది. పర్వతాలకు ఇది మరింతగా వర్తిస్తుంది. అభివృద్ధి పేరుతో చేస్తున్న విధ్వంసానికి ప్రకృతి ప్రతిస్పందనగా తాజాగా దేశవ్యాప్తంగా సంభవిస్తున్న విపత్తులే ఇందుకు నిదర్శనం. వాతావరణ మార్పులకు మానవ తప్పిదాలు తోడై హిమాలయాలను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఆగస్టు 5న ఉత్తరాఖండ్‌లో క్లౌడ్ బరస్ట్ ధరాలీ గ్రామాన్ని నామరూపాల్లేకుండా చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఇటీవల భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వాడ్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ బీభత్సానికి ఏకంగా 65 మందికి పైగా బలయ్యారు. తాజాగా కశ్మీర్‌లోని కథువాలోనూ అదే పరిస్థితి! భారీ పరిమాణం, నిటారుగా ఉండే స్వరూపం హిమాలయాల్లో ఆకస్మిక, తీవ్ర వరదలకు దారి తీస్తుంటుంది. వీటికి గ్లోబల్ వార్మింగ్ తోడైంది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తరచూ వరదలొస్తున్నాయి. అటవీ నిర్మూలన, భూవినియోగంలో మార్పులు సమస్య తీవ్రతను పెంచుతున్నట్టు సైంటిఫిక్ రిపోర్ట్స్ అధ్యయనం తేల్చింది. ధరాలి వరదలకు హిమనీ సరస్సు విరుచుకుపడటమే కారణమని నిపుణులు అంటున్నారు. 2013లో కేదార్‌నాథ్‌లో వేలాది మంది బలైన వరదలకు హిమనీ సరస్సు ఉప్పొంగడమే కారణం. 2023లో న్యూకాజిల్ వర్సిటీ అధ్యయనం ప్రకారం 2006 నుంచి 2016 మధ్య ప్రపంచంలో ఏటా ఏకంగా 332 గిగాటన్నుల మంచు కరిగిపోయింది. దీనివల్ల 1990 నుంచి ప్రపంచవ్యాప్తంగా హిమానీ సరస్సుల సంఖ్య 50 శాతం పెరిగింది. ఇది దిగువ ఉండేవారికి పెను ముప్పేనని అధ్యయనం వెల్లడించింది.

డేటాకే దిక్కు లేదు: భారత్‌లో వర్షపాతం, ఉష్ణోగ్రత, తేమ తదితరాలపై డేటా సేకరణ ఉంది. కానీ హిమాలయాలపై లేదు. ప్రత్యేకించి హిమనీనదాల ఔట్ బరస్ట్‌కు సంబంధించి అసలే లేదు. అక్కడ 28,000 సరస్సులున్నాయని హిమనీనద సరస్సులపై ఇస్రో జాబితా చెబుతోంది. 25 హెక్టార్లకంటే ఎక్కువ విస్తీర్ణమున్న సరస్సులనే ఇస్రో పర్యవేక్షిస్తోంది. ముప్పుకు కారణంగా మారుతున్న చిన్న సరస్సులెన్నో ఉన్నాయి. అభివృద్ధి పనులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, ఆవాసాల విస్తరణ. ఇళ్లు, హోటళ్లు, లాడ్జీల వంటివి ప్రమాదాన్ని పెంచుతున్నాయి. ఇటీవల ప్రమాదం జరిగిన ధరాలిలో 1996లో నాలుగు భవనాలే ఉన్నాయి. ఇప్పుడక్కడ ఎటు చూసినా ఇళ్లు, లాడ్జీలు, దుకాణాలు, హోటళ్లు, రిసార్టులే! పైగా వాటన్నింటినీ వాలు ప్రాంతాల్లో నిర్మించారు! ఇది అత్యంత ప్రమాదకరమని హిమాలయాల్లో ప్రాకృతిక విపత్తులను అధ్యయనం చేస్తున్న జర్మనీ శాస్త్రవేత్త వోల్ఫ్‌గ్యాంగ్ ష్వాంగ్‌హార్ట్ తెలిపారు.

అటవీ నిర్మూలన

2013లో కేదార్‌నాథ్ వరదల తర్వాత ఉత్తరాఖండ్‌ల నదీతీరాల వెంబడి నిర్మాణాలను నిషేధించారు. తర్వాత దాన్ని బేఖాతరు చేస్తూ భవనాలు, హోటళ్లను పునర్నిర్మించారు. పైగా జలవిద్యుత్ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల ప్రాజెక్టుల కోసం పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఝాలా-జంగ్లా మార్గంలో 'చార్ ధామ్ పరియోజన'లో భాగంగా ఏకంగా 6 వేల హిమాలయ దేవదారు వృక్షాలను నరికేశారు. ఇందులో 10 కి.మీ. పరిధిలో నిషేధాలు నిషిద్ధం! దేవదారు వృక్షాల నరికివేత వల్ల వాలు ప్రాంతాలు అస్థిరమవుతాయని నిపుణులు హెచ్చరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్-అమెరికా వాణిజ్య చర్చలు ఆలస్యం

న్యూఢిల్లీ: భారత్-అమెరికా వాణిజ్య చర్చలు నిలిచిపోయే సూచనలు కన్పిస్తున్నాయి. చర్చల కోసం ఈ నెల 25వ తేదీన భారత్‌కు అమెరికా అధికారులు రావాల్సి ఉంది. అయితే, ఈ బృందం రాక ఆలస్యమయ్యే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు అంటున్నాయి. ఇదే జరిగితే ఆగస్టు 27వ తేదీ నుంచి 50 శాతం టారిఫ్‌లు అమల్లోకి రావడం ఖాయం. అలా జరక్కూడదంటే ఈ చర్చలు కచ్చితంగా జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు అమలవుతున్నాయి. కాగా, వాణిజ్య బృందాన్ని రద్దు చేసినట్లు అమెరికా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. అయితే, భారత్‌కు రావడం ఆలస్యమవుతుందని ట్రంప్ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజా భౌగోళిక రాజకీయ పరిణామాలు దీని వెనుక ఉండి ఉండొచ్చని తెలుస్తోంది.

గవర్నర్.. విపక్షాలకంటే ఛీప్: సీఎం స్టాలిన్

చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవిపై ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన రాష్ట్రంలో ప్రతిపక్షం కంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమ పథకాల్లో రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా ఉందని, కానీ ఆయన దీనిని సహించలేకపోతున్నారన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా గవర్నర్.. రాష్ట్రంలో మహిళల భద్రత, యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఇతర అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేసినవారు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితు లయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772-1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు,హీబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ,ముస్లిం,క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవకోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్డ్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్ మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్- ఉల్- అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. విలియం బెంటింగ్ రాయ్ ఘనతను గుర్తించి 'రాజా' బిరుదుతో సత్కరించి ఇంగ్లండ్‌కు పంపాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824-1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషులను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ్ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి..

1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూమతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతిరాయ్, లాలా హంసరాజ్ మెదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారో రూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గదాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్పుకూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద (1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా? అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.



వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.
6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.

దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు. హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటు పడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు.


రేడియోధార్మికత శక్తిని కనుగొన్నవారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

ఆధునిక భౌతిక శాస్త్రం

1. సహజ రేడియోధార్మికతలో విడుదలయ్యే కిరణాలేవి?
జ. α, β, γ
2. α, β, γ కిరణాలకు మరో పేరు?
జ. బెక్వరల్ కిరణాలు
3. α-కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో తగ్గుదల?
జ. 2 యూనిట్‌లు
4. α-కణం విడుదలైనప్పుడు ద్రవ్యరాశి సంఖ్యలో తగ్గుదల?
జ. 4 యూనిట్‌లు
5. α-కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?
జ. రూథర్‌ఫర్డ్
6. అత్యధిక అయనీకరణ సామర్థ్యం ఉన్న కణం?
జ. α-కణం
7. అత్యధిక చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న కణం?
జ. γ-కణం
8. సహజ రేడియోధార్మికత ప్రక్రియలో β కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో పెరుగుదల?
జ. 1 యూనిట్
9. β-కణాన్ని కనుగొన్నవారు?
జ. రూథర్‌ఫర్డ్
10. γ-కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్య, ద్రవ్యరాశి సంఖ్యలో మార్పు?
జ. ఉండదు
11. γ-కణాన్ని కనుగొన్నవారు?
జ. విల్లార్డ్
12. రేడియోధార్మిక శ్రేణులు ఎన్ని రకాలు?
జ. నాలుగు రకాలు. అవి..
ఎ. థోరియం శ్రేణి లేదా 4n శ్రేణి
బి. యురేనియం శ్రేణి లేదా 4n+2 శ్రేణి
సి. ఆక్టీనియం శ్రేణి లేదా 4n+3 శ్రేణి
డి. నెప్ట్యూనియం శ్రేణి లేదా 4n+1 శ్రేణి
13. సహజ రేడియోధార్మిక శ్రేణుల్లో చిట్టచివరి మూలకం?
జ. సీసం (పరమాణు సంఖ్య = 82, లాటిన్ నామం ప్లంబం pb)
14. రేడియోధార్మికతకు ప్రమాణాలేవి?
జ. బెక్వరల్, రూథర్‌ఫర్డ్, క్యూరి
(రేడియోధార్మికతకు చిన్న ప్రమాణం Bq (బెక్వరల్)
Bq = విఘటనం/ సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d) $= 10^6$ విఘటనం/సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d) $= 10^6$ Bq
క్యూరీ (C.I) $= 3.7\times10^{10}$ విఘటనం/సెకన్
$= 3.7\times10^{10}$ Bq
$= 3.7\times10^4 \times 10^6$ Bq
క్యూరీ (C.I) $= 3.7\times10^4$ R.d
(R.d - రూథర్‌ఫర్డ్)
రేడియోధార్మికతకు అతి పెద్ద ప్రమాణం క్యూరీ.
15. ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో అత్యంత బలమైంది?
జ. బలమైన కేంద్రక బలం
16. కేంద్రక బలాలను మీసాన్ సిద్ధాంతంతో వివరించిందెవరు?
జ. యుకావా
17. పరమాణు కేంద్రకం పాల్గొనే చర్యలు?
జ. కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం
18. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియను వివరించిందెవరు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్, లిసేమెయిట్‌నర్
19. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ జరగడానికి ఉపయుక్తమైన కణం?
జ. ఉష్ణీయ న్యూట్రాన్
20. ఉష్ణీయ న్యూట్రాన్ అంటే?
జ. తక్కువ వేగం ఉన్న న్యూట్రాన్ (ఉష్ణీయ న్యూట్రాన్ శక్తి 0.04 ev కంటే తక్కువగా ఉంటుంది)
21. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియలో విడుదలయ్యే న్యూట్రాన్లు ఏ శ్రేణిలో ఉంటాయి?
జ. గుణ శ్రేణి
న్యూట్రాన్లు విడుదలయ్యే క్రమం: 3, 9, 27, 81, 243, 729....
22. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ ఒక యురేనియం మూలకం అంతరించిపోయే వరకు జరుగుతుంది. ఈ చర్య పేరు?
జ. శృంఖల చర్య
23. శృంఖల చర్య ఎన్ని రకాలుగా జరుతుంది?
జ. రెండు రకాలుగా. అవి..
ఎ. అనియంత్రిత శృంఖల చర్య
బి. నియంత్రిత శృంఖల చర్య
24. అనియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పనిచేసేది?
జ. ఆటమ్ బాంబు (అణు బాంబు)
25. అణు బాంబు సృష్టికర్తలు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్
26. అణు బాంబును మొట్టమొదటిసారిగా ఏ దేశంపై ప్రయోగించారు?
జ. జపాన్
27. అణు బాంబును మొదటిసారిగా ఏ నగరంపై విసిరారు?



జ. హిరోషిమా
ఆగస్టు 6న హిరోషిమాపై అణు బాంబు వేశారు. కాబట్టి ఆగస్టు 6ను హిరోషిమా డే అని పిలుస్తారు. హిరోషిమాపై విసిరిన బాంబు పేరు లిటిల్ బాయ్.
28. అణు బాంబును జపాన్‌లోని 'నాగసాకి' నగరంపై వేసిన రోజు?
జ. ఆగస్టు 9. అందుకే ఆగస్టు 9ని నాగసాకి డే అని పిలుస్తారు. నాగసాకి నగరంపై వేసిన బాంబు పేరు ఫ్యాట్‌మాన్.
29. నియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పనిచేసే పరికరం?
జ. న్యూక్లియర్ రియాక్టర్
30. న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
జ. ఎన్‌రికో ఫెర్మి
అమెరికాకు చెందిన ఫెర్మి 1942 డిసెంబర్‌లో న్యూక్లియర్ రియాక్టర్‌ను రూపొందించాడు. ఇతణ్ని న్యూక్లియర్ రియాక్టర్ పితామహుడిగా పిలుస్తారు. ఫెర్మి గౌరవార్థం పరమాణు కేంద్రక పరిమాణాన్ని ఫెర్మిలలో కొలుస్తారు. పరమాణు కేంద్రక వ్యాసార్ధం విలువ $=10^{-15}$ m
31. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఎన్ని ప్రధాన భాగాలుంటాయి?
జ. 5
32. న్యూక్లియర్‌లో ఉపయోగించే ఇంధన పదార్థాలు ఏవి?
జ. యురేనియం, థోరియం, ప్లూటోనియం.
ఈ ఇంధన పదార్థాలను స్థూపాకార అల్యూమినియం గొట్టాల్లో నింపుతారు.
33. న్యూక్లియర్ రియాక్టర్‌లోని మితకారి పదార్థం ప్రయోజనం?
జ. న్యూట్రాన్‌ల వేగం తగ్గించడం
34. న్యూక్లియర్ రియాక్టర్‌లో మితకారిగా ఉపయోగించే పదార్థాలు?
జ. భారజలం, గ్రాఫైట్, బెరీలియం, పారఫిన్.
భారజలానికి మరో పేరు డ్యూటీరియం ఆక్సైడ్. దీన్ని యురే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- ప్రస్తుతం ఇండియాలో 9 భారజల కేంద్రాలు ఉన్నాయి.
- భారతదేశంలో మొదట పంజాబ్‌లోని నంగాల్‌లో భారజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక భారజల కేంద్రం ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఉంది.
- గ్రాఫైట్‌ను లెడ్ పెన్సిళ్ల తయారీలో, భారీ యంత్రాల్లో కందెనగా ఉపయోగిస్తారు.
- లెడ్ పెన్సిల్‌లో లెడ్ ఉండదు.
- గ్రాఫైట్ కార్బన్ రూపాంతరం.
- కార్బన్‌కు అలోహ ధర్మం ఉన్నప్పటికీ గ్రాఫైట్ లోహ ధర్మాన్ని పాటిస్తుంది.
- కార్బన్‌ను 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.

35. న్యూక్లియర్ రియాక్టర్‌లో వాడే నియంత్రణ కడ్డీల ప్రయోజనం?
జ. చర్యా వేగాన్ని తగ్గించడం
36. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఉపయోగించే నియంత్రణ కడ్డీలు?
జ. బోరాన్, కాడ్మియం
37. న్యూక్లియర్ రియాక్టర్‌లో జరిగే కేంద్రక చర్యల వల్ల విడుదలయ్యే ఉష్ణాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఉపయోగపడేది?
జ. శీతల కారిణి
(శీతల కారిణిగా ఉపయోగించే పదార్థాలు భారజలం, ద్రవ సోడియం)
38. కేంద్రక సంలీన చర్యలకు మరో పేరు?
జ. ఉష్ణకేంద్రక చర్యలు
39. సూర్యుడు, నక్షత్రాల్లో నిరంతరం జరిగే చర్యలు?
జ. కేంద్రక సంలీన చర్యలు
40. సూర్యుడి నుంచి లభించే విటమిన్?
జ. విటమిన్-డి
41. హైడ్రోజన్ బాంబు ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
జ. అనియంత్రిత కేంద్రక సంలీన చర్య
హైడ్రోజన్ బాంబును ఎడ్వర్డ్ టెల్లర్ తయారు చేశారు. ఇతడిని హైడ్రోజన్ బాంబు పితామహుడిగా పిలుస్తారు. మొదటి హైడ్రోజన్ బాంబు పేరు మైక్.
42. కేంద్రక సంలీన చర్యలు భూమి, చంద్రుడిపై జరగకపోవడానికి కారణం?
జ. హైడ్రోజన్‌కు ఉన్న స్వల్ప పలాయన వేగం.
వాయు కణాలు తప్పించుకొని పోయేందుకు కావల్సిన కనీస వేగాన్ని పలాయన వేగం (Ve) అంటారు.
- భూమిపై హైడ్రోజన్ పలాయన వేగం? 11.2 కి.మీ./సెకన్
- చంద్రుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 2.38 కి.మీ./సెకన్
- సూర్యుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 620 కి.మీ./సెకన్

43. కేంద్రక సంలీన చర్యలో పాల్గొనే మూలకం?
జ. హైడ్రోజన్
44. కేంద్రక సంలీన చర్య జరిగిన తర్వాత ఏర్పడే మూలకం?
జ. హీలియం
45. సూర్యుడికి మరో పేరు?
జ. హీలియో

గతంలో అడిగిన ప్రశ్నలు

1. థర్మల్ రియాక్టర్‌లో శక్తిని విడుదల చేసే ముఖ్యమైన మూల పదార్థం?
ఎ) యురేనియం- 235
బి) యురేనియం - 238
సి) యురేనియం- 233
డి) ప్లుటోనియం-233
2. సూర్యుడిలో శక్తికి మూలాధారం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) ద్రవ్యరాశి లోపం
సి) రేడియో ధార్మికత
డి) కేంద్రక సంలీనం
3. బీటా కిరణాలు వేటిని కలిగి ఉంటాయి?
ఎ) ఎలక్ట్రాన్లు బి) ప్రోటాన్లు
సి) పాజిట్రాన్లు డి) న్యూట్రాన్లు
4. న్యూక్లియర్ రియాక్టర్‌ను విస్ఫోటక దశ నుంచి రక్షించడానికి వాడేవి?
ఎ) కాడ్మియం కడ్డీలు
బి) కార్బన్ కడ్డీలు
సి) భారజలం
డి) అల్యూమినియం కడ్డీలు
5. హైడ్రోజన్ బాంబు పని చేసే సూత్రం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) కేంద్రక సమ్మేళనం
సి) కృత్రిమ రేడియోధార్మికత
డి) సహజ రేడియోధార్మికత
6. న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్‌ల వేగాన్ని తగ్గించేది?
ఎ) భారజలం బి) పాదరసం
సి) హైడ్రోజన్ డి) ఆల్కహాల్
7. అణు రియాక్టర్‌లో ఇంధనంగా ఉపయోగించేది?
ఎ) బొగ్గు బి) యురేనియం
సి) రేడియం డి) భారజలం
8. భారజలం అంటే?
ఎ) మంచు గడ్డ కట్టడం
బి) డ్యూటీరియం ఆక్సైడ్
సి) పొడి మంచు
డి) పైవేవీ కావు
9. భారత అణుశక్తి పితామహుడు?
ఎ) రాజా రామన్న
బి) విక్రమ్ సారాబాయి
సి) సి.వి. రామన్
డి) హోమి జహంగీర్ బాబా
10. రేడియోధార్మికత శక్తిని కనుగొన్నవారు?
ఎ) బెక్వరల్ బి) ఛాడ్విక్
సి) బోర్ డి) లీనార్డ్
11. అణు బాంబు ఆవిష్కర్త?
ఎ) డాల్టన్ బి) అట్టోహాన్
సి) న్యూటన్ డి) ఐన్‌స్టీన్

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) ఎ; 4) సి; 5) బి; 6) ఎ; 7) బి; 8) బి; 9) డి; 10) ఎ; 11) బి.

తెలంగాణ ప్రాంతంలో రైతు ఉద్యమ నిర్మాత

నిజాం (మీర్ ఉస్మాన్ అలీఖాన్) నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన ప్రముఖుల్లో ఆరుట్ల రామచంద్రారెడ్డి ఒకరు. ఈయన 1943లో జనగామ తాలూకాలో జాగీర్దార్లకు వ్యతిరేకంగా రైతు పోరాటానికి నాయకత్వం వహించారు. వీరోచితంగా ఉద్యమం చేశారు. జీవితాంతం కమ్యూనిస్టు కార్యకర్తగా పోరాట పంథాలో పయనించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య అభ్యసిస్తూనే ఆంధ్ర మహాసభ కార్యకర్తగా ప్రజాసేవకు అంకితయ్యారు. నిజాం కాలం నాటి అక్రమ, చట్ట వ్యతిరేక వెట్టి చాకిరీ, వంతులవారి గల్లా వసూళ్ల పద్ధతికి వ్యతిరేకంగా పోరాడారు. రైతులను సమీకరించి భువనగిరి, జనగామ, ముండ్రాయి గ్రామాల రైస్‌మిల్లు యజమానుల దోపిడీని అరికట్టారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

ఆరుట్ల రామచంద్రారెడ్డి

భువనగిరి ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటం, గెరిల్లా పోరాటాల్లో ఆరుట్ల రామచంద్రారెడ్డి ప్రముఖపాత్ర వహించారు. ఈయన విద్యార్థి దశలోనే 1930 నాటికి రాజకీయాల్లో ప్రవేశించారు. 1948-1952 మధ్య కాలంలో వివిధ జైళ్లలో దారుణ నిర్బంధాలను అనుభవించారు. అనేక చిత్రహింసలకు గురయ్యారు. స్వాతంత్ర్యానంతరం మెదక్ జిల్లా రామాయంపేట నియోజకవర్గం నుంచి 1952, 1957, 1962లలో శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు అగ్రనాయకులుగా కొనసాగారు. ప్రజాసేవలో ఆయనకు సహధర్మచారిణి కమలాదేవి కూడా సహకరించారు.

బాల్యం - విద్యార్థి దశ

రామచంద్రారెడ్డి 1909లో నల్లగొండ జిల్లాలోని భువనగిరి తాలూకా కొలనుపాకలో జన్మించారు. గ్రామంలో ఒకే ఉపాధ్యాయుడు ఉండే జాగీరు పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. 1926లో భువనగిరిలో మాధ్యమిక పాఠశాలలో ఫస్టు, సెకండ్ ఫారం, 1928లో హైదరాబాద్ గోషామహల్ మిడిల్ స్కూల్లో థర్డ్ ఫారం పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని రెడ్డి బాలుర వసతి గృహంలో చేరి, నాంపల్లి హైస్కూల్‌లో 1930లో మెట్రిక్యులేషన్ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

జాతీయోద్యమ ప్రభావం

1930 ఏప్రిల్‌లో గాంధీజీ దండి సత్యాగ్రహం ప్రారంభించారు. దేశమంతటా జాతీయ ఉద్యమం వాయువేగంతో విస్తరించింది. విప్లవ వీరులైన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరికంబాలకు ఎక్కి ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ ప్రాంతం నుంచి కామ్రేడ్లు.. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కాకినాడ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. బ్రిటిషర్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నాడు స్వదేశీ లీగ్ పేరుతో హైదరాబాద్‌లోని వికాజీ హోటల్ (అబిదాషాపు) ఆవరణలో బహిరంగ సభలు నిర్వహించేవారు. ఈ జాతీయోద్యమ ప్రభావం రామచంద్రారెడ్డిపై పడింది.

కొత్వాల్ రాజా వెంకట్రామారెడ్డి హైదరాబాద్‌లో 'రెడ్డి బాలుర వసతి గృహం' స్థాపించి, ఎంతో అభివృద్ధి చేశారు. ఈయన సహకారంతో రామచంద్రారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు 'బాలికల వసతి గృహం' ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఇదే మొట్టమొదటి బాలికల వసతి గృహం.

ఆంధ్ర మహాసభలు

1931-32లో ఆరుట్ల రామచంద్రారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన కాలంలోనే ఆర్య సమాజం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ప్రథమాంధ్ర మహాసభ నిర్వహించారు. రావి నారాయణ రెడ్డి నాయకత్వంలో సైకిల్ యాత్రా దళంలో వలంటీరుగా పాల్గొని ఆరుట్ల రామచంద్రారెడ్డి ఈ సభకు హాజరయ్యారు. ఆ తర్వాత 1944లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన భువనగిరిలో 11వ ఆంధ్ర మహాసభ జరిగింది. దీనికి రామచంద్రారెడ్డి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి సభను విజయవంతం చేశారు. ఆంధ్ర మహాసభ మితవాద నాయకులైన కొండా వెంకట రంగారెడ్డి, మందుముల నర్సింగరావు భువనగిరి మహాసభను బహిష్కరించారు. తమదే నిజమైన ఆంధ్ర మహాసభగా పేర్కొంటూ 1945లో వీరు పోటీగా మడికొండలో మరో ఆంధ్ర మహాసభ నిర్వహించారు. 1945లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన ఖమ్మంలో 12వ ఆంధ్ర మహాసభ జరిగింది. పాలకుర్తి కుట్ర కేసులో ఏడాది పాటు హైదరాబాద్ సెంట్రల్ జైల్లో నిర్బంధంలో ఉండటం వల్ల రామచంద్రారెడ్డి ఈ సభకు హాజరు కాలేకపోయారు. ఈ సమావేశంలో వెట్టిచాకిరీ రద్దు, రైతులు, హైదరాబాద్ సంస్థానంలో ప్రజారాజ్య స్థాపనకు సంబంధించిన తీర్మానాలు చేశారు. 1946లో నిజాం నవాబు ఆంధ్ర మహాసభలపై నిషేధం విధించాడు. మితవాద నాయకులు జమలాపురం కేశవరావు అధ్యక్షతన 1946లో కందిలో ఆంధ్ర మహాసభ నిర్వహించారు. ఇదే సంవత్సరం హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిజాం నిషేధం ఎత్తేశాడు. తర్వాత మితవాదుల ఆంధ్ర మహాసభ కాంగ్రెస్ పార్టీలో విలీనమైంది.

నవయువకులైన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, డాక్టర్ రాజబహద్దూర్ గౌర్, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సర్వదేవభట్ల రామనాథం, పెరవెల్లి వెంకటరమణ ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వీరు తమ ఉపన్యాసాల ద్వారా తెలంగాణ ప్రజానీకాన్ని ప్రజా పోరాటాల దిశగా సమీకరించారు. ఆంధ్ర మహాసభలో అతివాద భావాలతో పనిచేస్తున్న యువకులంతా మితవాద నాయకత్వాన్ని దీని నుంచి దూరం చేయాలనే ఉద్దేశంతో 1941లో నల్లగొండ జిల్లా చిలుకూరు (హుజూర్ నగర్)లో రావి నారాయణ రెడ్డి అధ్యక్షతన 8వ ఆంధ్ర మహాసభ నిర్వహించారు. ఇది పూర్తిగా రాజకీయ స్వరూపాన్ని సంతరించుకుంది. బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనే ఆంధ్ర మహాసభ ఆశయంగా సమావేశ వేదిక నుంచి ప్రకటించారు. చిలుకూరు సభలోనే ఆంధ్రమహాసభ అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది.

హరిజనులు - దేవాలయ ప్రవేశ హక్కులు

అస్పృశ్యతా నివారణపై ఆంధ్ర మహాసభ వేదికల నుంచి తీర్మానాలు చేశారు. కొన్ని మహాసభల్లో సహపంక్తి భోజనాలు చేసేవారు. ఆ రోజుల్లో హరిజనులకు దేవాలయ ప్రవేశం ఉండేది కాదు. మూడో ఆంధ్ర మహాసభ పులిజాల వెంకట రంగారావు అధ్యక్షతన 1934లో ఖమ్మంలో నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ప్రతినిధుల్లో కొందరు సనాతన ధర్మ పారాయణులు ప్రత్యేక వంటలు చేయించుకొని, మడిబట్టలు ధరించి భోజనాలు చేశారు.

ఆరుట్ల రామచంద్రారెడ్డి హరిజనులతో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రవేశం చేయించారు. భువనగిరి తాలూకాలోని పాముకుంట, జాల, కుర్రారం, నమిలె, బేగంపేట, రాజాపేట, నర్సాపురం, రేణుకుంట మొదలైన సుమారు 35 గ్రామాలకు చెందిన 400 మంది హరిజనులను సమీకరించి దీన్ని నిర్వహించారు. కుర్రారం రంగారెడ్డి ఈ విషయంలో రామచంద్రారెడ్డికి విశేషంగా సహకరించారు. ఈ హరిజన సమూహాన్ని చూసి దేవాలయ పూజారులు ఎలాంటి అభ్యంతరం తెలపకుండా వారందరికీ తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

నిజాం కుటిల పన్నాగం

హైదరాబాద్ సంస్థానంలో నూటికి 90 మంది హిందూ మతానికి, 10 మంది ముస్లిం మతానికి చెందినవారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో వరసగా ఆంధ్ర మహాసభ, మహారాష్ట్ర పరిషత్తు, కర్ణాటక పరిషత్తు.. ప్రాంతీయ మహాసభల కార్యకలాపాలు, ప్రజా పోరాటాలు నిర్వహించాయి. ఇదే సమయంలో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన నిరంకుశ ప్రభుత్వాన్ని శాశ్వతం చేయాలని భావించాడు. బహదూర్ యార్ జంగ్ ముస్లిం మతతత్వవాది, మంచివక్త. నిజాం ప్రభుత్వానికి ముప్పు ఏర్పడుతుందని గ్రహించి, దీన్ని కాపాడగలిగేది ముస్లిం మతస్థులేనని భావించాడు. ముస్లింలు అల్ప సంఖ్యాకులుగా ఉన్నందువల్ల మత మార్పిడి ద్వారా వారి సంఖ్య పెంచుకొని రాజ్యాన్ని రక్షించుకోవాలని బహదూర్ యార్ జంగ్ సమగ్ర పథకం వేశాడు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన కులాలకు చెందిన వారిని, హరిజనులను ఇస్లాం మతంలోకి మార్చడానికి పూనుకున్నాడు. దొరలు, భూస్వాములకు చేస్తున్న వెట్టిచాకిరీ రద్దవుతుందని ప్రజలను మభ్యపెట్టాడు. దీంతో తీవ్ర యాతనలకు గురైన చాకలి, మంగలి, హరిజన తదితర పీడిత ప్రజలు ఇస్లాం మతంలోకి మారారు. జనగాం తాలూకాలో విసునూరు దేశ్‌ముఖ్ కఠార్ రామచంద్రరావు; నరసింహారావు, పూనుకూరు రాఘవరావు లాంటి వెలమ దొరలు, పేరు మోసిన భూస్వాములు.. ముండ్రాయి, కఠార్, రామాపురం, ముంచుప్పల, ధర్మాపురం, రామన్నగూడెం గ్రామాలపై ఏకచ్ఛత్ర పాలన సాగించేవారు. పథకం ప్రకారం బహదూర్ యార్ జంగ్ ముందుగా ఈ గ్రామాల్లోనే మతమార్పిడిని ఉధృతం చేశాడు.

మతమార్పిడులు ఊపందుకోవడంతో భూస్వాములు, దొరలు, దౌర్జన్యపరులంతా విసునూరు రామచంద్రారెడ్డి అధ్యక్షతన హిందూ సమితి పేరుతో దొరలతో కూడిన మత సంస్థను స్థాపించారు. హిందూమతం ఉనికి ప్రశ్నార్థకమైందని, మతాన్ని రక్షించే సాకుతో పాతకాలం నాటి బానిస విధానం, దోపిడీ, వెట్టి చాకిరీని యథాప్రకారం కొనసాగించుకోవచ్చనే దుష్ట తలంపుతో దీన్ని ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో ఆర్యసమాజం నిజాం ప్రభుత్వ విధానాలు, మత మార్పిడికి వ్యతిరేకంగా పోరాడింది. ఇస్లాం మతం స్వీకరించిన వారిని తిరిగి హిందూమతంలో చేర్చుకోవడానికి ఉద్యమం చేసింది. ఆర్య సమాజం నాయకులైన నరేందర్ జీ, శంకర్ రెడ్డి దీని కోసం విశేష కృషి చేశారు. 1944-45 సంవత్సరాల మధ్య జనగామ తాలూకాలో జమీందారీ వ్యతిరేక పోరాటం ఉధృతంగా జరిగింది. 1944లో ఆరుట్ల రామచంద్రారెడ్డిని తన స్వగ్రామం కొలనుపాక విడిచి ఎక్కడికీ వెళ్లకూడదని ప్రభుత్వం గృహనిర్బంధం విధించింది.

వేళ్లూనుకున్న వెట్టి చాకిరీ వ్యవస్థ..

తెలంగాణలోని ప్రతి గ్రామంలో దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, బంజర్‌దార్, ఇనాందార్, ముఖ్తాదార్ తదితర అధికారులు ఆయా గ్రామ ప్రజానీకంపై పెత్తనం చెలాయించేవారు. వీరు ప్రజలపై విపరీతమైన దౌర్జన్యకాండ సాగించారు.

నిజాం నవాబు ప్రత్యక్ష పాలన కింద ఉండే గ్రామాలను 'ఖల్సాలు'గా పేర్కొనేవారు. సంస్థానాధీశులు, జాగీర్దార్ల పాలన కింద ఉండే గ్రామాలను ఖల్సేతర ప్రాంతాలుగా వ్యవహరించేవారు. సాధారణంగా గ్రామాల్లో చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, తమ్మలి, హరిజన, బేగరి (గుర్రాల మాలీష్, పాకీ పని), మసుకూర్, నీరడి (నీరు తెచ్చేవారు) మొదలైన పన్నెండు కులాలవారు ఉండేవారు. పైన పేర్కొన్న రెండు రకాల గ్రామాలకు రెవెన్యూ, పోలీసు, అటవీ, మద్యపాన తదితర శాఖల అధికారులు వచ్చినప్పుడు ఈ కులాలకు చెందినవారు ఉచిత సేవ చేయాలి. ఈ పనులన్నింటినీ ఎలాంటి ప్రతిఫలం ఇవ్వకుండా నిర్బంధంగా చేయించుకునేవారు. అందువల్ల వీటిని 'వెట్టి పనులు' అంటారు.

వంతులవారీగా..

చిల్లర దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగించే కోమట్లు.. గ్రామాలకు ప్రభుత్వ, జాగీరు ఉద్యోగులు వచ్చినప్పుడు ఆ అధికారులకు కావలసిన సన్నబియ్యం, మసాలా, నెయ్యి, నూనె, పప్పు, చింతపండు, పప్పు దినుసులు, సిగరెట్లు, బీడీలు, సబ్బులు మొదలైన వాటిని ఉచితంగా సరఫరా చేయాల్సి ఉండేది. అదేవిధంగా దొరలు ఈ ప్రభుత్వాధికారులకు వంతుల ప్రకారం విందు ఇచ్చేవారు. దీని కోసం మసుకూర్లతో గొర్రె మందల నుంచి బలవంతంగా గొర్రెలు, మేకలను పట్టి తెప్పించేవారు. హరిజనవాడల నుంచి వంతుల ప్రకారం కోళ్లను పట్టి తెచ్చేవారు. గౌడ కులస్థులు ఉచితంగా కల్లు సరఫరా చేసేవారు. ప్రభుత్వాధికారులకు ఎన్ని విన్నపాలు చేసుకున్నా ప్రయోజనం లేదని, తాము వెట్టి చాకిరీ చేయడానికే పుట్టామని, మా బతుకులింతేనని ప్రజలు నిరాశ, నిస్పృహలతో కుమిలిపోయేవారు. దొరల కోపతాపాలకు గురై శారీరకంగా, మానసికంగా చిత్రహింసలు ఎదుర్కొనేవారు. ఈవిధంగా తెలంగాణ ప్రజానీకం మధ్య యుగం నాటి బానిసత్వాన్ని చాలాకాలం పాటు అనుభవించింది.

గల్లా వసూళ్ల అక్రమాలు

నాటి నిజాం ప్రభుత్వం ప్రతి చిన్నా, పెద్ద రైతుల నుంచి నిర్బంధ లెవీ వసూలు చేసేది. పంట పండినా, ఎండినా ప్రజలు వీటిని కచ్చితంగా చెల్లించాల్సి వచ్చేది. ఆంధ్ర మహాసభల ఉద్యమం ఫలితంగా అతి చిన్న రైతులను లెవీ నుంచి మినహాయించి మిగిలినవారి నుంచి గ్రేడ్ పద్ధతిలో లెవీ వసూలు చేసేవారు. ప్రభుత్వం రైస్‌మిల్లర్లనే ఏజెంట్లుగా నియమించుకునేది. ఈ ఏజెంట్లు ధాన్యం తూకం, డబ్బు చెల్లింపుల్లో అనేక అక్రమాలు చేసి ప్రజలను మోసగించేవారు.

Education is a strong instrument..

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
   1) play golf and other outdoor games
   2) watch television and engage yourself
   3) if outside choose a safe shelter
   4) stay in water
   5) stay on a hilltop
2. How should you react to a child's fright over lightning?
   1) give strict warning to them
   2) try to shout at them and control the things
   3) try to hide in a secret place
   4) ridicule them
   5) calm them by telling a story
3. What kind of structures does lightning generally strike?
   1) projections of some height
   2) nature's fireworks
   3) gambling joint
   4) a low building protected by a grove of trees 5) indoors
4. The meaning of **scoot** is
   1) crawl 2) creep
   3) poke 4) hurry 5) haze
5. The synonym of **vulnerable** is
   1) Inclination 2) week
   3) experience 4) susceptible
   5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
   1) untreated, unsightly
   2) artfully, dismal
   3) openly, few
   4) flagrantly, petty
   5) hazy, cloudy
7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
   1) ubiquitous, enjoyment
   2) propitious, delight

BANK EXAMS

GENERAL ENGLISH

   3) sporadic, bliss
   4) hedonistic, pleasure
   5) omniscient, plain
8. The___of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
   1) veracity, access
   2) verbosity, entre
   3) ambiguity, admission
   4) validity, contact
   5) opulence, grandeur
9. Catching the earlier train will give us the _____ to do some shopping.
   1) chance 2) luck
   3) possibility 4) occasion
   5) probable
10. David finally found the photographs, after hours spent _____ through drawers.
    1) cavorting 2) haggling
    3) rummaging 4) divagating
    5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
    1) are remain 2) will remained
    3) will still remain
    4) are remaining
    5) No Correction required
12. It is ten years since I <u>have begun</u> living here.
    1) begun 2) had begun
    3) began 4) beginning
    5) No Correction required
13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
    1) striking 2) powerful
    3) potent 4) proven
    5) No Correction required
14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
    1) appeared 2) took
    3) undertook 4) prepared
    5) No Correction required
15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
    1) mind blank 2) eyes covered
    3) hands full 4) hands tied
    5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)
17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)
18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)
19. The man who is persistently hesitating (1)/ which of the two things (2)/ he will do first, (3)/ will do either. (4)/ No error (5)
20. The Manager (1)/ gave her his assurance (2)/ that the complaint (3)/ would be discharged. (4)/ No error (5)
21. Everyone felt (1) / that the big (2)/ glittering diamond (3) / was most unique. (4) / No error (5)
22. From all accounts (1) / I learn that (2) / he is the best and honest member (3) / of the new committee. (4) / No error (5)
23. A man entered the tavern (1) / and asked for (2)/ some bread and cheese (3) / with a decided foreign accent. (4) / No error (5)
24. A large scale exchange of nuclear weapons (1) / will produce (2)/ unprecedented amounts of radiation (3) / that can penetrate into the biological tissue. (4) / No error (5)
25. Several prominent figures (1) / involved in the scandal (2) / are required to appear (3) / to the investigation committee. (4) / No error (5)

Directions (Q. 26-30): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The meeting, the first such gathering in Iraq since the overthrow of Saddam Hussein four years ago, was intended to shore up support for the Iraq government.
B) The next one came six hours later.
C) Delegates from neighboring countries and elsewhere did not set a date for a second, higher-level gathering of foreign ministers and agreed only to establish working groups to focus on various issues.
D) When Iraq's chief delegate stood on a podium and ripped into US policy in Iraq
E) Clobbering hopes that the summit would prove an ice-breaker in the two countries chilly relations
F) On that front, it appeared to have been cordial but far from a resounding success.

26. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
27. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
28. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
29. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
30. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A piece of writing, we have decided, _____ (31) from true forms of visual art in that you cannot respond to the effect of the _____ (32) in a single glance. In reading, the "viewer" has to work at seeing and understanding, for a page of print, _____ (33) at first apprehended by the eye, is fundamentally grasped by the mind _____ (34) the powers of interpretation, reasoning and analysis. But just as your vision can be educated so that _____ (35) eye responds more intelligently to a work of art, so your powers of interpretation, reasoning and analysis can be _____ (36) so that you respond more efficiently and _____ (37) rapidly to what a writer offers you on a page of print. This process _____ (38) refinement started years ago - when you first learned to read at the age of six or seven. It _____ (39) through elementary and high school and into your late adolescence. And then, possibly, it stopped, though there was _____ (40) much room for improvement.

31. 1) differs 2) vary 3) fluctuate
    4) change 5) altered
32. 1) entire 2) whole 3) complete
    4) total 5) intact
33. 1) while 2) how ever
    3) though 4) still 5) despite
34. 1) during 2) from first
    3) though 4) through
    5) thorough
35. 1) yours 2) your' s
    3) you are 4) your 5) you

Key

1) 3	2) 5	3) 1	4) 4
5) 4	6) 1	7) 4	8) 1
9) 1	10) 3	11) 3	12) 3
13) 2	14) 2	15) 5	16) 4
17) 5	18) 2	19) 4	20) 4
21) 4	22) 3	23) 4	24) 4
25) 4	26) 4	27) 5	28) 5
29) 1	30) 1	31) 1	32) 2
33) 3	34) 4	35) 5	